భారతి

సాహిత్య మాసపత్రిక
జనవరి 1983

గీః ప్రవక్త
శరభయ్య

అజువవారెవరు
వేంకటరాయశాస్త్రి

దయానది
దాశరథి

కామశిల్పం
జవహర్‌లాల్

ఆకాశం నిట్టూర్చింది
కాళిదాసు

సూక్ష్మజీవజాలం
రమేష్‌బాబు

ఇంకా రవికుమార్, వీరరాఘవాచార్య, సర్వజిత్, ప్రభాతం, మనోహర్‌రెడ్డి, కోణార్క, వెంకట రామకుమార్, సాంధ్యశ్రీ, కృష్ణమూర్తి, సోమరాజు, రామసూరి, రెడ్డి, రంగారావు, కిశోరుబాబు — అశోకుబాబు, విజయదత్తాత్రేయశర్మ ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

జనవరి 1983

సంపుటము : 60 సంచిక : 1

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు



కీ॥ శే॥ శివలెంక శంభుప్రసాద్ గారు
సంపాదకుడు 1938 – '72

స్వవిషయం

ఏవిధంగా చూసినా తెలుగువారు భారతీయులే. భారతదేశంలో ఎంతో వైవిధ్యం ఉంటే ఆంధ్రుల రాష్ట్రంలోనూ కావలసినంత వైవిధ్యం ఉంది. అసలు ఈ సాంస్కృతిక వైవిధ్యంలో రాజకీయ సమైక్యత ఉండటమే భారతదేశం ప్రత్యేకత. [యూరోపులోని వివిధదేశాలమధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు అనతగినవి తక్కువే అయినప్పటికీ ఆ ఖండంలో రాజకీయ విభేదాలకి మాత్రం కొదువలేదు. సోవియెట్ యూనియన్లో భారతదేశంలోవలె పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ లేదు.] 1967లో నేటి తమిళనాడులో మొదలయినటువంటి మార్పు 1983లో ఆంధ్రప్రదేశ్లో కూడా ప్రారంభం అయినదని అనిపించినప్పుడు పయిన చెప్పిన భారతదేశపు ప్రత్యేకతని గుర్తుచేసుకోవచ్చు. ఆధునిక వైజ్ఞానిక సాధనాలతో మానవుడు ఈ విశ్వంలోకి మరింత దూరంగా చూడగలుగుతున్నాడు. కాని తనచుట్టూ ఉన్న సమాజానికి సంబంధించినంతవరకూ అతనిదృష్టి మరింత సంకుచితం అవుతోందని బెర్ట్రాండ్ రస్సెల్ ఒకసారి అన్నారు. ఆయన మాటలు ఇప్పుడు మరింత ముఖ్యంగా తోస్తున్నాయి. తెలుగువారి సంస్కృతిని ప్రతిబింబించటమే భారతి ధ్యేయం. తెలుగువారిది ఎప్పుడూ సంకుచిత దృష్టి కాదు. తమ గౌరవాన్నీ, ప్రయోజనాలనీ కాపాడుకుంటూనే వారు భారతీయులుగా, ప్రపంచ పౌరులుగా జీవించగలరంటే అందులో అనుచితమయినది ఏదీ లేకపోవచ్చు. భారతికి రాసేవారూ, చదివేవారూ ఎప్పటిలాగే తమ సహాయాన్నీ, సహకారాన్నీ అందించగలరని ఆశిస్తున్నాము.

విషయానుక్రమణిక

జనవరి 1983

గీః ప్రవక్త

శ్రీ మల్లంపల్లి శరభయ్య

లోకము వేయేండ్లుగ, నిను
వాకొన ప్రథమాంధ్ర గీః ప్రవక్తగ, నకటా!
వ్యాకృతి నీకృతి కాదని
నీ కరిదిగ క్రొత్తతెలివి నెగడెను మాకున్.

నీ వాది కవివి యగుటకు
వావిరి సకలాంధ్ర గీః ప్రపంచమె కరిగా;
నీ వాది కవివి యవుదువు
కావని నేఁడొక విచార కర్మము మాకున్.

మిను మినుకు మినుకు మనుచున్
బెను జీఁకటిఁ జుక్కలెన్ని వెలసెనయేనిన్;
కని, గూబ లలరునేనిన్
దినకరతేజంబు వెలయునే! వాని కిలన్.

వేఁగి నాటి తెనుఁగు వేలకు వేలేండ్లు
మాఁగి నీదు నోట సాగినంత
వేఁగు తెనుఁగు నుడికి, వేగెఁ జీఁకటిరేయి,
వీఁగె జడిమ కవుల వేవెలుంగ!

ఆరఁగ నీసూక్తి సుధా
పారణమునఁ జుమి! సుపర్వభావంబెద నిం
డారెను త్రిలింగవిషయ మ
హీరాజ్యప్రజలకును మహీయః ప్రతిభా!

'శూరుల జన్మంబు సురల జన్మంబును
నేఱుల జన్మంబు నెఱుఁగ నగునె!'
ఋషి జన్మమును సుకవీంద్ర జన్మంబును
నొనరంగ నిట్టివ; యుర్వియందు
ఏపుట్టఁ బుట్టెనో! యెఱుఁగము తానయ్యె
మధుమయ ఫణితికి మార్గదర్శి!
నీవెందుఁ బుట్టితో! నిఖిలాంధ్ర వాఙ్మధు
ప్రభవ కారణ భూత భవ్యమతివి!

నీప్రసన్న కథలనిండె జగత్సర్గ
సన్నిహిత మహోర్థ జాతనొల్ల;
ఇష్టి నిత్యమగుచు సృష్టి సాంతత్యంబు
వెలయు నీదుపలుకు వేదసమము.

అరిది పరస్సహస్రసమ లయ్యును; నీనుడిత్రోవ మాధురీ
ఝురు లుడివోవు_నీయెడఁద శారద పార్వణ చంద్ర చంద్రికా
భరపరమ హ్రదాఽభమగు, పాయక సత్కవివంశ కైరవో
త్కరముల కెల్ల నీచలువ గాదె! వికాస నిదాన మారయన్.

ఆది క్షత్త్ర చరిత్రుఁడు
నీ దివ్యవ చోయశో వినిద్ర జ్యోత్స్నాఽ
హ్లాదిత చళుక్యలోక
క్ష్మాదయితుం డెపుడు మాకు గాదిలి సుమ్మా!

నీ ఋణము నీఁగ, మా కొక
పారము గలదయ్య! సుకవిపరమేష్ఠి! భవ
ద్గీరుదిత భారత సుధా
ధారల రే వగలు తడిసి తనియుట కంటెన్.

ఒక తుమ్మెద పాయక మా
మక హృదయ వసంత వన రమాయిత కుసుమాం
తికమునను మొకరి యుద్గీ
థక మొనరుచు నిదె! యనాహతము మధురముగన్!

మా గోదావరియే, తదియతటి, నామ్నాయాంత సంవేద్యుఁడౌ
మా గౌరీశుఁడె, మా త్రిలింగ భువియ్యే, మా వేణుగోపాలుఁడే,
పోఁ గాఁ బుట్టువు లెన్ని పుట్టినను; నీ భూమిప్రజాశ్రేణికిన్
నీ గీస్స్పందమె విందగున్ నవనవో న్నీతామృత స్యందమై.

ఎప్పటికో ఉషస్సు?

శ్రీ రామసూరి

నక్షత్రాలు సూర్యుణ్ణి తరిమినా
సూర్యుడు నక్షత్రాల్ని తరిమినా
ఆకాశం
మౌనంగానే ఉంది.

వెర్రి ఆశ మనిషిని పిలిచి
పలకరించినా
అనుక్షణం
చినుకు చినుకు చిలకరించినా

నిరీక్షణలో
కళ్లు వెలిగి వెలిగి
చీకటిలో మిగిలి పోయినా
జీవితం
మౌనంగానే ఉంది.

ఏ చెట్టు కొమ్మల్లో
ఏ పిట్ట గూడు కట్టి
వేకువ కోసం ఎదురు చూస్తోందో మరి

అందాకా
గుండె కంట్లో
పన్నీరో-కన్నీరో భరించాలి మరి.

రేపు!

సర్వజిత్

అందమైన సంకేతం -
రేపు!
గడచిన క్షణాలన్నీ
రేపు తెరచుకునే
తలుపుల ముందు
రెక్కలు విప్పుకున్నాయ్.
కాలం గడవదు
రేపటి క్షణం ఉదయించదు!
మస్తిష్కపు పొరల మాటున
మిణుగురులు తిరుగుతున్నాయ్,
మనోమూలల
మాపటి అర్జీలు రగులుతున్నాయ్,
గొంతులోపల మంట
పెదవుల వెంట
రసహీన హాసరేఖ!

ముందు వెనుకల మధ్య
జీవితం ఊగులాట;
శృతిలయల మధ్య
ఆలోచన పెనుగులాట.

శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రి

అఱవవారెవరు

తెలుగువారు తమిళ భాషను, తమిళ జనులను అరవమనియు, అరవవాండ్రనియు చెప్పుచుందురేగాని తమిళ పదమును వాడుట లేదు. ఇది జగత్ప్రసిద్ధము. దీనిని గుఱించి ఇంతవఱకు ఆలోచించినవారేలేరు. కాని ఇటీవల శ్రీ శంకరగంటి రంగాచార్యులు గారు జూలై నెల భారతి పత్రికలో కలగూరగంప, పుట 73) ఈ అఱవ పద వ్యుత్పత్తిని గూర్చి తాము కొద్దిమంది పండితులను ప్రశ్నించినట్లును, తమకు సరియైన సమాధానము దొరకనట్లును, ఎవరైనను ఆంధ్ర తమిళములందు అఖండ పాండిత్యముగలవారు వివరింపవలెనని కోరినారు. చాలమంచి కోరిక. కాని ఈ మాత్రమునకు తమిళాంధ్రములలో అఖండ పాండిత్యము గడించి యుండ నక్కఱలేదు. ఈ రెండు భాషలలో కొద్దిపాటి ప్రవేశముండి చక్కని చారిత్రిక దృష్టియుండిన చాలును. మనపండితులకు చారిత్రక జ్ఞానము (అనగా ఇంతివరకు చరిత్ర కారులు కనుగొన్న నూతనాంశములు) ఉండనిండు. చారిత్రక దృక్పథమే పూర్ణానుస్వారము. ఏది ముందు, ఏది వెనుక అను మామూలు జ్ఞానమే లేదు. వట్టి ఛాందసులుగా నున్నారు. అందుచేతనే శ్రీయుత రంగాచార్లవారికి సరియైన సమాధానము దొరకలేదు. ఆంధ్ర ద్రావిడ కర్ణాటక భాషలలో కొద్ది ప్రవేశముతో చారిత్రిక పరిశోధనలో కొంత ప్రవేశముగల వారికే ఇది సాధ్యము. నాకు గల చారిత్రిక పరిశ్రమ వలన కొంత సాహసించి వ్రాయుచున్నాను.

తమిళ పండితులకును, చారిత్రక పరిశోధకులకును ఆంధ్ర కర్ణాటక భాషలురావు. అట్లే మిగిలిన వారికి ఇతర భాషలు రావు. చారిత్రిక సమన్వయమునకు ఈ మూడును కావలెను. మనయాంధ్ర పరిశోధకులకు కొంతమందికి కన్నడములో ప్రవేశము కనబడు చున్నది. తమిళములో కనబడదు.

నాకు చూడగా తమిళ భాషకు తమిళేతరులు పెట్టిన పేళ్లు నాలుగుగా కనబడుచున్నవి. తమిళమును బౌద్ధులును, జైనులును ద్రావిడమనియు, త్రమిళమనియు రేఫయుతో పేర్కొనిరి. పాశ్చాత్యులు డమరికా యని దీనినే పేర్కొనిరి. భరత నాట్యశాస్త్రము కూడ ద్రావిడమన్నది, తెలుగువారు అరవమనుచున్నారు, అన్నారు, కర్ణాటకులు కొందరు అరవమని అన్నను ఎక్కువమంది తమిళులను తిగుళలని (వ్యావహారికముగా తిగళు) అన్నారు, అనుచున్నారు. చోళ చాళుక్య యుద్ధములలో పదవ శతాబ్దపు శాసనములలో కర్ణాటక చక్రవర్తులు రాజ రాజాది తమిళ చోళులనుజయించి 'తిగుళరమారి'యని బిరుదు ధరించిరి. నేటి కోయంబత్తూరుజిల్లాయే తిగుళభూమి. సాళువ నరసింహుడు ఇక్కడి తిగుళ భూములను జయించెను. ఆ తర్వాతిది తమిళ దేశము. కావేరీ ప్రాంతము. వారి కంటికి ఆ క్రిందివారందరును తిగుళులే. నేటికిని తిరువలిక్కేణి (మద్రాసు)లో కన్నడము వారు తమిళులను తిగళ్ళనియే యందురు. క్రీ. శ. పండ్రెండు పదుమూడు శతాబ్దములకు వచ్చు సరికి తమిళదేశమునకు, నెల్లూరు నుండి మలయాళ సీమ వరకు మాబర్ అనిపేరు. మార్కోపోలో వ్రాసియున్నాడు. దీనికి మధుర రాజధాని. ఇది మలబారుకు పొరపాటు కాదు. మాబర్ అనగా 'మహాముఖద్వారము' ది గ్రేట్ గేట్‌వే అని యర్థమట. దీని రేవుల నుండి జావా, బర్మా మున్నగు ద్వీపములకు పోయెడివారట. 1295 నాటి యొక ఈజిప్టు రచనలో మొదటి ప్రమాణము దొరికినది. ఇదియొకవేళ మహాభారత (గ్రేటర్ ఇండియా) అనిభావమునకు పాశ్చాత్య రూపముగా నుండు నాయని నా యనుమానము. పోనిండు. ఈ నాలుగుపేర్లు తమ తమిళమునకు ఉండుట తమిళులకే తెలియదు. "నూతద్రివ్యవేతాళముల్" అన్నట్లు పరిశోధించుచు పోయిన ఏవేవో బయలు పడుచుండును. కర్ణాటకులకు దక్షిణమున అనుకొని యుండిన తమిళ వక్తలు తిగుళులు గాన కన్యాకుమారి వఱకు వారికి అందఱును తిగుళులే ఐనారు.

ఈ సామ్యమును బట్టి, మనకు తెలుగు వారికి దక్షిణమున తమిళము మాటలాడు అరవవారుండి, వారు తమిళము మాటలాడు చుండినందున తమిళము మాటాడు వారందరు మన కంటికి అరవ వారై యుండవలెనుగదా! కాని చరిత్ర చూచిన ఇందులకు విరుద్ధముగా నున్నది.

అఱవ శబ్దమునకు మన నిఘంటువులు :—

శబ్దరత్నాకరము —

అఱవత - ద్వ. వి. ద్రావిడ స్త్రీ. ఎ. గీ. "కంచి యఱవతల సమాస్త్రి ఖడ్గలతలు" కాశీ. శ్రీనాథుడు, కి. అ.

అఱవ - దే. వి. సాధువు కాని యాపు. (పా. నఱవ) విణ. దుష్టము, దుష్టుడు.

అఱవము - వై. వి (అఱ + వాయి) ద్రావిడ భాష.

అఱవలు - వై. వి. బ. అఱవవాండ్రు, ద్రావిడులు

శ్రీ సూర్యరాయములోను విశేషమేమియు లేదుగాని లఘు రేఫము వాడబడియున్నది. తమిళ నిఘంటువులలో ది తమిళ్స్ (టి. అరవము) అని యుండుటేగాక "అరువానాడు" అని యొక దేశ విభాగము చెప్పబడియున్నది. ఇది 'పన్రినాడు'కు ఉత్తరమున నున్నదట. దీనికే(అరువ నాటికే) 'అరువావడతలై' అనియు పేరట. వీనికి ఆధారములు కళింగత్తుపరణి, తొల్కాప్పియం మున్నగు వాటి నుండి ఇచ్చినారు. అరువాట్టి - (స్త్రీ) ఆఫ్ అరువాళ ఉమన్ ఆఫ్ అరువా - నాడు, ఆరువానాట్టుప్పెణ్. (మన తెలుగు అరవత)

తమిళములో లఘురేఫమే.

దీనికే (అరువా) నదీ ముఖమనియు, సముద్ర తీరమనియు కూడ పేర్లట.

అన్నిటికన్నను ముఖ్యమైనది నన్నీ పరిశోధనకు పురికొల్పినది మఱియొక యర్థము - ఆది నాగుపాము. అరవదేశమనగా నాగుపాము దేశమనియు, అరవలు నాగు పాములని యర్థము చేయ వచ్చునా ? అదికాదు నాగపూజకులు నాగులని యొక జాతివారుండిరట. వారికి అరువలని పేరట. తమిళదేశచరిత్రను పరిశోధింతము.

తమిళ దేశమనగా చేర చోళ పాండ్యదేశము లేయని, తమిళ వాఙ్మయ ప్రసిద్ధము. మూడు రాజ్యముల, ముగ్గురు రాజులు (తమిళములో మూవేందర్) తమిళులు. ఇతరులు కారు. వీరినే సంఘం వాఙ్మయము ముడిమన్నర్ అన్నది. అనగా కిరీటములు ధరించిన రాజులు. వీరికి సామంతులుగా చిన్న రాజులుండిరట.

అశోకుని శాసనములలో వీరి ప్రశంసయున్నది. సింహళమునకు తాంబ్రపర్ణి (పాళి - తంబపణ్ణి) యనిపేరు. తామ్రపర్ణి తత్పూర్వుడు కౌటిల్యుడు అర్థశాస్త్రమున పాండ్య, తామ్రపర్ణి, మలయకూట, కేరళదేశములను పాండ్యదేశమున దొరకు ముత్తెములను, శంఖములను, ప్రవాళములను పేర్కొన్నాడు.

గ్రీకురాయబారి మెగాస్తనీసు, పాండ్యరాజ్యము, హెరాక్లీసు అను దేవత యొక్క కుమార్తె పాండ్యా అనునామె పాలనలో నుండినదనియు, ఈ హెరాక్లీసు 365 గ్రామముల రాజ్యమును తన కుమార్తెకిచ్చి, ఒకొక్కొక్క గ్రామమును సంవత్సరమునకొక దినమునపన్నుచెల్లించుచుండవలెననియు ఏర్పాటుచేసి పోయినాడట. ఈ దేశము భారతదేశము యొక్క చివర, సముద్రమును అనుకొని యున్నదట. దీనికే పాండ్య కవాటమనియు పేరట.

క్రీ. పూ. రెండవ శతాబ్దము, పూర్వ భాగముననున్న కళింగరాజు ఖారవేలుడు తన హాథి గుంఫ శాసనములో తాను తనకు పశ్చిమ దిగ్భాగము నుండిన శాలివాహనరాజు శాతకర్ణిని (రెండవ శాతకర్ణియా) (172 క్రీ. పూ) భూమిమీది యుద్ధమున జయించినట్లును, సముద్ర యుద్ధమున తమిళ దేశీయుల సంఘాతమును (సఖ్యమును) తత్పూర్వము 113 ఏండ్లుగా జరుగుచు ఇతరులకు సముద్ర బలము లేకుండ చేయుచుండిన దానిని, కళింగదేశమునకు అపాయకరమైన నౌకాబలమును విచ్ఛిన్నము చేసినట్లు వ్రాసియున్నాడు. ఈ త్రమిళులు చేర చోళ పాండ్యులే; వీరు తమ ప్రత్యేక వ్యక్తిత్వములను కాపాడుకొనుచునే మరల సంఘీభావముతో నౌకా వ్యాపారము చేయుచుండిరి.

ఈ త్రమిళమే పాళీలో ద్రవిడము. ఖారవేలుడు జైనుడు. బైబిలు సాలమన్‌కాలము క్రీ. పూర్వ శతాబ్దము నుండియు తమిళమునకు (డమరిక) పాశ్చాత్యరాజ్యములకు వ్యాపారము జరుగుచుండినది. తర్వాత క్రీ. శ. 130 ప్రాంతమున పెరిప్లస్ రచన తమిళదేశమును డమరిక అన్నది. ఈ కాలపు రోమకచక్రవర్తికి పాండ్యరాజు రాయబారము పంపెను. ఇంచుమించు ఈ కాలము వాడే టాలెమీయను భూగోళశాస్త్రజ్ఞుడు డమరికలో అరువర్ణాయ్ అను జాతివారు కలరని చెప్పియున్నాడు. వీరే అరవవారాయని చరిత్రకారులు సంశయించినారు. దాని వివరము మున్ముందు. కాని___

క్రీ. శ. ఒకటి రెండు శతాబ్దములకు వచు వరకు ఇనకు స్ఫుటముగా చేర చోళ పాండ్యులేతప్ప అరవవాండ్రు కనబడరు. కరికాలచోళుడు, క్రీ. శ. ఒకటి రెండు శతాబ్దములవాడుగా తమిళ పండితులచే నిర్ణీతుడు, హిమవత్పర్వతము వఱకు జయించినట్లు సంగం వాఙ్మయము చెప్పుచున్నది. ఈ జయింపబడిన వారిలో అరువాళర్ అను జాతివారు, అతి ప్రాచీనులు కూడ నుండిరట. వీరిని మద్రాచార్యవర్యులు శ్రీ నీలకంఠశాస్త్రిగారు తమ ది చోళాస్ (చోళ చరిత్రము) లో (1955 ముద్రణము పుటలు 33, 35) ఇట్లు వ్రాసినారు - "ఇవ్ వుయ్ డిస్‌రిగార్డ్ ది వేగ్ స్టేట్‌మెంట్ ఎబవుట్ నార్తర్‌నర్స్ ఎండ్ వెస్టర్‌నర్స్ ఇన్ ది పొయిన్స్ ఫ్రమ్ ది పట్టినప్పాలై వుయి సీ దట్ ఫర్ ఆల్ హీరోయిస్‌మ్ అన్ ది బాటిల్ ఫీల్డ్ కరికాలాస్ పర్మనెంట్ కాంక్వెస్ట్స్ డిడ్ నాట్ ఎక్స్‌టెండ్ మచ్ బియాండ్ ది లాండ్ ఆఫ్ ది కావేరి. ది అరువాళర్ వేర్ ది ఇన్‌హాబిటెంట్స్ ఆఫ్ ది అరువానాడ్ విచ్ కంప్రయిస్‌డ్ ది లోయర్ వాలీ ఆఫ్ ది పెన్నార్ జస్ట్ నార్త్ ఆఫ్ ది కావేరీ డెల్టా కంట్రీ."

కాగా, కాంచీనగరము రాజధానిగా నుండి దేశమునకు అరువావడతలై (అరువ నాటికి ఉత్తర భాగము) అనియు, దానికి దక్షిణము అరువనాడు అనియు వాటివ్యవహారము. ఈ కంచిరాజ్యము నెల్లూరి వఱకును వ్యాపించి యుండినది. ఇందులకు బలముగా ఇప్పటికిని నాయుడుపేట సూళూరుపేటలకు సమీపమున అరవ పాళెము, అరవ పెరిమిటి (చూ. మద్రాసు పెరియమెట్) అను గ్రామములున్నవి. పెరియమెట్ అనగా పెద్దమెట్టు లేక మిట్ట అని యర్థము.

ఈ అరవజాతివారు కాంచీనగరము రాజధానిగా పాలించినారు. చేర చోళ పాండ్యదేశములకే తమిళదేశమని ఖ్యాతి. దానికి ఎగువనుండు రాజ్యములు తమిళరాజ్యములో తర్వాత చేరినవి. కరికాల చోళుని కాలమునకు తర్వాత కాంచీనగరము పల్లవరాజులకు స్వాధీనమైనదని తమిళ పండితుల సిద్ధాంతము. శాతవాహనులు దాదాపు క్రీ. పూ. 210 నుండి క్రీ. శ. 240 వరకు పరిపాలించిరి. అటు తర్వాత వారికి సామంతులుగా నుండిన పల్లవులు స్వతంత్రులై గుంటూరు ప్రాంతమునుండి కంచికి వ్యాపించినట్లుగా చరిత్రకారుల యభిప్రాయము. సముద్రగుప్తుని దండయాత్ర నాటికే (క్రీ. శ. 325) పల్లవుడుగా కాంచీ విష్ణుగోపుడనురాజు కనబడుచున్నాడు. ఇతడు మొదటి పల్లవుడుగా నుండడు. నాటి పల్లవుల భాష ప్రాకృతము. అరవదేశమును జయించి ఆయూరి భాషను అనుసరింపక వీరు తమ భాషను దేశమున వ్యాప్తికి తెచ్చియుండవలెనని తోచుచున్నది. అరువనాటిలో చాల భాగమునకు తొండమనాడు తొండమండలము అనివాడ పేళ్లు. పల్లవులు తొండమానులు కారని కొంత మంది యభిప్రాయము. ఈ తొండమండలము కంచి చుట్టుపట్టులతో చేరి నెల్లూరి వరకుగల దేశము. అరవదేశమునకు ఈ పేరెట్లు వచ్చినది. తొండమాన్ రాజులెవరు, ఎచటి నుండి వచ్చిరను ప్రశ్నకు సమాధానము చెప్పవలసియున్నది. కాళహస్తి దగ్గరగా తొండమనాడను ప్రదేశము, ఒకనాటి చోళరాజధానికలదు. ఆదిత్యుడను చోళరాజు ఇచటనే మరణించినాడు. ఏది ఎట్లున్నను అరువనాడు పల్లవరాజ్య మెప్పుడైనది, వీరు అరవవారు కాదుగదా. తమిళ సంఘం వాఙ్మయమును చూతము.

మొదటి కరికాల చోళుని విజయములను గురించి శ్రీ ఎల్. ఉలగనాథపిళ్లెయను తమిళ పండితులు (1930) ఇట్లు వివరించినారు. కరికాలచోళుడు తన్ను తొమ్మిదిమంది రాజులెదిరింపగా వారిని తానొక్కడే జయించి అరువానాడు (దక్షిణ ఆర్కాట్) మీదికి దండెత్తెనట (పుట 33).

(తమిళము) "అరువానాడెన్బదు, అరువావడతలై, అరువా ఎన ఇరుకూఱుడైయదాయ్, మాయిలంగై, ఎన మఱుపెయర్ పూండదాయ్, కచ్చియై తనక్కు ఇరాజదానియాగ క్కొండదాయ్, పునల్ నాడాగియ చోళ నాట్టిర్కు వడక్కిరుప్పదు. ఇన్నాట్టిల్, ఓరిడత్తుం నిలై యిన్రిఅలైందు తిరియుంకుఱుంబర్ ఎన్నుం ఓర్ కొడియ శాదియర్ వాళ్ందు వందనర్, అవర్గళై అడక్కి ఓరిడత్తునిలై పెఱచ్చెయ్దదన్రి, అన్నవర్ నాట్టినైయుం ఇరుపత్తునాన్గు కోట్టంగళాగ పగుత్తు అవత్రై వేళాళర్కు క్కొడుత్తు అంగు కుడియేట్రినాన్."

దీని భావము - "అరువనాడనునది అరువావడతలై అరువా అని రెండు భాగములు. మాయిలంగై యని మఱియొక పేరు. కచ్చి (కంచి) రాజధాని. పునల్ నాడనబడు చోళనాడునకు ఉత్తరముననున్నది. ఈనాడులో స్థావరములేక తిరుగుచుండిన కుఱుంబ జాతి వారిని జయించి వారికి స్థావరమేర్పరచి, ఆనాడును (అరువ) ఇరువది నాలుగుకోట్టములుగా విభజించి వీనిని వేళాళజాతి వారికి వాసభూమిగా చేసినాడు.

తర్వాత ఆ 24 కోట్టములను పేర్కొన్నారు. ఈ నాటికి రాజధాని కచ్చి (కంచి) ఈ కోట్టములను విభాగము తమిళనాడులో లేదు. నెల్లూరు జిల్లాలో చాల భాగము ఈ పల్లవులు ఒకప్పుడు జయించిరట. ఈ పల్లవులకు వేంగి చాళుక్యులకును యుద్ధములేర్పడి, ఇందలి పన్రెండు కోట్టములను గుణగ విజయాదిత్యుని సేనాధిపతి పండరంగు గెలిచెననియు వానిలో నెల్లూరు ఒకటి, కందుకూరు ఒకటి యని తెలియుచున్నది. ఇవి బోయకొట్టములట (బోయ లనగా భోజకులు = అనుభవించువారు) బోయ శబ్దమే 'బోవ' సానబోవ, సానబోయిన అని నానావిధములుగా మారినది.

అటు వెనుక కరికాలుడు వేంగడము (తిరుపతి)ను, తమిళనాడు యొక్క ఉత్తరపుటెల్లను, తాకి, ఇక్కడవసించు వడుగర్ (ఉత్తరపు వారు) ను జయించి, అరువనాటి పడమటికి పోయెనట. ఈ వడుగరే తర్వాత తెలుగు వారైనారని వీరి యభిప్రాయము. అధోజ్ఞాపికలో నాగుల జాతులలో అరువాళర్ కూడ ఒకరిని వ్రాసినారు.

ప్రాచీన తమిళ గ్రంథములు - తమిళ దేశములో శెందమిళ్ (చక్కని తమిళము) (జాను తెనుగువలె ?) రాజ్యములనియు, కొడుందమిళ్ (భ్రష్ట తమిళ) రాజ్యములనియు రెండు భాగములని చెప్పుచున్నవి. "వైగై యాట్రిన్ వడక్కుం, మరుదయాట్రిన్ తెర్కుం, కరువూరిన్ కిళక్కుం, మరువూరిన్ మేర్కుం ఉళ్ళ నాడు చెందమిళ్నాడు" అనగా చాల వఱకు పాండ్య దేశము. చోళ

రాజ్యమునకు తూర్పున సముద్రము, దక్షిణమున వెళ్లారు. పడమట కొట్టకర్కర, ఉత్తరమున ఏనాటి పెన్న (నెల్లూరిది కాదు) వీని నడుమ 24 ఆమడల విస్తీర్ణము గలది.

కొడుందమిళు మాటలాడు నాడులు ఈ క్రింది వట - "పొంగర్నాడు, ఒళినాడు, తెన్పాండినాడు, కుట్టనాడు, కుడనాడు, పన్ది (పంది)నాడు, కర్కానాడు, శీతనాడు, పూళినాడు, మలైనాడు, అరువనాడు, అరువావడతలైనాడు" అని పన్నెండట. వీనిలో చోళ నాడుకు ఉత్తరమున అరువనాడును దాని నానుకొని అరువావడతలై నాడును (కంచి రాజధానిగా) ఉండినవట. ఈ అరువావడతలై కడప నెల్లూరుల పెన్నవఱకు (పాకనాటి) ఉండినదట.

అరవవారెవరో కొంతవరకు తేలినది. తత్కారణమున తమిళుల నందరిని అరవవారన్నవారు ఒక్క తెలుగువారే. ఈ తెలుగు వారెవరు, ఎక్కడ నుండిరి? నిశ్చయముగా అరవవారికి ప్రక్కనే యుండి యుందురు. దక్షిణమున నుండి యుండుట కవకాశములేదు గదా. వారందరు అరవవాడే పల్లవులు చెప్పియుండవలెను. పల్లవులు తమిళులు కారు, తెలుగువారని యొక యభిప్రాయమున్నది గదా. పల్లవులు గుంటూరు ప్రాంతమువారే. వారికి తర్వాతి కాలమున తెలుగు బిరుదులున్నవి. 'కటుంబిసుగు', 'పిరాప్పిడుగు' ఇత్యాది. పిడుగు శబ్దము తమిళమును (ఇడి) కాదు, కన్నడము (సిడిలు)ను కాదు. కాని ప్రాచీన పల్లవులకీ బిరుదులుండిన వనుట కాధారములు లేవు. సింహవిష్ణువు (క్రీ. శ. 575) వంశమువారి నుండి కనబడుచున్నవి. కాబట్టి ఆదిలో పల్లవులకీ బిరుదులుండిన వనుట సందేహాస్పదము.

పల్లవులు పాలించిన కాంచీ మండలమునకు తర్వాతి కాలమున ద్రావిడ దేశమని పేరు. 'చేర చోళ పాండ్య ద్రావిడ'యని శాసనములు. హ్యూయన్‌త్సాంగు కూడ కాంచీమండలమునే ద్రావిడమన్నాడు. మరి పల్లవులను ఎవరును అరవవారని యనలేదు. వీరు క్రీ. శ. రెండు లేక మూడవ శతాబ్దము నుండి తొమ్మిదవ శతాబ్దము వఱకు దక్షిణ దేశమును పాలించిరి గదా, వీరిని శాతవాహన, చాళుక్య, కదంబ, సాలంకాయన, ఇక్ష్వాకు, విష్ణుకుండిన చాళుక్య రాష్ట్రకూటాదులెవరును అరవవారని యనలేదు. పల్లవులనియే యన్నారు. పల్లవులును తమిళమును బొత్తిగా తాకక, మొదట ప్రాకృతమును తర్వాత సంస్కృతమును ఆదరించినారు.

కాబట్టి తమిళులను అరవవారన్నవారు పల్లవులు కారు, కాని అరవరాజ్యాధిపత్యము వహించిన వారేయై యుండవలెను. తెలుగు వారిలో తప్ప ఈ వాడుక మరి యెవరిలోను కనబడదు. తెలుగువారి పుట్టు పూర్వోత్తరములను చూతము. తెలుగు శాసనములు రేనాటి చోళులతోనే ప్రారంభించుచున్నవి. వీరినే చరిత్రకారులు తెలుగు చోళాస్ అని కూడ వ్యవహరించిరి. వీరు క్రమముగా కడప, నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాలలో వ్యాపించి ఎనిమిదవ శతాబ్దమునకు కృష్ణను దాటిరి.

ప్రాచీనాంధ్రులందరును ప్రాకృత భాషనే వాడిరి. వారి శాసనములలో కొన్నిమాటలు, ధ్వనులు, తెలుగువలె తోచవచ్చును గాని, నాడు తెలుగొక భాషగా మాటలాడు చుండినట్టివారు ఉండిరా యనునది సందేహమే. శాతవాహనులు వాడినది ప్రాకృతమని శాలివాహన సప్తశతియే ప్రమాణము. బృహత్కథ పైశాచి భాషలో గుణాఢ్యుడు వ్రాసెననునది పూర్తిగా అబద్ధమని నేను భారతిలో 1960 జూన్ సంచిక, 'కథాసరిత్సాగరమునకు మూలమేది' అను వ్యాసమున వ్రాసియున్నాను. శాతవాహన నృపతి (ఏయెవడో?) విద్యా విహీనుడై యుండగా, అతని రాణులలో నొకతె సంస్కృతమున విదుషి పరిహాసము చేయగా అతనికి అతని మంత్రులు గుణాఢ్య శర్వవర్మలు శపథములుచేసి సంస్కృతము వచ్చునట్లు చేసిరన్న కథ కల్పితము. సంస్కృతము ఆ తర్వాత మూడు నాలుగు శతాబ్దములకుగాని కనబడదు. ఒక్క శాతవాహన శాసనము సంస్కృతమందు బయలుపడలేదుగదా.

ఈ శాతవాహనులకు ఏవరైన అరవవారు దక్షిణమున నుండిరా యనిన ఒక శాసనము దొరకినది, కందుకూరు తాలూకాలో (పాత నెల్లూరు జిల్లా, నేటి ప్రకాశంజిల్లా) మాలకొండలో. లిపిని బట్టి ఇది క్రీ. పూ. మూడవ శతాబ్దమని తేలినది. అందిట్లున్నది—

"అరువల (హ?) కులస నంద సెట్టిపుతస
సిరి వీరిసెట్టినొ దాన"

అరువల కులమువాడైన నందసెట్టి పుత్రుడు, శ్రీ వీరిసెట్టి యొక్క దానము — అని యర్థము. శాసనము చెబ్బతిని యున్నదిగాని, నేడు పార్వతీ గుహయనబడు, ఒక కొండ గుహ, సహజముగా నేర్పడినది బౌద్ధులకో జైనులకో వాసయోగ్యముగా చేయబడినదని తెలియుచున్నది. దీనిని గురించి మొదట అన్యువల్ రిపోర్ట్ ఆన్ సౌత్ ఇండియన్ ఎపిగ్రఫి 1937-38 పార్ట్ II నెం. 631 ఆఫ్ 1937-38 ప్రకటితము. తర్వాత మదరాసు విశ్వవిద్యాలయమున ఆచార్య పీఠము నధిష్ఠించిన డా॥ టి. వి. మహాలింగంగారు తమ ఎర్లీ సౌత్ ఇండియన్ పాలాయియోగ్రఫీ అను గ్రంథమున ఈ అరువల కుల మన్నది ఒక జాతి వారిని సూచించునది అని అన్నారు. తమిళ పండితులు శ్రీ మైలై సీని వెంకటసామి

అనువారు, అరువాళర్ అనగా శ్రమణులు, అనగా జైనులని వ్రాసి నది సరికాదన్నారు. (పుటలు 308-309)

"ది ఎపితెట్(అరువ(హ ఆర్ ల) కులస నేమ్లీ హు బిలాంగ్‌డ్ టు ది అరువ (ల)కుల] ఎప్లయిడ్ టు ది డోనార్ ఈస్ ఆఫ్ ఇంట రెస్ట్ ప్రాబబ్లీ ఇట్ ఈస్ కనెక్టెడ్ విత్ ది అరువానాడు ఆర్ అరువావడతలై (ది నార్తరన్ సెక్షన్ ఆఫ్ అరువ) ఎప్లయిడ్ టు ది ట్రాక్ట్ ఆఫ్ లాండ్ ఎరవుండ్ కాంచీ ఎండ్ టు ది నార్త్ ఆఫ్ ఇట్ అప్‌టు నెల్లూర్ అండ్ విచ్ ఈస్ సపోస్‌డ్ టు కరె స్పాండ్ టు ది కంట్రీ ఇన్‌హాబిటెడ్ ఇన్ ది సెకెండ్ సెంచురీ ఎ. డి. ఎకార్డింగ్ టు ది గ్రీక్ జాగ్రాఫర్ టాలెమీ, బై ది ట్రయిబ్ నేమ్డ్ బై హిమ్ యాస్ అరువర్నాయి ఎవిడెంట్లీ. దిస్ ఫార్మ్‌డ్ ది ఆరిజిన్ ఫర్ ది టర్మ్ 'అరువాన్' ఎప్లయిడ్ టు ది తమిళ్స్ బై ది తెలుగు పీపుల్."

నూతనాంశము, ఆశ్చర్యకరముగను చారిత్రక కుతూహలమును రేకెత్తించునదిగను ఉన్నది. కాని ఎవరా తెలుగువారు, ఎక్కడ నుండిరన్న ప్రశ్నకు ఆంధ్ర శాతవాహనులేయన్న కుదురదు. వారి శాసనములలో అరవవారి ప్రస్తావమేలేదు. పై శాసనము వారిదికాదు. కాని దీనివలన ప్రాచీనాంధ్రుల కాలమున వారి సమకాలికులు అరవ వారుండిరని మాత్రము ధ్రువపడుచున్నది.

ఇచ్చట మరి యొక రహస్యము కూడ బయలుపడుచున్నది. ఈ అరవవారు పల్లవులు కాంచీనగరమును జయించుటకు చాల మునుపటివారు. అనునది మరి పల్లవులు అరవవారిని జయించిరా. కరికాలచోళుడు జయించినాడని సంగం వాఙ్మయములో కలదు గాని పల్లవులు జయించినట్లు ఏ వాఙ్మయాధారమును లేదు. కాని పల్ల వుల ప్రారంభ చరిత్రలో కొంత తెలియునట్లున్నది. పరిశీలించుట మంచిది.

పల్లవులు, శాతవాహనుల తర్వాత వారి సామ్రాజ్యము యొక్క దక్షిణభాగమున బలవంతులై కంచిరాజ్యమును రాజధానిని చూటు శాతకర్ణులనబడువారి నుండి అల్లుండ్రుగా గ్రహించినారని కథలు కలవు. చూట, చూతమన్న పాముపడగ. వీరే నాగవంశీయు లట. అరవమనగా పామని ముందే గ్రహించితిమిగదా. సంస్కృత మందు "ఉరగ్యపన్నగో భోగీ" అని అమరము. ఉరగపురమన్న ఉరయూరని కలదు. కాని ఇదో?

కాగా అరవవారినుండి, నాగులనుండి, పల్లవులు గ్రహించిరి. ఈ అరవవారు నాగజాతి వారని పై ఉలగనాధ పిళ్ళెగారును తెలిపి యున్నారు. వారి భాష కొడుందమిళ్ (శుద్ధముకాని తమిళము) ఈ నాగరోజులు చాల ప్రాచీనులు "పని పొడుంగత్తొల్ అరువాళర్" (పట్టినప్పాలై)....నాగర్ మరపిల్ (జాతిలో) ఎయినర్, ఒలియర్, ఒళియర్, అరువాళర్ ఎనప్పల వకుప్పినర్ కాణప్పడు గిన్డనర్.

చేర చోళ పాండ్యుల ప్రాభవ కాలమున నాగజాతి వారుండి నట్లును, వారును సముద్రములమీద (చోళ పాండ్య చేరులవలెనే) తిరుగుచు, ఇతరుల నౌకలను దోచుకొనుచుండినట్లును, ఒకప్పుడు ఆంధ్రదేశ తీరప్రాంతమున, వర్తకులు కొందఱు నానాద్వీప వాసులు, నాగులవలన (నాగద్వీప వాసులవలన) నౌకా చోరులవలన తమ సర్వస్వము అపహరింపబడగా, బాధపడి, అశోక చక్రవర్తితో మొఱపెట్టుకొనిరట. అంతట అతడు వారిని పిలిపించి, బౌద్ధమత మవలంబింపజేసి నౌకా చౌర్యమును మాన్పించెనని రాధా కుముద్ ముఖర్జీగారుతమ ఎ హిస్టరీ ఆఫ్ ఇండియన్ షిప్పింగ్, నాగాస్ పు. 34, 114లలో వ్రాసియున్నారు. వారిచ్చిన ఉద్ధరణము 'బోధిసత్వా వదాన కల్పలత' యను గ్రంథము నుండి.

"రాజా శ్రీమానశోకోஉభూత్ పురే పాటలిపుత్రకే
తం కదాచిత్ సభాసీనం వణిజో ద్వీపవాసినః
సర్వస్వనాశ శోకార్తాః స్వనిశ్వాసా వ్యజిజ్ఞపుః
"అస్మాకంతు ప్రవహణం భఙ్క్త్వా రత్నధనం హృతమ్,
కేవలం భాగ్యదౌర్బల్యా న్నాగైః సాగరవాసిభిః
వయమన్యస్య జీవామస్తు దుపేక్షాతు తే విభో
సంప్రయాత్రా విచ్ఛేదాత్ కోశశేషవిధాయినీ"
ఇతి తేషాం వచః శ్రుత్వా రాజా సంక్రాంత తద్భయః
సముద్రాంతర్గతాన్ నాగాన్ విచింత్య స్తిమితోஉభవత్,
తం దృష్ట్వా నిష్ప్రతీకార కోపవ్యాకులమానసం
ఇంద్రనామా బ్రవీద్భిక్షుః షడభిజ్ఞః స్థితోஉన్తికే
"నాగానాం రత్నచోరాణాం త్వత్ప్రతాపాగ్నిసూచకః
తామ్రపత్రాన్వితో లేఖః ప్రేష్యతాం పృథివీపతే.
ఇతి భిక్షువచః శ్రుత్వా లేఖం రాజా విసృష్టవాన్
క్షిప్రమేవ తమభ్యుధా నాగాస్తీరే ప్రచిక్షిపుః
అథ రాజా పునర్లేఖే ప్రహితో నాగపుంగవాః
స్కంధాన్వితాఖిల వణిగ్రత్నభారాః సమాయయుః
తదశేషం నరపతి ర్వ్యతీర్య వణిజాం ధనం
విసృజ్య నాగా నభవ జ్జినశాసన సాదరః"

ఆంగ్లమున ఇట్లు వ్రాసినారు —

"ఇన్ దట్ మాన్యుమెంటల్ వర్క్ కాల్‌డ్ బోధిసత్వావదాన కల్పలతా బై దికాశ్మీరియన్ పొయెట్ క్షేమేంద్ర ఆఫ్ ది 11త్ సెంచురీ ఎ. డి., ఈస్ ప్రిసర్వ్‌డ్ ఎ వెరీ ఇంటరెస్టింగ్ స్టోరీ రిగార్డింగ్

ఇండియన్ మర్కెంటయిల్ యాక్టివిటీ ఇన్ ది ఈస్టరన్ వాటర్స్, విచ్ క్లియర్లీ ఇండికేట్స్ దట్ ది ప్రోగ్రెస్ అఫ్ ది ఫారిన్ ఇంటర్‌కోర్స్ ఎండ్ నావల్ యాక్టివిటీ అఫ్ ఇండియా డ్యూరింగ్ ది డేస్ అఫ్ ది ఎంపరర్ చంద్రగుప్త వాస్ కంటిన్యూడ్ అల్సో ఇన్ ది డేస్ అఫ్ అశోకా ది గ్రేట్. ది 73ర్డ్ పల్లవ అర్ చాప్టర్ అఫ్ క్షేమేంద్రాస్ వర్క్ ఎబవ్ రిఫర్డ్ టు రిలేట్స్ హవ్ ది ఎంపరర్ అశోక, సీటెడ్ అన్ ది త్రోన్ ఇన్ ది సిటీ అఫ్ పాటలీపుత్ర, వైల్ హోల్డింగ్ హిస్ కోర్ట్, వాస్ వన్ డే ఎప్రోచ్డ్ బై సమ్ ఇండియన్ మర్చెంట్స్ హు ప్రేడెడ్ టు ది డిస్టంట్ ఐలాండ్స్. దే ఇన్‌ఫార్మ్‌డ్ హిమ్ అఫ్ దేర్ లాసెస్ ఎండ్ కంప్లీట్ రూయిన్ బ్రాట్ ఎబవుట్ బై ది డెప్రెడేషన్స్ అఫ్ సీ ఫేరింగ్ పయిరేట్స్ కాల్డ్ నాగాస్ (ప్రాబబ్లీ ది చైనీస్ హు అర్ వర్షిప్పర్స్ అఫ్ ది డ్రాగాన్) హు డిస్ట్రాయిడ్ అల్ దెయిర్ షిప్స్ ఎండ్ ప్లండర్డ్ దెయిర్ ట్రెషర్. దే సెడ్ దట్ ఇఫ్ ది ఎంపరర్ వాస్ డిస్‌పోస్డ్ టు బి ఇన్‌డిఫరెంట్ టు దెమ్ దే వుడ్ నో డౌట్ బి ఫోర్‌స్డ్ టు టేక్ టు అదర్ వేస్ అఫ్ ఎర్నింగ్ దెయిర్ లైవ్‌లిహుడ్, బట్ ది ఇంపీరియల్ ఎక్స్‌చెకర్ ఇన్ దట్ కేస్ వాస్ లయబల్ టు బి ఎంప్టీడ్ ఓయింగ్ టు అబ్సెన్స్ అఫ్ సీ వాయేజెస్ (నేమ్‌లీ ఇఫ్ దేర్ వాస్ ఎ స్లాకెనింగ్ అఫ్ ది సీ బార్న్ ట్రేడ్ ఎండ్ ఎ కాన్సిక్వెంట్ ఫాలింగ్ అఫ్ ఇన్ ది ఎక్స్‌పోర్ట్ ఎండ్ ఇంపోర్ట్ డ్యూటీస్.) దెన్ ది స్టోరీ గోస్ అన్ టు రిలేట్ హవ్ అశోక, అఫ్టర్ బెస్టోవింగ్ సమ్ థాట్ అన్ ది సీఫేరింగ్ నాగాస్ వాస్ పర్సువేడెడ్ బై ఎ బుద్ధిస్ట్ ప్రీస్ట్ టు ఇష్యూ ఎ సార్ట్ అఫ్ ఎడిక్ట్ (విచ్ వుయి మే కాల్ అశోకాస్ మెరైన్ ఎడిక్ట్) ఇన్‌స్క్రయిబ్డ్ అన్ ఎ కాపర్ ప్లేట్, విచ్ వాస్ హవెవర్ కంటెంప్ట్యువస్‌లీ సెట్ ఎట్ నాట్ బై దోస్ ఫర్ హూమ్ ఇట్ వాస్ మెన్ట్. ఇట్ వాస్ ఓన్‌లీ వెన్ అశోక బికేమ్ ఎ డివవుట్ బుద్ధిస్ట్ దట్ హి వాస్ ఏబల్ టు మేక్ ది నాగాస్ రెస్పెక్ట్ హిస్ ఎడిక్ట్ ఎండ్ గేవ్ అప్ అల్ దెయిర్ బూటీ, విచ్ వాస్ అఫ్టర్‌వర్డ్స్ డిస్ట్రిబ్యూటెడ్ ఎమాంగ్ ది మర్చెంట్స్ రాబ్డ్."

సాంచీ స్తూప మందలి యొక శిలా శిల్పమును గురించి వ్రాయుచు, పలు వ్యాఖ్యలుచేసి తుదకు ఇట్లు వ్రాసినారు:

"ఎకార్డింగ్ టు లెఫ్టినెంట్ మాస్సే, హవెవర్, దిస్ స్కల్ప్చర్ రిప్రెసెంట్స్ ది కన్వేయన్స్ అఫ్ రిలిక్స్ ఫ్రమ్ ఇండియా టు సిలన్ విచ్ వాస్ ఇంటర్సెప్టెడ్ బై నాగాస్."

నాగ పల్లవ బాంధవ్యము

కీ. శే. శ్రీ నేలటూరు వేంకట రమణయ్యగారు తమ చరిత్ర రచనలో పల్లవుల మూల పురుషుని గురించి ఇట్లుచర్చించినారు (పుట. 65 నుండి)

పల్లవ వంశమున చారిత్రిక పురుషుడుగ ప్రథమమున పరిగణింపదగినవాడు వీర కూర్చ మహారాజు. ఇట్టి రాజుండెననుటకు సాక్ష్యము దర్శి శాసనము. ఇతని పూర్వికులు రాజులుగారు, సామంతులు సేనాపతులునై యుండిన నుండవచ్చును. వారితో మనకుపని లేదు. ఈ వీర కూర్చునికి రాజ్యము వచ్చిన తెఱంగు వేలూర్పాళెయపు తామ్ర శాసనమున నిట్లు వర్ణింపబడి యున్నది.

"తత్సుతాదజని చూతపల్లవా
ద్వీరకూర్చ ఇతి విశ్రుతాహ్వయః
యఃఫణీంద్ర సుతయా సహాగ్రహీ
ద్రాజ చిహ్నమఖిల యశోధనః"

వీరకూర్చ మహారాజు ఫణీంద్ర సుతతోఁగూడ రాజచిహ్నములనన్నిటిని గ్రహించెనని శ్లోకార్థము. ఫణీంద్ర కన్యయన నేమని యర్థము చేసికొనవలయును? నాగబాము పిల్లయనియా? కాదు. పూర్వ మీ దక్షిణదేశమున నాగవంశజులగు రాజులు రాజ్యమేలిరి. నాగవంశపు రాజులలో నొక్కని కూతు నుద్వాహము చేసికొని తన్మూలమున రాజ్యమును వీరకూర్చరాజు వడసెను.

ఈ నాగరాజెవ్వడు? నాగునకు దక్షిణా పథమునం దధికారము ఎట్లువచ్చినది అను ప్రశ్నలకు సమాధానము చెప్పవలసి యున్నది. నాలుగవ పులుమాని యను నతడు ఆంధ్రరాజులలో కడపటివాడు. ఇతని యనంతర మాంధ్రసామ్రాజ్యము అంతరించిపోయినది. తదనంతరము నాగవంశజులగు రాజులు ప్రబలి యాంధ్రసామ్రాజ్యమును స్వాధీన పఱచుకొని రాజ్యము సేయ దొడగిరి. నాగరాజులాంధ్ర దేశమునకు క్రొత్తగావచ్చిన వారుకారు. చిరకాలమునుండి యాంధ్ర దేశమున నివసించుచు ఆంధ్రరాజ కుటుంబముతో సంబంధ బాంధవ్యములను నెఱపుచుండిన సామంత రాజులేయని యెఱుగ వలయును.

ఇట్టి సామంతరాజ కుటుంబములలో ముఖ్యముగ గమనింపదగినవి రెండు: (౧) చూటుకులము (౨) మహారథి వంశము.

(౧) చూటుకులమువారు నాగులనుటకు మొదటి నిదర్శనము వారి కులముపేరు. చూడమన్న అరవమునందు పడగెయని డా॥ కృష్ణస్వామి అయ్యంగారు తమ 'పల్లవులు' అను గ్రంథమున వ్రాసియున్నారు.

(౨) రెండవది యీ వంశమువారు సర్పములను పూజించుట.

శాతవాహన వంశమంతరించిన పిమ్మట వారి రాజ్యమందు చాలాభాగము చూటుకులనాగులకు కైవసమాయెను. ఇట్లని శాసనముల వలన తెలిసికొనుచున్నాము. .... ఇట్లాంధ్ర రాజ్యలక్ష్మి సాతవాహన వంశమును వీడి, చూటు, మహారథులకడ కొంతకాలము వసించి, తుదకు పల్లవాన్వయము నాశ్రయించెను." (పుట 68)

చూడగా 'చూటు' 'చూడ' కులమువారే నాగులనియు, వారు దక్షిణాపథమందు బలవంతులనియు, తమతో సమానస్కంధులైన మహారథి వంశమువారితో సంబంధ బాంధవ్యము గలవారనియు తెలియుచున్నది. వీరే అఱవవారు. వీరి భాష అఱవము. వీటి నడుమ తొండమానులెవరు. పల్లవులు కారనియు, వారికిముందు వారనియు కొందరు చరిత్రకారులును, కాదు పల్లవులే పహ్లవుల సంతతివారు, ఏనుగు తొండము పహ్లవులమకుట చిహ్నము, అదే పల్లవులకును ఉన్నట్లు తెలియుటచే, వారేవీరు, రెండుపేర్లును ఒకరివేయని కొందరును అభిప్రాయపడియున్నారు. నాకు జూడ తొండమానులే పల్లవులగుటకు అడ్డముకనబడలేదు. పల్లవుల తర్వాత తొండమానులు రాలేదు. అఱవలు తొండమానులు కారు. నడుమ మరెవ్వరును కానరారు. పల్లవులు తర్వాత తొండమానులనియే వ్యవహరింపబడిరి. పల్లవులా, తమిళులుకారు, అఱవవారును కారు, ఆంధ్రులునుకారు, తెలుగువారును కారు. వారిశాసన భాష ప్రాకృతము.

మరి ప్రకృతము - అఱవనాటి వారిని అఱవవారన్నవారు వారి పొరుగువారుగా గదా యుండవలెను. పైగా తెలుగు వారుగా కూడనుండవలెను. నాగులనుండి కాంచీరాజ్యమును సంపాదించిన పల్లవులు ఎచ్చటను అఱవవారి పేరెత్తలేదు. నాటికి తెలుగు వారెవరును కనబడరు. శాతవాహనాంధ్రులుగా నుందురాయన్న వారిది ఒక తెగప్రాకృతము. వారి కాలమున అఱవనాటి వీరిసెట్టియు కనబడుచున్నాడు. వారి శాసనములలోను నాణెముల మీదను తెలుగు పదములు, లేదా తర్వాతి తెలుగులో కనబడు తెలుగు పదములు తొంగి చూచుచున్నవి. కాబట్టి శాతవాహనుల నాటినుండియే తెలుగు వారున్నారు, వారి శాతవాహన రాజ్యములో అంతర్లీనులై యున్నారు అని తలంతుమా యన్న తెలుగు తెనుగు పదములు క్రీ. శ. పదవ శతాబ్దము వరకు కనబడక, పదునొకండవ శతాబ్దమున, నన్నయ నాటికిగాని కానరావు గదా. కాని ఆ మాత్రమున, తెలుగువారు అప్పుడు తటాలున ఊడిపడినారని ఎట్లు చెప్పగలము. కాబట్టి తెలుగువారు అఱవ వారి సమకాలికులు ఉండిరి, ఉన్నారు. దాగి యున్నారు. పరిశోధించి వారిని బయటికి లాగవలసి యున్నది.

కీ. శే. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు తమ 'దక్షిణదేశ భాషాసారస్వతములు - దేశి' యన్న పరిశోధక గ్రంథమున, ఆంధ్రము - తెలుగు అను ప్రకరణమున్న (పుట88నుండి) చర్చించుచు - మనభాషకు లోక విపరీతముగా రెండు పేర్లుండుట వలన, (తమిళమునకు అఱవము అని యున్నను) అది అస్వాభావికము కాబట్టి ఆంధ్రులును తెలుగువారును భిన్నజాతివారనియు, ఆంధ్రులు ఉత్తరమునుండి వచ్చు నాటికే తెలుగువారు దక్షిణాపథమున నుండిరనియు, నిర్జనారణ్యములకు ఆంధ్రులు వలసరాలేదు - వారికి ముందుండినవారే తెలుగువారు-ఈ కాలమున తెలుగువారి ప్రశంస యెచ్చటను కానరాక పోయినను బర్మాకుపోయిన తైలంగులు, తెలగాణ్య బ్రాహ్మణులు, టాలమీ ప్రశంసించిన 'ట్రిలింగాన్' 'ట్రిగ్లిప్టాన్'-మచిలీపట్టణమును సూచించు మైసోలాస్, కృష్ణవెణ్ణ కృష్ణవేణిగా మారుట ఇత్యాదులచేత-''ఆంధ్రులు తెలుగు దేశమున నెలకొనిన పిదప తెలుగు లాంధ్రులలోగలిసి యాంధ్రులైనట్లే తెలుగుదేశ మాంధ్రదేశమైనది'' అని వ్రాసినారు. కాని నాడు తెలుగు, తెలుగు శబ్దములుగాని ఉండినట్లు అధారములును లేవని యొక సందేహమును వెలిబుచ్చినారు. "నన్నయకు బూర్వమీ భాషను 'తెనుగు' అను పేరుతో స్మరించినవారెవరు నున్నట్లు అగపడరు" అనియు 'అస్తి నాస్తి విచికిత్సాహేతు' వులను తెలిపి, ప్రాచీన శాసనములను, కొన్ని శతాబ్దముల వానిని పరిశీలించి గ్రామనామములను, శకట రేఫముయొక్క పుట్టు పూర్వోత్తరములను, తెలుగు ఛందస్సులోని సంస్కృతేతర లక్షణములను జల్లెడబట్టి చూపి-తుదకు (పుట 110) "తమిళము, కన్నడము, తెలుగు, నాయాదేశము లందింతకు పూర్వము చిరకాలము నుండియు నెలకొనియే యున్నవని తెలియుచున్నది. తమిళమున క్రీ. శ. ప్రారంభము నాటికే వాఙ్మయము - భాషా లక్షణము, ఛందస్సాహిత్య లక్షణము బయలుదేరుటకు బాహ్యవరోధము లేవియు గలుగలేదు. కాని మధ్యభాగమున తెలుగు కన్నడదేశములు (అనగా దక్షిణాపథము నాంధ్ర పథమును) ఆర్యావర్త సంఘమునుండి విడిపోయి వచ్చిన యాంధ్రుల ప్రాజాపత్యమునకును, ఆధిపత్యమునకును లోనగుటయేగాక, ఆ యార్యాంధ్రు లీదేశమున ననగా కృష్ణా గోదావరీ మధ్యదేశమగు తెలుగు దేశమున స్థిరనివాస మేర్పరచుకొని యచ్చటి తెలుగు జనులతో గలిసిపోయి, వారితో నేకీభావము నొందిన యచిరకాలముననే సామ్రాజ్య స్థాపకులు నగుటచే, నిచ్చటి తెలుగువారునాంధ్రులై ప్రఖ్యాతిగాంచినను వారి దేశభాషాసాహిత్యము మాత్రము వెనుకబడి పోవుట తటస్థించినది" అని నిర్ణయించినారు.

తర్వాత 'ఛందస్సాహితీరీతు'లను పెద్ద ప్రకరణమునను, 'దేశిరచనలు' అను ప్రకరణమునను, ఆంధ్ర, తమిళ, కన్నడ, సంస్కృత ప్రాకృతాది ఛందోరీతులయు, భాషాభివృద్ధి దశలయు తులనాత్మక పరిశీలనము గావించి ఈ దేశి శాతవాహనులకు ముందే యుండినదను భావమును తెలిపినారు. గొప్ప విమర్శ. ఎంతోలోతులకు పోయినారు. పరిశోధకులు పదే పదే చదువదగిన రచన. 1949 నాటికే వెలువడినది. ఎంతో యుక్తి యుక్తముగా నున్నది.

కాని ఇది చాలవఱకు ఊహలమీద ఊహలుగా చేసిన పునర్నిర్మాణ ప్రయత్నము (చాల గొప్పదే) గాని చారిత్రకముగా కుదురకయున్నది. వారు చూపిన యుక్తులన్నిటిని కాదనుటకు ఎంతో అవకాశమున్నది. చారిత్రకముగా ఆయా ఆధారములకాలము ప్రాచీనముకాదు. టాలెమీ చెప్పినది ట్రిగ్లిప్టాన్‌గాని ట్రిలింగాన్ కాదు. అతడు త్రికళింగముల నుద్దేశించినాడుగాని నాటికి త్రిలింగము లేదు. శబ్ద సామ్యము నిర్ణాయకముగాదు. దేశీయ సామ్యములు తర్వాతి కాలము నాటివి ఏలకారాదు. కాల నిర్ణయమెట్లు. శాతవాహనులకు ముందుండినవారు తెలుగువారేయని చెప్పలేము. శ్రీ రామకృష్ణయ్యగారును, ఎంతో జాగ్రత్తతో, సందేహించుచునే తమ సిద్ధాంతమును ప్రతిపాదించినారుగాని, బల్లగుద్ది తమదే తుదినిర్ణయమని చెప్పలేదు. వీరి రచనలను చక్కగా పరిశీలించి ఎవరైనను వ్రాసినారో లేదో నా దృక్పథమునకు రాలేదు.

'తెలుగు వారెవరు' అని నేనొక వ్యాసమును 1969లో వ్రాసితిని. ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రకటింపబడినది. అప్పటికి శ్రీ రామకృష్ణయ్యగారి రచనపై నాదృష్టి ఎందుకో సాగలేదు. దురదృష్టమే. చోళ దేశమునుండి, రేనాటికి వలసవచ్చి క్రమముగా ఆంధ్రదేశమున వ్యాపించి, ప్రాకృత సంస్కృత భాషలనధఃకరించి పైకివచ్చిన చోళ రాజుల భాషయే తెలుగు యొక్క పూర్వమనియు, చోళులే తెలుగువారనియు నేను ప్రతిపాదించితిని. ఈ విషయమునుగూర్చి మరల ఆంగ్ల తమిళములలో ఉపన్యసించితిని. నా యభిప్రాయములను పరిశీలించి ఔను కాదని పరిశోధకులు చెప్పక యుండుట నా దురదృష్టము.

కావి, ఇదివరకు వ్రాసిన దానికి ఇంకను సాధకముగా నొక నూతనాంశము నాకంట పడినది. చేర చోళ పాండ్యులు అప్పటనైన తమిళులుగదా. తమిళ సంగం వాఙ్మయములో పల్లవులు పైకి వచ్చు లోపల ఈ నడిమికాలమున చోళులు రేనాటిని చొచ్చియుండవలెను. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు మైసోలాస్ అనునది, మాసోలియా అనునదియు 'మహాచోళ' అనబడు రేనాడునే నిర్దేశించునని వ్రాసియున్నారు. కంచి రాజ్యమునకు దక్షిణము పూర్తిగా అరవదేశమను వాడుకకు ఇది ప్రారంభకాలమని నాకు తోచుచున్నది.

ఇచ్చట మఱియొక విషయము గుర్తింపదగినది. తమిళ వాఙ్మయములో తమిళనాడుకు ఉత్తరపు ఎల్ల తిరుపతి (వడవేంగడం) యనియు, దానికి ఉత్తరమున నుండినవారు వడుగర్ అనియు కలదు. ఉత్తరాదివారని యర్థము. శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు తమ ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళములో వడుగావళిని గుఱించి యిట్లు వ్రాసినారు. (పు. 288-89)

తమిళ కన్నడ శాసనములలో ఆంధ్రదేశమునకు వడుగావళి, వడుకావళి యని పేర్లు. ద్రావిడదేశమునకు ఉత్తర ప్రాంతమునకు వడుగుభూమి యనియు, వడుకావళి యనియు పేర్లు. కన్నడ శాసనములలో వడుగావళి పన్నిసాసిర (పన్నీర్ = పండ్రెండు అని యుండును వే. వేం.) వడుగావళి పండ్రెండువేలు పాకనాటిరువది వేలు (21 వేలు సాధువు. చూ. వీరే ఈ రాజుల గొప్పను వర్ణించుచు పాండ్యరాజు యొక్క గుఱ్ఱమునకు ఘనపట్టం అనియు, చేరరాజు యొక్క గుఱ్ఱమునకు పాడలం అనియు పేళ్ళట. చోళరాజుయొక్క గుఱ్ఱమునకు గుఱ్ఱమనియే పేరట. ఇది తమిళము కురం అనిగాని వ్రాయకుదురదు. తమిళములో 'గ'లేదు. 1883 లో ప్రకటింపబడిన మదరాసు మాన్యువల్, వాల్యూం1, పుట ....లో 'కురం'అని వ్రాసి బ్రాకెట్టులో తెలుగు గుఱ్ఱం అని వ్రాసియున్నది. తమిళములో గుఱ్ఱమునకు 'కుదిరై' యని పేరు. కురం తప్పక గుఱ్ఱమే. పైగా గుఱ్ఱపునడకు పరుగు అని తెలుగు వ్యవహారము. తమిళములో 'పరి' యనగా గుఱ్ఱమే; కుదిరై, గుఱ్ఱం రెండును గలవు. కాబట్టి చోళులే కావేరీ తీరమందుండిన కాలములోనే తెలుగు (అనగా దాని ప్రాచీనరూపములో) మాటాడుచుండిరనియు వారే, తమకు ఉత్తరమునందు అనుకొని యుండిన అరవవారను నాగులను అరవవారని ఆదినుండి చెప్పుచుండిరనియు, చోళులే ఆంధ్రదేశీయులైన తర్వాతకూడ, పాతవాడుక ప్రకారమే తమకు దక్షిణమున నాటికింకను ఉండిన వారిని అరవవారనుచునే యుండిరనియు, చోళులు ఆంధ్రదేశమునకు వలస వచ్చునాటికి అరవవారింకను నుండిరనియు ఊహింపవలసి యున్నది. అనగా కరికాల చోళుని తర్వాత ఈ గ్రంథమున పాకనాటిని గుఱించి వ్రాసినది. ఈ గ్రంథమందు స్వవచోవ్యాఘాతములు సమన్వయము లేనందు వలన చాలగలవు. (వే. వేం.) వేంగిసహస్ర గ్రామము (2000 అని కొన్ని శాసనములు వే. వేం.)

"గుడిమల్లము బాణరాజుల శాసనములలో నైదింటియందు గొన్నిటిలో వడుగావళి యుదాహరింపబడినది.... ఆంధ్ర సాహిత్య పరిషత్తు రజతోత్సవ సంచికలో శ్రీమాన్ కృష్ణస్వామి అయ్యంగారు ఆంగ్లభాషలో 'వడుకు వడుక' అను విషయమును గూర్చి వ్రాసిన వ్యాసములో 'వడుకావళి' గూర్చి యిట్లు వ్రాసినారు — 'శాసనములలో తమిళాంధ్రదేశ సరిహద్దులను గూర్చి వడుగావళి మెర్కు (పడమట) వడుగావళికి కీళక్కు (తూర్పు) అను రెండు పదములు చెప్పబడినవి. పెరియ పురాణములో మధురపై దండెత్తి వచ్చిన యొక రాజునుగూర్చి వడుక కర్ణాటక రాజని వ్రాయబడినది. అదే విధమున హోయిసల రాజుల శాసనములలో దక్షిణ దేశపు దాడికి పెరియవడుగ కలహమని కలదు. కావున తమిళులకు వడుగలనిన కన్నడులనియే భావము. తర్వాత నేటి కాలమున వడుకవారనగా తెలుగువారయి వారి భాషకు వడుక భాషయనియు వ్యవహారము సిద్ధమయ్యెను.'— ఇప్పటి ఆంధ్రప్రదేశములోని కృష్ణానదికి దక్షిణ ప్రాంతమైన ఆంధ్ర భూభాగమునకు సరివచ్చు ప్రాంతమునకే వడుగావళియని పేరు." (ఇంతవరకు కుమారువారి గ్రంథము నుండి)

కాని, ప్రస్తుతము నాకు కావలసినది ఈ ఉత్తరపువారు ఆంధ్రులుగాని, తెలుగువారుగాని కారు — అను నంతవరకే.

తమిళులు ఒక జాతివారుగా, ఒక భూభాగములోని వారుగా నుండి తమలో వివాదములేర్పడి వేర్వేరు మండలములుగా చీలి పోయిన వారు కారు. అదిమొదలు యు, వీరి చరిత్ర తెలిసినదిమొదలు, చేర చోళ పాండ్యులు వెర్వేరు రాజ్యాలవారు, వేర్వేరు మండలములను పాలించుచు, తమలో తామొకప్పుడు కలయుచు, ఒకప్పుడు విడిపోవుచునుండినవారే. ఖారవేలుని హాథీగుంఫ శాసనము ప్రకారము వీరు క్రీ. పూ. 115 నాటికి - 113 సంవత్సరములు తత్పూర్వము నుండియు సముద్ర వ్యాపారాదికములలో సంఘీభావము వహించి యుండినట్లు తెలియుచున్నదిగాని. ద్వేషముగాని, స్నేహముగాని కార్య గౌరవమును బట్టి యుండునను ట న్యాయ సమ్మతము.

ఆ దినములలో - సంగం కాలములో - వంది మాగధులు ఈ రాజులను పొగడునప్పుడు ఒకనిని ఇంకొకనికి తక్కువ వానినిగా ఎవని ఆస్థానానికి పోయినప్పుడు వానిని గుఱించి చెప్పుట వారి అలవాటు. స్వభావము. ఇంతకు ముందుదాహరించి గుఱ్ఱముల పేళ్ళను గుఱించిన పూర్తి చాటువులే యిందులకు ప్రమాణము. ఇది చోళరాజు మీది చాటువు.

"కారత్తుక్కొప్పో కనవట్టం అమ్మానే, కూరువడుం కావిరిక్కువైగైయో, వమ్మానే, అఱుక్కు వేంబు నికరాగుయో వమ్మానే ఆదిత్తనుక్కు నికర్ అంబులియో వమ్మానే వీరరుక్కుని కరాగ మీనవనోవమ్మానే, వెట్రిప్పులిక్కొ డిక్కుమీనమోవమ్మానే ఊరిక్ పుకార్ తనక్కు కోరైక్కు యోవమ్మానే, ఒక్కుమో చోళనుక్కు పాండియన్‌కాణమమ్మానే." దీనికి తెలుగు—కురము (గుఱ్ఱము) నకు సమానమా గనవట్టము ఓ పిల్లా (వనితా) (ఘనవట్టము పాండ్యుని గుఱ్ఱమునకు పేరు) (పాడలం (పాటలము ?) చేరరాజు గుఱ్ఱము) కావేరికి వైగై సమానమని చెప్పవచ్చునా ఓ పిల్లా, అవిశెకు (అవిశెపూవులు చోళరాజులు ధరించెడివారట) వేప (పాండ్యులకు వేపాకు పూజ్యము) సమానమా ఓ పిల్లా ఆదిత్యునికి (చోళరాజులు సూర్యవంశస్థులు) చంద్రుడు సమానమా ఓ పిల్లా, (పాండ్యులు చంద్రవంశస్థులు) వీరునికి సమానుడా చేపల (మీనకేతనుడు) రాజు, సమానుడు కాగలడా ఓ పిల్లా, విజయ వ్యాఘ్ర పతాకకు మీనపతాక సమానమా ఓ పిల్లా, నగరరాజమగు ఉఱైయూరికి కోరైక్కుపురము ఉద్దియా ఓ పిల్లా - చోళునికి పాండ్యుడు ఎందులో ఉద్దికాగలడు చెప్పవే పిల్లా, ఏమేపిల్లా."

సంగం వాఙ్మయము ఈ ధోరణిలో నుండును. దక్షిణాత్య సాహిత్యములను తరచి చూచిన ఎంతో ఆశ్చర్యకరములైన చారిత్రిక సత్యములు, "నూతుల్ద్రవ్వ బేతాళముల్" అన్నట్లు వెలువడుచుండును.

తెలుగువారు తమిళులని ఎందులకన్నారను ప్రశ్నకు ఇంత రామాయణము వ్రాయవలసివచ్చినది. చరిత్రకారులు గుణదోషములు నిర్ణయింతురు గాక.

ఆకాశం నిట్టూర్చింది

శ్రీ వజ్ఝల కాళిదాసు

విహాయస వీధులో
విప్లవ శంఖం వినిపించింది!

"తర తరాలుగా
యుగ యుగాలుగా
నిరామయంగా
నిరంతరం
ప్రదక్షిణం చేస్తున్నామీ
ప్రభా పుంజం చుట్టూ
ఒక నిర్మిత పథంలో
ఒక కాలనియమంలో—
విసుగ్గా వున్నది,
విరామం కావాలి!"

అంటూ ఆగిపోయేయి
ఆగ్రహం వెళ్ళగక్కుతూ
గ్రహాలు కొన్ని ;
విప్లవ నినాదాలు చేస్తూ
వెనక్కి మళ్ళేయి !

అంగారకుడు అసలే కోపిష్టి
అగ్నులు కురుస్తూ
ఆక్రోశిస్తూ
ఆగిపోయేడు
కుతలం కుతకుత లాడింది
కొడుకేం చేస్తాడో అని!

వినీల వసనాలని విదిలిస్తూ
వికార హ్రస్వపాదాన్ని కదిలిస్తూ
శనిగ్రహం స్వీయ మందగమనాన్ని
స్థంభించి కూర్చున్నాడు!

కోటి నక్షత్రాల కాంతి నిండుగా దాల్చిన
గురుడు—దేవగురువు బృహస్పతి
తన సహజ శాంతస్వభావం వారించినా
మనసు దిటవు చేసుకొని
ఆగిపోయేడు!

* * *

అనంతతేజఃపుంజం లోలోపలి
అణువుల్లోని అణువులో
అణుపరమాణువు
అణుమాత్రం కదిలి చిరునవ్వింది!
ఆ కదలిక అంతరాళంలో
ఆవిర్భవింప జేసింది
అనిల సంచలనం
అనల ప్రజ్వలనం!!

నయాగరా నాట్యం చేసింది
సహారా సల సల కాగింది
ప్రశాంత మహాసాగరంలో
బడబానలం రేగింది
లేపాక్షి బసవయ్య లేచి
రంకె వేసేడు!

ఆకాశం ఆవలించి నిద్రలేచింది
ఆర్తవ వైపరీత్యాలని ఎదుర్కోవాలని;
తర తరాలుగా యుగయుగాలుగా
తన విశాల వినీల పథాంతరాళంలో
ఎన్ని ఝుంఝూ మరుద్వీర విహారాలు
ఎన్ని మహోజ్వలోల్కాపాత నిర్ఘాతాలు
ఎన్నెన్ని చమ చ్చమకిత
చంచలా విద్యుద్విలాసాలు
ఎన్నెన్ని నీరంధ్రాంధ కాలాంభోధర
విలాపాలు
ఎన్నెన్ని హిమోపల పాతాలు
భరించలేదు?! ?
ఇంకా ఎన్నాళ్ళు భరించాలో
అని నిట్టూర్చింది!!!

శ్రీ సూర్యదేవర రవికుమార్

జైమిని భారతము పాఠ-భేదములు

పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి రచించిన జైమినీ భారతపు తాళపత్ర ప్రతి యొకటి ఇటీవల నాకు లభించినది. ప్రకాశంజిల్లా దర్శిగుంటపేటలో శ్రీ డి. తిరుపతయ్యగారి యింటగల యీ తాళపత్ర ప్రతిని మరికొన్ని తాళపత్ర ప్రతులతో సంపాదించి యిచ్చిన వారు మిత్రులు, ఉదయగిరి సమితిలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న శ్రీ కె. వెంకట సుబ్బయ్యగారు. పై ఇరువురికి నా కృతజ్ఞతలు.

115 తాటియాకులపై చక్కగా వ్రాయబడిన జైమినీ భారతములో 106వ సంఖ్యగల తాటియాకు లోపించినది. ఈ గ్రంథముతోపాటు ద్విపద విరాటపర్వముగల కొన్ని తాటియాకులు కూడా చేర్చి ఒకే కట్టగా కట్టబడినది. ఈ ప్రతిని వ్రాసిన వ్యక్తి గ్రంథాంతమున ఈ విధముగా చెప్పుకొనెను.

> ధర శ్రీజైమిని యశ్వమేధము ననంత ప్రీతిగా వ్రాసె శే
> ఖరమౌ శ్రీ శుభకృత్తు వత్సరను మార్గాశీర్ష మాసంబునన్
> వరవిస్సాంబుధి వేంకనార్యసుత ధీవంతుండు సుబ్బన్న శ్రీ
> కర బొంతా బసువప్పనాయమణికిన్ కాంక్షన్మొసంగెన్
> గృహాన్ ॥

క్రీ. శ. 1933లో వావిళ్ళ వారచ్చువేసిన జైమినీ భారత ప్రతితో ఈ తాళపత్ర ప్రతిని పోల్చిచూచితిని. ముద్రిత, తాళపత్ర ప్రతులకు గల ప్రధాన పాఠభేదములను చూపించుటకీ వ్యాసముద్దేశింపబడినది.

వావిళ్ళవారి ముద్రిత ప్రతిలో దురదృష్టవశమున అచ్చు తప్పు లనేకము గలవు. తాళపత్ర గ్రంథమందలి వ్రాత నిర్దుష్టము కాదు.

ముద్రిత ప్రతిలో ఉండి, తాళపత్ర ప్రతిలోలేని పద్యముల సంఖ్య లివి :

1-70; 3-60; 4-36; 4-53; 5-115; 5-185; 5-190; 5-195; 6-166; 7-71; 7-125; 7-150; 7-159; 7-179; 7-2?2; 7-226; 8-14; 8-104; 8-214.

పై పద్యములలో

> ఆ సమయంబున ధర్మజ
> నే సోమకులంబునను జనించి కుటిలులన్
> శాసించి ధరణిపాలన
> చేసెదఁ దగ సాళ్వ నారసింహుఁడ నగుచున్.

అన్న 8-214వ పద్యమీ తాళపత్రి ప్రతిలో లోపించుట ముఖ్యముగా గమనింపదగినది.

ముద్రిత ప్రతిలో కన్పించక, తాళపత్రి ప్రతిలో కన్పించెడి అధిక పద్యములివి.

ముద్రితప్రతిలోని 3-61; 2-82; 4-133; 5-143; 5-174 పద్యముల తరువాత తాళపత్రి ప్రతిలో 'అప్పుడు' అను వచనము కన్పించుచున్నది.

ముద్రితప్రతిలోని వచనములలో ఈ క్రింది అధిక పాఠములు గలవు.

5-42 ము : డెందంబునం గ్రందుకొను నచ్చలరొబు పెచ్చు పెరుఁగ ....

తా : డెందంబునం గ్రందుకొను మచ్చరంబున చలంబు పెచ్చు పెరుగ....

ము : పుండరీకలోచనుండా త్మీయతేజో విశేషంబును, రామావతార సంచితంబగు ....

తా : పుండరీకలోచనుండు తత్కాండంబునపదభాగంబునం బరమేష్ఠియు,నంతరంగంబునం గృతాంతుని,నాత్మీయ తేజో విశేషంబు శేషంబును రామావతారసంచితంబగు.

8_178

ము : సునందా నీలకేతులు, ధమ్మిల్లాను సాళ్వులును మొదలుగా ....

తా : సునందానీలకేతులు, భానుమతీసహదేవులు, సుభద్రార్జునులు, మందారమాలా హంసధ్వజులు, ధమ్మిల్లాను సాళ్వులు, భారత సాత్యకులు మొదలుగా ....

ముద్రిత ప్రతిలో 5_43వ పద్యము తరువాత

బంధుర తరమగు నతని క
బంధము చుట్టుకొని ధాత్రిపై బడియె సుహృ
త్సింధుర భట హయ రథ ని
ర్గ్రంధన మెనరించ గిరికి గని వెరగందన్॥ అను పద్యము,

5_76వ పద్యము తరువాత

ఖండనమున సురధుని వర
మొండెము కరి తురగ రథ చమూపతులపయిన్
బొండుగ లవయగ జేగురు
గొండ విరిగి పడిన రీతి కుంభిని మీదన్॥ అను పద్యము,

6_15వ పద్యము తరువాత

ఏనవ మాసంబును నిదె
జానకికిన్ శుక్లపక్ష సప్తమి ముఖ్యం
బైన తిథి నామ చేయం
గానర్హము .... (గ్రంథపాతము) ....
అను పద్యము తాళపత్ర ప్రతిలో అధికముగా గలవు.

ముద్రిత ప్రతిలో 8_179, 8_190 పద్యముల నడుమ తాళపత్ర ప్రతిలో ఈ క్రింది పద్యములు గలవు.

8_179

నారదుడు సత్యభామా
గారంబున కేగి పూజగైకొని హర్షో
దారుండై యిట్లనియె ము
రారికి నయ్యింతికి కలహము పుట్టంగన్.

శమనాత్మజునకు నభిషే
కమొనర్పగోరి రాజగణమెల్లను సం
భ్రమమున తమతమ సతులన్
గ్రమమున గూడుకొని చనిరి గంగానదికిన్.

శౌరి రుక్మిణితో గూడి సంతసమున
చనియె నీవచ్చు బందు పుంజంబులోన
కొంచెమైనను నిను పల్కరించకునికి
నీకు తలవంపుగాదటె నిర్మలాంగి.

సలలితాకార సౌష్ఠవమున తెరగంటి
మించు బోణులకంటె మించినావు
ఘన భోగ భాగ్య సంగతుల భోజసుతాది
చెలువల కంటెను వెలసినావు
పారిజాతపు చెట్టు బాగుగా దెప్పించి
కొంచక పెరటి నాటించినావు
వలనొప్ప పుణ్యక వ్రత మొక్కటి యొనర్చి
భర్తృదానము చేసి ప్రబలినావు
ఇట్టి నిన్ను గణింపక గట్టువాయి
తనముగైకొని శౌరి స్వతంత్రుడగుచు
నిన్ను నిరసించి నీయాజ్ఞ నెరయ దప్పి
నడువ సాగెను ఇక నేటి కడిమి నీకు.

అనుటయు నవ్వారిజ లో
చన యిట్లని పలుకు మౌని సత్తమునీ చె
ప్పిన మాట తథ్యమైనను
వనజోదరు హృదయశుద్ధి వశమే తెలియన్.

వ॥ నాపుడమ్ముని వరుండమ్మానిని వీడ్కొని యాగశాల కరుదెంచె నంత నక్కడ.

శ్రీహరి పసుపున నట పు
ణ్యాహం బొనరించి దహను రవులు కొలిపి కౌ
తూహలమున 'నింద్రాయ
స్వాహా'యన చేయిసాచి శతముఖుడంటెన్. అ_19[illegible]

ముద్రిత ప్రతిలోని యీ క్రింది పద్యపాదములలో లోపించిన యతిని తాళపత్రప్రతి సవరించినది.

1_59

ము : నే, నన్నియుమాని కానలకు నేగెద ....
తా : నే, నిన్నియుమాని కానలకు నేగెద

5_170

ము : అనుసాళ్వుడనియె భావ్యంబు గాదని యావ
నాళ్వుడీచంద మపాయ మనియె
తా : అనుసాళ్వుడనియె భావ్యంబు గాదని యావ
నాళ్వుడీచంద మనర్హ మనియె

5_196

ము : చిత్రగతి నోర్తు చక చక ఝుంకృతులకు
తా : ఛత్రగతి నోర్తు చక చక ఝుంకృతులకు

8_130

ము : .... భక్తితోఁగాంచి గ్రగ
క్కున మాణిక్యరథంబుడిగ్గి చని సా
ష్టాంగంబుగా మ్రొక్కినన్

తా : .... భక్తితోఁగాంచి చ
య్యన మాణిక్యరథంబు డిగ్గి చని సా
ష్టాంగంబుగా మ్రొక్కినన్.

ముద్రితప్రతిలోని యీ క్రింది గణభంగమును తాళపత్ర ప్రతి సరిదిద్దినది.

2_81

ము :చ॥ అ, వ్వలనటుదాటి చిత్రగతి వాయుజుఁడిట్లపసవ్య మండల ....

తా : అ, వ్వలనటుదాటి చిత్రగతి వాయుజుఁడిట్లపసవ్య సవ్యమం డల....

ముద్రితప్రతిలోని కొన్ని ముఖ్యమైన అచ్చు తప్పులను తాళపత్ర ప్రతి సవరించినది.

	ముద్రిత ప్రతి	తాళపత్ర ప్రతి
1_29	అమితక్ష్మాధీశ	అహితక్ష్మాధీశ
1_38	బప్పున్న	ఛప్పున్న
1_66	నముద్రితమై	సముద్రితమై
2_95	తెమ్మని తిథికి మునువ	తెమ్మన్న తరికి మునుపు
4_115	కల్పవల్లిక, స్ఫలితము	కల్పవల్లికల్, ఫలితము,
5_62	క్రీడితో, నుక్కున	క్రీడిపే, రుక్కున
5_106	వృషకన్యక	విషకన్యక
5_172	నికృతికిన్ సైరింపఁగానేర	వికృతికిన్ సైరింప
6_37	జనకపుత్రిక నికటపై జనన నకట	జనకపుత్రిక నకట పై జనన కటక
6_93	పేర్పుగ భుజించి	నేర్పున భుజించి

	ముద్రిత ప్రతి	తాళపత్ర ప్రతి
8_22	కృష్ణుండు జిష్ణు రథం బారో హంబుసేయ	కృష్ణుంపు జిష్ణుతనయు రథం బారోహంబుసేయ
8_34	తదీయ చరిత్రమన్న విస్మ యము	.... మెన్న ....
8_174	ద్రౌపది యోషదుల్ గొనుచురా	ద్రౌపది యోషలన్ గొనుచురా
	నానా పృథివీశ్వరుండు యమ నందనుఁడధ్వరభూమి	నానాపృథివీ శ్వరుల్ శమ ననందను నధ్వరవేది

ముద్రిత ప్రతికి, తాళపత్ర ప్రతికి గల ప్రధాన పాఠభేదము లివి :

	ముద్రిత ప్రతి	తాళపత్ర ప్రతి
1_7	అని యిష్టదేవతా ప్రార్థనమ్ము నాదిక సుకవి వినుతమునుంగావిం చి నిలిచి పెల్లగు నుల్లం బునందు నేనొకపురాణముం జెప్పంగన్.	అని యిష్టదేవతా ప్రార్థ నంబును నాది కవి నుతంబునుం గావించి పెల్లగు నుల్లంబునందు నేనొక పురాణంబు
1_8	ఉద్యోగించి సుకవిజన హృద్యంబును నాద్యము మఱి యితిహాసానే క ద్యోతితపద్యావై శద్యం బైనదియుగాఁ విచారించి తగన్.	చెప్పగా నుద్యోగించి సుకవిజన హృద్యం బును నితిహాసానేక ద్యోతిత వైశద్యం బయినది యునుంగా విచార్షిని ॥
2_41	ఎ. గీ. సవనహరిఁ గొంచునెగసె నద్దివికి నొక్కఁ డుఱికి బలమెల్ల సమ యించెనొక్కఁ డతని దండనున్నాఁడు....	సీసపద్యమున అధిక పాదము తురంగంబు దివికి నెత్తుక పోయె నొక్కఁడు పోనీక సైన్యంబు బొదివిశిత
		ఎ. గీ. చండకోదండ నిష్ఠ్యూత సాయకముల నుక్కడంగింపుచున్నవా డొక్కఁడతని దండనున్నాడు ....

3_6	ఎ. గీ. గా నరుగుదెంచె వృషకేతుఁ డానరేంద్రుఁ బోర మెప్పించె నన ధర్మపుత్రుఁడీ జ యంబు కృష్ణకుఁ జెప్పు పొమ్మనిన భీముఁ డంతిపురమున	సీసపద్యమున అధికపాదము గా నేగుదెంచె సంగరమున మన వృష కేతుండు తనదు దోర్విక్రమమున ఎ. గీ. నన్నరేంద్రుని మెప్పించెనన్ననుబ్బి ధర్మతనయుండు నీవీ విధంబు ద్రుపద పుత్రి కెరిగింపు మనుచు పంపుటయు భీము డంతిపురమున....
4_94	బధిరుల నవైష్ణవుల న న్యధనాప హరులఁగాని...	బధిరుల మూగాంధుల న న్యధనాపహారులను ....
6_100	ఆ వసిష్ఠ వామదేవ గాలవగాధి	కణ్వవామదేవ గాలవ భృగుగాధి
6_171	అంత దశరథ మంత్రి సుమంత సుతులు సాహసులు పదుగురు సింహ చంద్రకాల ధార్మిక మదన శత్రు సూదన జితశ మామల శరన్నద సుకేతు లాగ్రహించి॥.	అంత దశరథ మంత్రి సుమంత సుతులు పదుగురను సింహ చంద్ర కపాలధార్మి క విమదన శత్రు సూదన కవి జితక్ల మామలా నదన సుకేతు లాగ్రహించి ॥
7_26	వాసిఁయిం దరికొండ కై వడిన్	వాసిపయిం జలిగాడ్పు కైవడిన్
7_44	ఆ. వె. బభ్రువాహనుండు పాండవ మధ్యము ప్రాణహరణ నిష్ఠుర ప్రచార జాగ్రదుగ్ర శరధి సంచిత జ్వాలాభి ధానశరము వింటఁ బూను టయును.	ఎ. గీ. బభ్రువాహుండు మధ్యము ప్రాణహరణ నిష్ఠుర ప్రచార జాగ్ర దున్నిద్ర శరధి లాలితామోఘ కీలి కీలా కలాప మానిత శరంబపుడు వింట బూనుటయును.
8_11	పాపకర్మ సంజనిత ఫలంబు	పుణ్యపాప సంజనిత ఫలంబు
8_48	దాదులచే నిరంతరము సంరక్షణ చేయింపఁగట్టడచేసి వేడ్క	వివిధభూషణ వస్త్రనిహంబు నొసగి నే ర్పున పూటపూటకు బుజ్జ గించి
8_113	బలబల వేగ	పలుమరు భక్తి
8_118	హరిపరాయణుడగు చంద్ర హాస నృపతి	ధర్మమార్గ మొకింతయు దప్పకుండ
8_130	ముంగలన్వర శతాంగా రూఢుడై వచ్చు దేవుని . మునిసేవ్యున్న క్తితోఁగాంచి...	ముంగలన్నరు శతాంగా రూఢుడై వచ్చుదేవుని... సేవ్యం గాంచి హర్షించి....
8_177	అఱునైదును నైదునైదు నిలిపి	అఱునేడును నైదునైదు నిలిపి
8_213	....ప్రథమపాదమునఁ గలిమహిమం బెరుఁగన వర్ణను గలిపిన కరణిన్ వర్ణాశ్రమములు కల్తి గలయున్	....ప్రథమపాదమున లక్షితమై చొరబడు వానలు కొంచెము కరగగ ధరదున్నకుండ పండవు పైరుల్.
8_220	... కుకురీకందర్ప చోళీకపో లాలంకార శకీ కర్పిత విలాసాకల్ప లాటీ కళా	... కుకురీ కందర్ప లీలాస్పదా చోళీ సత్కుచమల్లికా కుసుమ మంజువ్యాప్త గంధీ కళా

ఇక చివరగా తాళపత్రప్రతి సమర్థించిన మేలైన పాఠము లను కొన్నిటిని చూపించి యీ వ్యాసము ముగింతును.

	ముద్రిత ప్రతి	తాళపత్ర ప్రతి
1_22	అమృతాంశు మండలం బాలవాలముగాఁగ మొలిచె నొక్కటి జగన్మోహనముగఁ జిగిరించె	అమృతాంశు మండలం బాలవాలముగాఁగ మొలిచె నొక్కటి జగన్మోహనలత చిగిరించి ....
1_27	దానవారాతి దక్షిణేతర కరములు రాజితంబందు వెలయించె	దానవారాతి దక్షిణేతర కరంబు రాజితంబుగ వెలయించె

1_81	కవ్వడి నెవ్వడి విరోధి గణముల....	కవ్వడి నా డవ్విరోధి గణముల....
1_125	దేవరకు నట్టి గుణములు లేవుగాన	దేవరకు గల్గు గుణములు లేవుగాని
2_3	భద్రావతి యౌవనాశ్వ సురరాజ విరాజదిరామరావతిన్.	....సురరాజ సమర్థధ రాజరాజతిన్
2_9	అరిగిరి మువ్వురు నరిగి కుంజ గృహసంస్థితులై	అరిగిరి మువ్వురు నపుడు...
2_11	సంవర్త శిఖిశిఖాజ్వాల కీలంబును డాసిన కాల కూటంబుం బోలె	సంవర్తశిఖిశిఖా సఖకీలలం బురారి డాసిన ....
2_21	సింగంపుం గొదమ కరణి ధరణికిం జనుదెంచి....	ధరణికింబంఘించిచనుదెంచి
2_28	పెక్కు లీరీతి మఱియుం గల్పించి	పెక్కు లీరీతి మాయం గల్పించి
2_33	పెకలె నావృక్షభూభృచ్చయంబు	పెకలె సవృక్షభూభృచ్చయంబు
2_79	గదా ఘనదండము కేలం గ్రాలంగాం ద్రిప్పుచు	....కేల జాళెముల్ ద్రిప్పుచు ....
2_110	నా కారీతిన తప్పదు సంసారము సేయునెడ	నా కారీతిని వేడుక సంసారము సేయునెడ
3_109	బావిలోం గెడపితి వట్టి నిన్నిపుడు	బావిలోం గెడపితి యొంటి జేసి నిను
4_3	కళత్రము చూడంగం జూచె	కళత్రము చూడంగం జూచె
4_18	ఆహవముం దక్కి	సాహసము దక్కి ....
4_20	తేరికతివారణ సడ్డము సొచ్చి	తేరి కరివారణ సడ్డము సొచ్చి
4_102	అర్జును కిరకంకజాతోదరము సోకి	అర్జును కరకంకజాతమును సోకి
5_18	బాహాటోపమున్ జూపితా, నవిలో	బాహాటోపమున్ జూపితా నవిలో
5_22	పోరి నానాస్త్ర నిహతిం దొరగు శోణితముల	పోరి నానాస్త్ర నిహతిం ....
5_31	తీవ్రశరవేదనం జూపుచు	తీవ్రశరవేగము జూపుచు
5_112	అంత నశ్వామరసేక్షణల్ హయవతంసముం బట్టిన	అంత నశ్వామర సాక్షి యా హయ ....
5_143	పరాక్రమమున నక్షుభితగతిం బోరె	పరాక్రమమున సంక్షుభిత గతిం బోరె
6_118	కనలి కరములు శరములం దునుంగనేయ	కనలి శరముల సేనలం దునుంగనేయ
6_209	మృగములు వే శంతతట కుంజముల	మృగములు వే చెంతల నికుంజముల
6_236	వినియమ్మహీ కాంత	విని యమ్మహీజాత ....
7_36	తచ్చిరంబు శరీరంబునం జేర్చి	తచ్చిరం బురంబునం జేర్చి
7_46	వ్రాలెనతని తలయు నట్టయు వృషభ కేతనుని మ్రోల	వ్రాలెనతని తలయు నట వృషకేతునితలయు మ్రోల
7_192	ఇంత పడుచు కొడుకవు గలవే	ఇట్టి పడుచు కొడుకుం గలరే
7_238	ద్రావిడాంగ	ద్రావిడాంధ్ర
8_56	మూండు వగల పగిది	మూండు వగలు గలవి ....
8_108	సచివతనయుం డనిపి పంపిన....	సచివతనయుం డతని బంపిన....
8_173	ధర్మనందనునకు నమ్రుండై కేశవునన్ భజియింప....	ధర్మనందనునకు మ్రొక్కి కేశవుని తా భజియింప ....
8_198	ఏ మెఱికియును లేక	ఏ మెరికెయును లేక ....
8_212	అలమిన ఘోర మోహముల చేత....	అలమిన లోభ మోహముల చేత....
8_220	కుకురీ కందర్ప చోళికపో లాలంకార శకీ కరార్పిత విలాసాకల్ప లాటీకళా....	కుకురీ కందర్ప లీలాస్పదా చోళీసత్కుచ మల్లికా కుసుమ మంజు వ్యాప్త గంధీ కళా....*

పుప్పొడి చినుకులు

సాంధ్యశ్రీ

పుడమికి తొలిచూలు ముక్తాఫలం
మొక్క
సప్త వర్ణాల హరివిల్లును శరీరం మీద విరియిస్తుంది
గుణాన్ని మొదటి పూలతో పూజించనిచోట
మనిషిలో దర్పం దర్బారుసాగిస్తుంది
మూలికల్ని చంపుకున్న నేల తేజస్సుకోసం
పరితపించి
మౌలికధర్మం కోల్పోయి ప్రార్థన వినలేదింక
పూల మౌనభాష వినలేని హృదయానికి
స్వార్థ ఘోష సంగీతమై
చప్పుళ్ళసమాధుల్లో నిద్రబుచ్చుతుంది....
గాలిమోసే పుప్పొడి కడుపు పండైన
మొక్కలు
పూలను ప్రసవిస్తాయి....

రంగుల్లో తడిసిన శక్తి
జీవరస గర్భమైన పుడమికి పురుటినెప్పులు కలిగించి
గుడాకేశుడ్ని మనిషి అంతరంగంలో ఆవిర్భవింపచేస్తుంది
పరమహంసా...!

ప్రస్థానించు
నేలమీంచి
చెట్లచివళ్ళమీంచి
గిరిశిఖరాలమీంచి
మేఘాలమీంచి
నేలలోకి....

కాలపదాలు క్షణాలు
కావెప్పుడూ విరామచిహ్నాలు
అవి అచంచల దీక్షాసంకేతాలు
అందిపుచ్చుకొని అఖండయానం చేస్తూన్న
మనిషికి
ముందుగా మొక్కుతూ అక్షరాలతో అంజలిఘటిస్తున్నప్పుడు
ఆకాశాన్ని అంబరంగా ధరించిన అమృతమూర్తి కురుస్తున్న
దయావర్షంతో
మొలకెత్తిన
మానవతామూలిక
నాగరిక రోచిస్సును పర్వతాలగుండెలమీద
సానగంధం తీసి మై పూత చేస్తోంది....

గాలిపీస్తున్న చరిత్ర మరందంలో
మరోపుట వ్రాసుకుంటున్నాను....

కాలం కాంతిని కరళ్ళెత్తిస్తూ
మహాసముద్రంలా కదిలివస్తోంది
అభ్యంజనం చేస్తాను
ఎద పొరల్ని ఆవిష్కరిస్తాను....

నా మాట
అడవులకు అలంకారం
నా స్పృహ
భూగోళచైతన్యం
నా ఉనికి
తోటలకు పూవు
గిరిగీసుకున్న దేశరేఖలకు స్వస్తి....

మహాప్రస్థానంలో అలసిపోని మనిషిగుండెలో
నిత్యవాసంత సమీరప్రసారం ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ....

దేహం చెట్టు
పెరుగుతున్న కొమ్మలు రెమ్మలు
ప్రయాణసూచికలు...

నన్ను తెలుసుకున్న నేను
భూగోళమైన మరుక్షణం
అన్ని జాతులు ఒకేరోజు చేసుకొన్న సూర్యదినం ఉగాది
అస్తమయ బాదరబందీలు లేవని తెలుసుకున్న
ఇంద్రియం పడమటి కొండను పటాపంచలు చేస్తుంది
దిక్కు ఒక్కటే తూర్పు-ఇక్కడిపూవు నిత్య మంజిష్టం.

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

మానవాహారంగా సూక్ష్మజీవజాలం?!

"శాస్త్రం" పెరిగేకొద్దీ సమస్యలుకూడ పెరుగుతున్నాయన్నవాదం వాస్తవ దూరమైనదికాదు. "నేచర్"ని, "సైన్స్" "ఎక్స్ప్లాయిట్" చేస్తోందేమోనన్న అనుమానం కూడ రాకపోదు. అది కొంతవరకు నిజంకూడ! మితిమీరిపోతున్న జనాభా, ప్రళయాంతకమైన ఒక సమస్య. నానాటికీ పెచ్చుపెరిగిపోతున్న ఆహారసమస్య, ప్రపంచ యుద్ధాలకన్నా భయంకరమైనది. ఈ రెండింటికీ తోడుగా "సైన్స్" పరీక్షల పేరుతో జరుగుతున్న ఎన్నో రశ్మిధ్గారక పదార్థాల విశ్లేషణ చర్యలద్వారా ఉత్పన్నమౌతున్న ఆరోగ్యసమస్య, మానవజాతివికాసానికి పెద్దప్రతిబంధకంగా తయారైనది. జనాభాను నియంత్రించడం, అధికంగా ఆహారాన్ని ఉత్పన్నం చెయ్యడం, పారిశుద్ధ్య స్థాయిని గణనీయంగా పెంచడంవల్ల ఈ మూడు సమస్యలను పరిష్కరించవచ్చు. కాని అవంత సులభసాధ్యమైన చర్యలుకావు. అయినా "సైన్స్" ప్రయత్నిస్తూనే ఉంది. ప్రయత్నిస్తూనే ఉంటుంది. నిర్విరామంగా నిరంతరం మానవక్షేమం కోసమే అది పాటు పడుతూ ఉంటుంది. అప్పుడే అది "సైన్స్"!

ఆహార సమస్యను దృష్టిలో పెట్టుకొని ఎన్నో చర్యలు "సైన్స్" తీసుకొన్నది. భూమిపైనున్న ఆహారాన్నేగాక, సాగర గర్భంలో దాగి ఉన్న ఆహారాన్ని సైతం మనిషికోసం వినియోగించేందుకు -"సైన్స్" ఆరాటపడుతున్నది. సమస్యలమీద సమస్యలు వస్తూనే ఉన్నాయి. వాటిని తరుణోపాయంతో "సైన్స్" ఎదుర్కొంటూనే ఉన్నది. చివరికి సూక్ష్మజీవజాలం కూడ మానవాహారంగా పనికొస్తుందని "సైన్స్" భావించింది. రోజు రోజుకు కటకటమనిపిస్తున్న "ప్రోటీన్"ల కొఱత (దేహనిర్మాణానికీ చైతన్యానికీ యీ "ప్రోటీన్"లే మూలస్తంభాలు. వీటినే మాంసకృత్తులని వ్యవహరిస్తారు) సూక్ష్మజీవజాలాన్ని యిబ్బడి ముబ్బడిగా ద్విగుణీకృతం చేయడం ద్వారా ఒక కొలిక్కి వచ్చినట్లు ఊహిస్తున్నారు. రానున్న రెండు దశాబ్దాల కాలంలో "ప్రోటీన్"ల కొఱత పెట్టింపవుతుందని "చర్చ్"అనే జర్మన్ శాస్త్రవేత్త(1974) అభిప్రాయపడినాడు. ఈ అభిప్రాయం నూటికి నూరుపాళ్లు సరియైనదేనని క్షణ క్షణానికీ విషమిస్తున్న పరిస్థితులు - మనిషికి, యితర జంతువులకు, ఆహారానికి మధ్య ఏర్పడుతున్న విపరీతమైన పోటీ - తెలియజేస్తున్నాయి. ఈ కారణంగా ఆహారోత్పత్తిపై పరీక్షలను కేంద్రీకరించడం ఉచితమే కాదు, అవసరంకూడ! అందువల్లనే సూక్ష్మజీవులైన శైవలాలను ("ఆల్గే"లు), శిలీంధ్రాలను ("ఫంగస్"లు) "బ్యాక్టీరియమ్"లను "ప్రోటీన్" దాతలుగా స్వీకరించి, వాటినుంచి అత్యధికమైన మోతాదులో "ప్రోటీన్"ను రాబట్టి ప్రజావాహినిని ఆదుకోవడం "సైన్స్"లో ఒక ముఖ్య ఘట్టమైపోయింది. జాతి సౌభాగ్యానికి ఆయువుపట్టై కూర్చొంది!

సూక్ష్మజీవులను "ప్రోటీన్" ఉత్పన్నకాలుగా ఉపయోగించుకోవడంలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. వీటి వృద్ధి నిమిషాల మీద జరుగుతుంది. ఊహించనంత వేగంగా తీవ్రంగా యివి పెరిగిపోతాయి. సంఖ్యాపరిమాణంగా అత్యున్నత స్థాయికి కొన్ని గంటలలోనే చేరుకొంటుంది. శైవలాలు రెండునుంచి ఆరు గంటల లోగా "మాక్సిమమ్ నంబర్"కు చేరుకొంటాయి. అదే "యీస్ట్" అనబడే శిలీంధ్రానికైతే ఒకటి నుంచి మూడు గంటల వ్యవధి చాలు. అంతకంటే తక్కువ వ్యవధిలో అంటే అరగంట నుంచి రెండుగంటలలోగా "బ్యాక్టీరియమ్", "రికార్డ్" స్థాయిలో ఉత్పన్నమౌతుంది. పైగా యీ సూక్ష్మజీవులను జన్యుపరంగా మార్పులకు గురి చేయడం చాల సులభం. "ప్రోటీన్" యొక్క ధాటి లేక చేవ దానిలో ఉన్న "అమైనో ఆసిడ్"లను బట్టి ఉంటుంది. ఈ "అమైనో ఆసిడ్" జన్యు సంకేతం మీద ఆధారపడి ఉంటుంది. ఈ సంకేతాన్ని ప్రయోగాలద్వారా మార్చివేసి మనకు కావలసిన "అమైనో ఆసిడ్"ను తయారు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ సూక్ష్మజీవుల్లో చాల సరళంగా, బహుసులభంగా ఉంటుంది. అంతే కాకుండా యీ సూక్ష్మజీవులద్వారా లభ్యమయ్యే "ఆర్గానిక్ మ్యాటర్"లో నలభై ఐదు నుంచి ఎనభై ఐదు శాతం వరకు "ప్రోటీన్"లు "డ్రైమాస్"లోనే ఉంటుంది. సూక్ష్మజీవులఉత్పత్తికి అవసరమయ్యే పదార్థాలు లేక మూలధాతువులు ప్రకృతిలో విరివిగా లభ్యమౌతాయి. వ్యర్థపదార్థాలుకూడ ఒక్కోసారి మూలధాతువు

లుగా ఉపకరిస్తాయి! ఈ సూక్ష్మజీవుల ఉత్పత్తి నిలకడగా నిర్దుష్టంగా ఉండేందుకు అవకాశముంది. వాతావరణ ప్రభావం పెద్దగా లేదు. కావలసినంత మోతాదులో వీటిని తయారు చేసుకోవచ్చును. దీనికి కావలసిన ముడిపదార్థాలు కూడ స్వల్పమే! వీటిద్వారా హాని కలిగించే విధంగా ఉండే ఏ ప్రభావాలూ ఉత్పన్నం కావు. అంటే ఆరోగ్యసమస్యను తెచ్చిపెట్టే విధంగా పారిశుద్ధ్యస్థాయిని దిగజార్చేవిధంగా ఈ సూక్ష్మజీవుల ఉత్పత్తి కొనసాగదు. ఏ విధంగా ఆలోచించినప్పటికీ యీ సూక్ష్మజీవుల ఉత్పత్తి కొనియాడే విధంగానే ఉంటుంది.

"కిహిల్‌బెర్గ్" (1972) "మైక్రోబియల్ ప్రోటీన్" తయారీలో (సంగ్రహణలో) ఉపయోగించే సూక్ష్మజీవరాశుల వివరాలను గురించి స్పష్టంగా తెలిపి ఉన్నాడు. "క్లోరెల్లా", "సీన్ డెస్మస్", "స్పైరులైనా"- వంటి శైవలాలు; "రాడొటోర్యూలా", "శాఖరోమైసిస్","క్యాండిడా"- వంటి శిలీంధ్రాలు; "హైడ్రోజనోమోనాస్", "మెథనో మోనాస్", "మిథైలో మోనాస్" - వంటి "బ్యాక్టీరియమ్"లు; "మైక్రోబియల్ ప్రోటీన్" సంగ్రహణలో ఉపయోగించే సూక్ష్మజీవులుగా పేర్కొనబడ్డాయి. శైవలాలకు సంబంధించి వాటి ఉత్పత్తికి ఆధారంగా ఏ విధమైన సేంద్రియ పదార్థాన్నీ ("ఆర్గానిక్ సబ్‌స్ట్రేట్") ఉపయోగించవలసిన అవసరంలేదు. సూర్యరశ్మి, కార్బన్ డై ఆక్సైడ్ వాయువు ఉంటేచాలు. ఇవి రెండూ ఎలాగూ వాతావరణంలోనే లభ్యమౌతాయి. "బ్యాక్టీరియమ్"ల, 'యీస్ట్'ల(శిలీంధ్రాల)విషయం అలాకాదు. వాటికొక నిర్దుష్టమైన"ఆర్గానిక్ సబ్‌స్ట్రేట్" అవసరము. ఒక శక్తిజనకంఅవసరం. ఖనిజ లవణాలను, నత్రజనిని జతచేయవలసిన అవసరం కూడ ఉన్నది. 1979లో ఇంగ్లాండు, రుమానియా దేశాలలో "మైక్రోబియల్ ప్రోటీన్" ఉత్పత్తి అత్యంత గణనీయంగా జరిగిందని అంచనా. ఒక్క ఇంగ్లాండులోనే అరవై వేల టన్నుల "బ్యాక్టీరియమ్ మాస్" (సాలుకి) ఉత్పత్తి అయిందని అంచనా. ఈ ఉత్పత్తిని మరింత ఎక్కువ చేయడానికివీలుగా, "ఆర్గానిక్ సబ్‌స్ట్రేట్"లమీద మరింత పకడ్బందీగా పరిశోధనలు జరిగినాయి.

"కన్‌వెన్షనల్"గా ఉపయోగించే సేంద్రియ పదార్థాలతో పాటు క్రొత్తవాటిని కూడ ఉపయోగించి విస్తృతమైన ఫలితాలను సాధించగలిగినారు. "స్టార్చ్" (ధాన్యపుగింజలు, బంగాళాదుంపలు మొదలైన వాటిలో ఉంటుంది), చక్కెర ("బీట్‌రూట్", చెఱకు గడలలో ఉంటుంది), చెట్లనుంచి స్రవించే కొన్నిరకాల పదార్థాలు, పచ్చిదినుసులు - వంటి వాటిని "కన్‌వెన్షనల్"గా ఉపయోగించే 'ఆర్గానిక్ సబ్‌స్ట్రేట్'లుగా నిర్ణయించవచ్చు. ఇకపోతే 'ఆల్కేన్ లు, "ఆల్కహాల్"లు, "ఆల్డిహైడ్"లు, "ఆర్గానిక్ ఆసిడ్"లు, జంతు వృక్షవ్యర్థపదార్థాలు, కార్బన్ డై ఆక్సైడ్ - మున్నగు వాటిని "అన్‌కన్‌వెన్షనల్"గా ఉపయోగించే సేంద్రియ పదార్థాలుగా జమ కట్టవచ్చు. సూక్ష్మజీవులఉత్పన్నానికి అనుకూలంగా ఒక సేంద్రియ యోగికాన్ని సమకూర్చవలె. ''బ్యాక్టీరియమ్"ల ఉత్పన్నానికి 'డేవిస్' (1974) అనుసరించిన క్రమాన్ని యిక్కడ మననం చేసుకోవలె. సేంద్రియ యోగికానికి జతగా నీటిని, "ఫాస్ఫారిక్ ఆసిడ్"ను, "మెగ్నీషియమ్ సల్ఫేట్"ను, ''సోడియమ్", "పొటాషియమ్" లవణాలను కలుపుతారు. ఉత్పన్నమైన ''బ్యాక్టీరియమ్"లు "స్టెరిలైజేషన్ ఫిల్టర్" ద్వారా 'మల్టిప్లికేషన్ ఛేంబర్'లోనికి వెళ్తాయి. అంటే యిక్కడ 'బ్యాక్టీరియమ్'ల సంఖ్య తారాస్థాయికి చేరుకొంటుందన్నమాట. ఇది కణవిభజనద్వారా సాధ్యమౌతుంది. 'ఈస్ట్'ల విషయమైతే 'ఫెర్‌మెంటేషన్' ప్రక్రియకు గురిచేస్తారు. తరువాత సూక్ష్మజీవులను వేరుపరుస్తారు. ఆ తరువాత 'డ్రై' చేస్తారు. 'హీట్‌షాక్' యిచ్చే ప్రక్రియను పూర్తి చేస్తారు. ఈ విధంగా లభ్యమయ్యే 'డ్రైమాస్'ను ఆహారంగా ఉపయోగించుకోవచ్చునని మొదట్లో భావించినా, దీనిలో అధిక శాతంలో 'ప్రోటీన్'లే ఉన్నా, 'న్యూక్లియక్ ఆసిడ్' కూడా ఉండడంవల్ల మానవాహారంగా అదే స్థితిలో వినియోగించడానికి అభ్యంతరం ఏర్పడింది. ఎందుకంటే 'న్యూక్లియక్ ఆసిడ్'లను జీవక్రియలో ఉపయోగించుకొనే సామర్థ్యం మానవునికి ఒక సాధారణ జంతువుకన్నా (క్షీరదం) తక్కువగానే ఉంటుంది. ఈ 'ఆసిడ్'లు 'ప్యూరిన్'లని, 'పిరమిడిన్'లని పిలవబడే నత్రజని క్షారాల విడుదలకు సహకరిస్తాయి. ఇందులో 'పిరమిడిన్'లను ఉపయోగించు కోవడంలో పెద్ద యిబ్బందిలేదు. 'ప్యూరిన్'లతోనే గొడవంతా. ఈ 'ప్యూరిన్'లు, 'జాంతిన్' అనే విసర్జకాన్ని విడుదలచేస్తాయి. దానితో పాటు 'అమ్మోనియా' అనబడే విషవాయువు కూడ విడుదలౌతుంది. (దీన్ని బహిష్కరించడం క్లిష్టతతో కూడుకొన్న చర్య!) 'జాంతిన్' 'యూరిక్ ఆసిడ్'గా వ్యర్థపదార్థంగా విసర్జించబడుతుంది. ఒకవేళ 'యూరిక్ ఆసిడ్' మోతాదు ఎక్కువైతే ఆ 'ఆసిడ్' స్ఫటికాలుగా నిలువ ఉండి కీళ్ళనొప్పులను కలిగిస్తాయి. వాపు ఏర్పడుతుంది. దీన్ని 'గవుట్' అని పిలుస్తారు. అందువల్ల సూక్ష్మజీవులనుంచి వచ్చే 'డ్రైమాస్'లోని 'న్యూక్లియక్ ఆసిడ్'లను తొలగించి వేస్తే ఏ బాధా ఉండదు. అప్పుడు దానిని మానవాహారంగా ఏ విధమైన సందేహమూ లేకుండా ఉపయోగించుకోవచ్చును.

'ప్రోటీన్' సంగ్రహణలో 'డ్రైమాస్'పాత్ర కీలకమైనది. ఇందులో 'న్యూక్లియక్ ఆసిడ్'లను మినహాయిస్తే 'క్రూడ్ ఫ్యాట్' (క్రొవ్వు పదార్థము), 'క్రూడ్ ఫైబర్' (నారల వంటి పదార్థము) లాంటివి ఉంటాయి. పూర్తిగా 'ప్రోటీన్' మాత్రమే వేరుచేసి,

నిషి తన ఆహారంగా ఉపయోగించుకోవచ్చు. లేదూ అనుకొంటే 'డైక్రిమాస్'ను అలాగే పశువులకి మేతగా ఉపయోగించవచ్చు. ఇంగ్లాండులో పందుల పెంపకంలో 'డైక్రిమాస్'ను యిప్పటికే విరివిగా ఉపయోగిస్తున్నారు. సూక్ష్మజీవరాశులద్వారా ఏ మోతాదులో శుద్ధ 'ప్రోటీన్'ను సంగ్రహించగలమో క్రింది పట్టికలో తెలియబరుస్తాను.

సూక్ష్మ జీవి రకము	"క్రూడ్ ప్రోటీన్" శాతము	"న్యూక్లియక్ ఆసిడ్" ల శాతము	శుద్ధ "ప్రోటీన్" శాతము
శైవలాలు	55	6–13	50
శిలీంధ్రాలు	65	13–20	55
"బ్యాక్టీరియమ్"లు	80	15–25	65

శుద్ధ "ప్రోటీన్" యొక్క "క్వాలిటీ"ని కూడ మెరుగుపరచవచ్చు. దీనిని "అమైనో ఆసిడ్"ల పరంగా నిర్ధారిస్తారు. "అమైనో ఆసిడ్" లను జన్యుపరంగా మార్చడానికి వీలున్నదని ముందే తెలుసుకొని ఉన్నాము. "బెక్ మరియు గ్రాప్" అనబడే జర్మన్ శాస్త్రజ్ఞులు (1974) "అమైనో ఆసిడ్"లను గురించి పరిశీలించినారు. వీరు సూక్ష్మజీవులద్వారా లభ్యమయ్యే "క్రూడ్ ప్రోటీన్" లో ఉండే "అమైనో ఆసిడ్"లను, బలవర్ధకమైన ఆహారంగా భావించే చేపలు, సోయా చిక్కుడు వాటిలోని "ప్రోటీన్"లలో ఉండే "అమైనో ఆసిడ్"లతో పోల్చి "మైక్రోబియల్ ప్రోటీన్" ఎందులోనూ తీసిపోదని స్పష్టం చేసారు. "స్క్లజ్" అనే మరో శాస్త్రజ్ఞుడు కూడ (1975) దీనిని నిర్ధారించి ఉన్నాడు. ముఖ్యంగా తారసపడే "అమైనో ఆసిడ్"ల పంపిణీ "మైక్రోబియల్ ప్రోటీన్"లలో మిగతా జంతుసంబంధ వృక్ష సంబంధమైన "ప్రోటీన్"లలో ఎలా ఉంటుందో క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

"అమైనో ఆసిడ్"	శైవలం "ప్రోటీన్" లో	శిలీంధ్రం "ప్రోటీన్"లో	"బ్యాక్టీరియమ్" "ప్రోటీన్"లో	చేప "ప్రోటీన్"లో	సోయాచిక్కుడు "ప్రోటీన్"లో
లైసీన్	5.7%	7.4%	6.2%	6.4%	6.4%
మిథియోనైన్	1.6%	1.5%	2.4%	2.7%	1 5%
సిస్టైన్	0.7%	1.0%	1.6%	1.1%	1.5%
త్రియోనిన్	5.2%	4.9%	4.6%	4.5%	4.0%
ట్రిప్టోఫ్యాన్	1.3%	1.4%	1.0%	1.2%	1.3%

పై పట్టికను నిశితంగా పరిశీలించి నట్లయితే "మైక్రోబియల్ ప్రోటీన్" ఏ విషయంలోనూ తీసిపోదని నిర్దుష్టంగా తెలిసొస్తుంది. "క్రూడ్ ప్రోటీన్" 82–90 శాతం వరకు పశువులలో జీర్ణం కాబడుతుంది. 65–97 శాతంవరకు శక్తిని ప్రసాదించగలుగుతుంది. అందువల్ల ఈ "మైక్రోబియల్ ప్రోటీన్" పశుగ్రాసంగా శుద్ధి చేయకుండానే ఉపయోగించబడుతుంది. మనిషి విషయమైతేనే యీ "ప్రోటీన్"ను శుద్ధి చేయడమనే ప్రశ్నతలెత్తుతుంది.

ఇటీవల "రాత్" అనే శాస్త్రజ్ఞుడు యీ అంశాన్ని గురించి చర్చిస్తూ "మైక్రోబియల్ ప్రోటీన్"లను పశువులకు ఉపయోగించి వాటికి ఏర్పడిన ఆహారపు కొఱతను తీర్చవచ్చని సూచించినాడు. ఈ మేత ఎంతో బలవర్ధకంగా ఉండడంవల్ల పశువులు బాగా పెరుగుతాయని అభిప్రాయపడినాడు. ఆ పశువులు మానవాహారంగా ఉపయోగపడుతాయి. ఈ విధంగా మనిషికి పోటీగా ఉన్న జంతువుల ఆహార సమస్యను తీర్చవచ్చు. మనిషి కూడ సమృద్ధిగా ఆహారాన్ని సంపాదించుకోవచ్చు! అయితే యీ విధానం మన భారతదేశంలో ఏ విధంగా ఆచరింపబడుతుందనేది ఒక ప్రశ్న. మనదేశం కన్నా ఎంతో చిన్నదైన జపాన్, జర్మన్‌లు శాస్త్రీయ సాంకేతిక రంగాలలో అత్యున్నతమైన స్థాయిని చేరుకొని, అగ్రగాములైన అమెరికా రష్యాలకే "ఛాలెంజ్"గా నిలబడి ఎన్నో సమస్యలను, పరిష్కరించుకొంటూ ఉంటే–మన భారతదేశం ఎంతో వెనుకబడి ఉండడం విస్మయాన్ని కలిగిస్తుంది. శాస్త్రీయ అవగాహన లేక కాదు, సాంకేతిక పరిజ్ఞానము లేక కాదు, ఏదైనా సాధించాలన్న ఉత్సాహం లేక! "మనకెందుకు లెద్దూ" అన్న పాలమారిన తనం వల్ల! ఇది దేశాభివృద్ధికి గొడ్డలి పెట్టువంటిది. ఈ విధమైన నీరసభావాన్ని తొలగించుకొని, మన ముందున్న ఎన్నో సమస్యలను పరిష్కరించుకోవలె. అందులో ఆహారసమస్య ఒకటి. ఆ ఆహారసమస్యకు పరిష్కారమార్గాలెన్నో ఉంటాయి. వాటిలో యీ "మైక్రోబియల్ ప్రోటీన్"ల ప్రశ్న ఒకటి. మరి దీన్నెంత వరకు మన భారతం పాటిస్తుందో!

వేచిచూడమని కాదు నేను చెప్పేది, చేసి చూడమని!

నాలో మంటలు లోకం పంటలు

నాలో
లోలో
మంటలు మంటలు
తెల్లని మంటలు
సముద్రాల్ని శాసిస్తాయ్
దేశాలను దీవిస్తాయ్
నా మంటల్లో
నా మాటల్లో
ఒక నీతి
ఒక గీతి
ఒక రీతి
ఒక హేతి.

నీలో
ఏవో
ఊహాలు ఊహాలు
నల్లని ఊహాలు
కిరణాలకు భయపడతాయ్
మసి పూయాలని చూస్తాయ్
నీ ఊహల్లో
నీ చేతల్లో
అవినీతి
స్వార్థబుద్ధి
దౌర్జన్యం
అన్యాయం.

నా మంటలు ఆర్పే కిటుకు
నీకే తెలుసనుకుంటావ్!
నీ కిటుకులు కూల్చేవిషయం
నాకు తెలియదనుకుంటావ్!

దశదిశాంత పర్యంతం
నా మంటలు వ్యాపించాలి
ఆ కైలాసం సాంతం
అవనిలోన దీపించాలి.

అసలు దొంగ

అంతా
ప్రశాంతంగా వుంది
తోపులో కొబ్బరి చెట్లు
సన్నగా నవ్వుకుంటూ
మెల్లగా
కబుర్లు చెప్పుకుంటున్నాయి

అంతలో హడావుడిగా
దూసుకొచ్చిన గాలి
అంతటా
వార్తను ప్రకటించింది
"తుఫాను రౌడీ వస్తున్నాడు
అందరినీ చంపేస్తున్నాడు"

వెంటనే
గుండె లవిసిన చెట్లు
పరస్పరం వాటేసుకుంటూ
జుట్టు విరబోసుకొని ఏడుస్తున్నాయ్
ప్రకృతి దద్దరిల్లేలా కేకలు వినిపిస్తున్నాయ్

తెల్లారేసరికి చూస్తే
తుఫాను రౌడీ రాలేదు కాని
"మాయగాలి" బీభత్సానికి
చెట్లన్నీ నేల కూలాయి.

నక్షత్రాలు

దు నక పోతు న్న్యాడు
అస్తాద్రికి గుద్దుకొని
చెల్లా చెదరైన ముక్కలా !

భాను డస్తమించాడని
కాల పురుషుడు చల్లిన
చిల్లర డబ్బులా !

బొట్టు చెరిగి పోయేసరికి
దినకాంత ముసుగేసుకొని ఏడుస్తుంటే
జారిన కన్నీటి బొట్టులా !

కాదు కాదు
కాదు కాదు
భాస్కరునికి -
చావు లేదు

విదేశాలకు వెళుతూ
మన తండ్రి భారవి
అనాధలైన మన రక్షణకోసం
నియ మించిన సైనికులే
నక్షత్రాలు.

శ్రీ రావి రంగారావు

★ ★ ★ ★ ★ ★ ★

కవితో ...

శ్రీ యస్. యస్. రెడ్డి

కవితో ....
మల్లెలు మాట్లాడుతాయి
మంటలు చెలరేగుతాయి
మేఘాలు సందేశాన్ని
మోసుకపోతాయి
చెట్లు చైతన్య స్తన్యం యిస్తాయి.

కవికి ....
ఆకాశం వొంగుతుంది
సముద్రం లొంగుతుంది
గాలి గుసగుస లాడుతుంది
ఆకులు కనుసైగలు చేస్తాయి
వీటన్నింటికి కారణం
శిక్షితమైన కళ్ళు
లక్షితమైన మెత్తని హృదయం.

గవేషణ

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

ఎక్కడిదీ మృదుమనోజ్ఞ
వేణుగాన లహరి !
హృదయము కరగించే
చక్కనైన లాహిరి ! ॥ఎక్క॥

ఈ వెన్నెలరేయి యమున
తరగలపై తేలి తేలి
నా గుండియ నూపు వేణు
నాదం బిది యెవ్వరిదో —
సుందర రస బంధురము - మనో
మందిర కల్యాణకరము ॥ఎక్క॥

భువికి దిగిన నీలమేఘ
శకలము బృందావనిలో
నడయాడెనో! మృదుగర్జా
నాదంబులు వర్షింపగ—
లలిత మనోహరము - రాగ
లీలాచైతన్య ఝరము ! ॥ఎక్క॥

పరువెత్తెను యమునాతటి
విరబూసెను బృందావని
నీ మనోజ్ఞ వేణుగీతి
పల్లవించినంత స్వామి—
అమలిన శృంగారమూర్తి - కృపా
సుమధుర భావార్ద్రకీర్తి ! ॥ఎక్క॥

దివాంధం

శ్రీ పురాణం వెంకట రామ కుమార్

చిక్కటి చీకటికి రుచి మరిగిన నాకు
వెలుతురంటే వెగటు.

కాలంతో కదిలి పోకుండా కాళ్ళను
గట్టిగా కట్టేసి
చీకటనే ముసుగు తన్నాక ....
ఏమిటీ గొడవ ?

కిటికీ పక్కనే ఉన్న మల్లె మొక్క
మారాకు తొడిగానని మరీ మిడిసి పడుతోంది.

అర్ధరాత్రి లేచి అద్దంలో చూసుకుంటే
అప్పుడే వచ్చేశానంటూ గరుకు గడ్డం
అల్లరి పెడుతోంది.

తర తరాల అతుకుల దుప్పటి
చెవుల నిండా లాక్కున్నా ....
చెవులు గింగురు మనేలా
నా చుట్టూ వినబడే కదలికల హోరు.
కాలప్రవాహపు రణగొణ ధ్వని.

కమ్మగా గుప్తరాజుల కాలంనాటి
కల గంటున్న నేను....
మెలకువ వచ్చి కళ్ళు తెరిస్తే....
కళ్ళుజిగేలు మనేలా వెచ్చటి వెలుతురు.

చిక్కటి చీకటికి రుచి మరిగిన నాకు
వెగటనిపించే వెలుతురు.

డాక్టర్ ఘంటా జవహర్‌లాల్

దేవాలయాల్లో కామశిల్పం

పురుషార్థములలో కామం యిమిడివున్నా మిగిలిన వాటితో దానికి సరిసమానమైన హోదా కల్పించలేక పోతున్నాం. అట్లే ధర్మ శాస్త్రాలు[1] కామశిల్పం హిందూ మతానికి వ్యతిరేకంగాను, ఆధ్యాత్మికతా దృష్టికీ, నైతిక దృష్టికీ విరుద్ధంగాను చాటుతున్నవి. అయితే ఆ కామశిల్పం భారతీయాధ్యాత్మిక భావానికీ, ధ్యేయానికీ విరుద్ధమైనదైతే దేవాలయాల్లో దానికి స్థానమెలా సంభవించింది? ఈ శిల్పంపై అనేకులు వ్రాయటం - మాట్లాడటం - జరిగినా సరిగ్గా దాన్ని అర్థం చేసుకొన్నట్లు కన్పించదు. ముఖ్యంగా మన రాష్ట్రంలో యీ కామశిల్పంపై సరియైన అవగాహనలేదు. ప్రతి చారిత్రిక సెమినార్‌లలో దీనిపై తరచు ప్రశ్నలడుగుట, దానికి చారిత్రికులు కప్పదాటుడు సమాధానాలు చెప్పుట నేను గమనిస్తున్నాను. ఈ కామశిల్పంపై సరియైన పుస్తకాలు మన తెలుగు భాషలో చాలా తక్కువ. తాపీ ధర్మారావుగారి పుస్తకం ఒకటి.[2] అది యిప్పటికి అయిదు ముద్రణలు చూచినది. అనగా ప్రజలు కామశిల్ప మట్టు పూర్వోత్తరాలు తెల్సుకొనుటకు ఉవ్విళ్లూరుతున్నట్లు అవగాహన మౌతుంది. అయితే తాపీ ధర్మారావుగారు యీ 'కామశిల్పం'న్ని సరిగ్గా అర్థంచేసుకొన్నారా! అనేది అనుమానం. వారి పుస్తకం చదువుతుంటే మన హిందూ సంస్కృతిని కించపరచి వ్రాసినట్లు తోస్తుంది. వారి రచన ఇలా సాగింది: "ప్రాచీన సంస్కృతులు చాలా వాటిలో గూడా స్త్రీల స్వామ్యమూ, సంభోగ స్వేచ్ఛా, దేవతారాధనకు సంభోగమే ముఖ్యసాధన. దేవాలయాలు ఆ విధంగా క్రీడా మందిరాలు" .... మరియొకచోట .... "దేవాలయాలు అన్నీ ఆ రోజులలో సంభోగాల కోసమూ, బూతు పనుల కోసమూ నిర్మించినవే. బూతు అంటే .... ఆ రోజులలో అది ఒక మహాకార్యం, ఒక ప్రజాసేవ, ఒక మహాభక్తి, ఒక పవిత్ర ఆరాధన, పుణ్యకార్యము" .... ఇంకోచోట .... "స్త్రీలు దేవాలయాలలో బూతు పనులు చేసి ఆ రూపంగా గడించిన డబ్బు దేవాలయాలకే దానం చేసి శాసనాలు వ్రాసేవారు (ఉదాహరణ తెల్పలేదు.)" ఈ విధంగా వారి రచన సాగింది. సమస్యను కూలంకషంగా పరిశీలించి వ్రాసిన రచన మాత్రంకాదు. మన హిందూ సంస్కృతిని, మత సంప్రదాయాలను వేలెత్తి చూపే విధంగా సాగిన రచనవారిది. మనం పవిత్రంగా భావించే దేవాలయాల్లో కామశిల్పం చిత్రించుట ఏవకరిద్దరి భావాలకో, ఆలోచనలకో ప్రతిరూపం అనుకోవటం కష్టం. నాటి సంఘం దాన్ని అంగీకరించి వుండాలి. కామశిల్ప నిర్మాణానికి వెనుక సంఘ సంస్కృతి వుండాలి. కామశిల్పం దేవాలయాల్లోకి ఎలా ఎప్పుడు ప్రవేశించింది? ఎప్పుడు విస్తృతంగా చిత్రించబడ్డది? నాటి ప్రజల యభీష్టము మొదలగు ప్రశ్నలను మనం ముందు తెల్సుకోవాలి.

ఇప్పుడు చారిత్రక పరిశోధన అన్ని సమస్యలపై సాగుచున్నది. అట్లే 'కామశిల్పం' పై సిద్ధాంత వ్యాసం వ్రాసి డాక్టరేటు పొందినవారు డాక్టరు దేవాంగన దేశాయి.[3] ఆమె ఎన్నో కష్టనష్టాలననుభవించి, విస్తృతంగా సంచారము చేసి, ఎన్నో విషయాలను వారి సిద్ధాంత గ్రంథములో విశదపరచిరి. వారి అభిప్రాయములు యితర రాష్ట్రములకు ఎలావున్నా మన రాష్ట్రములో ఎంత వరకు సరిపోతున్నవి! మనం చూసుకోవాలి!

ఈ కామశిల్పంపై కొందరు నైతికభావవాదులు వెలిబుచ్చిన వాదాలను మొదట పరిశీలిద్దాం! ఒక వాదాన్నిబట్టి కామశిల్పం ద్వంద్వాత్మక ప్రకృతి కావలనున్న అద్వైత - ఏకత్వ స్థితిని చిత్రిస్తున్నదని ఉపనిషద్వాంత దృష్టాంత చెప్పటం వుంది.[4] దివ్యానంద స్థితికే స్త్రీ, పురుషుల, సంయోగం సూచకమని వీరి భావన. ఈ ద్వంద్వం ప్రకృతి పురుషుల- జీవాత్మ పరమాత్మల సంయోగ ప్రతీక. కాని దేవాలయాలపై గల వివిధ కామభంగిమలకూ, నగ్న శిల్పాలకూ పైవాదం సమాధానం చెప్పలేదు. కర్నాటక రాష్ట్రంలో గల హళిబీడు నందుగల దేవాలయాల్లో కొన్నిచోట్ల బలవంతంగా కామానుభవాన్ని పొందుతున్న బొమ్మలూ లేకపోలేదు. మరొక వాదం ప్రకారం ఈ బొమ్మలు కామ భావవ్యక్తీకృతులని. అంటే కామం పురుషార్థ ప్రతిబింబమని.[5] కాని కామం ధర్మానుబంధి. మరి నాల్గింటిల్లో వకటే. సర్వమూకాదు. అసంయమిత కామోద్రేకానుభవం శాస్త్ర సమ్మతంకాదు. దేవాలయాల మీదున్న ఈ బొమ్మల్లో ఎంతో విచ్చలవిడి కామ ప్రకటన కన్పిస్తున్నది. కేవల కామ పురుషార్థ ప్రకటనమే ఈ శిల్ప తాత్పర్యమైతే యోనిలింగ చూషణం వంటి శాస్త్ర నిషిద్ధ కామం దేవాలయాలపై ప్రకటీకృతం కావటంకుదురదు. పైవాదం చెప్పేవాళ్ళు అంటారు-[6] "ధర్మార్థాలను

చిత్రించినట్లే దీన్ని శిల్ప చిత్రించాడని." దేవాలయాగ్ర భాగంలో ధర్మం, మధ్యలో అర్థం, క్రింది భాగంలో కామం చిత్రించబడిందని వారి వాదనలో ముఖ్యాంశం. కాని ఈ క్రమానికుదాహరణలు చూపటం కష్టం. మన దేవాలయాలను పరిశీలించిన పైవాదం ప్రమాణం కాజాలదని తెలియవస్తుంది. సామాన్యంగా ధర్మం సన్యాసులను శిల్పించటంలో వుందంటే, వారే కామ భోక్తలుగా కొన్ని దేవాలయాల్లో చిత్రించబడటం మరీ విశేషం.

మరొక వాదం ప్రకారం జితేంద్రియత్వం దీనివల్లేచిత్రించబడిందని. ఇందుకే జితేంద్రియత్వ సూచకంగా కామశిల్పం దేవాలయం బయటి గోడలపైన చెక్కబడింది. మోక్షదృష్ట్యా ఇది అడుగున పడిపోవటానికిది తార్కాణ మంటారు.[7] అంటే మోక్ష లబ్ధికి కామం విఘ్నకారణమని వారి ఉద్దేశ్యం. కాని ఈ శిల్పం గుడి బయటా, లోపలా గర్భగుడి గోడలమీద చెక్కబడివుండటం గమనార్హం. మరియొక వాదం - కామశిల్పాలు భక్తుల కామ విజయానికి గుర్తులు. అంటే వారి ఆధ్యాత్మిక శక్తి కవి పరీక్షలు, అని. కాని విజయనగర దేవాలయాల్లో మాడు మూలల్లో వున్న కామ శిల్పంపై సిద్ధాంతానికి వ్యతిరేకం. కొందరు ప్రకారం ఈబొమ్మలు కామశాస్త్ర బోధకమని.[8] కాని దేవాలయాల్లో పాశవికతాను తృష్ణను చిత్రించిన దృశ్యాలు లేకపోలేదు. అవి బోధకనర్హాలు. పైవాదాలన్నియు కామశిల్ప చిత్రణకుగల బలమైన కారణాలు చెప్పలేక పోయినవి.

అసలు కామశిల్పం ప్రాచీనత్వం తెల్సుకొందాం. దేవాలయాల్లో కామశిల్ప చిత్రణను చారిత్రికులు మూడు కాలాలుగా విభజించిరి. మొదటికాలం క్రీ. శ. 500 దాకా. ఈ కాలంలో మైథున శిల్పం మతకళలలో కల్పించరు. కాని మృణ్మయ పాత్రలపై వుంది. శిల్పంలో స్త్రీ, పురుషుల బొమ్మలున్నా అవి కామ కేళిలో నిమగ్నం కావే. అనగా మధ్య కాలంలో ఈ కళ హఠాత్తుగా వచ్చింది కాదు.[9] క్రీ. శ. 500-900 రెండవ యుగం. ఇక్కడ మొదటి సారిగా మనకు మైథున శిల్పం కన్పిస్తున్నది. ఈ కాలం చివరి భాగంలో కామశిల్పం దేవాలయాలమీదకు ఎగబాకినట్లు తెలుస్తున్నది. క్రీ. శ. 900-1400 మూడవ యుగం. ఇక్కడ దేవాలయ శిల్పంలో కామకళ విపరీతంగా చోటు చేసుకొన్నది, కాని దాని వ్యక్తీకృతిలో భిన్నత్వం వుంది. అది శిల్ప శైలీభేదం కావచ్చును.

కాబట్టి ఈ కామశిల్ప వ్యక్తీకృతి-దాని పరిణామ విశేషాలు, దీన్ని అంగీకరించిన మతానికీ దీ కున్న బాంధవ్యం. ఈ శిల్పాన్ని ప్రోత్సహించిన సంఘ స్వరూపం, ముఖ్యంగా వివేచింపదగ్గ విషయాలు. ఇంతేకాక కామశిల్పాన్ని సాంఘిక సంస్కృతీ,చారిత్రిక మానవశరీర నిర్మాణ శాస్త్రదృష్ట్యా, చూడాలిగాని కేవలం కళా దృష్టితో కాదు. ముఖ్యంగా మనంగమనించదగ్గ విషయాలు రెండు- 1. ఇందు ద్వంద్వ మైథున క్రీడలు క్రీ. శ. 500 తర్వాత పలు ప్రాంతంలో కన్పిస్తున్నవి. రెండు, మూడు యుగాలకు చెందిన కామశిల్పాలు పత్తద్‌కల్‌లోను, ఎల్లోరాలోగల లంకేశ్వర గుహల్లోను, కోణార్క దేవాలయంమీద విపరీతంగా కన్పిస్తున్నవి. అనగా క్రీ. శ. 900-1400 కాలం కామశిల్పం దేవాలయాల మీద విస్తృతంగా కన్పిస్తున్నట్లు మనం గ్రహించాలి. అదొక్క భువనేశ్వర్, ఖజురాహో-కోణార్కలోనే కాక ఇతరత్రా చాలాచోట్ల కన్పిస్తున్నది. అంటే మధ్య కాలీన దేవాలయాల నిర్మాణంలో కామశిల్పం విస్తృతంగా చిత్రించబడిందని మనం గ్రహించాలి. ఇక కామ శిల్పం భంగిమలు గురించి తెల్సుకుందాం. ఈ శిల్పం ముఖ్యంగా ప్రేయసీ ప్రియుల బహువిధ క్రీడలకు సంబంధించి వుంది. అనగా ప్రేయసీ కపోలాన్ని స్పృశించటం దగ్గర్నుండీ సంభోగ పర్యంతం వ్యాపించి వుంటుందని గ్రహించాలి. వీటిల్లో చాలా విభేదాలున్నా డా॥ దేవాంగ దేశాయిగారు అరింటిని ప్రాథమిక మైనవిగా పేర్కొన్నారు. అంటే అవే తరచు దేవాలయాలపై చిత్రించబడినవిగా గుర్తించాలి. మొదటిది సాత్త్వికకామభావ విన్యాసం. ఇవి ఉద్రిక్తంగా వుండనివి. ఇందులో మరలా రెండు భేదాలు- (అ) ఇద్దర స్త్రీలతో ఒక పురుషుడుండటం. ఇవి గంధిలో గల చైత్యాకారమునందు, భువనేశ్వర్‌లోగల శిరేశ్వరాలయము లోను గలవు. (ఆ) ఇద్దరు పురుషులు - ఒక స్త్రీ. కామభావదృష్ట్యా రెండూ ఒక్కటే. అయినా సాంఘిక దృష్ట్యా రెంటిల్లో భేదముంది. మొదటి దానిలో బహు భార్యాత్వమూ, రెండవ దానిలో దేవదాసి లేక వేశ్యాసంగమం. కాబట్టి రెండవది దాంపత్య పరిధిలోనికిరాదు. ఈ శిల్పాలు మధ్య భారతదేవాలయాల్లో కన్పిస్తున్నవి.

రెండవ భంగిమ సంఘాతిక సంబంధం. దీనిని గూర్చి వివరంగా కామ సూత్రం వివరిస్తుంది.[10] ఇందులో ముగ్గురు మనుష్యుల సంయోగక్రియ ఉంటుంది. ఇందులోను రెండు భేదాలు కన్పిస్తున్నవి. (అ) ఒక పురుషుడు - ఇద్దరు స్త్రీలు, (ఆ) ఒకస్త్రీ ఇద్దరు పురుషులు. ఈ శిల్పాలు కర్నాటకలోని బేలూరు, హాలీబీడులోగల హోయసల దేవాలయాల్లో చూడవచ్చును. మూడవ భంగిమ. ఇందులో ఒక జంట సంయోగము జరుపుతున్నప్పుడు మరియొక పురుషుడుగాని, స్త్రీగాని లేక నపుంసకుడుగాని సాయపడుతున్నట్లు చిత్రించబడుతుంది. ఇందులో నాల్గు భేదాలు గుర్తించబడినవి - (అ) ఒకే సేవకుడు నిలబడి ఒక కూజాగాని, లేక అలాంటి పాత్రి మరియొకటిగాని పట్టుకొని ఆ జంట కామక్రీడకు తోడ్పడుతున్నట్లుంటుంది. ఇది మధురాలయంలో చిత్రించబడి

వుంది. (ఆ) ఇందులో సంయోగక్రీడ జరుపుతున్న జంట ప్రక్క ఒక సేవకుడుంటాడు. ఇది కోణార్క సూర్యదేవాలయ చక్రముపై చిత్రించబడి వుంది. (ఇ) ద్వంద్వ కామక్రీడకు తోడ్పడుతున్న సేవకుడు. ఈ శిల్పం కోణార్క సూర్య దేవాలయ మంటపం మరియు హంపీ విజయనగరంలోగల అమృత దేవాలయ స్తంభముపై చూడవచ్చును. (ఈ) ఇందులో సేవకులుకూడా ద్వంద్వకామ క్రీడకు తోడ్పడుతూ వాళ్ల ఉద్రిక్తులై అందులో పాల్గొంటున్నట్లు చిత్రించడం. ఈ శిల్పం ఖజురహోలోగల దేవాలయాల్లో విస్తృతంగా చిత్రించబడింది.

ఇక నాల్గవ భంగిమ వాత్స్యాయనుడు చెప్పిన 'గోయూధిక'. ఇందులో ఇద్దరి కంటె ఎక్కువమంది స్త్రీలతో ఒక పురుషుని కామకేళి చిత్రించ బడుతుంది.11 లేక ఒక స్త్రీ ఇద్దరికంటె ఎక్కువ మంది పురుషులతో రమించడం. కాని వాత్స్యాయనుడు ఈ రెండు భేదాలకు వేర్వేరు శబ్దాలు వాడలేదు. ఈ శిల్పం కోణార్క సూర్య రథచక్రముపై చూడవచ్చును. ఇక అయిదవ భంగిమ - ఇందులో అనేక స్త్రీ పురుషులు ఏకకాలంలో సంయోగంలో పాల్గొంటున్నట్లు శిల్పించబడుతుంది. ఇది మదురాలోగల రంగ మంటప స్తంభముపై చూడవచ్చును. ఇక ఆరవది - ఒకే చోట ఒకే కాలంలో జంటలనేకము జరుపుతున్న కామకేళిని చిత్రించడం. ఇది ఖజురహోలోగల లక్ష్మణ దేవాలయములో చూడవచ్చును. ఆరవ భంగిమ ఐదవ భంగిమ కంటే భిన్నము. అక్కడ ఏజంటకాజంట పాల్గొనుట యుంటుంది. ఇచ్చట అందరూ కలిసి పాల్గొనడం వుండదు. పైన చెప్పిన భంగిమలలో 1 (అ), 2 (అ) (ఆ), 3 (అ) (ఇ), 5, 6 చక్కములో ఎక్కువగా కన్పిస్తాయి. ఉత్తర భారతంలో కామక్రీడ భేదాలన్నీ కన్పిస్తాయి. సంఘాత భేదం ఒరిస్సా, కర్నాటకలో తరచు కన్పిస్తాయి. ఆంధ్రలో పరిశోధించవలసి వున్నది. కాని 1 (అ), 2 (అ), 3 (అ) (ఆ) (ఇ) భంగిమలు తరచుగా కన్పించేవి. ఇవిగాక యింక [illegible], విచిత్రంగాను శిల్పించిన చిత్రాలున్నవి. అవీ చూద్దాం. వాటిని గుర్తింపుగా 'సంయోగ భంగిమ'లనుకొందాం.

సామాన్యంగా సంయోగ భంగిమలు శిల్ప నిర్మాణ సూత్రాన్ననుసరించి లభించిన స్థలానిబట్టి చెక్కబడతాయి. ఇవి ప్రాంతీయతననుబట్టి గూడా నిర్ణయించబడతాయి. కామశిల్పం మధ్య భారతంలో, ఒరిస్సాలోగల దేవాలయాల 'జంఘ' భాగంమీద, శిఖరాలమీద, గూళ్ళల్లోను, వేదికలమీద చిత్రించబడితే, కర్నాటకలో గల దేవాలయ పునాదిపై చిత్రించబడింది. ఇక ఆంధ్రలో ఇది అనేక భాగాలపై చిత్రించబడింది. తెలంగాణా ప్రాంతంలో దేవాలయాల పునాదిపైన, సర్కారు జిల్లాలలో దేవాలయ శిఖరాలపై, రాయలసీమలో దేవాలయ గోపురాలపై చెక్కబడింది. ఉత్తర సర్కారు జిల్లాల్లోగల దేవాలయాలు ఒరిస్సా దేవాలయాలవలె 'జంఘ' ప్రాంతంలో కల్గివున్నాయి. పరిశోధనాదృష్టితో పరిశీలించిన మరిన్ని విషయాలు బోధపడగలవు.

సంయోగ భంగిమలలో 'పురుషాయితము' సంస్కృత కవులకు12, కామశాస్త్ర కర్తలకు13 ఇష్టమైన భంగిమ. శిల్పులు, చిత్రలేఖకులు కవులకేమియు తీసిపోరని కామశిల్ప భంగిమలను పరిశీలించిన విశదమగును. ఈ భంగిమలో స్త్రీయే పురుషునితో రమించుట చిత్రించబడుతుంది. ఇది భువనేశ్వర్, కోణార్క, ఖజురహో మొదలగు చోట్లగల దేవాలయాల్లో కన్పిస్తుంది. తాంత్రిక వాఙ్మయము 'మహాకాల సంహిత'లో చిన్నమస్తదేవి ధ్యాన మంత్రంలో సుందరా రతీ మన్మథులు యీ పురుషాయిత భంగిమలో ఆమె దగ్గరలో కామకేళి జరుపుతున్నట్లు14 వర్ణించబడి ఉంది.

ఇక ముఖరతి. ఇది 'విమార్గ' (కృత్రిమము) రతిగా ధర్మశాస్త్రాల్లో నిందింపబడింది. కాని ప్రతి ప్రాంతంలోను ఈ శిల్పాలు కన్పిస్తాయి. దీనికి చాలా ప్రాచీనత్వముంది. ఈ భంగిమ దేవాలయాలపై మధ్యకాలంలో కన్పించినా, క్రీ. పూ. 2వ శతాబ్దంలో బెంగాల్‌లో లభ్యమైన మృణ్మయ బొమ్మలపై యీ భంగియ కన్పిస్తుంది. ఇందులో మూడు రకాలు - స్త్రీ జరుపుతున్నట్లు, సంస్కృతములో దీని 'కాకిల' అన్నారు.15 ఇది ఎల్లోరాలోగల లంకేశ్వర గుహాలలోను, మన రాష్ట్రంలోగల ముఖలింగంలో ఈ భంగిమ కన్పిస్తుంది. దీనికంటె పురుషులు జరుపుతున్న క్రియ తక్కువగా కన్పిస్తుంది. ఇది భువనేశ్వర్, బెంగాల్‌లో గల దేవాలయాలపై కన్పిస్తుంది. 'కాకిల' పద్ధతి 10, 12 శతాబ్దాల్లో దేవాలయ కళలో చోటు చేసుకున్నట్లు కన్పిస్తున్నది. ఖజురహోలోను, బదరీలోను గల దేవాలయాల్లో యీ క్రియ సన్యాసులు జరుపుతున్నట్లు కూడా చిత్రించబడింది. ఇక మూడవది - స్త్రీ, పురుషులు ఎవరికి వారే జరుపుకొనే స్వకీయ కామక్రీడల చిత్రణ. ఈ క్రియ ప్రాచీన కాలంలోని 'మృణ్మయ' బొమ్మల్లో, మధ్యకాలంలోని దేవాలయాల శిల్పకళలోను కన్పిస్తున్నది. స్వకీయ భావప్రాప్తి దృశ్యాలు, బేలూరు, అంబర్‌నాథ్‌ల్లోగల దేవాలయాల్లో కన్పిస్తాయి. ఖజురహోలో పురుషులు మరియు స్త్రీలు ఎవరికివారు తమ మర్మాంగాలను స్పృశించుకొంటున్న బొమ్మలున్నాయి.

ఇక ఆఖరి సంయోగ భంగిమ - నగ్నతా - ప్రదర్శక దృశ్యాలు. ప్రతి ప్రాంతంలోగల దేవాలయాలు యీ భంగిమలు కల్గివుంటవి. అనగా స్త్రీ, పురుషులు తమ తమ మర్మాంగాలను ప్రదర్శించుకునే రీతి కన్పిస్తున్నది. ప్రత్యేకించి సన్యాసులు తమ

గుహ్యాంగాలను పట్టుకొని ఉన్నట్లు శిల్పించుట గమనించదగ్గ విషయం. వీటిని కేవలము నగ్న ప్రదర్శనగాను, స్వకీయ కామ క్రీడగాను గుర్తించుట పొరబాటు. అట్లు చిత్రించుటకుగలకారణము తెల్సుకోవలయును. పాశుపత శైవదీక్ష పుచ్చుకొనేవాళ్ళు విధిగా 'శృంగారన' శాస్త్ర విధిని పాటించాలి. ఇందులో వారు తమంతట తామే ఒక సుందరీ దర్శనంతో కామ పారవశ్యాన్ని చెందటాన్ని ప్రదర్శించుకోవాలనుంది.[16] బహుశ సన్యాసుల కామక్రీడా నిపుణ్నతకు ఇదే కారణం కావచ్చు. మరో విధంగా భావించరాదు.

ఈ కామ శిల్పాలు కామ సంబంధమైన యోగాసనములా? డెనీలస్[17], ముల్క్‌రాజ్ అనంద్[18]మరియు లాల్[19]వంటిపండితులు ద్వంద్వ సంయోగ భంగిమలు యోగసంబంధాలన్నారు. మధ్య కాలంలో వచ్చిన కామ సూత్రాలు కేవలం లౌకిక దృష్ట్యా వ్రాయబడ్డవి. అనేక రతిబంధాల్ని యోగశాస్త్ర దృష్ట్యా వర్ణించాయి. వాత్స్యాయనాదులు చెప్పిన రతిబంధాలన్నీ యోగాసనాలేనని, ఇవే రానురాను సంకీర్ణంగా తయారైనాయని, ఇందుకే కొన్ని రతి బంధాలు శీర్షాసన దృష్ట్యా తల క్రిందుగా నుండి సంయోగాన్ని సృష్టించారని, అలాగే 'కుక్కుట బంధం', ఫణిపాశం లాంటివి వచ్చాయనీ, ఇవన్నీ ఇంద్రియ సంబంధ వేగాన్ని తగ్గించేవని ఎలెక్స్ కంఫర్ట్ అభిప్రాయపడ్డారు. కాని, పై కామ శిల్ప భంగిమలను పరిశీలించిన వీరియభిప్రాయం చారిత్రిక సమ్మతము గానేరదు. కాని శిల్పంలో కొన్నిబంధాలు నిజానికి 'హఠయోగ' పద్ధతుల్లో వున్నవి. ఇవి ఖజురహో, బేలూరు, భువనేశ్వర్, కోణార్క ప్రాంతంలో కన్పిస్తున్నవి. వీటికిగల కారణం ఖచ్చితంగా ఇదని చెప్పలేకున్నాం. ఇవి కేవలం కామశాస్త్రీయాలా? లేక క్రీడా సంకేతాలా? లేక వినోద క్రీడలా? పైగా యీ మైథున శిల్పంతో రాజులు, వీరులు, వేటగాళ్ళు వున్నట్లు సర్వత్రా కన్పించుట చేత విషయం సరిగ్గా తెలియుటలేదు.

మరియొక చిత్రం - జంట, లేక కామోన్మత్త సమూహం భువనేశ్వర్, పూరి, కోణార్క మొదలగు చోట్ల పద్మంలో నిలబడి వున్నట్లు చెక్కబడటం కన్పిస్తుంది. ఇది చాలా విశేషం. ఎందుకంటే పద్మం పవిత్ర ప్రతీక తప్ప కేవలం అలంకారంకోసం శిల్పించబడిందికాదు. ఏలన పద్మం లక్ష్మీ జన్మస్థానం కనుక పౌరాణికంగా అది ప్రతీక. ఈ శిల్పంలో దేవతలు గూడా పాల్గొటం గమనార్హము. ఇది దేవతా సన్నిధానంలో రతిక్రీడ సఫలత్వానికి, జన్మకిచ్చే సంకేతం కావచ్చు. విజ్ఞులు దీనిపై పరిశోధించవలసివుంది. తంత్రంలో మకరం మైథున సంకేతం. ఇది దేవతకు నివేదించటం వున్నది. మోతాప్‌లో దీనికుదాహరణం కన్పిస్తున్నది. ఇక్కడ చాముండాదేవి 'ఉత్తాన పాద' భంగిమలో తనయోనిని ప్రదర్శిస్తున్నట్లు, కొందరు సేవకురాళ్ళు తోడ్పడుతున్న దృశ్యం వుంది. ఆమెకు ఎడమన కామోద్రిక్త కూటమి దృశ్యంవుంది. ఇటువంటివి గుజరాత్‌లో ఎక్కువగా కన్పిస్తవి.

ఈ కామ శిల్పాలు దేవాలయ ప్రాకారానికే పరిమితమా? కాదు. దేవాలయం బయటా, లోపల చెక్కబడినట్లు మధ్య భారతం, గుజరాత్, మహారాష్ట్ర దేవాలయాల్లో కన్పిస్తుంది. ఓఢ్ర, కర్ణాట కాంధ్రాల్లో ఇది ప్రాకారాల మీదే కన్పిస్తుంది. కాని పరికించి చూడగా ఆంధ్రములోగల తెలంగాణా, రాయలసీమ, సర్కారు జిల్లాలలో పైని చెప్పినట్లు, దేవాలయాల పునాదులు, గోపురాలు శిఖరాలపై గూడా కన్పిస్తుందని పాఠకులు గ్రహించాలి. ఒరిస్సాలో గల లింగరాజు దేవాలయం భోగమండపం లోపలి స్తంభాల మీద ఈ మైథునశిల్పం వుంది. ఐహోలు, పట్టడకల్ లోగల చాళుక్య దేవాలయాల్లో, విజయనగర దేవాలయాల్లో ఈ శిల్పం లోపలి భాగంలోనూ చెక్కబడింది. హళీబీడులోగల హొయసలేశ్వరాలయంలో, 'బాగలి' లోగల చాళుక్య దేవాలయాల్లో ఈ శిల్పం గర్భగృహాల్లోనూ విపరీతంగా చెక్కబడటం గమనార్హం.

ముఖ్యంగా యీ కామ శిల్పం 'ఫలసూత్రం' (ఫెర్టిలిటీ)తో ముడిబడటం గమనించాలి. అనేక దేవీమూర్తుల్లో మూడు ప్రధానం- లక్ష్మి (ఐశ్వర్య దేవత), యోనిమూర్తి, పంచ చూడాదేవి (పంచ చూడశబ్దం 5 శీర్షాలంకారాలను సూచిస్తుంది). మన సమస్య దేవాలయాలకే పరిమితం కాబట్టి పై దేవీ మూర్తుల వివరణ వదిలివేద్దాం.

ఈ కామ శిల్ప విన్యాసానికి వెనుక సంఘ సంస్కృతి వుండాలని మనం మొదట చెప్పుకొన్నాం. మధ్యకాలంలో విస్తృతంగా దేవాలయాల్లో కామశిల్ప చిత్రీకరణకు నాటి ప్రజలు మద్దతు ఇచ్చి వుందురు. లేనిచో క్రీ. శ. 900-1400 మధ్యకాలంలోనే కామశిల్పం దేవాలయాలపై కన్పించుటకుగల కారణాలు కన్పించుటలేదు. నాటి శిల్ప వాస్తు శాస్త్రాలు చాలా దేవాలయాల మీద నున్న ఆ శిల్ప విన్యాసాన్ని గూర్చి ప్రస్తావించాయి. వారెవరూ ఇది మత విరుద్ధాంశంగా పరిగణించినట్లు కన్పించదు. కవులెవ్వరూ దీని విషయం ప్రస్తావించలేదు. 11వ శతాబ్ది చాందేల్లా రాజాస్థాన కవి కృష్ణమిశ్రుడు, క్షేమేంద్రుడు, బిల్హణ, కల్హణాదులు ఆనాటి సాంఘిక వాతావరణాన్ని చెప్పినా కామశిల్పం గూర్చి ఎవరూ మాట్లాడలేదు. కాని, 11వ శతాబ్ది క్షేమేంద్రుడు కాళిదాసు కుమార సంభవంలోని కామవర్ణనలు 'అనౌచిత్య భాషితాలు'న్నాడు.[20] అయినా దేవాలయ కామశిల్పాన్ని గూర్చి ఏమీ అనలేదు. అట్లే కృష్ణమిశ్రుడు 'కామవిరుద్ధ' నాటకాన్ని కామశిల్ప కేంద్రమైన 'ఖజురహో'కు

50 మైళ్ళ దూరంలోగల ఖజురహోలో పర్యటించాడు. కాని యీ కామశిల్ప నిర్మాణంపై మౌనం వహించాడు. 11వ శతాబ్దిలో విస్తృతంగా తిరిగిన ప్రజ్ఞాశాలి బిల్హణుడు. అతడు కాశ్మీరు, దాహ్లా (మధ్యభాగం), గుజరాత్, దక్కను దేవాలయాలు చూడలేదనుకోవటం కష్టం కాని దీనిగురించి ప్రస్తావించలేదు. అయినా తన 'విక్రమాంకదేవ చరిత్ర'21లో కాశ్మీరు దేవాలయాల్లోని 'దేవదాసి' విషయముంది. ఆనాటి పండిత దృష్టి ఈ విషయంలో ఏమో మనకు బోధపడటం లేదు. ఇది, కామ శిల్పం సాంఘిక సంస్కృతీ విరుద్ధాంశం కాదన్న మాటను ఋజువు పరచటం లేదా? ఓవరగా నాటి సాంఘిక సంస్కృతీ దృష్టి దీన్ని అంగీకరించటమే గాక గొప్పగా భావించి ప్రోత్సహించి వుండును.

పై మొగింపు మధ్యకాలంలో నిర్మితమైన దేవాలయాలకు వర్తించవచ్చును. నాటి రాజులు ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఏ విషయంలోను ప్రవర్తించి యుండలేదు. కావున కామశిల్పాన్ని దేవాలయంలో అన్ని భాగములపైన (గర్భాలయం వద్ద కూడా) విస్తృతంగా చెక్కబడింది. పైమొగింపు మన రాష్ట్రములోని దేవాలయాల విషయంలో వర్తిస్తుందా? పైన చెప్పినట్లు మన రాష్ట్రములోని దేవాలయాల్లో గూడా కామ శిల్పం మధ్య కాలంలో విస్తృతంగా చెక్కబడింది. పై రాష్ట్రాలలోని దేవాలయాలకు భిన్నంగా మన రాష్ట్రములోని దేవాలయాల్లో మరుగు ప్రదేశాలలో మాత్రమే కామశిల్పం చెక్కబడింది. అంటే దేవాలయానికి వచ్చే భక్తుల దృష్టి నాకర్షించే ప్రదేశాలలో కామ శిల్పం చెక్కబడలేదు. ఈ విషయం మధ్య కాలంలో గూడా (ముఖ్యంగా క్రీ. శ. 900–1400 సడలించలేదు. దీనికి కారణం అవగాహన కావటంలేదు. ఈ విషయమై పరిశోధనజరగాలి. అనాదిగా మనప్రాంతంలో దృష్టి దోషం నుండి తప్పించుటకు, ప్రతి కట్టడాలకు, పంటలకు వికృతరూపంగల బొమ్మలను, శృంగార బొమ్మలను తగిలించుట పరిపాటి. ఆ ఉద్దేశ్యంతోనే దేవాలయాల్లో మరుగు ప్రదేశాలలో కామశిల్పం చెక్కబడివుండవచ్చును. ఉత్తర సర్కారుజిల్లాలోని దేవాలయాల్లో, ముఖ్యంగా, సింహాచలం, శ్రీముఖలింగంలో మాత్రం కామశిల్పం దేవాలయం మధ్య భాగంలో చెక్కబడింది. భువనేశ్వర్ కోణార్క దేవాలయాల్లో ప్రభావం వీనిపై పడివుండవచ్చును. మధ్య కాలంలో కామశిల్పం విస్తృతంగా దేవాలయాల్లో చెక్కబడింది. కాని మనరాష్ట్రంలోని దేవాలయాల్లో మరుగు ప్రదేశాలలో మాత్రమే చెక్కబడింది. దీనికి సరియైన కారణం అవగాహనకాలేదు. దీనిపై పరిశోధన జరగాలి. దీనిపై పాఠకులు వారి యభిప్రాయములను 'భారతి' ముఖంగా తెలుపగోర్తాను.

గమనిక : డా॥ టి. కోటేశ్వరరావుగారు (సీనియర్ రీడర్, తెల్గు శాఖ, శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం, అనంతపురం) శ్రమతో నా ఆంగ్లవ్యాసమును ఆంధ్రీకరించిరి. వారికి నా ధన్యవాదములు.

పరిశీలించిన గ్రంథములు, వ్యాసములు

1. పి. వి. కాణే, ధర్మశాస్త్రం, సంపుటి–2, పు. 422
2. దేవాలయాల మీద బూతు బొమ్మ లెందుకు? 1975
3. ఎరోటిక్ స్కల్ప్చర్స్ (= కామ శిల్పాలు)
4. స్టెల్లా క్రమంచీ, హిందూ దేవాలయము, సంపుటి – 2 పుటలు 346–47
5. బి. జె. సందెసరా, ఇతిహాసవి కడి, పుటలు 99 నుండి
6. పై గ్రంథం చూడుడు
7. పి. థామస్. కామకల్పము, పుట 139
8. కె. లాల్, కల్ట్ ఆఫ్ దేవి, పు. 68 మరియు ఇమ్మోర్టల్ ఖజురహో, పు. 179
9. దేవాంగన దేశాయి, కామ శిల్పాలు గ్రంథం చూడుడు
10. కామ సూత్రం, సంపుటాలు 2, 6 పుటలు 40, 42 మరియు రతిరహస్యం, సంపుటం – 10, పుట 41
11. కామసూత్ర – 2, 4, 41, 42
12. కాళిదాసు, కుమారసంభవము – 8, 19, 89
భర్తృహరి, శృంగార శతకము, 26వ శ్లోకము
జయదేవ, గీతగోవిందం – 6, 2, 7; 12, 6–4; 14, 7–4; 22, 11–2, 23, 12–3, 24, 12–3
13. వాత్స్యాయనుడు, కామశాస్త్రము, పుట 40
14. మహాకాల సంహిత, పుట 248, పటము, పేజి 116
15. కామసూత్రము, 2, 9, 34
16. సర్వదర్శన సంగ్రహము (సంస్కృత ప్రతి) 6, 95, పుట 170 మరియు కౌండిన్య, పాశుపతశాస్త్ర వ్యాఖ్యానము, పుట 25, 3–12
17. భారతీయ కామశిల్ప సమీక్ష, మార్గ – 2, పుట్ల 88
18. కామకళ, పుట 38
19. ది కల్ట్ ఆఫ్ దేవి, నెంబరు 37, పుట 95
20. సి. శివరామమూర్తి, యమ్. యస్. ఎ. ఐ, సంపుటి – 73 పుట 17.
21. 18–11, 23

ప్రగతి - పరిశ్రమ

పచ్చగా
ముచ్చటగా
గుబురుగా
గుమ్మటంలా
గాలిలో జలకాలాడుతూ కనిపించే
ప్రతి చెట్టుకీ వెనుక—
విస్తృతంగా
విశాలంగా
లోతుగా
చేతులు చాచుకుని
నేలయందు నిరంతర ధ్యానముద్రలో
కనిపించని వేళ్ళ కఠోరమైన దీక్ష.

చెడుగుడు

కరాత పట్టుకుని పశ్చిమాద్రికి వెళ్లి
కోర్టంతా కవ్వించినపుడు
చీకటి మూకంతా చుట్టుముట్టినాక
పట్టుబడినట్టే పట్టుబడి
నేర్పుతో ఒక్క తన్ను తన్ని
తూర్పు దిశకు చేరుకొని
'ఆల్ అవుట్' చేసి
అరుణకుమారు లందరితో అలరిన సూరీడు
బలే జగజెట్టీ చెడుగుడు ఆటగాడు.

"ప్రభాతం"



శ్రావణంలో ఒకరోజు

శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి

ఈ చలిగాలిలో ఈ వర్షపు హోరులో
చెట్టూ చేమా గిజగిజలాడుతున్నది.
నా హృదయం కూడా కుంచించుకపోతున్నది.
అంతా అయోమయంగా విచిత్రంగా ఉన్నది.

అడవికి మేతకు పోయిన పశువులు
అర్ధనిమీలిత నేత్రాలతో
ముసురు ఆగిపోవాలని వానదేవుడ్ని ప్రార్థిస్తున్నవి.
నీటి బిందువులు - బిందువులు కలసి ధారలై
ధారలు - ధారలు కలిసి కాలువలై
కాలువలు- కాలువలు కలిసి సెలయేఋలై పారుతున్నవి.

పారే సెలయేఋ రంగు నీలం, నింగీనేలా సంగమం నీలం
దూరంలో తటాకం నీలం, తటాకపుటంచున
పర్వతం హరిత నీలం
నీలంలో కలిసిన ప్రకృతి హరితం కూడా నీలం -
అంతా నీలం నీలం

గడ్డి తడిగా, నేల బురదగా ప్రకృతి అంతా
నీటిముద్దయింది.

ఈ శ్రావణంలో
ఈ ముసురు పట్టిన దినంలో
సాగి సాగి ఆగి ఆగి నడుస్తున్నాడు సూర్యుడు
స్థంభించి పోయాయి సకల చరా చర జీవులు.

మేల్కొ

"కోణార్క"

వెన్నెల పందిరిని
అల్లుకునే
చిరుగాలి తీగల చివర
చుక్కల పూలు పూసినపుడో....
ఎపుడో....
ఒక్కసారి తూలుతుంది మనసు -
మనసు మధుపాత్రై
ఏవో మత్తు వాసనలు ఒలుకుతాయి....
మెదడు పూల చెండై
ఒక్కో రేకే వూడిపడి వాడిపోబోతుంది -

పందిరి కమ్మెచ్చు సందుల్లోంచి
నిప్పులీనే
వెలుగు తీగలు - లాగుతున్నట్టు
సూర్య రశ్మి
చురక పెడుతుంది.

ఎంత మేల్కొ .... !
తుళ్ళిపడి లేస్తుంది,
మనసు -
ఉదయాన్ని
రాగరేఖల్తో ఆహ్వానిస్తుంది !
అవును, ఈ మనసే !!

(రఘు 'కవిత' చదివి)

డా॥ కొండూరు వీరరాఘవాచార్య

మరికొందరు విశ్వబ్రాహ్మణ కవులు

అథర్వణాచార్యుడు

నన్నయవలెనే భారతము నాంధ్రీకరించిన ఆది కవులలో అథర్వణాచార్యుడు కూడకలడు. ఇతడు నన్నయకు సమకాలీనుడనియు, ఈతని భారతమును నన్నయ తగులబెట్టించెననియు గాథలు కలవు. కాని ఈ గాథల ననేకు లంగీకరించుటలేదు. నన్నయకు పిమ్మట ఈ కవివతంసు డుండియుండునని పలువురు భావించుచున్నారు. ఇతనిదే యని చెప్పబడుచున్న "వికృతి వివేకము" (అథర్వణకారికావళి) అను ఆంధ్రవ్యాకరణము గూడ ఇతని రచన కాదని ఇటీవలి వారు ఒకరిద్దఱు భావించుచున్నారు. ఈ వాదము లెట్లున్నను, ఈతని కవిత్వము మాత్రము నన్నయాదుల కవితలకు తీసిపోవునదికాదని లక్షణగ్రంథోదాహరణములలోని పద్యము లనుబట్టి తెలియుచున్నది. ఈ దిగువ పద్యము నరయుడు —

క. శ్రీకంఠుఁ డెదురు నపుడు, వ
నౌకోధ్వ, జమింద్రముకుట, మజ్జనతురగా
నీకము, దివ్యశతాంగము
నా కప్పుడికిబ్బయున్న నతఁ డేమగునో!

ఈ అథర్వణాచార్యుడు విశ్వబ్రాహ్మణుడే అని కొందఱి తలంపు. నన్నయాథర్వణుల కవితా స్పర్థకు గూడ వీరి బ్రాహ్మణ శాఖా భేదము కారణమని ఈ పక్షమువారి వాదము. సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర విద్వత్కవులు, నూజివీడు వాస్తవ్యులు, అభినవ మురారి, కవిరాజ శేఖర బిరుదాంచితులు శ్రీ దురిసేటి వెంకట రామాచార్యులుగారు "అథర్వణాచార్యుని చరిత్రము" ను కావ్యముగా రచించినారు. అందు అథర్వణుడు విశ్వబ్రాహ్మణుడే అని వర్ణించినారు.

కొట్టిపాటి గురువయ్య

ఈయన శిల్పబ్రహ్మ ఋషి పంచకములో సానగ ఋషి గోత్రమున జన్మించినవాడు. మునిమాంబకు, పిన్నగురువప్పకు పుత్రుడు. శేషాచార్యుని శిష్యుడు. కాళికాంబా వరప్రసాదాంచితుడు. పురహరాంఘ్రియుగళ పూజాభిరతుడు. సహజ దరిద్రుడగు నీ కవిని కొందఱాప్తమిత్రులాతని కవిత్వ పాండిత్య శక్తులుడిగి పోవుటకు సైపక ప్రేరేపించి ప్రోత్సహింపగా తాను "సుద్యుమ్న రాజచరిత్రము" అను కావ్యమును రచించినట్లు గ్రంథావతారికలో చెప్పికొనినాడు —

"అనుపమ విద్యాని యం
బనెడు సభకు నాదు మిత్రులంచిత గతితో
నను రావించి దయామతిఁ
గనియిట్టులఁ బల్కి రధిక గౌరవమొప్పన్."

"శ్రీపద్య రసాప్పదముగఁ
గృతిరచియింపంగ వలయుఁ గీర్తి చెలంగున్;
క్షితి సప్తసంతతు లందు
తత్కృతియే శాశ్వతము మిగులఁగే వలనుగుచున్."

"కావున నీవొక సత్కృతిఁ
గావింపుము శక్తి కొలఁదిఁగాఁగ వినిన సం
భావిత కవితా చాతురి
భావించుచు వేత్తలెల్లఁ బొంపిరి మెచ్చన్."

"శ్రీ కొట్టిపాటి పురీవర సంస్థాన
సంవాసుఁడవు బ్రహ్మ సంతతియగు
సానగ ఋషి గోత్ర సంజాతుఁడగు ముసలాచార్య పౌత్రుఁడ, వార్య వినుతుఁ
డగు పిన్నగురు వప్పవాత్మజుఁడవు, కాళికాంబా వరప్రసాదాంచితుఁడవు,
గురువయాఖ్యుఁడవు సద్గుణవు శేషాచార్య
ముఖ్య శిష్యుఁడవు, సమ్మోదమతివి,

సభ్యుఁడవు, గ్రంథ సృష్టి కుశలుఁడ, వరయ
బుధజన విధేయుఁడవు, భక్తిఁ బరహరాంఘ్రి
యుగళ పూజాభి రతుడవు నుచితగదిని
మాకు నాచార్యుఁడవు, శుభ మహిత గుణివి."

అని బహూకరింపగా పురాతన కథా విసరంబులనెమకి, తానీ కావ్యమును శ్రీ చెన్నకేశవాంకితముగా రచించినాడట. ఈ చెన్నకేశవు దేగ్రామములోని దేవుడో తెలుపలేదు. ఒక వేళ కడప మండలము నందలి కొట్టపాటిలోనే చెన్నకేశవాలయమున్నదేమో! ఎట్లయినను చెన్నకేశవానుగ్రహము తనకు పూర్తిగా నున్నట్లు కావ్యాంత గద్యములో గూడ చెప్పికొని నాడు:

"ఇది శ్రీమచ్చెన్న కేశవస్వామి కృపాలబ్ధ సరస కవితా చాతురీధురీణ, త్రిభువన నిర్మాణోద్ధారక, మనువంశ పయోదధి రాకా సుధాకర, సానగర్షి సగోత్ర, శ్రీ కాళికాంబా పాద పద్మ రాధనాసక్త చేతోవిరాజమాన, ముసలాచార్య పౌత్రి, పిన్న గురు మూర్త్యాచార్య పుత్ర, సదమల గుణభాసమాన, మునిమాంబాగర్భ శుక్తి శౌక్తి కాయమాన, బుధ జన విధేయ గురువయ నామధేయ కవి ప్రణీతంబైన పురూరవోదయం బను నామాంతరంబు గల సుద్యుమ్నరాజ చరిత్రము ...."

కథా సంగ్రహము

సుద్యుమ్న రాజచరిత్ర అద్భుతమైన కథగల కావ్యము. మను పుత్రుడగు సుద్యుమ్నుడు వేటకై పోయి కుమార వనములోని ఒక కొలనులో మునుగగా కామినిగా మాఱిపోయి "ఇల" అనెడి పేర బరగును. అతని పరివారము కూడ సరస్సున జల క్రీడల దేలినందున స్త్రీలై ఇలా దేవిని సేవించుచు వనములో విహరించుచుందురు. ఇంతలో చంద్రుని కుమారుడగు బుధుడు తపము చేసికొనుచు వారికి కాన్పించును. బుధుని గాంచిన ఇలాదేవి అతనిని మోహించి శాపభీతిచే మిన్నకుండి చెంతనున్న మేరు పర్వతమున కేగి వేదన పడుచుండును. తరువాత శిష్యునివలన ఇలా వృత్తాంతము నెఱిగిన బుధుడు కూడ ఆమెకలయికకై పరితపించుచుండును. కడకు ఇల చెలివలనను, బుధుని శిష్యుని వలనను నాయికా నాయకులకు సమాగమము కలిగి చంద్రవంశ వర్ధనుడగు పురూరవు డుదయించును. ఇది ఇందలి కథ. పురూరవుని పుట్టుక ఇందు వర్ణింపబడినందున "పురూరవోదయమ" నియు దీనికి నామాంతరము కలిగినది.

ఈ కథాంశము భాగవతమునందును, వాల్మీకిరామాయణమునందును సంగ్రహముగా నున్నది. రామాయణములోని కథను కంకంటి పాపరాజు తన ఉత్తర రామాయణమున నించుక పెంచి వ్రాసినాడు. భాగవతములోని కథను మనోహర శృంగార ప్రబంధముగా కొట్టపాటి సంస్థాన నివాసుడగు నీ కొట్టపాటి గురువయ్య కవి రచించెను. ఈ సుద్యుమ్నరాజ చరిత్రము ఈ శతాబ్ది ప్రారంభమున వెలువడిన రసవత్ప్రబంధము. ప్రౌఢమైనది కూడ. 1920 ప్రాంతమున ఇది వావిళ్ళవారి "ఆది సరస్వతీ నిలయము ద్రాక్షర శాల"లో ముద్రితమైనది. ఒక్క ప్రతి నెల్లూర్లో బహుశ్రమలుపడి సంపాదించుటయైనది. ఈ కావ్యమును తొలుత చూచినప్పు"డిట్టి కావ్య మీ శతాబ్దిని రచితమయినదా" అని నేనాశ్చర్యపడితిని. పెద్దన, రామ రాజ భూషణుడు, ముక్కు తిమ్మన, రుద్రకవి మొదలగు మహాకవుల కావ్య ధోరణులలో అనవద్యముగను, అనర్గళముగను ఈ కావ్యము సాగిపోవుట పండితులకు విస్మయావహము. ఇందయిదాశ్వాసములున్నవి. అష్టాదశ వర్ణనలతో గూడిన మహాకావ్యముగా కవి దీనిని తీర్చిదిద్దినాడు. కథా సంవిధానాది విశేష చర్చకు పూనినచో వ్యాసము పెరుగునుగాన, ఒండు రెండు పద్యములు మాత్రముదాహరింపబడుచున్నవి. సుద్యుమ్న మహారాజు వేటకేగుచు నెక్కిన గుఱ్ఱమును కవి ఇట్లు వర్ణించినాడు:

"పొన్ను తంతియల ముప్పలరి వాగెకలీయమ్ము,
మందంపు మడి కాసు బొందళమ్ము,
అపరంజి పోగుము త్తెపుఁగుట్టు పసిజీను,
తళుకురానిగ్గుల తంగువారు,
డా ళట్టునన రాజిడాలు. నా బరిచియుఁ
బొన్నీరు బచ్చన పొదుపువిల్లు,
ప్రక్కల కోలల బత్తళికల దండ,
రహిమీఱ రాణించు రవలపిడెముఁ,
బచ్చమానికముల ముఖపట్ట, కెంపు
జాలు దాపిన కలికితురాయ మర్చి
తనరబడివాగె సవరించి ధనికి నెదుట
జవమనోజ్ఞాతిపీతిలె సాదిదెచ్చె."

ఇందలి అచ్చతెనుఁగు మాటల జిగిబిగి సొంపు అశ్వవేగము వలెనే అందుకొనరాక యున్నది! సుద్యుమ్నుడు విహరించిన కుమారవన వర్ణనము నాలింతము—

"క్ష్మారుహ శీతలచ్ఛాయా సుఖాసీన
గంధర్వ కామినీగాన యుతము,
నవ్య పల్లవ ఖాదన ప్రహర్షోన్మద
పిక పంచమ స్వర ప్రకటనంబు,

సరస ఫలాహార సంతతా మోద వి
స్తారశుకాలాప సంకలితము,
సూనమరంద పానానంద సంభ్రమ
ద్రోలంబ ఝంకార రుత మహితము,
నటన కృద్బర్హిషడ్జైక నాదఘనము
రాజ హంసాది జలపక్షి రాజకమల
కైర వాంచిత సారసాకర కలితము"

కుమార వనము నందలి సరోవర వర్ణనము —

"అలివేణిన్, వికచోత్పలాక్షిఁ, గమలా
స్యన్, హంసవాణిన్, దరో
జ్జ్వల కంఠిన్, బిసబాహుఁ, జక్రకుచ, నా
వర్తోరునాభిన్, సుశై
వల రోమావళి, వీచికాత్రివళి, దీ
వ్యత్సైకత శ్రోణిఁ, బు
ష్కలశోభన్, సరసిన్, లసన్మకరజం
ఘన్, హల్లకాంఘ్రిన్ గనెన్."

ఈ పద్యము నందలి రూపకోపమలు కవి సమయ సంవాదులై మనోహరముగా నున్నవి. కడవఱకు విన్నను, ఆలోచింపనిదే రాజుచూచినది సరస్సా, సారసాక్షో నిర్ణయింపలేము. ఇట్టి పద్యముకావ్యమునందు లెక్కకు మిక్కిలి.

సరోవరమున స్నానమాడిన పిదప అతివగా మాఱి ఇలాదేవియైన రాజు తనకు పురుషరూపమిమ్మని గిరిజను ప్రార్థింపగా ఆమె యిచ్చిన సమాధానము —

"అనవిని దుర్గ యిప్పగిది
నర్థము పౌరుషి, నర్థమింతినై
తనరెడు దాననౌట సత
తంబును పౌరుష మీయఁజాల, నీ
మనియెడుదాఁక నీకు నొక
మాసము స్త్రీత్వము, నొక్కమాసముం
దనుపమ పూరుషాకృతిని
నందఁగఁజేసితిఁ బొమ్మటంచనెన్.

ప్రతిష్ఠాన పురము నందలి పురుషులనిట్లు వర్ణించినాడు —

"కాలగళుఁడు దక్కగాఁమువిఁ గెలిచిన
వారలెవరటంచు వసుధలోన
చక్కదనముచేత నిక్కుచు నీల్గుచు
మదనుఁ గెలువనట్టి మనుజుఁడెవఁడు?"

ఇలా వర్ణనము —

"అగురా కెంజిగురాకుల
నగు రాకొమరిత పదమ్ముస ఖరుచికల్మిన్,
దగురా నీలపురాజిగి
తగు రానుత వాలుకురుల తతులకు సరియై."

ఈ కావ్యమునందిట్టి మనోహర వర్ణన లనేకములు.

కడియాల వీపూరయాచార్యులు

ఈ కవి గుంటూరుజిల్లా నరసరావుపేట తాలూకాకు చెందినవాడు. శ్రీ విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్రను యక్షగానముగా రచించినాడు. 70, 80 ఏండ్లుగా ఈ నాటకము ఆంధ్ర ప్రదేశమున విస్తారముగా ప్రచారములోనున్నది. బ్రహ్మము గారి చరిత్రను యక్షగానముగా వ్రాసి ప్రచారము చేసిన మొదటి కవి ఈయనయే అనవచ్చును. ఈ కవి తన యక్షగానములో అవసరమైన చోట్ల నెల్ల బ్రహ్మముగారి తత్వములనే కొలది మార్పులు చేసికొని పాటలుగా నుపయోగించు కొనినాడు. ఈయన మంచి పదకవితా ప్రవీణుడనియు, సంగీత నిపుణుడనియు ఈయన

నాటకములోని కీర్తనలు, దరువులు సాక్ష్యమిచ్చుచున్నవి. కంద గీత, సీసాదులను, కందార్థములను, తరళ, మత్తకోకిలాది వృత్తములను కూడ ఈ కవి తన యక్షగానములో పాడినాడు. ఈయన గొప్ప వేదాంతియు, బ్రహ్మముగారి సంప్రదాయమునకు చెందిన తత్త్వవేత్తయునని మనము గుర్తింపవచ్చును. నేటికిని వీరియక్ష గానమును వలసిన మార్పులను చేసుకొని పల్లీ పట్టణములయందు విరివిగా ప్రదర్శించుచున్నారు.

వడ్డెపాటి నిరంజనశాస్త్రి కవిశేఖరుడు

వీరి జననము 14-10-1877. మరణము 17-10-1937. నిరంజనశాస్త్రిగారి తండ్రి కోటయ్య, తల్లి భద్రమ్మ. వీరిది యజుర్వేద ప్రస్తుతులైన శిల్ప బ్రహ్మర్షి పంచకములో మొదటివాడగు సానగ బ్రహ్మర్షి గోత్రము. శాస్త్రిగారు ముందు వేదాధ్యయనము చేసి, ఆవల కావ్యనాటక శాస్త్రములను, శిల్ప వాస్తు విద్యలను నేర్చి కవులై ప్రకాశించినారు. మహావిద్వత్కవులని చెప్పదగిన పాండితీ ప్రకర్షము వీరిని వరించినది. తెనాలి తాలూకా దుగ్గిరాల గ్రామములోని ఉన్నత పాఠశాలలో పెక్కేండ్లు ప్రధానాంధ్రోపాధ్యాయులుగా నుండినారు.

శాస్త్రిగారు వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్రను "కల్యాంధ కౌముది" అను పేరపద్య కావ్యముగా రచించినారు. కుమారస్వామి తారకాసురుని వధించిన కథను "కుమారాభ్యుదయము" అను పేర నాటకముగా వ్రాసి ఆ నాటి పండితుల ప్రశంసల నందుకొన్నారు. ఇది ప్రౌఢమైననాటకము. వీరికావ్యములలో "ధర్మపాలన చరిత్రము" "భీష్మోదయము" "పౌరుషేయాన్వయ మహా పురుష రత్నమాల" అనునవి అముద్రితములు. శాస్త్రిగారి కవిత శబ్దార్థాలంకార శోభితమై నాచనసోమన, శ్రీనాథ, పోతనాదుల కవితలను తలపించుచుండును. మచ్చునకు కొన్ని పద్యములను పరికింతము-

"మిడిమిడి యెండపైఁ బడకుండఁ దగురీతి
    ఛత్రంబు పట్టుమీ చండకిరణ,
అలసటఁ జిఱుచెమటలఁ దోఁగకుండ విం
    జామరల్వేయుము సరసిజాక్ష,
మహిత పూరుషసూక్త మంత్ర పూర్వకముగ
    స్వస్తి చెప్పుము సరోభవ తనూజ,
తవిసులు, సుమములుఁ దగుపాత్ర మలరించి
    పరుగులెత్తుఁడు ముందు ప్రమథులార,
వెడలునప్పుడు జాగ్రత్త వృషభరాజ!
బుస్సనక మేన నడగుమీ భుజగనాథ,
మానసీయ తపోవన మధ్యమునకుఁ
జంద్రశేఖరుఁ డరుదెంచు సమయమయ్యె."

ఇది కుమారాభ్యుదయనాటకములో శివుడు తపోవనమునకు వచ్చు సందర్భములోనిది. ఇందు "తగురీతి ఛత్రంబు పట్టుమీ" అనుటలో ఒక చమత్కారమున్నది. సూర్యమండలము హిమాద్రికి పైనున్నది కదా! మంచు కొండమీదనేమో శివుడున్నాడు. పైనున్న సూర్యుడు దిగువనున్న శివునకు గొడుగుపట్టవలె నన్నచో ఆ గొడుగు గుబ్బను చేబూని పట్టినగాని నీడ శివునిపై బడదు. కనుక మామూలుగా గొడుగును పట్టుకొనునట్లు కాక, తగిన రీతిలో సూర్యుడా గొడుగును పట్టవలయునన్న మాట. "తగురీతి" అనెడి పదమును ప్రయోగించికవి యీ చమత్కారమును సాధించినాడు. అట్లే "బుస్సనకమేననడగుమీ భుజగనాథ" అనెడి వాక్యము కూడ సహజమై కవియొక్క ఉచిత సుందర పద ప్రయోగమునకు నిదర్శనమైయున్నది. కుమారాభ్యుదయములోని "ఆటలాటినయట్టు లాగడంబు నటించి యేలా లతాంగి నుయ్యేలలూపు" అను పద్యమునుగాంచి మురిసిన కీ. శే. వేదం వేంకటరాయశాస్త్రిగారు "ఏలాలతాంగి నుయ్యేలలూపి"న కవి నిరంజనశాస్త్రిగారు 'ప్రతిభాశాలి' అని జీవితాంతము వఱకును తన మిత్రులతోను, శిష్యులతోను అనుచుండెడివారట!

నిరంజనశాస్త్రిగారి కృతులలో మాఘ మాహాత్మ్యము గణనీయమైనది. ఇది సంస్కృత పద్మ పురాణములోని మాఘ మాహాత్మ్యమునకు స్వతంత్రమగు ఆంధ్రీకరణము. 18అధ్యాయములను శాస్త్రిగారాంధ్రీకరించినారు. పురాణేతిహాసాదుల నాంధ్రీకరించుటలో నన్నయ, తిక్కన, శ్రీనాథాదులెట్లు నీరసఘట్టములను వీడి, రసవద్ఘట్టములను తెనుగు బాస పొంకము బింకము తప్పకుండునట్లాంధ్రీకరించినారో, అట్లే శాస్త్రిగారును ఈ పురాణ భాగము నాంధ్రీకరించి కృత కృత్యులైనారు. తెనుగు సేతలోను, సీసములను ఒయ్యారపు తూగు నడకతో నడిపించుటలోను నిరంజనకవి శ్రీనాథుని యట్టి వాడు. కాశీ ఖండపు తెనుగు సేతవలె మాఘ మాహాత్మ్యాంధ్రీకరణమును వన్నెకెక్కినది. స్వతంత్ర గ్రంథము వలెనుండును గాని, ఆంధ్రీకరణమని చెప్పవరకును తెలియదు. ఆంధ్రీకృత భాగమున - ఋష్యశృంగ, సౌభరి - చరిత్రములు, గార్హస్థ్యవిధి, పతివ్రతా ధర్మములు, మృకండు చరిత్రమును కలవు. ఈ కావ్య మిటీవలే తిరుమల తిరుపతి దేవస్థానము వారి ధనసహాయమువలన ముద్రితమై వెలుగు చూచినది. ఇందలి రెండు మూడు పద్యముల నరయుదము. మాఘమహిమాభివర్ణనము—

"పొరాడు నిసువులబ్రాపు ముద్దుఁ బలుకులఁ
    గిల కిలలాడు ముంగిళులు గలిగి,
సిరులు దుటారింప విరిబోండ్ల యాటలఁ
    దల తల్దొలకు మోసలలు గలిగి,

పాఱుల పార్మిస్కు పదఱుల మిన్నంది
        కనకసగ్గాను శుభధ్వనులు గలిగి,
తనివార మెసవి గట్టునఁ ద్రేఁచున తిథుల
        యెడనెడఁ దొడరు సందడులు గలిగి,
వెలయు గీముల నిండారు వేడ్కలలర
రోహిణీదేవి, శచియు, నరుంధతియు వె
లంది లోకంబులందు వలంతులగుట
మాఘమునఁ గ్రుంకు పెట్టిన మహిమగాదె!".... 77

ఈ భగవన్నుతి నాలకింపుము –

"నిత్యానందము, నిష్కలంకము, మహా
        నిర్వాణమున్, ఘోర సం
సృత్యంభోనిధితారకం, బుపనిష
        త్సేవ్యం, బుదాత్తంబు, ని
ర్వ్యత్యౌన్నత్యము, నిర్విశేష మహిమా
        విర్భావమై యున్ననీ
ప్రత్యక్షాకృతి దేహమందెలిచెదన్
        బ్రహ్మాండ భాండోదరా!" 178

ఇందలి ధారాశుద్ధి గంగా ప్రవాహమును దలపించుటలేదా!
ఇటు వినుము –––

"పరమాత్మునకు నిరీశ్వరున కీశ్వరునకు
        నతులిత పరమ కల్యాణనిధికి,
లోకనాథున కతిలోక లోకునకుఁద్రి
        లోక సామాన్య విలోకరతికి,
వేయి శీర్షములతో విలసిల్లు మేటికి
        నిరతోజ్జ్వలామల నిర్గుణునకు,
నిర్వికారకునకు నిర్ద్వంద్వునకు నఖి
        లాజాండ కోటి బ్రహ్మాండపతికి,
స్వప్రకాశునకచలున కప్రమేయ
కాది మధ్యాంత శూన్యున కచ్యుతునకు
జిష్ణునకు విష్ణునకును వర్ధిష్ణునకును
మహితగుణునకు నీకు నమస్కరింతు.".

ఇట్టి పద్యము లిమ్మహాకవి కావ్యములందు కొల్లలు. విస్తర భీతి నుదాహరింపనైతి. శాస్త్రిగారు వేదవిదగ్రయాయులు. వేద ద్రష్టల మీదను, మహర్షుల మీదను, వైదిక క్రియలమీదను ఆయనకు భక్తివిశ్వాసములు మెండు. అందుకే ఆయన ప్రధానాధ్వర్యవమున ఆంధ్ర, తమిళ, మహారాష్ట్రాదులలో అనేక యజ్ఞములు అహింసా ప్రధానములు నిర్వహింపబడినవి. తన కావ్యములందెచ్చటను ఆయన వంశ ఋషుల సంస్తుతులను మఱచెడి వారుకారు. ధర్మ పాల చరిత్రములో తన గోత్ర ఋషి నిట్లు స్తుతించినారు –

"ఉరుతరలోక సృష్టిమది
        నూనుచు ఋజ్నిగమంబుతోఁబరా
త్పరు ప్రథమాననాబ్జమగు
        ప్రాగ్దిశఁ బుట్టి యఖండుఁడై చరా
చరములఁ బ్రోవఁ జాలు తను
        జాతులఁగన్న మహామహుండు మ
త్సు రుచిర గోత్ర కర్తయయి
        శోభిలు సానగమౌనిఁ గొల్చెదన్."

అట్లే కుమారాభ్యుదయ కావ్యమున విశ్వజ్ఞ ఋషిని గూర్చి యిట్లు స్తోత్రించినారు –

"క్షణతన్ విశ్వ కృదూర్ధ్వ వక్త్రమునఁ బూ
        ష వ్యక్తి లోకైక వీ
క్షణుఁడై వెల్గె, హిరణ్మయాకృతి వరి
        జ్ఞానంబు పూరించె, బ్రా
హ్మణ ధర్మ ప్రణవాగమాధ్యయన ము
        ద్యత్క్రీడఁ గావించె, సత్
ప్రణతుల్ మిక్కిలి లెక్క గైకొనియె వి
        శ్వజ్ఞర్షి సామాన్యుడే!"

నిరంజనశాస్త్రిగారి కావ్యరచనయు, పత్రికా పాలనమును, సభా ప్రబోధములును ఒకయెత్తు! "విశ్వకర్మ బ్రాహ్మణవంశాగమ" గ్రంథరచన మొకయెత్తు!! విశ్వబ్రాహ్మణుల యొక్క పుట్టు పూర్వోత్తరములను సులభముగాను, వేదశాస్త్రాది ప్రమాణ సమ్మతముగాను విశదీకరించి చెప్పు సముత్కృష్ట గ్రంథరాజమిది. ఏతద్గ్రంథ రచనకై మహనీయుడు యావద్భారతమును పర్యటించి, మారుమూలల యందుగల గ్రంథాలయములను పరిశీలించి, విపక్ష పండితులతో వాదించి యోడించి వారి సమ్మతులను గైకొని సమ కూర్చిన గ్రంథ మీ విశ్వకర్మ బ్రాహ్మణ వంశాగమము. యావ ద్భారత మీ గ్రంథ రచనకై శాస్త్రిగారి మీద పుష్ప వర్షమును కురిసినది. అందుకే ఈ ప్రశంసాపద్యము ప్రచారమైనది –

"వేదశాస్త్రంబు నిధి మున్గి వెదకితెచ్చి
నట్టి రతనాల రాశి "వంశాగమంబు"
ఒక మహీయః ప్రకాశంబు నొసగు మాకు,
ఇది మఱువఁజాల మెన్నటికేని సుకవి!"

శ్రీ నిరంజన శాస్త్రిగారి చరిత్రమును ఈ వ్యాసకర్త "నిరంజన విజయము" అను పేరవ్రాసి యున్నాడు. కళాప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు తమ "ఆంధ్ర రచయితల"లోను వీరి చరిత్రము నుల్లేఖించినారు.

గున్నేపల్లి మృత్యుంజయ కవి

ఈ కవి నిరంజనశాస్త్రిగారికి సమకాలికులే. తూర్పుగోదావరి మండలమునకు చెందినవారు వీరు. పూర్వ కవులతో సమానముగా ప్రౌఢకవిత్వము చెప్పి మెప్పించిన యుద్దండ పండితకవులు వీరు. వీరి ఏకైక మహాకావ్యము "సావిత్ర్యుపాఖ్యానము". దీనిని "సావిత్రీ చరిత్రము" అనియు నందురు. ఈ కావ్యము ముద్రిత మైనదియు లేనిదియు తెలియదు. నా విద్యార్థి దశలో నందలి పద్యము లొక మహాశయుని మూలమున విని ఆనందించుటయైనది. అందొక్క పద్యము మాత్రము జ్ఞప్తిలో నున్నది —

"అలి నీలాలక మీనకేతన ధను
 ర్జ్యాటంక్రియా మోహశ్యం
ఖలయై సోలుచుఁ గీరశారికల నే
 కగ్రీవ భావంబునన్
బిలువన్ గర్జకఠోరముల్వలుకఁ బూ
 నె న్నోటికిన్ వచ్చిన
ట్టులుగాఁ గూఁతలు గూయు టబ్బురమె బ
 ట్టుల్ పొట్టకక్కూరితిన్ "

వీరి సోదరులు శ్రీ గున్నేపల్లి అక్షయ లింగకవిగారు కూడ మంచి కవీశ్వరులే. వీరు కాకినాడలో ఒక హైస్కూలులో పనిచేసి ఇటీవలనే పరమపదించినారు.

చెఱుకూరు కాళహస్తీశ్వరశర్మ

ఈ కవి 21-10-1899న కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో జన్మించినారు. కొంతకాలము గన్నవరం తాలూకా కుమ్మమూరులో నివసించిరి. అటుపిమ్మట 1920 నుండి పయిడికొండలపాలెములో నివసించినారు. గాంధీతత్త్వానుయాయులు. మహాత్ముని ఆదేశమును పాటించి శ్రీకృష్ణ జన్మస్థానము నలంకరించి, దేశస్వాతంత్ర్యము నకై పోరాడినఘనులు. తల్లిదండ్రులు పుణ్యవతమ్మ, త్రియంబకము గారలు. వీరికి సంస్కృతాంధ్ర హిందీ భాషలలో మంచిపాండిత్యము కలదు. వీరి కవిత చక్కని సుడికారము, జాతీయత, కలిగి భావ సౌందర్యముతో నొప్పుచుండును. వీరి కవితా మాధుర్యమునెఱింగిన రసికులీయనను అభినవ రుద్రకవి అని పిలుచుచుండెడివారు. వీరి చిల్లర మల్లర కవిత్వములనటుంచి చూచినచో వీరి అమరుక కావ్యానువాదము పేరెన్నికగన్నట్టిది. సంస్కృతభాషలో అమరుక మహాకవి రచించిన అమరు కావ్యము శృంగార రసమునకు అనన్య మైనదని ప్రసిద్ధిగన్నది. దీనిని ప్రాచీనార్వాచీన ఆంధ్ర కవులు పెక్కురనువదించిరి. ప్రాచీనులలో కానుకొలను అన్నమరాజు, తాళ్ళపాక వెంగళప్ప - అను కవులు తెనిగించిరి. ఆధునికులలో జయంతి రామయపంతులు, మండపాక పార్వతీశ్వరశాస్త్రి ప్రభృతులు దాదాపు ఇరువదిమంది కవులీ యమరుకము నాంధ్రీకరించి యున్నారు. ఒక్కొక్కరి యనువాదములో ఒక్కొక్క గుణ మందునని సహృదయులెఱుంగుదురు. అమరుకాంధ్రీకర్తలలో శ్రీ కాళహస్తీశ్వరశర్మగారును ఒక్కరు.

శర్మగారి ఆంధ్రీకరణము కూడ గుణ భరితమైనదే. అది ఎవరియనువాదమైనను వినినంతనే భావము సుగమముగా తెలిసి ఆనందము నొసంగవలయును. అట్టి యనువాదము కొనియాడదగిన దనవచ్చును. శర్మగారి యనువాదమును, మూల శ్లోకములతో బాటు రెంటి మూటిని పరికించి చూతము.

"దంపత్యోర్నిశి జల్పతోర్గృహశుకే
 నాకర్ణితం యద్వచ
స్తత్ప్రాతర్గురు సన్నిధౌనిగదత
 స్తస్యాతి మాత్రం వధూః
కర్ణాలంచిత పద్మ రాగశకలం
 విన్యస్య చంచూపుటే
వ్రీడార్తా విదధాతి దాడిమ ఫల
 వ్యాజేన వాగ్బంధనమ్" (15)

రాత్రి తానును భర్తయు నాడుకొనిన సల్లాపములను వినిన పంజరములోని చిలుక, తెల్లవారగనే తన యత్తమామల యెదుట ఆ మాటలనే పలుకుచుండగా విని లజ్జించినదై అమాటల నాపుటకు తన చెవియందలి కెంపును దానిమ్మగింజను తినబెట్టినట్లు చిలుక నోట బెట్టుచున్నది. అనగా అట్లుచేసి చిలుకకు వాగ్బంధనము సలిపినదన్నమాట. దీనికి శర్మగారి ఆంధ్రీకరణము.

"చిలుక నిశిన్ సతీపతుల
 చే నుడువంబడి విన్న చాటు మా
టలఁ బవలత్తమామల క
 డన్ దెగ వాగుచునుండఁగాఁ ద్రిపా
వలయయి, యవ్వధూమణి చె
 వింగల కెంపును దీసి దాడిమీ
ఫలముగఁ బెట్టి ముక్కునను
 వాయిని మూయఁగఁ జేసె గ్రుక్కునన్."

ఈ తెనుగు పద్యమెంతయో సుగమముగా నున్నది కదా ! మఱి యొకటి.

"సాలక్తకేన కర పల్లవ కోమలేన
పాదేన నూపురవతా మదలాలసేన
యస్తాడ్యతేదయితయా ప్రణయాపరాధాత్
సోఽంగీకృతో భగవతా మకరధ్వజేన" 101

"అందియలు మ్రోయఁ బారాణి యంటఁ జివురు
బోలి మదలాలసంబైన ముదిత యంఘ్రి
నాహతుండగు నెవఁడు నెయ్యంపుటలుకఁ
గామ భగవానుఁ డవ్వానిగా రచించు."

ఆంధ్రీకరణ మనుటకు వీలుగాని సాధు రచన కదా యిది ! దిగువ పద్యము మూల రహితముగా నుదాహరింపబడుచున్నది -

"దయితుఁడు పాన్పుఁ జేరఁగనె
తాదిగ జాఱెనునీవి, జాఱువ
ల్వయుశ్లథ మేఖలా గుణము
పట్టున వించుక శ్రోణినిల్చె, నిం
తయె సఖి, నేనెఱింగినది
తత్తనుయుక్తి; నితండెవాడొ, ఏ
మయితినొ నేన్, రతమ్మెదో, ర
వంతయు జ్ఞప్తియె లేదదేలనో !"

మొత్తము మీద ఈ కవి చంద్రుని ఆంధ్రీకరణము సహృదయ పరితోషమ్ం గూర్చునట్టిదిగా నున్నదనుటలో నే సందేహమునులేదు.

శ్రీ శర్మగారీ అమరు కాంధ్రీకరణమునే కాక, 'శిల్ప వంశ ప్రఖ్యాత ప్రజ్ఞానధనులు' అను మఱి యొక వచన గ్రంథమును గూడ వ్రాసి యశశ్శరీరులైనారు.

వి ధి!

శ్రీ కే. కిశోరుబాబు

వలన ఊహలన్నీ
పుష్పతోటలో నడయాడే
మీనాక్షులైతే....

వాటికి వీరుని లాంటి
మిక్కిలి బీదవానితో
జతను కూరుస్తుంటాడు!

సజావుగా సర్దుకపొమ్మంటుంటాడు !

మన తలపులన్నీ
ఉన్నత సౌధగవాక్షాలలో తడవాడే
ఏకకీరలైతే ....

శ్రీ కే. అశోకుబాబు

వాటికి కుట్టాన్‌లాంటి
మహారాజుల బిడ్డతో
మాలిమిని కలుపు తుంటాడు !

తీరని స్పృహలతో
సగి సముగ్గిసలుగా సతాయిస్తుంటాడు !
అహో ! విధి విశ్వనాథుడు !
ప్రాకృతులెవ్వరికీ ఎరుకపడని
ధిషణాహంకార సంభార చతురుడు !

ఒక్క కలంతోనే
జీవితంలోనే
నవరసాలను
"వైగై పాయల్లా" పొంగించగల ప్రవీణుడు !
వాడు ! అసాధ్యుడు !

దయా నది*

డా॥ దాశరథి

ఓయి ! దయా నదీ ! జగతి కూరక శాంతిని బోధసేయు నీ
తీయని వీచికావళి మదిన్ మధురోహలు రేప సాగనే !
ఏ యుగమందు పుట్టితివొ యేమొ సుమా ! భువనేశ్వరమ్ము నీ
తోయముతో పవిత్రమయి తోచెను మాకొక పుణ్యభూమిగా

ఆకాశమ్ము భవజ్జలమ్ములను మేలద్దమ్ముగాజేసి ఆ
లోకించున్ తన మోముతానె ; రుధిరస్రోతస్సువై నీవు రు
ద్రాకారమ్మున తత్కళింగ రణవేళన్ పొంగుచున్నప్పుడే
శోకంబందె అశోక భూమిపతి విచ్చుంగత్తి చే జారగా

బుద్ధమూర్తి పాదములచెంత కరవాల
ముంచి యెంతగ విలపించె నేమొ ?
రణముసేయ ననుచు ప్రతిన గావించెను;
హింస మానుకొనె, అహింస బూనె

నీ తీరాన జపాను బౌద్ధులిదిగో ! నిర్మాణముంజేసి రెం
తో తాత్పర్యముతో విహారమును శాంతుల్‌దాంతులుప్పొంగ; గీ
చీ తంత్రీ తతిపై తథాగత గుణశ్రీ గానమున్ చేయు నీ
శీతాంభఃకణరాజి వాయు విహతిన్ చిందెన్ శిరస్సీమలన్

ఎన్ని తలలు తెగెనో ? ఎంతెంత రక్తము
భీకరముగ పరుగువెట్టె నేమొ ?
రణ భయమ్ము లేని, రక్తపాతము లేని
మహిని మానవుండు మనెడుగాత !

కత్తి, నాడు, తలల నుత్తరించెనుగాని
అణువు నేడు లక్షలాది జనుల
క్షణములోన భస్మమొనరింప జాలు ; నీ
ఆధునిక జగాన అతిభయమ్ము !!

భువనేశ్వర పరిసరముల
ప్రవహించు దయానదీ జలమ్ములలోనన్
కవులు జలాంజలులెత్తుచు
కవితలు రచియించినారు కరుణామయులై

రండు ! దయానదీ జలములన్ జలకమ్ములనాడి ధన్యులై
పొందు ! తథాగతాలయముపొంత సదా నినదించు భేరికా
దాండడ నాదముల్ వినుడు ! ధ్యాన సమాధినిషణ్ణ భక్తరా
ట్తుండము వెంట మంత్ర జప తత్పరులై పరిశుద్ధి పొందుడీ !

[★ ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ పరిసరాలలో ప్రవహించే నది, దయా నది.]

సేతలా ఆటి నిజాయితీ సాలు!

శ్రీ రంధి సోమరాజు

వోరి వోరి నదువుల తండ్రులూ
కాలేజీ గోడల్నిండ ఏట్రా తండ్రీ

ఆ రాతలూ కక్కులూ ...
కుట్టురోగపోడి మొగంనా
వొయిజాగెలం పేట వొల్లునా
ఏటా గోడలు

సినేమాగా తీత్తేగాని
రేపటోలకి
యీ మీ నిగారింపు లాపడవ్ ...

మీ యీపుల మీద సొక్కాల మీద
రాసీసుకోని తిరిగిరాద
తెలుత్తాది పెతాపం....

వో సోకు జమాయింపులూ
ఆ గుమాయింపులూ
మీకేనేటి ?
సీమూ నెతురూ ఉండోలకట్రా
సీ ....

సున్నం సోకేన మిగల్నిండిరా తండ్రీ...
మరీ అంత మిరప గింజల్లా
పుత్త వొట్రయితే ఎలా ?

సూ ఆలోశెన్ల తాలింపులో
యేగి పొండెహె ...
ఆ గింజ యేంత రుసో
ఆజా అవుద్ది !

యీరాసకీయ నాయకులూ అంతే ...
రూపాయి నోల్లల్ల పేదోల సత్తువంతా కుక్కీసి
సరన జిప్పు నాగేత్తారు
తన్నుకు సావాల !
మరి బయి టుడ్నేం.

యములోలనా దడ దడ లాక్కెల్లిపోతారు
కట్ట పడటం ...మర్సిపోడం ... యిదేగా మా బతుకు
యీ వొయినమే గ్నోరే ... మీ కూపిరి
ఆ పూత కర్రతో మల్లీ మల్లీ నక్కనా వొచ్చీసి
గోడ లుచ్చీసుకోని యేలాడ్తారు
అంతే ... అంతే .. వోడేన
పూరోల సొమ్ముకే యెగబడాల !

కుల్లు కాలవలో నచ్చే బంగారు గుడ్ల బాతులంకదా ..
అలాగని మాకేటి తెల్సు ... ?

మీరు మాత్తరం గుడ్డు కోసరం కుడితి గొడ్డునా
సుట్టూత యెగబడ్తారు ...

గోడల మీదడి రంగులై పోతారు
బోలుడు బోలుడు బొమ్మలూ అయిపోతారు

వున్నదంతా అందరిదీ అని మందిలో
పేలేసి సొప్పేత్తారు

ఆనక వొంటిగా యింటి కాడ కూకోని ...
"యీ మందంతా వోరూ ... నానె కాదేటి"
అనీసు కోని
జోబీలో అందరి పెసాదం కుక్కీసుకుంటారు

హుఁ ... బలే గమ్మత్తైనోలు...
మోలీలు సేసే వోరి వోరి దొమ్మరోలూ ...
మీకన్న దొమ్మర సానే నయమొరే ...

సామియం పందిరికింద
బంట్రోతుగాడ్కి ముక్కి మంత్రి మునుగేసీసి
జబ్బలు సరిసేసుకున్నారు

'య్యెంత సామియమో సూడండెహో' అంటూ
వో సంబరపడి పోనారు
'పెజల మడ్సులం ... పెజల మడ్సులం ... అంటూ
మీసాలు మెలి తిప్పీసినారు
య్యెంత గొప్ప ఇసేయం పెపంచంలో!
అస్సలు పుట్టనేదన్నారు ...

మళ్లీ వోరం తిరక్కుండానే ...
ఆ తిప్పడు కుర్సీ వొగ్గిదాక నిద్దరోనారు కాదు
వోరి వోరి ఇయ్యాట్రా సామియం ఆటలు ?
పెల్లాల కాడ ఆడుకోండెహో ...
పెజల కాడ కాదు ...!

మీముత్తేల ముగ్గుల కయిత్తాలు సూసి
ముత్తేలే అనుకున్నాం
తీరా సూసీతలికి అదేన్రోరే
తేరిపార మరోపాలి సూసీ తలికి
ఆ ముత్తే లెనక అన్నీ తొత్తు బుద్ధులే ...
మీ తాట వొల్సి వోడ్నేక
మీ యేసాలు సాగుతున్నయ్ ...
అస్సలు రాతలు రాసీడం
మా సులువోరే....
మా గుంటడితో కల్సి కలుపు తీగ్రలేటి ?

ఆ పంట సొగసు మీరు తేగ్రలేటి ?
ఆకలి తీర్చే రెక్కల ఎల్తుర్రా అది....
అస్సలు వోడు సేసే పనిలో వుండదా పాటి ఎల్తురు
అందంగా సొప్పి ఎల్తుర్నా ఆపడి
కాలికి మెలిక లేత్తారా....
తేగం సెయ్యి లే నోడి కన్న
సిన్ని తేగ బద్ద నయమొరే....
నిజానికి మీరంతా దేగలు
కాకి పిల్లా కోడి పిల్లా దొరికీ దాక గువ్వలు
దొరికీ గానె గుటుక్కున హూస్ కాకి అనిపిత్తారు
పెదాలు తుడ్సుకోని
కత్తెర మీసాల నవ్వు సన్నగా మొలేత్తారు
"య్యెప్పుడు నానేటి సేసినాను య్యేటీ సెయ్యనేదే"....
అనీ అంటారు

పొట్ట కోసి సూపిత్తే నిజం ఆపడద్ది
మీ పొట్ట సించీడాకి మా తాతలు దిగొత్తారు
సించడం అంటే మాట లేటి ?

లబ్బరు బుడగైతే టుప్పు మనిపించీసి
సిన్ని గుంటలే సర్న సీల్సిగ్రలు
అస్సలదేటో మీ కల్లేపే సూడ్నేం
మీ కాల గోళ్ళేపూ సూడ్నేం
మీ మాటకారి తనం కాడ మాతల్వి తెల్లారుద్ది
సొకు లాంటి మీ తెలివి కాడ మా బతుకు
సొరకాయరా తండ్రీ .... వుత్త సొరకాయ !

మీ రెన్ని సొప్పండి
పేదోలకి పేనాలంటేనే వొల్లమాలిన అతిమానం.... పేమ....
అయ్యొ ఎండి పోతున్నా
పచ్చగా పండించుకోవాలనే యేడుపు
ఆకాసం య్యెత్తంత దలసరి పాటి
మీ వుక్కు తప్పుల దొంతర్ల్ని సూపడాకి
య్యెంక పేనాలు లేనోలు య్యేటి తేగం సెయ్యగ్రలు
మీరు సత్తెంగ తప్పులే సేత్తున్నారు
ఆట్నే యీ కల్లతో సూత్తూనే వున్నాం
అయ్నా నెత్తిమీద సెయ్యెట్టుకోని
ఆ నిజం కక్కనేం
మాట రాదు నోరు పెగల్దు ....
పేనాల మీద అదేటో అంత ఇట్టం
అంతే .... అంతె ....
మడ్సుల్ని ఆల గుండె సత్తువునీ ఆపడకుండసంపీవోలు
ఊలే ఊలే .... అన్నేం
అందుకే బతికున్న మీ పేనాలు సప్పున తీసీనేం
కడుపు తీపి కాదు ... య్యేటి కాదు

సూత్తూ సూత్తూ
మీలా పచ్చినెత్తురు బుడ్డి గుటుగుటు తాగినేంరా దేముడూ
సేతగానోలం .... వుత్త సేటుపెయ్యలం....
మీ గేలానికి ఎరగా బల్లైపోయి
మీకే సేపలు పట్టిచ్చీవోలం.
సేటు పెయ్యలగా నిల్సి

అమ్మ కల్లు గప్పీసి
మీకే పాలిప్పిచ్చీ వోలం
య్యెంతే య్యెంతే ... మా బతు కింతే ...
గడ్డి య్యెప్పుడూ కోసుగోడాకే పనికొత్తాది ...
వుత్త సచ్చు నాయాలం
మిమ్మల్ని కలుపు మొక్కల్ని పీకేసినట్టు పీకేత్తే తప్ప
పేనానికి సుకం నేదు ..

అలా అన్నమే కాని
ఏటీ సెయ్యినేం
'సంపేత్తాను .... సంపేత్తాను....' అన్న మాటకిలువేటి ?
యిల్లల్లో అందరి పెల్లాలు నిత్తెం ఆ మాట
లింటూ సుబ్బడంగానే వున్నారు
అందుకే ఈ ఆడారెద్వలు య్యేటి సెయ్యిగల్రు అని
మీ నిబ్బడం
కూతంతేన అడ్డ మేసు కోడాకి
వుత్తుత్తి వూసులు తడిక గోడ లేనా అవుతాయేటి ?
మీ సదువులకుర్రోల కున్నాయి పెద్దపెద్ద రాచ్చసి గోడలు
యీ రానకీయ సిల్లంగోలకి య్యెక్కడలేని గోడలు
యీ కవిగోలకి పాలరాతి గోడలే....
ఆటి ఎనక అలు సివంగులు
ముందల మాత్తరం మాసత్తె గోవులు !
యిదేటి బతుకోరే....
ముప్పై అయిదేళ్లు అలు ఏటీ సెయ్యినేక పోనారు
మీరూ .... ఏటీ సెయ్యినేక పోనారు
మీరు కుర్సీ లెక్క నేక పోనారు
అలు కుర్సీలు దిగ నేక పోనారు
అదేం కిల్ల వోతమో....ఏటో....
ఏటీ సెయ్యినేదని అలు దిగనేదు
ఏటీ సెయ్యక మీరెక్కనేదు
య్యింక అలైన మీరైన ఏటీ సెయ్యినే రోరే....
తియ్యగా సొప్ప గల్రంతే....
అలా సొప్పిన వన్నీ
పుత్తకాల నిల్వ కొట్టుల్లో ఆకాసెం ఎత్తుకు ఎదిగిపోనాయ్
తలుపు తీసే వోడ్నేక
పురుగులు పురుగులు మాసెడ్డ సెదపురుగులు....
మీగుండెల్లో పురుడోసుకున్న పురుగులు !
అందుకే మీ ఎనక రాడానికి కాళ్ళాడ్డం నేదు....
సచ్చడి పోనాయ్
మీరు సెప్పున్నట్టే మీ సేతలూ వుంటే ....
గుండె మా నిబ్బడంగ వుంటాది
మనసు పడద్ది !
వుత్త గాలిమాట లెందుకురా తండ్రీ
'గాలి' మీదడద్ది
సేతలూ ఆటి నిజాయితీ సాలు
సాల్రోరే .... సాలు ఆ సిక్కని పాలు !

శ్రీ ఎ. విజయదత్తాత్రేయ శర్మ

విశాఖపట్నం జిల్లా గ్రామ నామములు: ఒక పరిశీలన

స్వాతంత్ర్యానికి పూర్వం 'వైజాగ్ పటాం' దేశంలో పెద్ద జిల్లాగా పరిగణింపబడేది. మొదటిసారి 1935 సం॥లో ఒరిస్సా రాష్ట్ర నిర్మాణ సందర్భంలో కోరాపుట్, గజాం జిల్లాలు, రెండవసారి 1938 సం॥లో బస్తర్, జయపూర్ ప్రాంతాలు ఆ జిల్లానుంచి వేర్పడి ఒరిస్సా రాష్ట్రాంతర్భాగాలయినవి. స్వాతంత్ర్యానంతరం 1950 సం॥ ఆగస్టు 15 తేదీన శ్రీకాకుళంజిల్లా, 1979 సం॥ జూన్ 1వ తేదీన విజయనగరం జిల్లా ఈ జిల్లానుంచి కొన్ని తాలూకాలను కలుపుకుని యేర్పడినవి. 1971 సం॥ గణాంక వివరములననుసరించి ప్రస్తుతం విశాఖపట్నం జిల్లాలోగల తాలూకాలు, ఆయా తాలూకాలలోగల గ్రామముల సంఖ్య ఈ విధంగా కానవస్తున్నవి. 1. అనకాపల్లి (154), 2. ఎలమంచిలి (148), 3. చింతపల్లి (556), 4. చోడవరం (392), 5. నరసాపట్నం (196), 6. పాడేరు (2,258), 7. భీమునిపట్నం (166), 8. విశాఖపట్నం (58),[1] కాగా, మొత్తం గ్రామముల సంఖ్య 4, 198. 1971 సం॥ లెక్కల ప్రకారం 4,888 గ్రామములతో ఈజిల్లా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యా గ్రామములు గల జిల్లాగా నుండెడిది. ఈవిభజన ప్రకారం గ్రామములు అధికసంఖ్యలో (2,258) పాడేరు తాలూకాలోను, తక్కువగా (58) విశాఖపట్నం తాలూకాలోను కనిపిస్తున్నవి. పాడేరు, చింతపల్లి తాలూకాలు పూర్తి 'ఏజన్సీ' (మన్యం) ప్రాంతమైయుండగా, నరసాపట్నం, చోడవరం తాలూకాలలో గూడ ఏజన్సీ గ్రామములున్నవి. ఇటీవలె, ఎలమంచిలి తాలూకా నుంచి నక్కపల్లి తాలూకా ఏర్పడినదిగాని ఈ పరిశీలన యందు ఆ విభజన గుర్తింపబడలేదు.

విశాఖపట్నం పరిధిలోగల మధురవాడ యందు నవీనశిలా యుగము నాటి మానవ నివేశనా సూచిత విశేషములు బయల్పడినవి.[2] అందువలన ఈ జిల్లా ప్రాంతం ఆది మానవుని కాలం నుంచి జీవన యోగ్యంగా వుంటూ వస్తోందని తెలుస్తోంది. చారిత్రక కాలమందు మధ్యమ కళింగ దేశముగా నుండిన ఈ జిల్లా ప్రాంతమును పలురాజవంశములు పాలించినవి. ఆయా రాజవంశముల, పాలకుల పేళ్ళమీదుగా గ్రామనామము లేర్పడుటలో వింత లేదు. ఈ కాలమందు కూడా రాష్ట్ర రాజధానులు (ఉదా॥ గాంధీనగర్-గుజరాత్) జిల్లాలు (రంగారెడ్డిజిల్లా - ఆంధ్రప్రదేశ్) మొ॥ వాటికి దేశ, రాజకీయ నాయకుల పేర్లు పెట్టుట రివాజుగానే సాగుతున్నది కదా! ముందుగా, ఈ జిల్లాలో ప్రాచీన, మధ్యయుగాలలో నుండిన పాలనా విభాగములు సూచింపబడుతున్నవి.

ప్రాచీన, మధ్య యుగములలో పాలనా విభాగములు

సముద్రగుప్తుని (క్రీ॥ శ॥ 335-380) దక్షిణ దిగ్విజయ యాత్రాకాలమునాటికి స్వామిదత్తుని పాలనలో నుండిన గిరికొత్తూర విశాఖపట్నం దాపునగల కొండ వానులలోగల కొత్తూరుతోను, కుబేరుని పాలనలో నుండిన దేవరాష్ట్రము ఎలమంచిలి ప్రాంతముగాను గుర్తింపబడినవి.[3] దేవరాష్ట్రము లేక ఎలమంచిలి - కళింగ దేశము ఒక రాజ్య విభాగముగా తూర్పు చాళుక్య మొదటి భీముని (890-918 క్రీ॥శ॥)కళింకోట తామ్రశాసనమందు ప్రశస్తమైనది.[4] ఎలమంచిలి - కళింగదేశము దక్షిణమున ఎలమంచిలి నుంచి ఉత్తరమున భీమునిపట్నం/విజయనగరం తాలూకాల వరకు విస్తరించుకొని ఉండవచ్చునని, ఈ ప్రాంతమును 5, 6 శతాబ్దులలో వాశిష్ఠవంశమువారు ఏలినపుడు రాజధానిగా నుండిన దేవపురము కాలగతిని కానరాకుండ పోయినదని పరిశోధకాభిప్రాయము.[5]

విష్ణుకుండిన ఇంద్రభట్టారకవర్మ (క్రీ. శ. 529-556) రామతీర్థ తామ్రశాసనము[6]లో పేర్కొనబడిన ప్లకిరాష్ట్రము, బొబ్బిలి-చీపురుపల్లి ప్రాంతములకు సరిపోవునదిగా భావింపబడినది.[7] కాగా, 'పకనాడు' చోడ మహామండలేశ్వరుని కుమారుడొకడు[8] శ॥ 1325 (క్రీ॥శ॥1403) సం॥లో సింహాచలస్వామికి ఇచ్చిన దానశాసన[9] చెప్పబడిన 'పకనాడు' విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి- ఎలమంచిలి ప్రాంతమైయుండునని, వెనుకటి 'ప్లకి'యే

'ప్లక్కి', 'పర్కి' మొదలుగా మార్పులు చెందుతూవచ్చి ప్రస్తుత శాసనమందు 'పకనాడు'గా వ్యవహరించబడినదని వేరొక అభిప్రాయమునూ గలదు.[10]

అర్వాచీన తూర్పు గాంగుల, సూర్యవంశ గజపతుల కాలమునాటి కళింగ విషయము సింహాచల పరిసర ప్రాంత - విశాఖ పట్నం తాలూకా భాగముగా గుర్తింప బడినది.[11] తూర్పు గాంగుల శాసనములలో ప్రశస్తమైన చోడనాడు (చోడవరం తాలూకా), దిమిలి విషయ్యం (ఎలమంచిలి తాలూకా) నేటి విశాఖపట్నం జిల్లా అంతర్భాగములు.[12] సూర్యవంశ గజపతుల కాలములో రాజమండ్రి రాజ్యంలేక దండ పాటలోని స్థలములైన అరట్లకోట, చోడవరం, సర్వసిద్ధి, రాయవరం విశాఖ జిల్లాలోనే ఉన్నవి.[13] ఈ విధంగా విశాఖజిల్లా ప్రాంతం ప్రాచీన, మధ్య యుగాలలో పాలనా విభాగ కేంద్రమై ప్రాముఖ్యత కలిగి ఉండేదని తెలుస్తోంది.

ఈ క్రింది విశాఖజిల్లాలో పూర్వ రాజవంశముల, పాలకుల పేళ్ళ ననుసరించి ఏర్పడిన గ్రామ నామముల పైనను సూచింప బడుతున్నది.

తూర్పు చాళుక్య

తూర్పు చాళుక్య వంశ స్థాపకుడు కుబ్జ విష్ణు వర్ధనుడు (క్రీ. శ. 624-641) 'సర్వసిద్ధి' అను బిరుదు వహించాడు.[14] అతని సోదరుడు వారసుడు మొదటి జయసింహ వల్లభుడు (641-673), ఆ వంశములోని రెండవ జయసింహ వల్లభుడు (705-717) కూడ 'సర్వసిద్ధి' బిరుదాన్ని వహించారు.[15] ఎలమంచిలి తాలూకాలోని 'సర్వసిద్ధి' గ్రామం ఆ బిరుద పదంగానే పేరు తెచ్చుకున్నది. శక సంవత్సరం 555 నాటి కుబ్జ విష్ణు వర్ధనుని తిమ్మాపుర శాసనమందు ప్రశస్తమైన కలువలపల్లి గ్రామం నేటికీ అదే పేరుతో ఎలమంచిలికి మూడునాలుగు మైళ్ళ దూరంలోఉన్నది.[16] "కలువల పల్లి దిమిల కొకమైలు దూరమున నున్నది. దిమిల ప్రక్కనే తెరువపల్లి గ్రామంలో రత్నాకరస్వామి ఆలయమున్నది. రత్నాకరుడనగా సముద్రుడు. ఆంధ్రుల నౌకాధికారమున కిదియొక ప్రబల నిదర్శనము. ఇచట గొప్ప దీప స్తంభములుండెడివి. తూర్పు తీరమున రాకపోకలు గావించుచుండిన యోడలకీ దీప స్తంభములు మార్గదర్శకములై యుండెడివి .... సముద్రము మీది యోడలకు తెరువు చూపించుటకు అనగా దారి ఇది అని చెప్పుటకు దీపములు లేక దివ్వెలు ప్రతిష్ఠింపబడినచోటు కాలక్రమమున 'దిమిల' యైనది."[17]

ఎలమంచిలి చాళుక్య[18]

శాసనములలో 'ఎలమంచి'[19] (మంచి గ్రామనామాత్మము కాగా, ఎలము అనగా సుందరమైనదని అర్థము)గా పేర్కొనబడిన ఎలమంచిలి తూర్పు చాళుక్య శాఖలలో నొకదానిగా కేంద్రముగా నున్నది. రెండవ జయసింహుని మరణానంతరము (క్రీ॥ శ॥ 717) అతని సవతి సోదరులలో చిన్నవాడైన కొక్కిలి విక్రమాదిత్య భట్టారకుడు అగ్రజుడైన మూడవ విష్ణువర్ధను (718-752)నితో కలహించివేంగినివిడిచి మధ్యమ కళింగమునకు తరలివచ్చి ఎలమంచిలి రాజధానిగా నొకచాళుక్య రాజవంశపాలనకు ప్రారంభకుడైనాడు.[20] "ఈ కొక్కిలి రాజు తన పేర నొక పల్లెకూడా కట్టించినట్లగపడు చున్నది. ఈ కొక్కిలిరాజుపల్లె 'కొక్కిరాపల్లి'యను కుగ్రామమై ఎలమంచిలి కొక మైలు దూరమునన్నది."[21] ఈ వంశములో మల్ల (ప) నామధేయులుకలరు. తూర్పు చాళుక్యులలోనే యుద్ధ మల్లురిరువురున్నారు. వడ్డాదినేలిన మత్స్యవంశీయులలో నొకయుద్ధ మల్లుడు కలడు. నర్సీపట్నం తాలూకాలోగల మల్లభూపాలపట్నం, ఈ జిల్లాలోని వివిధతాలూకాలలోగల మల్లవరములు(న&చిం&అ) ఏవి వీరిలో ఎవరి పేరున ఏర్పడి ఉండునో నిశ్చయించుట కష్ట సాధ్యము. ఎలమంచిలికి ఏడు మైళ్ళ దూరంలోగల కొప్పాక ఈ చాళుక్య వంశములోని రాజనారాయణ కొప్ప దేవుని పేర వెలసినదిగా ఊహింపవచ్చును. అయిదవ అపేంద్రుడు (క్రీ॥ శ॥ 1375) తన పేరున అపేంద్రపురమను నగ్రహారమును నిర్మించినట్లు ఇతని పుత్రుడైన నృసింహ దేవుని శాసనము వలన తెలియు చున్నది.[22] "దీనిని ప్రస్తుతం ఎలమంచిలి తాలూకాలోని 'అప్పాక' గా గుర్తింపదగును."[23] దీనికి సమీపముననే 'గోకులపాడు' నామముతో విన్నకోట పెద్దన రచించిన 'కావ్యాలంకార చూడామణి' ఏడవ ఉల్లాసపు అరవై అయిదవ పద్యమున వర్ణించబడిన 'గోర్థనము' కలదు.[24] 1122 సం॥ ప్రాంతంవాడైన కుమార యొట్టునాయకుడు, అతనిభార్య సింగమ, వారి పుత్రుడు సింగరాజు ఆ తరువాత పాలకులైన శ్రీధర రాజనరేంద్ర, హరి నరేంద్రుల పేరున ఎర్రభూపాల పట్నం (న), ఎర్రవరం - సింగవరం (ఎ), నరేంద్రపురం (అ), హరిపాలెం (ఎ) గ్రామనామములేర్పడి ఉండ వచ్చును. పంచదార్ల (ఎ) ధర్మలింగేశ్వరాలయమున ఈ వంశ చరిత్రను తెలుపు శాసనములున్నవి. పంచ (అయిదు) ధారలు కల ప్రదేశమగుటచే ఆ గ్రామమునకాపేరు వచ్చినది.[25]

చోళ

తూర్పు గాంగులకు దాక్షిణాత్యులైన చోళులకు రాజకీయ, వైవాహిక సంబంధ బాంధవ్యము లుండినవి.

"వైశాఖి" యను శబ్దమునుండి విశాఖపట్టణ మను నామ మత్పన్నమైనది అని ఒక అభిప్రాయం.[26] "వైజాగపటాం అను నామమునకు వైశాఖపట్టణమనునది సుశబ్దమయియున్నది. అనగా కార్తికేయస్వామి యొక్క పట్టణమని తాత్పర్యము....కులోత్తుంగ చోళుని నొకరాజు సుమారు అయిదు వందల సంవత్సరముల క్రిందట శ్రీ కాశీయాత్ర వెళ్లుచు ప్రస్తుత విశాఖపట్టణ ప్రదేశ మందు మకాం చేసి....అ స్థలమును చూసి యాయన సంతోషించి లాసన్సుబె అను సముద్రమునకు దక్షిణభాగమందు తీర్థపురాళ్ళు అను పిలువబడు స్థలము యొద్ద వారి జాతము కిష్టదేవతయయిన కుమారస్వామి నిమిత్తము ఒక అలయము కట్టించెను."[27] నేడు విశాఖస్వామి ఆలయం సముద్రం కోతకు గురియై నీటకలిసి పోయినా తీర్థపురాళ్ళ అనేచోట నమ్మకముగల హిందువులు నేటికీ గ్రహణ కాలాదులందు స్నానాదికముల నాచరించడం జరుగుతోంది. శ॥ 990 సం॥ (క్రీ॥ శ॥ 1068)నాటి ద్రాక్షారామ శాసనంలో విశాఖ పట్టణము పేర్కొనబడినది.[28] శ॥ 101 (3) (క్రీ॥ శ॥ 1990-91) సం॥ నాటి శాసనము విశాఖపట్టణమైన కులోత్తుంగచోడ పట్టణమును పేర్కొనినది.[29] క్రీ॥ శ॥ 1083 ప్రాంతమున కులోత్తుంగుని సేనానియైన కరుణాకరుడు విశాఖపట్టణమును స్వాధీన పరుచుకుని దానికి కులోత్తుంగచోడ పట్టణమని పేరిడినాడు.[30] చివరకు, తొలుత నెవరో ఆంధ్రరాజు విశాఖాలయాన్ని నిర్మించి ఆ ప్రాంతానికి ఇచ్చిన విశాఖపట్నం నామమే నేటికి నిలిచి ఉన్నది.

చోడపల్లి (ఎ), చోడవరం (చో) వంటి గ్రామ నామములను చోళ సంబంధముగానే ఏర్పడినట్లు తలంప వచ్చును. వెలనాటి చోడులు కొంతకాల మీప్రాంతముపై యాధిపత్యము వహించిరి. ఎలమంచిలి చాళుక్యులలో నొక చోడేంద్రుడు (1391 ప్రాంతం) డున్నాడు. తూర్పుగాంగ చక్రవర్తులలో ప్రముఖుడు అనంతవర్మ చోడగాంగ దేవుడు.

తూర్పు గాంగ

క్రీ॥ శ॥ 5వ శతాబ్దంనుంచి 15 శ॥ వరకు కళింగమునేలిన గాంగ వంశనామ ప్రభావముగానే ఈ జిల్లాలో గంగవరములు (4చిం & 4న & 1చో) విరివిగా నుండినట్లు తోచును. ఈ జిల్లాలో భీమవరములు (ఎ & చిం & పా & అ)ను ఎక్కువే. తూర్పు చాళుక్య, తూర్పుగాంగ, వడ్డాదిమత్స్య, వంశాదులలో భీమనామ ధేయులు ఒకరికంటె నెక్కువగనే యున్నారు. అదిగాక, ముఖలింగ ద్రాక్షారామ భీమేశ్వరుల ప్రభావము కూడ నీ గ్రామనామములపై యుండియుండ వచ్చును. ఇంద్రపురం చింతపల్లి తాలూకాలో ఉన్నది. తూర్పు గాంగరాజులలో ముగ్గురు ఇంద్రవర్మలున్నారు. ఈ ప్రాంతమునేలిన వారిలో విష్ణుకుండిన ఇంద్ర భట్టారకవర్మ (529-556) వున్నాడు. వారిలో నెవరో ఇంద్రపురమునకు తమ పేరిచ్చినారో! తూర్పుగాంగులలో అనంతవర్మ నామధేయులు ఆరుగురు. 5, 6 శతాబ్దులలో మధ్య దక్షిణ కళింగముల నేలిన వాశిష్ఠ, మాఠర (పితృభక్త) వంశీకులలోను అనంతవర్మలు కలరు. అనంతపరం భీమునిపట్నం తాలూకాలోను, అనంతభూపాలపట్నం నర్సీపట్నం తాలూకాలోను ఉన్నవి. తూర్పు గాంగులలో భాను దేవులు నలుగురు. భానుదేవపురం భీమునిపట్నం తాలూకాలో ఉన్నది. అనియంకపల్లి జన వ్యవహారవశమున అనకాపల్లి గా మారినది.[31] తూర్పుగాంగ రాజులలోగల రెండవ అనంతవర్మ అనియంక భీమ వజ్రహస్త (970-1014), అనియంక భీమ (1194-1198) రాజులలో నొకరి పేరున ఏర్పడిన గ్రామమిది. తూర్పు గాంగులలో నరసింహదేవులు నలుగురు. నరసింహ గజపతినగరం చోడవరం తాలూకాలో నున్నది. భానుదేవుని ఉద్యోగి యొకడు శ॥ 1339[32] సం॥లో సింహాద్రి నాధునకు సమర్పించిన కణితి విశాఖపట్నం పరిధిలోనే ఉన్నది.

సూర్యవంశ గజపతి

తూర్పుగాంగుల రాజకీయ వారసులుగ కటకం కేంద్రంగా నేలిన సూర్యవంశ గజపతులలో పురుషోత్తమ గజపతి (1468-79) ప్రముఖుడు. పురుషోత్తమపురం విశాఖపట్నం తాలూకాలో ఉన్నది.[33] 'బుర్హాన్-ఇ-మాసిర్' అను చారిత్రక గ్రంథమననుసరించి సూర్యవంశ గజపతిరాజ్య స్థాపకుడైన కపిలేశ్వరుని (1435-1469) మరణానంతరం అతని కుమారులు అంబరరాయలు, మంగళ రాయలు రాజ్యాధికారముకొరకు కలహించుకున్నారు. కపిలేశ్వరుని హంవీరుడు అంబర రాయలుగను, పురుషోత్తముడు మంగళరాయలు గను గుర్తింపబడినారు.[34] అంబేరుపురం, మంగళాపురం గ్రామములు చోడవరం తాలూకాలో ఉన్నవి.

రెడ్డి

అనవేమ, కుమారగిరుల కాలంలో కొండవీటి రెడ్డి రాజ్యం సింహాచల పర్యంతం విస్తరించుకున్నది. ఏతత్ఫలితంగా గోపును వేమవరం (చో), వేమగిరి, వేమపాడు (ఎ) గ్రామనామము లేర్పడినవి.[36] పెదకోమటి వేముడు వీరనారాయణ బిరుదాంకితుడు.[36] ఈ రెడ్డిరాజు బిరుదనామం ధరించినది వీరనారాయణం (చో) గ్రామం.

హంపీ విజయనగర

"రాయ రాహుత మిండ రాచయేనుగు వచ్చి
యారట్ల కోట గోరాడునాడు" ....
....

అని కృష్ణదేవరాయల మరణానంతరం విజయనగరంపైకి దండెత్తి వచ్చిన కటకం గజపతికి పూర్వ పరాజయాలను జ్ఞప్తికి తెస్తూ అల్లసానిపెద్దన చెప్పెనను చాటువు ప్రసిద్ధం.[37] "అరట్లకోట ఏదియో సరిగా తెలియవచ్చుటలేదు. కాని, అదియొక బలిష్ఠమైన దుర్గమే అయియుండును .... ఇట్లుభయపక్షముల వారికిని మిక్కిలి అరడి (అలజడి) కలిగించినకోట సార్థకనామమై 'అరట్లకోట' అని ప్రసిద్ధి వహించియుండును. విజయనగరము వారికిని, గజపతి సైన్యములకును, బేధించుట యందును, రక్షించుట యందును, ఎక్కువ అరట్ల (అలజడి) కలిగించినకోట ఉదయగిరికోట కాని లేక కొండవీడు కాని కావచ్చును. అనగా అరట్లకోట అనుపదము విశేషణవాచకము మాత్రమే అగుచున్నది. వాస్తవముకాదు."[38] అని ఒక అభిప్రాయ మటులుండగా, "రాసురాపుత గండరావాచ యేనుగువచ్చి జీరాడిన యారట్లకోట" ప్రస్తుత విశాఖపట్నం జిల్లా ప్రాంతములోనిదే అనిది పరిశోధకుల నిర్ణయం.[39] ఇంతకీ ఈ అరట్లకోట గ్రామం ఎలమంచిలి తాలూకాలో నున్నది.

రాయవరం (ఎ) అసలు పేరు కృష్ణదేవరాయపురం. కృష్ణరాయపురం గ్రామం విశాఖపట్నం తాలూకాలోనున్నది.

తాలూకా కేంద్రంగా ఉన్న నర్సీపట్నం (నరసాపట్నం) ఇంకా ఈ జిల్లాలో ఉన్న నరసింగబిల్లి (ఎ), నరసాపురం (భీ), నరసాపురం (అ) వంటివి కృష్ణదేవరాయల అగ్రజుడు వీరనరసింహుని పేరనగాని, తండ్రి నరసానాయకుని పేరనగాని ఏర్పడి ఉండునేమోననిపించునుగాని ఆ ఈ గ్రామములు తూర్పుగాంగ రాజులలోగల నరసింహ నామధేయుల పరంగానే ఏర్పడినవి కావచ్చును.

సామంత రాజవంశములు

ఒడ్డాది మత్స్య వంశము

"ఉద్రులకు, ఒడ బాడి లేక ఒడబాది అనే పేరుగల ఒకరాజధానియున్నట్లు ప్రమాణముగలదు. ఇది ప్రస్తుతము విశాఖపట్నం జిల్లాలో చేరి యుండు వడ్డాది లేక ఒడబాదియై యుండుట విశేష సంభవము."[40] శాసనములలో ఒడ్డవాది,[41] ఒడ్డాది[42] రూపములు రెండునూ కనపడినవి. ఈ జిల్లాలోగల వడ్డియవలస, వడ్డియపుట్టి (చో) మొ॥ గ్రామనామములు సైతం ఈ ప్రాంతముపై గల ఓఢ్ర దేశ ప్రభావమును తెలియచేస్తున్నవి.

క్రీ॥ శ॥ 12, 14 శతాబ్దములందు దక్షిణ కళింగ మండలి వడ్డాది పేరును మత్స్యవంశము వారు ఏలిరి. ఈ మత్స్యవంశజుల పాలనా ప్రభావ సూచికముగ మత్స్యపురములు (చో) ఏర్పడినవి. మత్స్యవంశరాజులలో అర్జున (క్రీ॥ శ॥ 1252-1292), వీరార్జున (1356-1379), ప్రతాపార్జున (క్రీ॥ శ॥ 1399-1427) నామధేయులు కలరు. తామరచెర్ల అర్జాపురము (చో), అర్జునగిరి (చో) గ్రామములు వారిలో నెవరి పేరుననైనను రూపెత్తి ఉండును. మొదటి అర్జునదేవరాజు శ॥ 1191 (క్రీ॥ శ॥ 1269)లో వేయించిన దిబ్బిడ తామ్రశాసనం[43] ప్రకారము అతడు తన తండ్రి జయంతుని పుణ్యముకొరకు దిబ్బిడ అగ్రహారమునకు తన తండ్రి పేరిట 'జయంతి నారాయణ పురము' అని ప్రతి నామమిడి కొంతమంది విప్రులకు దానము చేసినట్లు తెలుస్తోంది.[44] అయితే దిబ్బిడి అగ్రహారం అదే పేరున నేటికీ చోడవరం తాలూకాలోనున్నది.

వీరకొఠాం పల్లవ

వీరకూటమి (వీరఘట్టం, శ్రీకాకుళంజిల్లా) పల్లవులలో నిరువురు బయ్యరాజులు కలరు.[45] వీరు పన్నెండు, పదమూడు శతాబ్దములకు చెందినవారు. బయ్యవరం (అ&న) గ్రామములు వీరి పేర్లమీదుగా ఏర్పడి ఉండవచ్చును. ఈ వంశములోని సౌభాగ్యదేవుని (1400-1420) పేర కానోపును సౌభాగ్య రాయపురం (వి) ఏర్పడినది.

నందాపుర శిలావంశము

నందాపురము (ఒరిస్సా)ను రాజధానిగా చేసుకుని ఏలిన శిలావంశీయులలో ప్రతాప గంగరాజు[46] (1427-1435) ఒకడు. ఈతని పూర్వీకుడు మరియొక గంగరాజు (14 శ॥ పూర్వార్ధం)ను

కలదు. పాడేరు తాలూకాలో పాతగంగరాజు మాడుగుల, గంగరాజు మాడుగల గ్రామములున్నవి. పాడేరు గ్రామనామము నదీ పరంగాను, మాడుగుల గ్రామనామము మత్స్యకుండము పరంగానూ ఏర్పడినవిగా తోచును. జంతర్నాటి గాంగవంశీకులలో గంగరాజు, ప్రతాప గంగరాజ నామధేయులున్నారుకాని నందాపురము వారికిని వడ్డాది మత్స్యవంశీకులకును వైవాహిక సంబంధములుండుటనుబట్టి వడ్డాది సీమలోనివైన మాడుగుల గ్రామములు నందాపురాధిపతుల పేరుననే ఏర్పడినవని భావించవలసిఉన్నది. నర్సీపట్నంతాలూకాలో పెద్దభైరవభూపతి అగ్రహారం, చిన్నభైరవ భూపతి అగ్రహారం గలవు. శిలావంశీయులలో భైరవరాజు (1370 ప్రాంతం) గలడు. శిలావంశీయుల వారసులైన నందాపుర సంస్థానాధిపతులలో భైరవదేవు (1510-1527) కలడు. 1776 ప్రాంతంలో గోలుగొండ జమిందారు నొక భైరవభూపతి గలరు. పై అగ్రహారములు పై వారిలో నెవరిపేరునగాని ఏర్పడినవి కావచ్చును.

గుణగ విజయాదిత్యుని (9 శ॥) సేనాని పండరంగుడు కళింగముపై విజయయాత్ర చేసాడు. భోగాపురం తాలూకాలోని పాండ్రంగి గ్రామనామము ఆతనిపేర ఏర్పడినదై వుండునేమోనను అభిప్రాయము కలదు. వెలనాటి చోడరాజన్యుడు పృధ్వీశ్వరునికి కళింగయుద్ధమున సాయపడిన వారిలో అతని ప్రధాన దండనాయకుడైన కొరవి వెన్నయామాత్యుడు ముఖ్యుడు. దానిచే ఈ అమాత్యునకు 'వీరఘోటవిభాళా'ది బిరుదులు లభించినవి.[47] వెన్నవరం (2 చో & 1 ..ం), వెన్నవోలు (చో), వెన్నభూపాలపట్నం (న) గ్రామాలలో నేవైనా ఈ వెన్నమాత్యుని పేర నేర్పడినదేమో!

మహమ్మద్ కులీకుతుబ్‌షా (1580-1612) పనుపున అశ్వారాయనింగారు[48] ముకుంద బాహుబలేంద్రుని ఓడించి తరిమినట్లు ఆతని శ్రీకూర్మం,[49] సింహాచల[50] శాసనాలు తెలియజేస్తున్నవి. ముకుందపురములు (చో & భీ) అలా ఉండగా, అశ్వారాయినింగారు సింహాద్రినాధుని రాగభోగాల నిమిత్తం సమర్పించిన నరవర గ్రామం నేటికి నరవ అనే పేరుతో విశాఖపట్నం తాలూకాలో ఉన్నది.

సంస్థానములు / జమిందారీలు

విజయనగరం

విజయనగర సంస్థాన పాలకుడు, ఉషాభ్యుదయ కావ్యకర్త వేంకటపతిరాజు (1669-1720). ఇతనిపేర నేర్పడినవి వెంకటపతిరాజుపేట (వి & చో), వెంకటపతి రాజపురం (చో) గ్రామములు. ఇతని సోదరుడు, చరిత్ర ప్రసిద్ధికెక్కిన పెద విజయరామరాజు తండ్రి ఆనందరాజు (1671-1717). ఇతని పేరున ఏర్పడినవి ఆనందపురం (ఎ & భీ), పలపు ఆనందపురం (అ). పెద విజయరామరాజు (1708-1757), చిన విజయరామరాజు (1748-1794) ఇద్దరు సుప్రసిద్ధులే. విజయరామరాజు పేట (చో), విజయరాంపుర అగ్రహారములు (ఎ & భీ) ఉన్నవి. చినవిజయరామరాజు కుమారుడు నారాయణ గజపతి (1786-1845) పేరున వెలసినది నారాయణ గజపతిరాజపురాగ్రహారం (న), నారాయణ గజపతిరాజపురం (భీ) నారాయణ రాజుపేట (భీ),[52] - 'గజపతి' విజయనగరం పూసపాటి రాజుల బిరుదు. గజపతినగరం చోడవరం తాలూకాలోనున్నది.

మాడుగుల

మాడుగుల సంస్థానాధీశ్వరులలో లింగ భూపతులిరువురు. చోడవరం తాలూకాలో లింగభూపాలపురం, లింగభూపాలపట్నం ఉన్నవి. శాశ్వతికర నిర్ణయం నాటికి (1802) మాడుగుల జమిందారు జగన్నాధభూపతి. ఇతని ప్రత్యర్థి అప్పల భూపతి. కృష్ణభూపతి (1813-1875) ప్రముఖుడు. జగన్నాధ భూపాలపురం, అప్పలరాజపురం, కృష్ణభూపాలపురం చోడవరం తాలూకాలో ఉన్నవి. 'భూపతి' ఈ జమిందారుల బిరుదు. భూపతిపాలెం చోడవరం తాలూకాలో నున్నది.

అనకాపల్లి

అనకాపల్లి జమిందారుల బిరుదు 'పాయకరావు'[53] పేరిట పాయికరావుపేట (ఎ) పాయికరావు చోళంగి (అ) గ్రామములున్నవి. రేకపల్లి సోమనాథకవి రుక్మవతీ పరిణయం అంకితం పుచ్చుకున్న గోపాల పాయకరావుపేట గోపాలపురం (అ) ఆతని పుత్రుడు రామభద్ర పాయికరావు పేర రామభద్రపురం (అ), బొబ్బిలి యుద్ధంలో విజయనగరం పక్షం వహించిన జగన్నాధరాజు పేరున జగన్నాధపురం, జగన్నాధపురాగ్రహారం (అ) ఏర్పడినట్లు తోచును.

ముస్లిం పాలనా ప్రభావము

ఈజిల్లా ప్రాంతం 1568-1652 సం॥ల మధ్య గోలుకొండ నవాబుల పాలనలో నుండినది. 1652-1687 సం॥ల కాలములో వారి ప్రతినిధి అయిన చికాకోల్ (శ్రీకాకుళం) ఫౌజుదారుల పాలనలో ప్రవర్తిల్లినది. 1687-1724 సం॥లలో మొఘల్ ఫౌజుదారుల పాలన సాగినది. ఈ ముస్లింపాలనా పరిణామంగా ఈ ప్రాంతంలో ముస్లింలు స్థిరపడటమూ, కొన్ని గ్రామాలు వారి పేరు మీద ఏర్పడటమూ జరిగినది. ఉదా : ఆలీఖానుడుపాలెం (అ), అమీన్ సాహెబ్ పేట (అ), ఖాజీపాలెం (ఎ), మాసాహెబ్ పేట (ఎ), హుకుంపేట (పా), ఫకీర్ సాహెబ్‌పేట (చో), తురకలపూడి(చో), విశాఖపట్నం పరిధిలోని మల్కాపురం (మాలిక్ = ముస్లిం), అల్లీపురం (అలీ) కూడా ఇట్టివే. అనకాపల్లి తాలూకాలోని కశింకోట, ఖాసింకోటకు అపభ్రంశ రూపమనుకునే వీలుంది కాని కసిమికోట గ్రామ నామముగా శాసనాలలో కానవస్తున్నది.

పౌరాణికములు

జనసామాన్య విశ్వాసంలో కొన్ని గ్రామాల పుట్టుక, నామకరణమూ పౌరాణిక వ్యక్తులకు సంబంధించినవిగా ఉన్నవి. అందుల కుదాహరణములుగా గల కొన్ని గ్రామములు :

పద్మనాభం

భీమునిపట్నం తాలూకాలోగల ఈ గ్రామంలోగల చిన్న కొండపై వెలసిఉన్న శ్రీ పద్మనాభస్వామి పేరిటనే ఈ గ్రామనామం ఏర్పడినది. "పద్మనాభములోని దేవతామూర్తి తిరువాంకూర్‌లో ననంత పద్మనాభములోనున్న మూర్తివలె యున్నది."[54] అనంతపద్మనాభపురం నర్సీపట్నం తాలూకాలో నున్నది.

భీమునిపట్నం

ద్వాపరయుగంనాటి భీమసేనుడే ఈ పట్టణ నిర్మాతయని ఒక నమ్మిక.[55]

బలిఘట్టం

నర్సీపట్నానికి నైరుతి దిశగా మూడు కి॥ మీ॥ దూరంలో ఉన్న ఈ గ్రామసమీపంలోగల చిన్నగట్టుపై బ్రహ్మేశ్వరస్వామి ఆలయమున్నది. ఆలయమున్న గట్టకు రెండు వైపులా వందేరు (వరాహా)నది ప్రవహిస్తున్నది. "వరాహానది యొడ్డను కొంచెము యెర వరకు శివభక్తులు ముఖమందు ధరించెడి విభూతి యనగా భస్మయొక్క పొత్తిగల భస్మకలిగియున్నది. అది లోగడ నీ స్థలములో బలిచక్రవర్తి వలన చేయబడియున్న యజ్ఞ సంబంధమైన భస్మమయినట్లు ప్రజలునమ్ముదురు."[56]

జాతి, కుల, వృత్తి, సంబంధములు

ఏదో ఒక జాతి, కుల, వృత్తులకు సంబంధించిన వారు తొలుత నివశించుటను బట్టియో, లేక వారిసంఖ్య గణనీయమైనదిగా నుండుట వలననో కొన్ని గ్రామములకు తత్ సూచనా పూర్వక నామము లేర్పడినట్లు తోచును. ఉదా॥ వడ్రపల్లి [అ], పాడేరు తాలూకాలోగల బానపట్టు, దాసరిపుట్టు, రెడ్డిపాడు [చో], సెట్టిపాలెం [న], జంగంపాకలు, జంగాలపాలెం [చిం] గొండుపాలెం [చో], బోయిపాలెం [వి & చిం] కుమ్మరిపాలెం [భీ], చాకిపల్లి [చో], చాకిరేవు [పా], కమసాలి గుమ్మి [పా], కుమ్మరి గుంట [పా], మంత్రిపుట్టు [పా], బంట్రోతు పట్టు [పా].

ఇంటిపేర్లు - గ్రామనామములు

ఈ రెండింటికి అవినాభావ సంబంధమున్నది. ఒకానొక కుటుంబమునకు వారు తొలుత నివశించిన గ్రామము ఇంటిపేరగుటయు. లేక ఒకానొక ఇంటిపేరు వారు స్థిరపడుటచే ఆ గ్రామమునకు వారి ఇంటిపేరు వచ్చుటయు జరుగవచ్చును. ఉదా॥ జంపెన [చో], నరవ [వి], పైడిపాల [న], కొత్తగడ్డ [చిం], ఉప్మాక [ఎ], భాగవతుల అగ్రహారం [చో], కవి కొండల అగ్రహారం [చో], దీక్షితులు అగ్రహారం [చో], జయంతి వారి అగ్రహారం [భీ], పిలకావారి అగ్రహారం [భీ]

అగ్రహారములు

రాచరిక వ్యవస్థలో వేదవిదులకు, కవి పండితులు మొ॥ వారికి అగ్రహారము లిచ్చుట ఒక సంప్రదాయముగా సాగినది. అట్టి అగ్రహారములు ఇచ్చి, పుచ్చుకున్నవారి పేళ్ళలో నేలాగునైనా ఏర్పడటం జరిగేది. పైన చెప్పిన అగ్రహారములుకాక మరికొన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చును. రామయోగి అగ్రహారం(చో భీ) రాజుల అగ్రహారం [ఎ] అడివి కామయ్య అగ్రహారం [న], క్రిష్ణ భొట్లు అగ్రహారం [న], గణపతిరాజు అగ్రహారం [న], సన్యాసి రాజు అగ్రహారం [న], నారాయణ గజపతిరాజపురాగ్రహారం [న], విజయరాం పురాగ్రహారం [ఎ&భీ]

వలసలు

"విశేషించి 'వలస' యనునది శ్రీకాకుళం, విశాఖపట్టణ మండలములయందు ప్రచురముగా గ్రామనామముల ఉత్తర భాగముగాఁగన్పట్టు చున్నది."[57] ఒక్క పాడేరు తాలూకాలోనే కొత్త

వలసలు 15. సంగం వలసలు 7. కొత్త వలసలు ఎంత పాతపడినా అవి ఏదో ఒక కాలమందు క్రొత్తగా ఏర్పడిన వలసలేకదా! ఇక సంగం వలసలు సంగము [కూడుక, కూడుట] ము వలన ఏర్పడిన వలసలనే చెప్పాలి. మన్యం ప్రాంతమైన పాడేరు తాలూకా కొండజాతుల కాలవాలము. అంతగా స్థిరనివాసులు కాని వారు తరుచుగా నొక చోటు నుండి మరియొక చోటుకు వలసపోతూ ఉండుటయు, ఆ విధంగా కొత్త వలసలనేకములు ఏర్పడుటయు జరిగినది.

ఊరి పేరుపై మమకారం

ఏ కారణం చేతనైనా ఊరు విడిచి దేశాంతరమే వలసపోయినా పాత ఊరిమీద మమకారం అంత త్వరగా పోదు. బృహత్ భారతదేశంలోనిదైన అరకాన్ ముఖ్యపట్టణానికి త్రిలింగ మని. సియాం (శ్యామ) అనబడిన నేటి కాంబోడియాలో కాకులమని ఒక ప్రాంతానికి పేరుంచుకోవడమే మాతృభూమితో వలసపోయిన వారికి తెగని అనుబంధానికి ఒక ఉదాహరణ. బృహద్ భారతంలో సింగపూర్ (సింహపురం), పాండురంగ, విజయ, కొత్తూర మొ॥ కానవస్తాయి. ఉపరి, అటు ఉభయ గోదావరిజిల్లాలు, ఇటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు విశాఖజిల్లాకు ఇరుగు పొరుగులు. ఒకే పేరుగల గ్రామాలు ఈ జిల్లాలలో కొన్ని ఉన్నవి. ఉదా॥ టెక్కలిపాలెం (చిం) — టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), రేలంగి (చిం) - రేలంగి (ప॥ గో॥ జిల్లా), పొట్టంగి (పా) - పొట్టంగి ఒరిస్సా, అమలాపురం (స) - అమలాపురం (తూ॥ గో॥), అన్నవరం (చిం & న) - అన్నవరం (తూ॥ గో॥), పాలకొండ (చిం) పాలకొండ [శ్రీకాకుళం జి॥], బలిజిపేట [చిం] బలిజిపేట [శ్రీ॥ జి॥]. పార్వతీపురం [వీ] - పార్వతీపురం [విజయనగరం జిల్లా], ధర్మవరం [చిం & న] - ధర్మవరం [వి॥ జి॥], కోరుకొండ [భీ & చిం]; భోగాపురం [ఎ] సిరిపురం [చిం] మొ॥ గ్రామాలు విజయనగరం జిల్లాలో కూడ ఉన్నవి. విజయనగరం జిల్లాలోగల లక్కవరపుకోట శృంగవరపుకోట గ్రామనామాలను పోలినవి లక్కవరం, లక్కవరపు పేట [చిం], శృంగవరం [చో & న]. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకూర్మం ఉండగా ఈ జిల్లాలో చినకూర్మం [చో] ఉన్నది.

గ్రామవాచకములు

"బాగా పరిశీలిస్తే ప్రతిశబ్దమూ గ్రామ నామంగా కావడానికి అవకాశం ఉన్నట్లు తోస్తుంది. వొంటి మామిడి, కోరు మామిడి, వంకమామిడి అయీ మామిడి శబ్దాలు గ్రామ వాచకాలుగా పరిణమించాలి".58 విశాఖజిల్లాలోని ఏజెన్సీ తాలూకాలలో ఈ మామిడులు పుష్కలంగానే గ్రామనామంగా ఉన్నాయి. ఉదా॥ చింతపల్లి తాలూకాలో బురద మామిడి, గొడుగు మామిడి, పుల్లల మామిడి, వాడ మామిడి మొ॥ పాడేరు తాలూకాలో బొర్ర మామిడి [5], కంగారు మామిడి [2], బండమామిడి [3], తియ్యమామిడి, చిలకల మామిడి ఇట్లా ఉన్నవి. ఇంకా ఏజన్సీ తాలూకాలలో పాకలు, కోటలు ఒకేలాగు గ్రామనామములై యున్నవి. ఉదా॥ బూసులకోట, పుట్టకోట, రాకోట, రాసకోట, రేపులకోట, తాళ్ళకోట [అన్నీ చింతపల్లి తాలూకా]. పుట్టకోట. ఆరాడకోట, మెండికోట [3], రసంకోట, సునకోట, పెంటకోట, వెన్నెలకోట [అన్నీ పాడేరు, తాలూకా] చింతపల్లి తాలూకాలో 'పాకలు' కొన్ని: జాజిపాకలు, కొత్తపాకలు, రాజపాకలు, బూరుగుపాకలు, దిగువకలు, జంగం పాకలు, చెరుకుపాకలు [పా] సామాన్యంగా, 'వీధి' అనేది ఒక ఊరిలో భాగంగా భావిస్తాం కాని ఈ ప్రాంతంలో 'వీధి' గ్రామ నామాంత్యంగా ఉన్నది. ఉదా॥ బండవీధి, బురదవీధి, గూడెంవీధి [అన్నీ చింతపల్లి తాలూకా]. పాడేరు తాలూకాలో బండ వీధులు మూడు, చెరువు వీధులు మూడు, మెట్ట వీధులు అయిదు, చింతల వీధులు 9 ఉన్నవి. ఒక్క 'బొడ్డపుట్టు' అని పేరుగల గ్రామాలు పాడేరు తాలూకాలోనే ఇరవై రెండు ఉన్నవి. పట్టియే అపభ్రంశం చెంది పుట్టు అయి ఉండును,59 ఇది భూమి కొలతలో ఒక ప్రమాణం. ధాన్యమును కొలిచెడి ప్రమాణం.60 మంత్రపుట్టు, పురోహితులపుట్టు, బంటోత్రుపుట్టు, జంగంపుట్టు, దాసరిపుట్టు మొ॥ గ్రామములుండుట బట్టియివి ఆయాకాలముల, వృత్తుల వారి కొరకు ఏర్పడిన గ్రామములని భావించవలసి ఉన్నది.

అపభ్రంశములు

ఉదా : అనకాపల్లి తాలూకాలో అతి ప్రాచీనమైన గ్రామము శంకరం బౌద్ధ భిక్షువులకు స్థానమైన సంఘారామమునకిది వికృతి.61 సింహాచలమున్న గ్రామ ప్రస్తుత నామము అడివివరము [వి]. సింహాచల దేవాలయ శాసనములలో నీ గ్రామనామము 'అధివరము'గా కానవచ్చును. 62 అధి [కన్నడ = అడి] వరమనగా కొండ దిగువనున్న గ్రామమని అర్థము చెప్పబడినది.63

పై వివరణలవలన ఈ జిల్లా గ్రామనామములపై స్థానికపాలక వంశములైన తూర్పుగాంగ, ఎలమంచిలి చాళుక్య, మత్స్యవంశ, విజయనగర, పూసపాటి మొ॥ రాజులనామ ప్రభావము ఎక్కువగా కానవచ్చును. ఈ ప్రాంతముపై విజయ యాత్రలు సాగించిన తూర్పు చాళుక్య, విష్ణుకుండిన, రెడ్డి విజయనగరాది పాలకుల ప్రభావము తాత్కాలికముగానే గ్రామనామములపై వాటి ప్రభావ

మును అంతత మాత్రముగనే నున్నది. గ్రామనామములు మధ్యమ దక్షిణ కళింగములకు గల చారిత్రక అనుబంధమును సూచించు చున్నవి. తామ్రశిల్ప శాసనములు, సాహిత్యము ప్రధాన ఆధార ములుగా ఈ విషయముపై ఇంకను విస్తృత శాస్త్రీయ పరిశోధన జరుగవలసిన అవసరమును ఈ ప్రాథమిక పరిశీలన గుర్తించు చున్నది.

అధోజ్ఞాపికలు

1. సౌలభ్యము కొరకు కుండలీకరణములలో తాలూకాల పేర్లు సంక్షిప్తముగా పేర్కొనబడినవి. ఆ సంజ్ఞ వివరణ : అ= అనకాపల్లి; ఎ = ఎలమంచిలి; చిం = చింతపల్లి; చో = చోడవరం; న = నరసాపట్నం [నర్సీపట్నం]; పా = పాడేరు; భీ = భీమునిపట్నం; వి = విశాఖపట్నం.
2. డి. భాస్కరమూర్తి 'లేట్ స్టోన్ ఏజ్ కల్చర్ ఇన్ విశాఖ పట్నం డిస్ట్రిక్ట్'; [మల్లంపల్లి సోమశేఖరశర్మ కమ్మెమొరేషన్ వాల్యూమ్, హైదరాబాదు, 1976]
3. భావరాజు వెంకటకృష్ణారావు 'ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ' [మద్రాసు, 1942] పే. 67, 68, 69
4. సి. పి. [కాపర్ ప్లేట్ = తామ్రశాసనము] నెం. 14 ఆఫ్ 1908-9 పంక్తులు 27-28
5. ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ, పు. 464
6. ఎపిగ్రాఫికా ఇండికా VII, పే 133-36 & డా॥ నేలటూరి వెంకటరమణయ్య విష్ణుకుండినులు, [హైదరాబాదు, 1973] పే. 56
7. ఆంధ్రదేశచరిత్ర భూగోళ సర్వస్వము, రెండవ సంపుటము [హైదరాబాదు, 1974] పు. 485
8. పైది. పు. 47-4[illegible]
9. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్ [యస్. ఐ. ఐ] వాల్యూమ్ VI నెం. 770
10. భూగోళ సర్వస్వము, రెండవ సంపుటము, పే. 48
"ఴ" అను విశిష్ట వర్ణము ప్రాచీనాంధ్ర భాషయందు విరివిగా కానవచ్చును. ద్రావిడ భాషలన్నింటికిని సాధారణమైన ఈ ధ్వని కాలక్రమమున తెలుగులో నశించినది. దీని స్థానమున 'ల', 'డ', 'శ' మున్నగు ధ్వనులు బయలుదేరి 'ఴ' వర్ణమును అస్తమింప జేసినవి" (పైది పే. 485).
11. డా॥ సి. వి. రామచంద్రరావు, ఎడ్మినిస్ట్రేషన్ అండ్ సొసైటి ఇన్ మిడీవల్ ఆంధ్ర [ఎ. డి. 1038-1538] అండర్ ది లేటర్ ఈస్టరన్ గాంగాస్ అండ్ ది సూర్య వంశ గజపతీస్ [అంగ్లం]. నెల్లూరు, 1976], పే. 124
12. ఎన్. రమేశన్ [సం] కాపర్ ప్లేట్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ మ్యూజియం, వాల్యూమ్ I [హైదరాబాదు, 1962] పే. 133
13. ఆర్. సుబ్రహ్మణ్యం. దిసూర్యవంశగజపతీస్ ఆఫ్ ఒరిస్సా [ఆంధ్ర యూనివర్సిటీ వాల్తేరు, 1957], పే. 141
14. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము [హైదరాబాదు, 1976], పే. 381
15. డా॥ నేలటూరి వెంకటరమణయ్య, ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, [మద్రాసు, 195[illegible]], పే. 64, 70
16. రాళ్ళబండి సుబ్బారావు [సం] కళింగదేశ చరిత్ర, పు. 28[illegible]
17. పైది. ఆంధ్రప్రదేశ్ దర్శిని, [విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1976], పు. 1010
18. కొల్లూరి సూర్యనారాయణ, 'ఎలమంచిలి చాళుక్యులు', భారతి, సెప్టెంబరు, 1980
19. డా॥ బూదరాజు రాధాకృష్ణ, ప్రాచీనాంధ్రశాసనాలు [క్రీ॥ శ॥ 1100 వరకు], హైదరాబాదు, 1971], పు. 246 & యస్. ఐ. ఐ. VI నెం. 919, 921
20. ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, పే. 71
21. కళింగదేశ చరిత్ర, పు. 291
22. యస్. ఐ. ఐ. VI, నెం. 632 ఎ. ఆర్. ఇ. నెం. 214 ఆఫ్ 1899

23. భారతి, సెప్టెంబరు, 1980, పు. 28

24. ఆంధ్రపత్రిక, 1925. కొల్లూరి సూర్యనారాయణ, 'కావ్యాలంకార చూడామణి యందలి చారిత్రకాంశములు', భారతి, డిసెంబరు, 1981, పు. 61 నందు ఉటంకించబడినది.

25. డా॥ ఎన్. రమేశన్, విశాఖపట్నం (రివైజ్డ్) డిస్ట్రిక్ట్ గజిటీరు (ఆంగ్లం) (హైదరాబాదు, 1979). పే. 242

26. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము. ఎనిమిదవ సంపుటము హైదరాబాదు. 1971) పు. 260

27. విజాపురపు వేంకట కోదండరావు పంతులు (అను). విశాఖ పట్టణము జిల్లా వృత్తాంత సంగ్రహము. (విశాఖ పట్నం. 1889). పు. 1

28. యస్. ఐ. ఐ. IV. నెం. 1012 (ఎ. ఆర్. నెం. 187/1893

29. పైది. X. నెం. 651 (ఎ. ఆర్. నెం. 99/1909)

30. అల్లాడి వైదేహి, ఆంధ్రుల సాంఘికచరిత్ర-మధ్యయుగము [హైదరాబాదు, 1978], పుట 17.

31. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము [హైదరాబాదు, 1971,] పుట 221

32. యస్. ఐ. ఐ. VI, నెం. 1040

33. ఈ గ్రామము పురుషోత్తమ గజపతి పేరుననే వెలసినదని ఖచ్చితముగ నిర్ణయించలేము.ఉదాహరణకు జంతర్నాడు, వీరకూటం శ్రీసార్వచాళుక్య పాలకులలోను పురుషోత్తమ నామధేయులున్నారు. సింహాచలస్వామికి దానము సమర్పించిన పురుషోత్తము నాయకుని [శ॥ 1209_S. I. I.VI, నెం. 896] వంటివారుకూడ ఈ గ్రామ నిర్మాతలు కావచ్చును.

34. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 45_46

35. మల్లంపల్లి సోమశేఖరశర్మగారి 'హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్స్' [పుట 187]లో చెప్పబడినట్లు సింహాచల మందలి శ॥1313 సం॥ నాటి శాసనములోనున్న 'అనవేమ నగరు' సింహాచల పరిసర ప్రాంతములోనిదికాదని, ఆ దానమిచ్చిన వ్యక్తి అనవేమనగరకు చెందిన వాడు మాత్రమేనని. "డా॥ కె. సుందరం, ది సింహాచలం టెంపుల్, [సింహాచలం, 1969] అనుబంధం_2

36. మల్లంపల్లి సోమశేఖరశర్మ, ది హిస్టరి ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్స్ [వాల్తేరు, 1948], పుట 464

37. వేటూరి ప్రభాకరశాస్త్రి, చాటుపద్య మణిమంజరి, 162

38. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 179_182

39. నేలటూరి వెంకటరమణయ్య, శ్రీకృష్ణ దేవరాయలు, (హైదరాబాదు, 1972) పుట 87

40. కళింగ దేశ చరిత్ర, పుట 267

41. యస్. ఐ. ఐ. వాల్యూమ్, V, నెం. 1163 శ॥ 1206

42. పైది నెం. 1296 శ॥ 1160

43. టీ. పి. ఇం V, పుట 106

44. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 539

45. నందాపుర శిలా వంశీయులలో నొక బయ్యరాజు [15శ॥] కలడు.

46. యస్. ఐ. ఐ. V, నెం. 1170

47. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 213,214

48. భూగోళ సర్వస్వము, రెండవ సంపుటము, పుట 54_56

49. ఎస్. ఐ. ఐ. V, నెం. 1260

50. పైది నెం. 1184

51. "భీమునిపట్నం తాలూకాలో ఉన్న అనందపురమునకు నేటిపేరు అనందపురమని మరియొక పేరు." భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పుట 143

52. భీమునిపట్నం తాలూకాలోని అనందపురమందు తంత్యులూరి నారాయణ గజపతిరాజు శాసనములు ఉన్నవి. ఈ నారాయణ రాజుపేట ఈతని పేరున ఏర్పడుటకు కూడ అవకాశము గలదు.

53. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పుట 321
కవికొండల వెంకటసత్యన్నారాయణమూర్తి, విశాఖమండల చరిత్రము [కాకినాడ, 1927], పుట 312

54. విశాఖపట్నంజిల్లా వృత్తాంత సంగ్రహము, పుట 115

55. పైది పుట 116

56. పైది పుట 119
విశాఖపట్నం డిస్ట్రిక్ట్ గజిటీరు (రివైజ్డ్), పే. 236-37

57. తూమాటిదొణప్ప, ఆంధ్రసంస్థానములు సాహిత్యపోషణం, [వాల్తేరు, 1969] పుట 478

58. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి కథలు గాథలు, తృతీయభాగము, 'గ్రామనామాలు', పుట 502

59. డా॥ బూదరాజు రాధాకృష్ణ, 'ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట 389

60. "పూర్వము భూములను విత్తనముల వెదజల్లి పంట పండించు నాచారమే యుండెను .... ఎన్ని విత్తనములు చల్లుటకు దగిన భూమియో ఆ విత్తనముల కొలతనుబట్టి భూమికొలత యేర్పడెను. పుట్టెడు విత్తనములు వెదజల్లుటకు దగిన భూమికి పుట్టి లేక ఖండుక మనిపేరు." — కుందూరి ఈశ్వరదత్తు, శాసనశబ్దకోశము, (హైదరాబాదు, 1967), పుట 86

61. కళింగదేశ చరిత్ర, పుట 103

62. ఎస్. ఐ. ఐ. VI, నెం. 713, 902. 1142, ది సింహాచలం టెంపుల్, పే. 6,135 అధోజ్ఞాపికలు

63. శాసనశబ్దకోశము, పుట 10

చెలీ!

నీ వెంత కాదన్నా
నీ వేడి నిట్టూర్పే చెబుతోంది
నీ యెదక్రింద అగ్నిగోళాలు దాక్కున్నాయని

నీ కళ్ళు వెన్నెల్ని వర్షించినా,
నీ కురులే చెబుతున్నాయి
నీ తలనిండా చీకట్లేనని!

తెలీదు

పూలకి యౌవనం తప్ప
వృద్ధాప్యం తెలీదు.

ఈ మనిషికి స్వార్థం తప్ప
మరొకటి తెలీదు.

ఆరని దీపాలు

ఎందుకలా మాటిమాటికి
నీ కనురెప్పల్ని ఆర్పుతావు?
ఆర్పితే, ఆరే దీపాలా నీకళ్ళు?

నిశ్శబ్ద సంగీతం!

మూతలు పడుతోన్న కళ్ళతో
పారవశ్యాన్నందుతోంది ఆకసం—
ప్రకృతి నిశ్శబ్ద సంగీతాన్ని వింటూ!

చంద్రుడు నీళ్ళలో మునకలిడుతూ
చలికి తృళ్ళింత లిడుతున్నాడు.

ఆర్ద్ర హృదయంలా పారుతోంది యేరు.

దూరంగా—
అడవి కునికిపాట్లు పడుతోంది.

ఓ పూవు మేల్కొని,

తీయని శ్వాసని వదులుతోంది.

భూమిసైతం నిట్టూర్పు విడుస్తోంది
ఈ ఆనందం బరువును మోయలేక!

అవ్వా!

అదిగో!
వాళ్ళిద్దరూ కౌగిలించుకుంటున్నారక్కడ!
అందరి ఎదుటే!
అది చెట్టు! ఆమె లత!
వాడి మొరటు పెదాలపై ముద్దెట్టుకుంటోందామె!
ఆమె గులాబి! అతగాడు ముల్లు!
ఆ తల్లి అందరెదుటే ప్రసవిస్తోంది బిడ్డని!
ఆమె మొక్క, అది మొగ్గ!
అరరే! వాడు పట్టపగలే దాన్నెగరేసుకు పోతున్నాడు.
అది పరిమళం! వాడు సమీరం!
బాబోయ్! అది తలబాదుకుంటూ నవ్వుతోంది.
ఆమె ఝరి! అది రాయి!
అమ్మో! అది మొగుడు ఛస్తేంటే,
విటుడితో కులుకుతోంది.
అది సంధ్య! వాడు చంద్రుడు!
ఓ చెలీ! నీ చేయి నా కందివ్వు!
వాటిని పలకరించి వద్దాం!
పులకరింతలు తెద్దాం!

శ్రీ గన్ను కృష్ణమూర్తి

కలగూరగంప

పరాంతక చోళుని బెజవాడ శిలాశాసనము

మొదటి కులోత్తుంగ చోళుని పరిపాలనా కాలములో వేంగీ దేశమును పాలించిన రాజప్రతినిధులలో పరాంతక చోళుడొకడు. ఇతడు కులోత్తుంగ చోళునికి రాజేంద్రచోడి వలన కలిగిన కుమారుడు.[1] ఆంధ్రదేశము నందలి శాసనములలో నితడు చాళుక్య సింహాసన శ్రీనాథుడనియు, చాళుక్యవంశ తిలకుడనియు, రాజేంద్ర చోడదేవ తనూజుడనియు వర్ణించబడినాడు.[2] చక్రవర్తి యనియు, త్రిభువన చక్రవర్తియనియు నీతని బిరుదములు.[3] క్రీ. శ. 1111 నుండి క్రీ. శ. 1118 వరకు వేంగీదేశము నితడు పరిపాలించి నట్లు శాసనాధారములు కలవు.[4] ఈతని బెజవాడ శిలాశాసనము[5] తక్క మిగిలిన తెలుగు శిలాశాసనములన్నియు ద్రాక్షారామము[6] నందే కలవు. అవిగాక, ఒక తామ్రశాసనము కూడ నీతని కాలము నందీయబడినది.[7]

విజయవాడలోని కనకదుర్గకొండ క్రింది భాగము నందు లభించిన ఈ శాసనముపై పలువురు చరిత్రకారులు భిన్నాభిప్రాయములు వెలిబుచ్చిరి. ముఖ్యముగా కీ॥ శే॥ డా॥ ఎన్. వెంకట రమణయ్య[8] గారు, కీ॥ శే॥ డా. ఎన్. రమేశన్‌గారు[9], శ్రీమతి డా॥ వి. యశోదాదేవిగారు[10], కీ॥ శే॥ డా॥ బి. వి. క్రిష్ణారావు గారు[11] ఈ శాసనము పరాంతకచోళుని 5వ విజయ రాజ్యకాలమందును, మొదటి కులోత్తుంగుని 43వ రాజ్యకాలమందును, శక సంవత్సరము 1037 నందును ఈయబడినట్లుగా చెప్పిరి. కాని, గవర్నమెంటు ఎపిగ్రాఫిస్టు అభిప్రాయము పరిశీలించినచో పరాంతకుని ఈ శాసనము అతని 5వ రాజ్యకాలమునందును, సత్యాశ్రయ వంశమునకు చెందిన శ్రీ పెమ్మనడి దేవరయొక్క 46వ విజయ రాజ్యసంవత్సరము నందీయబడినది.[12] పెమ్మనడి దేవర అని చెప్పబడిన రాజు పశ్చిమ చాళుక్య రాజైన ఆరవ విక్రమాదిత్యుడుగా వారు అభిప్రాయపడిరి. చారిత్రిక దృష్టితో పరికించిన మరిన్ని ఆసక్తికరమైన విషయములు వెలుగులోనికి వచ్చునను వుద్దేశ్యముతో ఈ శిలాశాసనమును సమగ్రముగా పరిశీలించుటకు సంకల్పించితిని.

పరాంతకచోళుడు బెజవాడ శిలాశాసనమునందు త్రిభువన చక్రవర్తి, రాజసర్వజ్ఞుడని చెప్పబడియున్నాడు.[13] ఈ శాసనమున పరాంతకుని 5వ రాజ్యకాలము ప్రస్తావించబడినది. కాని మిగిలిన వేంగీరాజ ప్రతినిధులు అట్లుకాదు. ఒక్క రాజ రాజ ముమ్మడి చోడుడు[14] తప్ప మిగిలిన వారందరు తమతం డ్రియు, చక్రవర్తియు నైన కులోత్తుంగుని పరిపాలనాకాలమునే తమ శాసనములలో ప్రస్తావించినారు.[15] మరియును తక్కిన వేంగీరాజ ప్రతినిధుల శాసనముల వలెకాక ఇతని శాసనములు కొన్ని కులోత్తుంగచోడుని ప్రశస్తితో ఆరంభమగుచున్నవి.[16]

శాసనమునందలి విషయములు పరికించినచో శక సంవత్సరము 1037 నందు (క్రీ॥ శ॥ 1115) మహామండలిక బొద్దనకు బెజవాడ రడ్డికము ఇచ్చినట్లుగా చెప్పబడినది. శాసనము రెండో భాగము నందు ఈ బెజవాడ రడ్డికమును సత్యాశ్రయ వంశజుడైన త్రిభువన చక్రవర్తి శ్రీ పెమ్మనడి దేవుడు మహామండలిక భీమునికి 1046న ఇచ్చినట్లుగా చెప్పబడినది. అనగా శక సంవత్సరము 1043న బెజవాడ రడ్డికమును భీమునికిచ్చినట్లుగా స్పష్టమగుచున్నది. శాసనము చివరి భాగమున సంవత్సరములు రసోదధి వాయు పధే దుసంఖ్యగా చెప్పబడినది. అనగా, శక సంవత్సరము 0096 (క్రీ॥ శ॥ 1174) నందు ఈ శాసనము వ్రాయబడి యుండవచ్చును.

ఈ శాసనము పరిశీలించిన చరిత్రకారులందరును ఈ శాసనమును మొదటి కులోత్తుంగుని 16వ రాజ్య సంవత్సరముగా పేర్కొనిరి.[17] కాని ఆ యూహ సరికాదు. శాసనమునందెచ్చటను కులోత్తుంగ చోళుని పేరు చెప్పబడలేదు. సహస్రవర్షములు 46 అని శాసనమునందలి 26, 27వ పాదములలో స్పష్టముగా వ్రాయబడినది. కావున సత్యాశ్రయ వంశజుడైన పెమ్మనడి దేవర ఎవరో, అతడెందులకు బెజవాడ రడ్డికమును తిరిగి భీమనికి ఈయవలసి వచ్చినదో పరిశీలింతము.

కృష్ణాజిల్లాలోని ఎనమలకుదురు గ్రామమందలి శాసనము[18] నొకదానిని పరిశీలించినచో మహామండలిక బొద్దన విజయవాటీ పురమును చోడవంశరాజైన వేంగీదేశాధిపతి నుండి గైకొనినట్లును అది పిదప బొద్దన తమ్ముడైన భీమునికి కర్ణాటక రాజు ఇచ్చినట్లును చెప్పబడినది. ఈ శాసనమునందు వేంగీదేశపు రాజెవరో, కర్ణాటక రాజెవరో స్పష్టముగా లేనప్పటికిని పరాంతకుని శిలా

శాసనమునందు పొందు పరచబడ్డ విషయములను బట్టి ఆ వేంగీ దేశపురాజు రాజేంద్ర చోడదేవ తనూజుడైన పరాంతకుడు గాను, కర్నాటక రాజుగా చెప్పబడినది ఆరవ విక్రమాదిత్యుడుగాను విశదమగుచున్నది.

మొదటి కులోత్తుంగుని పరిపాలన క్రీ॥ శ॥ 1118 నాటికి పరిసమాప్తమైనది. అతని యనంతరము అతని కుమారుడైన విక్రమ చోడుడు రాజ్యాధికారమును చేపట్టెను. క్రీ॥ శ॥ 1124నకు గాని విక్రమ చోళుని శాసనములు ఆంధ్రదేశము నందెచ్చటను కానరావు. దీనిని బట్టి అతడు రాజ్యముచేయ మొదలిడిన కొలది సంవత్సరముల వరకు వేంగీదేశము అని క్లిష్టమైన సమస్యల నెదుర్కొనుచున్నట్లుగా తెలియుచున్నది. ముఖ్యముగా కళ్యాణి చాళుక్య రాజుల దండయాత్రలవలన వేంగీదేశము కొంతకాలము వారి అధికారములోనుండెను. బహుశ నట్టి సంధి కాలమునందు పశ్చిమ చాళుక్య రాజైన ఆరవ విక్రమాదిత్యుడు పల్లవ వంశజుడైన మహామండలిక భీమనికి బెజవాడ రడ్డికమును ఇచ్చియుండ వచ్చును. కులోత్తుంగ చోళునికిగాని, అతని కుమారుడైన విక్రమ చోళునికిగాని పెన్మనడిదేవర యను నామధేయములు లేవు. మరియును శాసనమునందు స్పష్టముగా "సత్యాశ్రయ వంశ్య చాలుక్యాభరణ" అని చెప్పబడినది.[19] కులోత్తుంగుని శాసనము[20] లన్నిటి యందును చోడకులశేఖర పాండ్యకులాంతక రాజకేసరి వర్మాన అని చెప్పబడినది. దీనిని బట్టి సూచిన ఆరవ విక్రమాదిత్యుడే పెన్మనడి దేవుడిగా బెజవాడ శాసనము నందు చెప్పబడిన త్రిభువన చక్రవర్తి అని స్పష్టమగుచున్నది.

శా స న పా ఠ ము

1. స్వస్తి శ్రీ సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజులు త్రిభువన చక్రవర్త్తిన
2. శ్రీ పరాంత్తికదేవర ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరంబులు ౫ గుసార్ని
3. హితకపక్షంబులు ౧౦౬ గు నేంటి మన్మథ సంవత్సరంబున రాజసర్వజ్ఞు
4. డు జననాథ పురంబున రాజ్యాభివర్ధన (క్షో) సుఖంబున (రా)జ్యంబు సేయు
5. చుణ్డి తన యన్వయ కాంపులైన వారి సకల పరమ వంశోద్భవ భారద్వాజ గోత్ర (క)
6. ట్వాంగధ్వజ వృషభలాంఛనకాంచీపురవరే.......పల్లవ కులతి
7. లక పాదాంబుజ సే (వి) త అన్నువ కామకుల....నోడి -
8. వపి సాహసాజ్ఞాన సంగ్రామ రామ........ చాలుక్య -
9. నంక్కకాల పరమణ్డల చూఅకాల పతి .... జముద్దై -
10. న శ్రీ మన్మహా మణ్డలిక బొ (ద్ద) న .... కల్లత్తిన
11. లోకత్తిన పల్లియల మింద బెజవా(డ) ....
12. ॥కంద॥ [రా] జేంద్ర చోడదేవ తనూజు....నరపాల సేఖ-
13. రునిచే రాజితయశు వేతరాజు....లు పాలు
14. [కు] చేత రాజమహేంద్ర చేనా పురంధర .... తా
15. ఖిల కీర్త్తిన [చే] బెజవాడ రడ్డికమును ....సలువత్తి
16. ప్రతి పన్నికలు ॥వ॥ విసేష పదార్థంబు .... హిమాస్పదు
17. లై మణ్డలిక బొద్దణునుం దమ్ము ....
18. [క]ంబు రాజ్యంబుసేసి మణ్డలిక బొద్దణ .... ట్టి కలుణ్డు
19. వి॥ అతని తమ్ముణ్డన్వయ వియత్తల మిత్రుణ్డసేష దిక్తట ఖ్యాత యశోత్తిన భీ[మ]
20. ణ్డు సుఖస్థితి రాజై యధ్విపేష్టిత క్ష్మాతల నాథులెల్ల నరిగాంపుల మాడ్కి—
21. న తీఋ వెట్ట మాందాత యయాతి వేణునిగ్రధప్మన జులట్లతి ప్రగల్భుండై —
22. గీ॥ పరమహీశులు భక్తులై బంప్పం బనులు సేయు చుణ్డం గ్గందపను
23. రస్మియునుం గామ్మచొ (చ్చిన)నచ్చాన తన యాజ్ఞసొ(చ్చి) వెలుంగు భూమి యెల్లను
24. బంగ్గిన భీమణ్డలే స్వస్తి సమస్త భువనాశ్రయ రాజాధిరాజ పరమే -
25. స్వర పరమ భట్టారక రవికుల తిలక సత్యాశ్రయ వం(స్య) చాలుక్యాభరణ

26. శ్రీత్రిభువన చక్రవర్తిన్ శ్రీమత్పెమ్మన్నడిదేవర దివ్య సహస్ర

27. వషన్ంబులు ౪౬ గుర్శాహి శ్రీవెంగిదేశ చాలుక్య.... క కాల పరము

28. ఙల చూలకాల పతిదేవ (గురు ద్విజ భక్తులైన) కుల మలజ

29. ముఙైన మహామణ్డలిక భీమ .... లకు మెచ్చి బెజవాడ

30. రడ్డి కంబు దయసేసిన ॥ర్విత్త॥ .... రంబులు రసోనిధి

31. వాయు పథేందు సంఖ్యగా .... స్బైజ

32. వాడ రడ్డికం బరిపుర భేదిరాజ పరమాత్మునిచేం బడస్ని్రవీం

33. ను ధరణి యునంబు రాసులు సదాగతి మార్గన్ము గల్గు నంత్రకును॥

పా ద పీ ఠి క

1. కావర్ ప్లేట్ నెం. 1; ఆర్. ఇ. ఎ. పి. ఆఫ్ 1965; ఎన్. రమేశన్ - స్టడీస్ ఇన్ మెడీవల్ డెక్కన్ హిస్టరీ, కాపర్ ప్లేట్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ది స్టేట్ మ్యూసియమ్, వాల్యూం III, 1972

2. ఎస్. ఐ. ఐ., వాల్యూం IV, నెం. 737; 1384

3. ఆదే. నెం. 73

4. ఆదే. నెం. 737, 1226

5. ఆదే. నెం. 737

6. ఆదే. నెం. 1214, 1226, 1269, 1270, 1275-ఎ, 1296, 1384

7. ఎన్. రమేశన్-స్ట.మె.డె.హి.

8. జె. ఒ. ఆర్., వాల్యూం XXV, పు-65, పరాంతక బైడా॥ ఎన్. వెంకటరమణయ్య

9. కాపర్‌ప్లేట్ నెం. 1, ఆర్. ఇ. ఎ. పి. ఆఫ్ 1965; ఎన్. రమేశన్ - స్టడీస్ ఇన్ మె. డె. హి. పుట 108, 109

10. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్. వాల్యూం XXI, పుట 83

11. బి. వి. కృష్ణారావు - ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి పు. 464

12. ఎ. ఆర్. ఇ. ఆఫ్ 1959-60, పుట 63

13. ఎస్. ఐ. ఐ., వాల్యూం IV. నెం. 737

14. ఎ. ఆర్. ఇ ఆఫ్. 1921-22. రెండవభాగము. పారా 6, పుట 97

15. ఎపిగ్రఫియా ఇండికా, వాల్యూం, VI నెం. 35. ఎస్. ఐ. ఐ., వాల్యూం I, నెం. 39. ఎ. ఇ. వాల్యూం 1, నెం. 10

16. ఎస్. ఐ. ఐ., వాల్యూం IV, నెం. 1226, 1296, 1384

17. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్., వాల్యూం XXI, పుట 83

18. ఎస్. ఐ. ఐ., వాల్యూం VI, నెం. 91

19. ఎస్. ఐ. ఐ., వాల్యూం నెం. IV; నెం. 737

20. అదే. నెం. 1281, 1284, 1288, 1290

డాక్టర్ ఎం. కృష్ణకుమారి

శ్రీశ్రీశ్రీ పరమహంస జి. ఎస్. బి. సరస్వతీ స్వామి

"మరుగున పడిన మహావ్యక్తి పరమహంస జి.ఎస్. బి. సరస్వతీస్వామి" అను శీర్షికతో 1981 డిశంబరు 'భారతి' లో, శ్రీ కె.వి.రమణారెడ్డిగారు ప్రచురించిన వ్యాసమున శ్రీ స్వామి వారిని గురించి విలువైన సమాచారమును నేటి లోకమున కందించి కృతకృత్యులైనారు.

శ్రీ రెడ్డిగారందించిన సమాచారమునకు అనుబంధము కాదగిన ఒకటి రెండంశములు కలవు.

దేశమునందంతటను ముందెప్పుడో ప్రారంభమై సాగుచుండిన విశ్వబ్రాహ్మణోద్యమమును కూడ శ్రీ సరస్వతీ స్వాములవారు ఎంతగానో ప్రోత్సహించి బలపరచిరి. ఇది సాధారణమగు విషయము కాదు.

శ్రీ స్వాములవారి "విశ్వబ్రాహ్మణ శబ్దార్థఖండన ముండనము" రచన కూడ అట్టిదే ! శ్రీవారు రచించిన గ్రంథములలో ముఖ్యముగా పేర్కొనదగినది. 1921 ఫిబ్రవరి 1 వ తేదీ "శ్రుతిధర్మ సంజీవని" పత్రికలో శ్రీ శివపురపు పాకయాజిగారు ప్రచురించిన 'విశ్వబ్రాహ్మణ శబ్దార్థ ఖండనము' -అను వ్యాసమునకిది సమాధానము. శ్రీ స్వాములవారు దీనిని, నాడు, గంజాము (నేడు శ్రీకాకుళము) జిల్లా సోంపేట నుండి వెలువడుచుండిన, 'పంచానన' పత్రికా సంపాదకులు కీ॥శే॥ సింహాద్రి వేంకట - నరసింహ మూర్తి గారికి ప్రచురణార్థము పంపిరి.

పత్రికలో ప్రచురించినచో తాత్కాలికముగానే పోవునని - సార్వకాలికముగా నుండదగిన దీనిని - 1924 సెప్టెంబరు 20 న శ్రీ వేంకట నరసింహమూర్తిగారు వారి 'పంచానన' ముద్రాలయమున ముద్రించి 'పంచానన' బుక్ డిపోనుండి పుస్తక రూపమున ప్రకటించిరి. ఆ ప్రతులు నేడు పూర్వగ్రంథాలయములలోను, అక్కడక్కడ వ్యక్తుల వద్దను కలవు.

"విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠము" దాని పునర్ముద్రణ ప్రయత్నము చేయుచున్నది.

శ్రీ ఎక్కోజు మాధవాచార్యులు

భీమకవి కాలము

వేములవాడ భీమకవి కాలనిర్ణయముతోపాటు అతని చరిత్రతో ముడివడిన మైలమ భీమనామును గురించి శ్రీ కొర్లపాటి శ్రీరామ మూర్తిగారు 'భారతి'లో ప్రచురించిన వ్యాస పరంపరలో వెలువరించిన అభిప్రాయములు కొన్ని వివాదాస్పదములుగా నున్నవి.

భీమకవి జన్మస్థానము తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురము తాలూకాలోని వేములవాడ అని, ఆ వేములవాడలోని భీమేశ్వరుడే దాక్షారామ భీమేశుడని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాసిరి. కీ. శే. జయంతి రామయ్య పంతులుగారు కవిజనాశ్రయ పీఠికలో భీమకవి కరీంనగర్ జిల్లాలోని లే(వే)ములవాడ గ్రామస్థుడని, అక్కడి రాజేశ్వరాలయమే భీమేశ్వరాలయమని వ్రాసిరి. రాజేశ్వరాలయమే భీమేశ్వరాలయమను పురాణ విషయము పూజ్యమని, నమ్మదగినదని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాసిరి. నిజమే. కాని అది మాత్రమే భీమకవి కరీంనగర్ జిల్లావాడు కాదనుటకు ప్రమాణము కాదు.

కరీంనగర్ జిల్లాలోని వేములవాడకు లేములవాడ అను పేరున్నది. 'లేములవాడ భీమ ! భళిరే ! కవిశేఖర సార్వభౌమ !' అను చాటువును ఉదాహరించుచు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'ప్రబంధరత్నావళి' పీఠికలో 'ఈ పద్యమున లేములవాడ యనియె కలదు. తక్కిన భీమకవి చాటువు లన్నిటిలో(గూడ లేములవాడ యను పాఠమున్నది' అని వ్రాసిరి.

15వ శతాబ్ది ఉత్తరార్ధమున గల తెలంగాణా కవి కొలని గోపరాజు తన 'సింహాసన ద్వాత్రింశిక'లో భీమకవిని ఒక కంద పద్యమున నుతించినాడు.

లేములవాడక శుచియై
లేములవాడం జరించు లేములవాడం
దామెజసిన భీముని నుత
భీముని బలభీము విహిత భీమునిఁదలంతున్. (1-11)

సింహాసన ద్వాత్రింశికకు లభించిన రెండు వ్రాతప్రతులలో ఒకదానిలో 'లేములవాడ' అని కలదని ఆ పాఠమే ముద్రితప్రతిలో గ్రైకొనబడినది. ప్రాచీనాంధ్ర కవులలో భీమకవిని ప్రత్యేకముగా ఒక పద్యమున నుతించినవాడు గోపరాజు మాత్రమే. పెద్దలను తప్పులు పట్టు కుబుద్ధి 'భీమన పద్యమున్నఁ గమ్రబ్రీతి వహించుచు మేలుమేల'ను నని కూడ గోపరాజు చెప్పినాడు (1-18). భీమన కవిత్వ విషయమై ఈరీతిగా మరెవ్వరు చెప్పలేదు. ఇంతేకాక గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో 13 యతులను చెప్పిన సందర్భమున భీమకవి పద్యములను అనుకరించినాడు.

భీమన :

పోలఁగ పువుబుభులకుమూ
పోలికవడి శీలముల్లమున కెలయనఁగా
శీరం బల్లం బసఁగా
భూలోకం బమరలోకమున కెనయనఁగన్. (నం-73)

గోపరాజు :

పోలఁగ పువుబుభులకుమూ
పోలిక వడి యనఁగ నంత్యమున యతిమీఁదం
దేలి బుకారము పట్లను
భూలోక సురేంద్ర యోగ్యముగఁ జనుదెంచున్. (4-203)

భీమకవిపై గోపరాజింత అభిమానమును ప్రదర్శించుటకు గల కారణము ఇరువురు ఒకే ప్రాంతీయులు కావటమే. భీమకవి చాటువులలో పేర్కొనబడిన చాళుక్య చొక్క నృపాలాదులు రామగిరి దుర్గముతో సంబంధము గలవారు. ఈ రామగిరి కూడ కరీంనగర్ జిల్లాలోనిదే. కనుక భీమకవి జన్మస్థానము కరీంనగర్ జిల్లాలోని వేములవాడే కాని గోదావరి మండలములోని గ్రామము కాదు.

భీమకవి తాను 'దక్షారామ భీమేశనందనుడన్' అని చెప్పుకొనిన దానిని గురించి విచారింతము. భీమకవి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ నివాసి అయినప్పటికి శివభక్తుడగుటవలన వివిధ శైవ క్షేత్రముల సందర్శించి యుండును. దక్షారామమందలి భీమేశుని భక్తుడై 'దక్షారామభీమేశనందనుడన్' అని చెప్పుకొని యుండును. పాల్కురికి సోమనాథుడు బసవని భక్తుడై 'బసవని పుత్రుండ నని చెప్పుకొనినాడుగదా! 'శరనుమా మాతా పితారుద్రా' అని గదా శివ భక్తుల నమ్మకము. గోదావరి మండలములోని వేములవాడలో వెలసిన భీమేశ్వరుడు 'దక్షారామభీమేశ్వరుడే అగును' అని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాయుట ప్రమాదము. కవిజనాశ్రయములోని 'వేములవాడను వెలసిన భీమేశ్వరు కరుణగల్గు భీమసుకవి' అను పద్యము ప్రక్షిప్తము కాదనుటకు బలమైన ప్రమాణములు లేవు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాము పరిశీలించిన సుమారు 40 కవిజనాశ్రయ తాళపత్ర ప్రతులలో ఈ అవతారికా పద్యములు లేవని వ్రాసిన విషయమును ముఖ్యముగ గమనింపవలసి యున్నది.

ఇక శ్రీరామమూర్తిగారు వివరించిన మధ్యాక్కర, క్రౌంచపద పద్యముల గురించి రెండు మాటలు.

మధ్యాక్కరను అయిదవ గణాదిని యతి స్థానముగా నన్నయ ప్రయోగించినాడు. ఎఱ్ఱాప్రెగడ నాల్గవ గణాదినే యతిని నిల్పినాడు. కవిజనాశ్రయకర్తతోపాటు లాక్షణికులందరూ నాల్గవ గణాదినే యతి స్థానముగా నిర్ణయించినారు. ఎఱ్ఱాప్రెగడ రచనకే కవిజనాశ్రయకర్త లక్షణము చెప్పినాడు కనుక కవిజనాశ్రయము ఎఱ్ఱన తరువాతి రచనయని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాసిరి. ఇక్కడ రెండు విషయములు స్పష్టము కావలసి యున్నవి.

1. నన్నయభట్టు అరణ్య పర్వశేషమును 'తద్రచనయకా' రచించిన ఎఱ్ఱన మధ్యాక్కరను నన్నయకన్న భిన్నమార్గమున వ్రాయుటకు గల కారణము.

2. ఎంతో ప్రామాణికుడైన నన్నయ రచించిన మధ్యాక్కరకు ఏ లాక్షణికుడు నన్నయ చెప్పిన యతిని నిర్దేశించక పోవుటకు గల హేతువు.

"మధ్యాక్కర పద్యమునందు అయిదవగణాది యతిమైత్రి కంటే చతుర్థగణాది. యతిమైత్రి సరసము" అన్న శ్రీ శ్రీరామమూర్తి గారి మాట సరికాదు. అయితే, ఎఱ్ఱాప్రెగడ, లాక్షణికులు సంస్కరించి సరసంగా తీర్చిదిద్దిన మధ్యాక్కరను ఏ ప్రాచీనకవి రచించకపోవుటకుగల కారణమేమి? కవిత్రయములోని నన్నయ, ఎఱ్ఱన ఆ పద్యమునకు యతి స్థానమును చెరియొకరీతిగా నిర్ణయించుటచే ఆ పద్యరచనలో ఒక సంప్రదాయ మేర్పడలేదు. కనుకనే కవిత్రయానంతర కవులు మధ్యాక్కరను రచించలేదు లాక్షణికుల మతమును వారంగీకరించలేదు.

క్రౌంచపదమును ప్రాచీన కవులు తలకొక రీతిగా వ్రాసిరి. నన్నెచోడుడు ప్రాసయతిని పాటించి, 11, 19 అక్షరములకు ప్రత్యేక యతిని సమకూర్చినాడు. సోమనాథుడు ప్రాసయతిని, ఆద్యక్షరముతో 11, 19 అక్షరాలకు యతిని కూర్చి అంత్యానుప్రాసతో రచించినాడు. ఎఱ్ఱన ప్రాసయతిని పాటించక ఆద్యక్షరముతో 6, 11, 19 అక్షరములకు యతిమైత్రిని గూర్చి అంత్యానుప్రాసతో రచించినాడు. తిక్కన పద్యమున అంత్యానుప్రాసలేదు. అది ఇతర లక్షణములలో సోమనాథుని పద్యమువలె ఉన్నది. లక్షణకర్తలలో భీమన, పెద్దన, అనంతుడు ప్రాసయతిని, 1, 11, 19అక్షరములకు యతిని చెప్పగా అప్పకవి ప్రాసయతిని చెప్పలేదు.

లక్షణకర్తలు పూర్వకవుల ప్రయోగముల ననుసరించేకాక వారి వారి యిష్టానుసారముకూడ లక్షణములను నిర్దేశించిరి. అంతేకాక లాక్షణికులు కొందరు తాము రచించిన గ్రంథములలోని లక్ష్యములకు సైతము లక్షణములను నిర్దేశించలేదు. కనుక కవిజనాశ్రయములోని మధ్యాక్కర లక్షణము మాత్రము ఎఱ్ఱన ప్రయోగముతో సరిపోయినంత మాత్రమున అది ఎఱ్ఱన తర్వాతి రచనయని నిర్ధారించుట ప్రమాదము.

భీమకవి చెప్పిన 'గరళపు ముద్ద లోహ'మను చాటుపద్యములోని 'పట్టుకార్లు' శబ్దము అన్యదేశ్యమని, తెలుగుభాషలో అన్యదేశ్యములు 13వ శతాబ్ది ఉత్తరార్థమునుండి ప్రవేశించినవి గనుక 'పట్టుకార్లు అను పదము ప్రయుక్తమైన పద్యము రచనాకాలము పదునాల్గవ శతాబ్ది కావలయును' అని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాసిరి. పట్టుకారు శబ్దము దేశ్యముగానే నిఘంటువులలో చూపబడినది. ఈ శబ్ద ప్రయోగము భీమకవి కాలనిర్ణయమునకు తోడ్పడునది కాదు.

కళింగ గంగుకు సంబంధించిన చాటువులలోగల 'మీనమాసము'ను గూర్చి ప్రస్తావిస్తూ శ్రీ ఆరుద్రగారు "రాజ రాజ నరేంద్రుని కాలంలోనూ, అటు తరువాత కొంతదాకానూ మన

దేశంలో సౌరమానం ప్రచారంలో ఉండేది. భీమన సౌరమానం ప్రచారంలో ఉన్నప్పటి వ్యక్తేనని మనం నికరంగా తేల్చుకోవచ్చు" అని వ్రాసిరి (సమగ్రాంధ్ర సాహిత్యం 1-194). భీమకవి 14వ శతాబ్ది ఉత్తరార్ధమువాడైన అప్పటివరకు తీరాంధ్రంలో సౌరమానం ప్రచారంలో ఉన్నదా ?

'రాయలగెల్చి' అనగా విజయనగర రాజునే గెలిచి అనే అర్థము చెప్పుకొనవలసిన అవసరం లేదు. శత్రురాజుల గెలిచి అని కూడ చెప్పవచ్చును గదా ! "ఈ రాయలు కోన ఇమ్మడి పోతరాజు పెద్దన్నగారయిన రాయలని చాగంటి శేషయ్యగారి అభిప్రాయం." (స. ఆ. సా. 1-194)

నృసింహ పురాణములోనిదని చెప్పు పద్యము శ్రీ శ్రీరామమూర్తిగారన్నట్లు 'భీమకవి కాలము నిర్ణయించుటకు అసమర్థము.'

ఇక మిగిలినవి పూసపాటివారి సీసమాలిక, మైలమ భీమనపై గల చాటువులు.

పూసపాటివారి సీసమాలికలో చెప్పబడిన

1. 'మాధవవర్మ కాలము ప్రామాణికము కాదు.'
2. 'వత్సవాయ గృహనామకారణము ప్రామాణికముకాదు.'
3. 'వత్సవాయ బహుమాన స్వీకార కాలమును ప్రామాణికము కాదు.'
4. 'మాధవవర్మ పూసపాటి పుర నిర్మాణాదికమును ప్రామాణికము కాదు.'

అని శ్రీ శ్రీరామమూర్తిగారు సెప్టెంబరు 'భారతి'లో నిర్ధారించినారు. కాని అదే సీసమాలికలో వత్సవాయి రాజ వంశానికి మూలపురుషుడుగాను, వేములవాడ భీమకవి రామగోపాల చరితమును అంకితము పుచ్చుకొన్నవాడుగాను, వత్సవాయిని చంద్రవర్మచే క్రీ. శ. 1175లో కాన్కగా పుచ్చుకొన్నవాడుగాను చెప్పబడిన దానరాజును గూర్చి వ్రాస్తూ దానరాజు అనునది పేరు కావలసిన ఆవశ్యకములేదు, "దానకర్ణుడైన రాజు దానరాజు కాగలడు" అని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాయుట విచారకరము. వత్సవాయి తిరుమలరాజు 'మహీసురేంద్ర మందిరములు రత్నధనపూర్ణములు' చేసి దానరాజైనాడని శ్రీరామమూర్తిగారు వ్రాసిరి. ఈ ప్రమాణము ననుసరించి ప్రాచీన రాజులలో దానరాజు కాని రాజెవరూ ఉండరు. నిజముగా వత్సవాయి తిరుమలరాజు దానరాజుగా ప్రసిద్ధి చెంది యుంటే ఏనుగు లక్ష్మణకవి ఆ విషయమును చెప్పక విడువడు.

సీసమాలికలోని దానరాజు, చంద్రవర్మ అనువారు చారిత్రిక పరీక్షకు నిలబడక పోవచ్చునని శ్రీ ఆరుద్ర వ్రాసిరి. దానరాజును చారిత్రిక వ్యక్తిగా చూపటానికి శ్రీ శ్రీరామమూర్తిగారు చెప్పిన సమర్థన హాస్యాస్పదము. దానకర్ణుడైన రాజు వందిమాగధులకు 'దానరాజు' కావచ్చునేమో గాని చరిత్రకారులకు కాడని మనవి.

భీమకవి రామగోపాల చరితమును వ్రాసి దానిని దానరాజు కంకితమిచ్చినట్లు చెప్పబడిన సీసమాలికలోని విషయమును శ్రీ శ్రీరామమూర్తిగారు పూర్తిగా విశ్వసించలేదు. కాని పూసపాటి వారి సీసమాలిక రాచిరాజు కృతమే కావచ్చునని, శ్రీ ఆరుద్ర అభిప్రాయ పడినట్లు కూటసృష్టి కాకపోవచ్చునని విశ్వసించినారు. దీనికి కారణము దానరాజు ప్రభువు భీమనృపాలుడే మైలమ భీముడను శ్రీ శ్రీరామమూర్తిగారి నమ్మకమే, ఈ మైలమభీమున మీదనే భీమకవి చాటుపద్యములు చెప్పినది. ఆ చాటుపద్యములలో మైలమ భీమన అను సంబోధనతోపాటు ఏఱువభీమ, చిక్కభీమ, భండనభీమ అను సంబోధనలుగలవు. శ్రీ శ్రీరామమూర్తిగారు ఏఱువ భీముడు 13వ శతాబ్ది మధ్యభాగము వాడని, చిక్కభీముడు 1 వ శతాబ్ది పూర్వార్ధములోనివాడని, భండన, మైలమభీము లొకరేయని తెలిపిరి. మైలమభీముడు భక్తిరాజు కుమారుడని నిర్ణయించిరి. భక్తిరాజు కుమారుడు భీముడే కాని అతని తల్లి పేరు ఎక్కడను చెప్పబడలేదు. శ్రీ శ్రీరామమూర్తిగారు భక్తిరాజు కొడుకైన భీముని తల్లి పేరు 'మైలమాంబ కావచ్చును' అని ఊహించి ఎంతో చరిత్ర రచించారు.

సాధారణముగా ఒక వ్యక్తి పేరు తండ్రి పేరుతోనో, వంశము పేరుతోనో చెప్పబడుట సహజము. చరిత్రలో ఒక వ్యక్తి తల్లి పేరున ప్రఖ్యాతుడైనపుడు ఆ తల్లి ఎంతో ప్రసిద్ధి గలదై యుండనిదే అతని కాపేరు రాదు. 'మైలమ భీమన' అని మైలమాంబకొడుకు భీముడు చెప్పబడినప్పుడు ఆ మైలమాంబ ఎంతో ప్రసిద్ధి చెందిన వ్యక్తి కావలసియున్నది. భీముడను వ్యక్తి కనబడగానే అతని తల్లి పేరు 'మైలమాంబ కావచ్చును' అని ఊహించి అతనినే మైలమ భీమునిగా చరిత్రీకరించటము తగనిపని.

పూసపాటి తమ్మరాజు 'కృష్ణవిజయము' అను గ్రంథము నుండి శ్రీ శ్రీరామమూర్తిగారు ఉదాహరించిన పద్యములలో దేవవర్మ, మైలమాంబల కుమారుడొకడు చెప్పబడినాడు. అతని పేరు భీమరాజు. అతను 1. చిక్కభీముడని 2. మైలమభీముడని 2. భండన భీముడని 4. ఏఱువ భీముడని 5. బిరుదు మగడని 6. పరిచ్ఛేది అని ప్రసిద్ధి వహించినట్లు కృష్ణవిజయమునందే చెప్పబడినది. ఈ ప్రసిద్ధులలో మైలమభీముడు, భండన భీముడు అనునవి

తప్ప మిగిలినవి 'నిజముకాదు' అని శ్రీ శ్రీరామమూర్తిగారు నిర్ణయించిరి. దీనినిబట్టి కృష్ణవిజయములోని పద్యముల ప్రామాణికత తేటతెల్లమగుచున్నది.

శ్రీ శ్రీరామమూర్తిగారు, భక్తిరాజు కొడుకైన భీమరాజే కృష్ణవిజయములో చెప్పబడిన దేవవర్మ కొడుకైన భీమరాజని ఊహించుట చాలవింతగనున్నది. పైగ "భక్తిరాజు అసలుపేరు కామరాజు. పూర్తిపేరు కామదేవచోడుడు. దేవవర్మ తాతపేరు మాధవవర్మ. కామదేవచోడ నామధేయములోని దేవశబ్దము, మాధవవర్మ నామధేయములోని వర్మ శబ్దము కలిసి దేవవర్మ నామధేయము కాలక్రమమున కల్పితము కావచ్చును" అని శ్రీ శ్రీరామమూర్తిగారి వంటి చరిత్రకారులు వ్రాయుట నేమనవలెనో తెలియకున్నది. పై పద్ధతిలో ఎన్నిపేర్లయినను సృష్టించవచ్చును. శ్రీ శ్రీరామమూర్తిగారు దానరాజును, దేవవర్మను సృష్టించిన తీరు హాస్యాస్పదముగా నున్నది. వేరే వ్రాయవలసిన పనిలేదు.

శ్రీ శ్రీరామమూర్తిగారు ఇంత అవస్థపడుటకుగల కారణము భీమకవి 14వ శతాబ్ది ఉత్తరార్ధము వాడని నిరూపించదలచుటే. భీమకవి మైలమభీమునిపై పద్యములు చెప్పినాడుగనుక మైలమభీముని కాలమే భీమకవి కాలమగును. పూసపాటి తమ్మరాజు కృష్ణవిజయమే వారికి ప్రమాణ గ్రంథము. అందే భీమన మైలమాంబ కొడుకని చెప్పబడినది. కృష్ణవిజయములో చెప్పబడిన ఎన్నో విషయములు నమ్మదగినవి కావని శ్రీ శ్రీరామమూర్తిగారే నిరూపించినారు. అయినప్పుడు భీమన తల్లిపేరు విషయములో మాత్రము ఆ గ్రంథము ప్రమాణమైనదా?

పశ్చిమ చాళుక్యరాజైన ఆరవ విక్రమాదిత్యుని నుంచి క్రీ. శ. 1076లో కొలనిపాకను, పానుగంటిని పరిపాలించే అధికారమును పొందిన ఏఱువ తొండయరాజుకు 'మైలమాంబ' అను పట్టమహిషి గలదు. ఆమె శాసనములు క్రీ. శ. 1121 నాటిది దాక్షారామములోను, క్రీ. శ. 1124 నాటిది పానుగల్లులోను గలవు. పానుగంటి శాసనమును నుంచి ఏఱువ తొండయ, మైలమాంబలకు ఉదయనచోడ, భీమచోడ, గోకర్ణచోళులను పుత్రులుగలరని, వారిలోని భీమచోడుడే ఏఱువభీముడని, మైలమ భీముడని ప్రసిద్ధి చెందినట్లు తెలియుచున్నది (చూ. భారతి మే. 73) ఇతనినే మొదటి ఏఱువ భీమునిగా శ్రీ శ్రీరామమూర్తిగారు పేర్కొనినారు.

పానుగంటి శాసనములో ఏఱువ భీముని తల్లిపేరు మైలమాంబ అని ఉండగా ఏఱువ భీమునికి 5వ తరము వాడయిన అన్నదేవచోడుని రామహేంద్రవర శాసనములో మొదటి ఏఱువ భీముని తల్లిపేరు అన్నమాంబ అని చెప్పబడినది. (చూ. భారతి మే. 73) శ్రీ శ్రీరామమూర్తిగారు అన్నదేవచోడుని శాసనములు ఆధారముగా మొదటి ఏఱువ భీముని తల్లిపేరు అన్నమాంబ అని విశ్వసించి, భక్తిరాజునే దేవవర్మగా చేసి, భక్తిరాజు కుమారునిగా శివలీలావిలాసములో చెప్పబడిన భీమరాజే, దేవవర్మ-మైలమాంబల కుమారుడుగా కృష్ణవిజయములో చెప్పబడిన భీమరాజని నమ్మి, అతనే మైలమభీముడని నిర్ణయించినారు. మొదటి ఏఱువ భీముని సమకాలీన శాసనములు అతని తల్లిపేరును మైలమాంబ అని స్పష్టపరచినపుడు దానిని విశ్వసించకుండుటకు కారణము కన్పించదు.

కనుక మొదటి ఏఱువ భీముడే మైలమ భీముడు. ఇతనికి క్రీ. శ. 1105 నాటికే పెక్కురు భార్యలు గలరు. ఇతను క్రీ. శ. 1150 వరకు జీవించి యుండవచ్చును. ఈ మైలమ భీమునిపై పద్యములు చెప్పిన భీమకవి క్రీ. శ. 12వ శతాబ్ది మధ్యభాగము వాడని గట్టిగ చెప్పవచ్చును.

పూసపాటివారి సీసమాలికను ప్రచురించిన శ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారే పూసపాటివారి మూలపురుషుడైన మాధవవర్మ రచించిన 'జనాశ్రయ'మనే సంస్కృత ఛందస్సును మైలమభీమన పోషణలో ఉండే భీమకవి కవిజనాశ్రయమను పేరున తెనిగించినాడని వ్రాశారని శ్రీ ఆరుద్ర వ్రాసిరి. (స. ఆ. సా 1 20) శ్రీ ఆరుద్ర ఈ సీసమాలిక 'సాహిత్య పోర్జరీ' అని అభిప్రాయపడిరి. ఈ సీసమాలిక కూడా శ్రీకృష్ణదేవరాయల కుమార్తె మోహనాంగి వ్రాసినట్లుగా వ్రాయబడిన 'మారీచీపరిణయము' వంటిదేనేమో.

శ్రీ సూర్యదేవర రవికుమార్

"సాయి" - పదార్థం

సాయిబాబా పేరు వినని వారుండరు. షిర్డీ సాయిబాబా, పుట్టపర్తి సాయిబాబా సుప్రసిద్ధులు. వీరిరువురే కాక ఉత్తర, దక్షిణ భారతదేశాల్లో మరెందరో చిన్న సాయిబాబాలు వున్నారు. అసలు 'సాయి' శబ్దం ఎలా పుట్టింది?

'సాయి' శబ్దము స్వామియొక్క అపభ్రంశ రూపం. 'బాబా' శబ్దము పూజ్యులను, వృద్ధులను సంబోధించు గౌరవ వాచక పారశీక పదము.

మఠాలు, పీఠాలు మున్నగు వాటిపై అధికారం లేకుండా స్వయంభువులైన అవధూతలు, మహాత్ములు,

సాధువులు, బైరాగులే సాయీలు. వారు దక్షిణ భారత దేశంలో కానవచ్చు ముండనం చేయించుకున్న స్వాములు కానక్కరలేదు. కేవలం 'సాయీ'లే కాక 'గోసాయి'లూ వున్నారు. ఈ పదం యొక్క సంస్కృత రూపం గోస్వామి. సంస్కృత భక్త కవి రూపగోస్వామి, రామాయణము రచించిన గోస్వామి తులసీదాసుగార్లు. ఈ గో-స్వాములకు, గోవులకు సంబంధం లేదు. 'గో' అనగా ఇంద్రియము. గో-స్వామి ఇంద్రియములను జయించిన విరక్తుడు లేదా ఇంద్రియముల యజమాని. అతడు సంసారియైనప్పటికీ విరక్తుడుగా వుండవచ్చును. బసవేశ్వరుడు తన పదాలలో 'గో జిత' (ఇంద్రియములను జయించిన వాడు) అన్న పదమును ప్రయోగించాడు.

కాని 'సాయిబాబా' శబ్దానికి స్ఫూర్తి నిచ్చినది ఇస్లాం మతమేమో అన్న అనుమానం వస్తుంది. ముస్లిం సంప్రదాయంలో ఒక వర్గానికి చెందిన సాధువులకు 'సాయి' అన్న పేరున్నది. ఈ అరబిక్ శబ్దానికి ప్రయత్నించువాడు, సాధకుడు అని అర్థం. ఆధ్యాత్మిక సాధకుడుగా వుండిన సాయిబాబా (షిర్డీ) ఇస్లాం సంప్రదాయానికి చెందిన ఫకీరు లేదా అవధూత అన్న విషయం నిర్వివాదం.

'స్వామి' సాయిగా ప్రజానీకంలో నీరాజనాలందుకుంటున్నాడు. కాని 'స్వామిని' 'సాని'గా సంశయాస్పద గౌరవానికి నోచుకున్నది. ఈ నాటి 'సాని' శబ్దానికి ఒకప్పుడు కళంకిత ధ్వని వుండేది కాదు. తెల్లదొరల భార్యలను "దొరసానులు" అని వ్యవహరించటం సాధారణం. వేశ్యను సానిగా వ్యవహరించడం ఎలా జరిగిందో సరిగా తెలియదు. 'సాని' అన్న అరబీ మూలం గల ఉర్దూపదం ఒకటుంది. దీనికి రెండవ, జత, సమానం, మున్నగు అర్థాలు వున్నాయే కాని వేశ్య అనే అర్థంలేదు. ఈ సానికి నిర్దిష్టార్థం లేదు. కన్నడములో నాయకసాని పదముంది. నాయకి (నాయిక) అనగా యజమానురాలు, మార్గదర్శకురాలు. నాట్యశాస్త్రంలో ముఖ్య స్త్రీ పాత్రకు నాయికసాని అన్న పేరుంది. నాట్యంలో నర్తనం ప్రధానం కాబట్టి 'నాయిక'కు నర్తకి అన్న పేరువచ్చింది. నర్తనము చేయువారు సాధారణంగా వేశ్యలు (సూళెయరు) కాబట్టి నాయికకు కూడ అదే అర్థం వచ్చింది. నాయికల బృందం యొక్క స్వామి లేదా ప్రధాన నర్తకి "నాయకసాని"గా పిలువబడి తుదకు నర్తనము చేయు స్త్రీలందరికీ ఈ పదం అన్వయింపబడివుండవచ్చు. వర్తకులలో ముఖ్యునికి 'శ్రేష్ఠి' (శెట్టి) అన్న బిరుదముండి తుదకు వర్తకులందరికీ అతికించబడింది.

పండితులు ఈ విషయంపై మరికొంత చర్చింపగలరని విశ్వసిస్తున్నాను. ('కస్తూరి' సెప్టెంబరు-82 సంచికలో పా. వెం. గారి రచన ఆధారంగా)

శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

వ్యంజన సూత్ర ఖండన

ఈ మధ్యన 'వ్యంజన సూత్రం' అనే పేరుతో ఒక పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం వచ్చింది.[1] రచయిత ఈ ఖండన కర్తే.

ఈ ఖండన రెండు అంశాల్ని ఆధారంగా జరుగుతుంది.

1. ఆ సిద్ధాంత వ్యాసం కేవలం బ్రహ్మానందకున్న సాంస్కృతిక నేపథ్యాన్ని, నమ్మకాల్ని, పక్షపాతబుద్ధిని - ఆధారంగా కల్గింది.
2. భాషాశాస్త్రదృష్టితో ఒక విషయాన్ని గురించి రాసేటప్పుడు ఆధి భౌతిక విషయాల ప్రసక్తి వుండకూడదు.

పైరెండు అంశాలను వివరించడం అవసరం. ఒక సిద్ధాంతాన్ని గురించి రాసేటప్పుడు - శాస్త్రీయదృక్పథంపైన నమ్మకం - ఉన్న రచయిత — ఆ సిద్ధాంతం చరిత్రక్రమంలో ఏ ఆర్థిక- సామాజిక రాజకీయ పునాదుల మీద ఏర్పడ్డదో గమనించకుండా, తన సమకాలీన వ్యవస్థతో సమన్వయించకుండా — ఆ సిద్ధాంతాన్ని గుడ్డిగా అనుసరించడంకాని-సమర్థించడంకాని - ఇదే అత్యుత్తమ మనడంకాని చేయకూడదు - అది అశాస్త్రీయ దృక్పథం.

అలాపైని-మొదటి అంశాన్ని గమనిస్తే 'వ్యంజనసూత్రం' కాశ్మీర శివాద్వైతాన్ని - అందులోని 'అభివ్యక్తి'ని సూత్రంగా అంగీకరించింది - అంటే 'తంత్ర' విద్యేకదా! శబ్దార్థాభివ్యక్తి - శివశక్తుల సంబంధం - లాంటిది. ఈ శివుడూ శక్తీ వగైరా మాటలూ - వామాచారం, పంచమకారాలు, త్రికోణం, పద్మం - మొదలైనవీ చెప్పే విషయమంతా ఒకటే. ఈ సృష్టి అంతా ఒక

మహామైథునమని. దానికి స్త్రీ పురుష అంశలు కావాలి. వాటిలో స్త్రీ అంశ - సృజనశక్తి - చాలా ప్రధానమని. పురుషుడు అప్రధానమని - లేదా స్త్రీ అంశ తర్వాతే పురుషాంశకు ప్రాతినిధ్యమని. వెరసి - శాక్తేయమన్నా, శివశక్తి సమన్వయమన్నా, - మసిపూసి మారేడుకాయచేసి ఎంత 'వేదాంతాన్ని' దాని చుట్టూ పూసినా - అందులోని కామ - వామాచారాల్ని దాచిపెట్టలేం. స్పష్టంగా అది మానవ పరిణామ క్రమంలో ఒక దశలో ఏర్పడ్డ 'ప్రాచీన', 'అనాగరిక'- వాస్తవిక దృష్టికి అతి మొరటు రూపమైన ఊహాత్మక కాముకదృష్టి. అదే సృష్టికి స్త్రీ పురుషుల ఉనికి అవసరమన్న అంశం గుర్తించడం. వ్యావసాయిక సంస్కృతిలో బుద్ధిని వ్యావసాయికం చెయ్యడం కర్మతో వ్యవసాయం చెయ్యడం అభిన్నంగా భావించాడు ఆనాటిమనిషి. దేహాన్ని విశ్వానికి సూక్ష్మీకరణంగానూ; దేహానికివిశ్వాన్నిస్థూలీకరణంగానూ సూత్రీకరించుకొన్నాడు. దాన్ని బాహ్యాభ్యంతర సమన్వయమను కొన్నాడు. మనిషిలో 'సృజన'కు కేంద్రమైన 'స్త్రీ'ని -తత్తుల్యమైన ప్రకృతితో రమింప చెయ్యడం- తనలోని సృజనాత్మక శక్తిని పెంచుకోవడంకోసం పురుషుడు స్త్రీ సమత్వాన్ని పొందడం-ఈ తంత్రవిద్యకు అంతిమఫలం. అదే 'యోనిపూజ', 'లతాసాధన' వగైరాలు.

అందుచేత హైందవమతంలో మిగిలిపోయిన లైంగిక ప్రతీకలన్నీ ఈ తంత్ర విధానానికి పరిణతరూపాలే. ప్రపంచమంతటా అనాగరిక సమాజాల్లో ఈనాటికీ ఇలాంటి తంత్రవిధానాలు - స్త్రీ ప్రాధాన్యాన్ని సూచించేవి ఏదో ఒక రూపంలో వున్నాయి. చారిత్రకంగా చూస్తే పశువుల కాపరులుగా ఉన్న ఆర్యుల్లో ఉన్న పురుషాధిపత్యదృష్టికన్నా ప్రాచీనమైంది ఈ స్త్రీ ఆధిపత్యదృష్టి. సింధూలోయ నాగరికతలో దొరికిన ముద్రల్లో ఈ తాంత్రికాలోచన విధానం కనిపిస్తోంది. వ్యావసాయికమైన సంస్కృతిలో - స్త్రీలు వ్యవసాయాన్ని ఆరంభించడంతో ఏర్పడ్డది ఈ దృష్టి. ఇది అవైదికం. అనార్యం.

చరిత్రలో ఈ దశ వచ్చేటప్పటికి ఈ సృష్టికి కారణం వక్షోజాలు వగైరాలన్న దృష్టిపోయి-యోని లింగాలన్న - లైంగిక పరిజ్ఞానం పరిణామ క్రమంలో మానవుడిలో ఏర్పడడమే ఈ 'శివ శక్తి' వాదానికి మూలం. అప్పట్లో అది ఒక నూత్నత - పదార్థ దేహ ప్రాధాన్యాన్ని గుర్తించడంవల్ల. స్పష్టంగా దీని మీద మానవుడు సాధించిన పరిణతే సాంఖ్యం. జాతినియమాలు లేని ఈతంత్రవిద్య కేవలం అట్టడుగు వర్గాల్లో మాత్రమే ప్రచలితంగా వుండే అగ్రవర్ణాలవారు దీనికి వైదిక ప్రామాణ్యత సాధించడం కోసం తర్వాతి దశల్లో చేసిన ప్రయత్నమే - ఈ దేశంలో చాల మంది పెద్ద పెద్ద ఆచార్యుల్ని పప్పులో కాలువేసేలా చేసింది. సాంఖ్యాన్ని వైదిక మతంతో ముడి పెట్టుకొన్నట్టుగానే తంత్రవిద్యను కూడా 'వైదికీ కృతం' చేశారు. ఈ కృత్రిమప్రామాణికత్వాన్ని మినహాయిస్తే మౌలికంగా తంత్రం ఒక 'ప్రోటో మెటీరియలిజం.'[2]

బ్రహ్మానంద తన గ్రంథంలో పాండేని అధికంగా ఉపయోగించు కొన్నాడు. ఉడ్రాఫ్ వంటివాళ్ళనీ వాడుకున్నాడు. వీళ్ళందరూ తంత్ర విద్యను కృత్రిమ ప్రామాణికత్వ దృష్ట్యా చూసిన వారే - రాధాకృష్ణన్ మొదలైన ఓరియంటలిస్టులలాగా. కనీసం బ్రిఫాల్ట్ గ్రంథాన్నైనా చూడక పోవడం చింతించాల్సిన విషయం. భాషా పరిశీలకుడికి తులనాత్మక దృష్టి చాలా అవసరం.[3]

అందుచేత వ్యంజన సూత్రాన్ని తాత్త్విక సత్యంగా నిరూపించదలిస్తే ఆధునిక శాస్త్ర పరికరాలలో చూడాలితప్పా ఒక 'ప్రోటో మెటీరియలిస్టిక్ థాట్' ని - అది అదని గుర్తించకుండా కూడా - ఆధారంగా తీసుకోవడం అశాస్త్రీయం. ఇది బ్రహ్మానంద అసమగ్ర దృష్టిని సూచిస్తోంది.

ఇక రెండో అంశం.

ఇంతకీ 'వ్యంజన సూత్రం' ఏం ప్రతిపాదించింది? శబ్దార్థాలు తమ వాచ్యార్థాల్ని కోల్పోయి - వ్యంగ్యాన్ని ప్రధానీకరించడం ఉందని. దాని ద్వారా చెబుతున్న కొత్త (?) విషయం - భాష అంటే భావం శబ్దార్థ రూపాలుగా అభివ్యక్తిని పొందడమని.

ఇందులో కొత్తదనం ఏమిటి? 'రోకళ్ళు రోకళ్ళం బాడె' పాటే కదా! శబ్దమంటే ఏమిటి? అర్థమేమిటి? ఈ పదాలు ఎంత 'వేగ్' గా ఉన్నాయి? 'భావం' అంటే ఏమిటని? - ప్లాటో - శంకరుల మొదలు 'భావవాదులు' పాడుతున్న పాటకు వంతగా ఉంది తప్పా బ్రహ్మానంద 'అనిదం పూర్వం'గా చెప్పిన విషయం ఏమిటి? పైగా తానే రాసుకునాడు. 'ఇతి క్షుద్రబుద్ధిరాజాం యేనస్తద్ 'వ్యాచచక్షిరే'. అని' అంటే తాను ఏమీ కొత్తగా చెప్పలేదని అంగీకరించాడుగా! ఇది అసలు పరిశోధన ఎలా అవుతుంది? పైగా అంటాడు - భాషా శాస్త్రజ్ఞుల్లో వుండే ఈ 'యాంత్రిక ధోరణి'ని మార్క్సు ఎంగెల్సు లాంటి 'మేధావులు' తిరస్కరించారని. అంటే తన పరిశోధన సామాజిక వాస్తవికతను కల్గిందన్న ధీమా రచయితకు ఉన్నట్టుంది. అది ఏమిటో వివరించకుండా మాటను పూర్వ గాలిలోకి వదిలేస్తే సిద్ధాంత వ్యాసం ఎలా అవుతుంది? కాబట్టి రెండు తీర్మానాలు:

1. 'వ్యంజన సూత్రం' - కేవలం పండితుడి సర్కస్ లాగా వుంది తప్ప దానికి సామాజిక వాస్తవికత - సమాజోపయోగ దృక్పథం - లేవు.

2. ఇది కేవలం 'భావవాదం'కి వాస్తవిక పునాదుల్లేనికారణంగా కేవలం అన్నీ ఊహల మీద ఆధారపడ్డ ప్రతిపాదనలు. -'ఆధ్యాత్మికవాదం'.

బ్రహ్మానంద మరో పెద్ద తప్పుచేస్తున్నాడు: ఒకవైపు అభినవుడంటాడు. మరోవైపు లెనిన్ అంటాడు. ఏమిటిది ? ఏదో 'తాతాచార్యులకీ పిల్ల సండక్కీ' ముడిపెట్టినంత సహజంగా వుంది. అభినవుడెప్పటివాడు ? ఆయన చదువుకున్న చదువేమిటి ? ఆయన సమాజానికి చేసిందేమిటి ? ఆయన సామాజిక స్పృహ ఏపాటిది ? — ఆయన చెప్పిన 'అభివ్యక్తి'కీ; లెనిన్ చెప్పిన 'రిఫ్లెక్షన్'కి సంబంధమేట ! డయలెక్టికల్ అండర్ స్టాండింగ్ లేని అభినవుడెక్కడ ? —అది సమగ్రంగా ఉన్న లెనిన్ ఎక్కడ ?

పైగా ప్రతిదానికీ తుమ్మపూడి వారిలా అన్నారు, అలా అన్నారు ! అని తన 'గురుపాదుల్ని' తేపతేపకూ ఉదాహరించుకొంటూ - అంగుళానికో పుస్తకాన్ని అడ్డుపెట్టుకొంటూ 30 పేజీల బిబ్లియోగ్రఫీతో అంతపుస్తకాన్ని తగలెయ్యకపోతే వచ్చిన నష్టం ఏమిటి ? రాసి సమాజానికి ఆయన ఒరిగించిందేమిటి ?

ఇక్కడ బ్రహ్మానందలాంటి వాళ్లు గుర్తించాల్సిన అంశం ఒకటుంది. ఇది ఆయనకేకాదు ! యూనివర్సిటీ 'ఐవరీటవర్స్'లో గోళ్ళుగిల్లుకుంటూ తమ చుట్టూవున్న స్టూడెంట్స్‌కి బృహస్పతుల్లా పోజుపెడుతూ అగాధాల్లో కూరుకుపోయిన పండిత ఆచార్య గురుపరంపరకు అంతటికీ వర్తించేది. గుర్తించాల్సిందికూడా !

అది కార్ల్ మార్క్స్ ప్రబోధం :4

'తాత్త్వికులు ప్రపంచాన్ని వివిధాలుగా వ్యాఖ్యానించారు. కాని కావాల్సింది దాన్నిమార్చడం'.

వ్యంజన సూత్రం - భాషాతత్త్వానికి ఒక అగాధమైన పండిత వివరణే అనుకొందాం ! నేటి సమాజంలోవి అసమానతను తొలగించడానికి - అభ్యుదయ మార్గంలోకి సగటు మానవుడిని నడిపించడానికి ఈ గ్రంథరచన ఎలా సాయపడుతోంది ? వేయిపడగలద్వారా విశ్వనాథ వెయ్యేళ్ళవెనక్కి మనల్ని నడిపించాలని చూసినట్టు - బ్రహ్మానందా అదే చేస్తున్నాడు. ఇది తిరోగమన వాదం. పలాయన వాదం.

అంతెందుకు ? శ్రీరంగం శ్రీనివాసరావుగారు చెప్పలేదా !5

'శ్రీ శ్రీ' స పొయట్రీ ఈజ్ నథింగ్ బట్ ధ్వని'

'ధ్వని కమ్యూనిజాన్ని ధ్వనించినపుడే ధ్వని' - అని.

ఈ పరిజ్ఞానం ఆ గ్రంథమంతటా కాగడావేసి చూస్తే కనిపిస్తుందా ! ధ్వన్యాలోక లోచనాల్ని వాడుకోవడంలో సరిపోదు. భారతాన్నో, ఆముక్తమాల్యదనో (తన గురువుగారిని కాకాపట్టడానికి) ప్రమాణంగా ఉదాహరిస్తేచాలదు. ఆ గ్రంథాలు ఏ ఫ్యూడల్ సమాజాన్ని - అందులోని బూజుపట్టినవిలువల్ని సమర్థిస్తున్నాయో నిర్ద్వంద్వంగా ఖండించాల్సిన నైతిక బాధ్యత బ్రహ్మానందపైన యువరచయితగా వుంది. ఉదాహరించడానికి ఆధునిక సాహిత్యం దొరకలేదా ! అసలు చదవలేదా !

ఒక్కమాటలో తేల్చిచెబితే బ్రహ్మానంద ఒక బ్రహ్మాండమైన రియాక్షనరీ. తేనెపూసినకత్తి. మార్క్సిస్టు పదజాలంవాడుతూ అభ్యుదయవాదాన్ని ఖండించే ఇలాంటి ప్రబుద్ధులు ఈ రోజుల్లో ప్రబలిపోతున్నారు. యువ రచయిత విమర్శకులు ఇలాంటి కుహనాధోరణుల్ని సమూలంగా ఖండించి యువత తప్పుడు మార్గంలో పడకుండా కాపాడాల్సిన అవసరం వుంది.

ఇంతవరకూ భాషాశాస్త్రంలో 'విశ్వనాథ' పుట్టలేదు. అది శాస్త్ర మర్యాదల్ని దాటకుండా; అశాస్త్రీయధోరణులకు చోటివ్వకుండా - 'ప్యూర్ సయిన్స్'గా తన గౌరవాన్ని నిలబెట్టుకొంది. ఆ వాతావరణాన్ని బ్రహ్మానంద కలుషితం చేశాడు. ఇది భాషాశాస్త్ర గ్రంథంకాదు. బ్రహ్మానంద భావాలు 'ప్రోగ్రెసివ్'గా లేవు. ఉంటే ఏనాడో చచ్చిపోయిన అలంకార శాస్త్రాన్ని మళ్ళీ తగదు నంటూ వ్యాఖ్యానిస్తాడా!

పూర్ ఫెలో! అద్దేపల్లి రామమోహనరావు చేసినప్రయత్నం కంటె ఈ గ్రంథం ఎలా మెరుగు? శ్రీ శ్రీ కవిత్వంలో ధ్వని వుందని నిరూపించే ప్రయత్నాన్ని అద్దేపల్లి ఎంత అసమర్థంగా నిర్వహించాడో - తర్వాత వచ్చిన విమర్శల్నిబట్టి తెలుసుకోరాదూ !6 !

గతంనుంచి వర్తమానంలోకి-భవిష్యత్తులోకి మనిషినిరంతరం అభివృద్ధిని సాధిస్తాడన్న ప్రాథమిక వైజ్ఞానిక సూత్రాన్ని వ్యంజన సూత్రం వ్యతిరేకిస్తోంది. అంతేకాదు. భాషాశాస్త్ర గ్రంథాన్ని తక్కువ చెయ్యడం కోసమే 'పృథక్కరణ'మని పేరుపెట్టాడు. ఆలంకారికులు - తన బంధువులైనట్టు - పెద్దపీటవేస్తూ 'సూత్రీకరణ' మంటాడు. వారి ప్రస్తావన వచ్చినపుడల్లా అతిశయ ప్రీత్యయంతో అభినవులు, ఆనందులు-అంటాడు. ఇది వస్త్వాశ్రిత ధోరణి కాదు. అంచేత భాషాశాస్త్రజ్ఞుడికి ఉండాల్సిన 'ఓపెన్ మైండ్' బ్రహ్మానందకి లేదు. ఇది 'కమిటెడ్' రచనకాదు.

భాషాశాస్త్ర గ్రంథాన్ని రాసేటప్పుడు - అధి భౌతిక విషయాల ప్రసక్తి - దృష్టి - వాంఛనీయంకాదని పూర్వ పరిశోధకులు గుర్తించికూడా వున్నారు. (చూ. చేకూరి రామారావు, 1971) పూర్వులపైన అంతగౌరవం - ఉన్నవాడు ఆ మాటనిమాత్రం ఎందుకు ఖాతరు చెయ్యలేదు?

మరోగమ్మత్తు. 'సెమియోటిక్స్' అంటూ ఏదో ఒకకొత్త అంశాన్ని మొదలుపెట్టాడు. అసలు విషయం ఏమిటంటే 'సెమియోటిక్స్'ని నవీన భాషాశాస్త్ర ప్రామాణత్వం కల్గిందిగా ఈనాడు అందరూ అంగీకరించటం లేదు. అంటే బ్రహ్మానందలాంటి ఆధ్యాత్మికవాదులు ఇంకా ప్రపంచంలో మిగిలేవున్నారని అర్థం. ఇలాంటి ధోరణుల్ని ప్రతిఘటించడమే ఈనాటి అభ్యుదయ వాదుల ప్రధానకర్తవ్యం.

బ్రహ్మానంద చదివిన లింగ్విస్టిక్స్ ఏపాటిది? భాషాశాస్త్ర మార్గాల్లో చాలావాటిల్లో 'మెటఫర్'ని గురించిన ప్రతిపాదనలు అనంతంగా వస్తున్నాయికదా! జాతీయాల్ని గురించి, వక్రతను గురించి, పొడుపుకథల్ని గురించి రాస్తున్నారుకదా! వ్యంజన సూత్రం - ఇవి ఏవీ చెప్పని ఏకొత్త అంశాన్ని గురించి చెప్పిందని దీన్ని భాషాశాస్త్ర గ్రంథంగా గుర్తించాలి?

మౌలికంగా బ్రహ్మానందలో ఎక్కడో కన్‌ఫ్యూషన్ వుంది. ప్రతివానికీ ఇదిగో పాశ్చాత్యులు ఇలా అన్నారు - అలా అన్నారు అంటూ రాస్తూ - ధ్వని సిద్ధాంతంకాడికి వచ్చేటప్పటికి - పాశ్చాత్యదేశాల్లో దీనికి సమానమైన సిద్ధాంతంలేదని ఒకచోటా - పాశ్చాత్యమంటే మానసిక దశావికల్పమని మరోచోటా రాస్తూ పోవడం స్వవచోవ్యాఘాతంకాదా !8

ఇవన్నీ ఒకమూలవుంచి ఆలోచించాల్సిన మొదటి అంశం- ఆ గ్రాంథికంలో రాయడం ఎందుకని? వ్యావహారిక వాదం పుస్తకాలు ఏవీ దొరకలేదా! గిడుగు గురజాడ కృష్ణమూర్తుల 'ప్రమాణాలు' తెలీదా! దీన్ని అజ్ఞానమనాలా! అహంకారమనాలా! భాషాశాస్త్రగ్రంథమట - గ్రాంథికంలో రాయడమట! వాట్ నాన్‌సెన్స్!

ఇది అభివృద్ధి నిరోధక రచన.

విన్నపం: అయ్యా! ఇదీ వ్యంజన సూత్ర ఖండనం. మన దేశంలో శాస్త్రపాండిత్యాల స్థాయి ఇలా వుంది. ఏం అనాలో ఏం అనకూడదో కూడా తెలీని 'బాల్య'స్థితిలో వున్నాం మనం. వీటిలో అన్నిటికీ రచయిత బ్రహ్మానంద సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత వుంది. ఈ ఖండనకర్త రచయితలోని తార్కికుడు. భౌతికవాది. సగటు మనిషి.

('భారతి' వారు ఇలాంటి ఖండనకూ సాహిత్య ప్రక్రియగా ఒక చోటుందని గుర్తిస్తే- సమర్థనో, పునర్విమర్శో చేసుకొమ్మని రచయితని అడగొచ్చు.)

జ్ఞాపికలు

1. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(స్వాధికారస్నాతకోత్తర కేంద్రం) నుంచి డిగ్రీ పొందిన సిద్ధాంత గ్రంథం (1979). ముద్రించబడింది (1981). (ప్రచురణ: అక్షర ప్రసారిణి, అనంతపురం. పుటలు XXX+362. వెల రూ. 45.) ఈ గ్రంథంలో రెండు అధ్యాయాలున్నాయి. 1. పృథక్కరణము (అబ్‌స్ట్రాక్షన్) 2. సూత్రీకరణము (కోడిఫికేషన్). ప్రతి అధ్యాయంలో 13 అంశాలున్నాయి. అధ్యాయాలకు ముందున్న భూమికలో ధ్వని సిద్ధాంతానికి అంతర్గతంగా ఉన్న వ్యంజనను వాక్‌ప్రక్రియగా గుర్తించాల్సిన అవసరాన్ని గురించి; గుర్తించిన పూర్వ పరిశోధకుల్ని గురించి చెప్పడం జరిగింది. రెండవ అధ్యాయానంతరం నాలుగు

అనుబంధా లున్నాయి. 1. ధ్వన్యాలోకలోచన పూర్వాపరములు, 2. ద్రావిడ ధ్వని సిద్ధాంతచ్ఛాయ, 3. వ్యవహారము - వ్యంజన, 4. కావ్యము - వ్యంజన దశా నిరూపణము. తర్వాత అనువిద్ధ గ్రంథ సూచి. ఇది మొత్తం గ్రంథం.

ప్రథమాధ్యాయంలో 'పాశ్చాత్య' మంటే ఏమిటో చర్చించ బడింది. సంప్రదాయ ఆధునిక భాషాశాస్త్రాలమధ్య భేదం-స్పష్టంగా ఏ అంశంలోవుందో ప్రతిపాదించబడింది. గ్రీకువాదాలు- ససూర్-ఎంస్లేవ్, సపీర్, బ్లూంఫీల్డు. ఛామ్స్కీపూర్వరంగం, కార్టీజియన్ సంప్రదాయం, వీన్‌రిష్, సామాజికభాషాశాస్త్రం, అర్థపరిశోధనలోని అనేక ముఖత్వం, సంకేతవాదం - ఇవివ్యంజనతో అన్వయింప బడ్డాయి.

రెండో అధ్యాయంలో వ్యాపారత్రయచర్చ- ధ్వని వికల్ప వాదాలు ; శబ్దార్థపరిశీలనలో దశాత్రైవిధ్యం, భాషలో అవయవి - అవయవ సంబంధం, వాక్యార్థగ్రహణం, అభిదాతాత్పర్య వాదాలు(శాబ్దికదృష్టి), లక్షణభాక్తవాదాలు (అర్థదృష్టి), వ్యంజన (శబ్దార్థదృష్టి), అనుమితి, అర్థాపత్తులు (శబ్దార్థ వివేకదృష్టి) - అనిర్వచనీయత - వాచ్యవాచకసంబంధం; వాగ్దర్శనం, ఆనందాభి నవుల భాషా సిద్ధాంతం, వ్యంజనసూత్ర ప్రతిపాదనం - గ్రథింప బడ్డాయి.

రచయిత స్వయంగా 'శ్రుతి' (ఇన్నర్ వాయిస్) అన్న పేరిట పీఠికరాసుకున్నారు. రచయిత గురువు' కుమార భారతి' పేరిట చత్వార్ వాక్' అన్న భూమికరాశారు.

ఇదీ మొత్తం గ్రంథం స్వరూపం.

2. ఇంతవరకు తంత్రానికి సంబంధించి చర్చించిన దృక్ప థం మార్క్సిస్టు కోణానికి సమన్వయించడంలో ఖండన కర్తకు సహకరించిన పరిశోధన దేవీప్రసాద భట్టాచార్యగారి 'లోకాయత' (ఎ స్టడీ ఇన్ ఏన్షియంట్ ఇండియన్ మెటీరియలిజం) అన్న గ్రంథం (పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ 1959: 1978). ఈ గ్రంథంలో బుక్ IIIలోని 5, 6, 7, అధ్యాయాలు (వరుసగా తంత్ర, సాంఖ్య, సంఘ నియతులమీద) ఈ దృక్పథాన్ని చర్చి స్తాయి. (పుటలు 269-459).

3. పై గ్రంథంలో ఆర్. బ్రిఫాల్ట్ ('ది మదర్స్', లండన్ 1952) ప్రతిపాదనలు చాలా ప్రధానంగా గ్రహింపబడ్డాయి. 'ఇండియాలోనూ', ఇతర దేశాల్లోనూ ఈ నాటికీ పొలంపనుల్లో స్త్రీకి ఉన్న ప్రాధాన్యం; స్త్రీ రజస్సుకి ఉన్న ప్రాముఖ్యం-ప్రాచీన తంత్రవిద్యకు అపరిణత పూర్వ రూపాలుగా - ఎలా ఉన్నాయో తులనాత్మకంగా చర్చించడంలో బ్రిఫాల్ట్, మజుందార్, థాంసన్, నీడ్‌హామ్; బోస్ మొదలైన వారి రచనలు విస్తారంగా ఉద్ధరింప బడ్డాయి (చూ. పు. 269-358).

4. ఇది 'లెవెన్త్ తీసిస్ ఆన్ ఫ్యూయర్ బ్యాక్'గా ప్రసిద్ధి పొందిన వాక్యం (చూ. మార్క్స్, ఎంగెల్స్, 1946 సెలెక్టెడ్ వర్క్స్, సం. 1, పు. 354) పండితులు ఏవో సిద్ధాంతరాద్ధాంతాల కోసం కాలం వెలిబుచ్చడం కాదు. సిద్ధాంతాల్ని ఆధారంగా 'ఆచా రాలు' ఎలా ఉంటున్నాయో చెప్పడంకాదు; (ఆచారం - అంటే ప్రయోగ స్థితిఅని అర్థం). ఆచారాల్ని బట్టి సిద్ధాంతాలు ఎలా పుడు తున్నాయో చెప్పడం ప్రధానమనీ - చారిత్రిక దృష్టి అంటే -అదే నని మేధావి వర్గానికి వీరిరువురూ ఇచ్చిన నిర్మాణాత్మక సూచన. 'హౌ ఎవర్' - అంటే 'ఎంతరాసినా' అని అర్థం.

5. అందాకా మనం షెక్స్పియన్లం తప్ప 'కవులం' కాదని శ్రీశ్రీ సిద్ధాంతం. కె. వి. రమణారెడ్డి (సం) శ్రీశ్రీ సాహి త్యం కె. సం. శ్రీ శ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘం ప్రచురణ (1971)

6. అద్దేపల్లి రామమోహనరావు 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' (1968)లో జేసిన ఈ ప్రయత్నాన్ని రాచమల్లు రామచంద్రారెడ్డి సంవేదన వ్యాసంలో (1969, సారస్వత వివేచన (1976) లో సంకలితం) ఖండించారు.

7. ఇక్కడ విస్తారమైన వాఙ్మయాన్ని ఉదహరించాలి. సారాం శాన్ని మాత్రం అందించడం జరుగుతుంది. సెమియోటిక్స్‌లో భిన్న సంప్రదాయాలు ఉన్నాయి. ససూర్ (1915) ప్రతిపాదనలే ఈ 'సెమియాలజీ/టిక్స్' ల ఉద్భవానికి హేతువు లయ్యాయి. (చూ. టెరెన్స్ హాక్స్, 1977) వాక్కును మానవుడితో ఐహిక సంబంధమున్న సాధనంగా గ్రహించడం సెమియోటిక్స్‌లో ఒక ప్రధాన లక్షణం. ఇలా గ్రహిస్తూ ససూర్ రెండు విరుద్ధ ప్రతి పాదనలు చేశాడు.

1. భావదశలో సంకేత (సిగ్నిఫైయర్) సంజ్ఞితాల (సిగ్నిఫైడ్) అన్వయాన్ని కల్గినవి.

2. వ్యవహారదశలో సంకేతానికి విలువ (మీనింగ్) కేవలం భేదాల వల్లే కలుగుతోంది.

తరువాతివాళ్ళు పై రెండు ప్రతిపాదనల్ని భిన్నరీతుల్లో వ్యాఖ్యా నించుకున్నారు. బ్లూంఫీల్డు (లాంగ్వేజ్, 1933)తో ఈ సందిగ్ధత ఒక

విధంగా పరిష్కరింపబడింది-కాని అది 'వల్గర్ మెటీరియలిజమ్'. సస్యూర్‌లోని ఈ సందిగ్ధతను తాత్త్వికంగా ప్రదర్శించి 'సెమియోటిక్స్'ని తీవ్రంగా గర్హించిన రచనకు చూ. జాక్స్‌దెరిదా 'స్పీచ్ అండ్ ఫెనామినా' (1973). ఇందులో దెరిదా, హుసర్ల్ ప్రతిపాదనల్ని కూడా సమీక్షించాడు. హుసర్ల్ 'లాజికల్ ఇన్వెస్టిగేషన్స్' (1970)లో కూడా సంకేతాల్ని, వాచకాలని, వ్యంజకాలని రెండు రకాలుగా చెబుతాడు. దెరిదా వాదం ప్రకారం ఈ రెండిటా 'మెటాఫిజికల్ ట్రీట్‌మెంట్' వుంది - కాబట్టి ఇది పరిహరణీయం.

8. బ్రహ్మానంద రచనల్లో ఈ దృష్టి ఇంకా బలపడుతున్నట్టు కనిపిస్తోంది. (చూ. ఏప్రిల్ 'భారతి' (1982)లో 'ప్లాటినస్' మీది వ్యాసం. 'తెలుగు సాహిత్య విమర్శ పాశ్చాత్య ప్రభావం' (అము. 1982) అన్న గ్రంథంలోనూ ఇదే దృక్పథం కనిపిస్తోంది (అధ్యా-1.)

రిఫరెన్సులు

1.	భట్టాచార్య, దేవీ ప్రసాద్,	'లోకాయత' (ఎ స్టడీ ఇన్ ఏన్షియంట్ ఇండియన్ మెటీరియలిజమ్, పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ (1978. ప్రతి)
2.	బ్రహ్మానంద హెచ్. ఎస్.	'వ్యంజన సూత్రము'. అక్షర ప్రసార ప్రచురణ, అనంతపురం (1981)
3.	—	'ప్లాటినస్', భారతి, ఏప్రిల్ (19 2)
4.	—	'తెలుగు సాహిత్య వి ర్శ, పాశ్చాత్య ప్రభావం', అము. (198?)
5.	బ్రిఫాల్ట్, ఆర్.	'ది మదర్స్', లండన్ (1952)
6.	బ్లూంఫీల్డు. ఎల్.	'లాంగ్వేజ్', న్యూయార్క్ (1933)
7.	దెరిదా, జాక్స్	'స్పీచ్ అండ్ ఫెనామినా: ఇంట్రొడక్షన్ టు ది ప్రాబ్లమ్ ఆఫ్ సైన్స్ (Signs)ఇన్ హుసర్ల్స్ ఫెనామెనాలజీ, డేవిడ్. బి. అలిసన్ (అను), ఎవాన్‌స్టన్ (1973)
8.	హుసర్ల్,	'లాజికల్ ఇన్వెస్టిగేషన్స్', జె.ఎన్. ఫిండ్లే(అను), న్యూయార్క్ (1970)
9.	హాక్స్, టెరెన్స్	'స్ట్రక్చరలిజం ఎండ్ సెమియోటిక్స్' మ్యాథ్యుఎన్ పబ్లిషింగ్ కం.(1977)
10.	మార్క్స్, కార్ల్ & ఎంగెల్స్, ఫ్రెడరిక్	'సెలెక్టెడ్ వర్క్స్' సం. 1. (1948)
11.	రమణారెడ్డి కె. వి. (సం.)	'శ్రీ శ్రీ సాహిత్యం' (సం. 3) శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘం ప్రచురణ (1970)
12.	రామచంద్రారెడ్డి, రాచమల్లు	'సారస్వత వివేచన', విశాలాంధ్ర ప్రచురణ (1976)
13.	రామమోహనరావు, అద్దేపల్లి	'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' ప్రభాకర్ పబ్లికేషన్స్, మచిలీపట్టణం (1968)
14.	రామారావు. చేకూరి	'భాషాశాస్త్రంలోపరివర్తనసిద్ధాంతం, గోలి ఈశ్వరయ్య సన్మాన సంచిక, హైదరాబాదు (1970)
15.	సస్యూర్, ఫర్డినాండ్ డి.	'కోర్స్ డి లింగ్విస్టిక్ జనరల్' వాడ్ బాస్కిన్ (అను) (1 15) పీటర్ ఓవెన్. లండన్ (1960)

డా॥ హెచ్. ఎస్. బ్రహ్మానంద

లేఖలు

విజయదశమి - దీపావళి నిర్ణయము

ఈ అక్టోబరు "భారతి"లో పై శీర్షికతో వ్యాసము ప్రచురింపబడినది. ఈ వ్యాసము 5, 6 మాసములకు పూర్వము ప్రచురించిన ఆస్తికులకు మేలు కలిగెడిది. ఈ వ్యాసకర్తయైన శ్రీ పిడపర్తి చిన కృష్ణమూర్తిశాస్త్రి, శ్రీ పిడపర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి సోదరులు తమ దుందుభి నామ సంవత్సర పంచాంగమున పేర్కొన్న విషయములనే ఈ వ్యాసములో పొందుపరచినట్లు కనుపట్టుచున్నది. ఈ రచయితలు సహ రచయితలుగా నుండగా వీరి తండ్రిగారు ప్రచురించిన శోభకృతున్నామ సంవత్సర పంచాంగములోని విషయములనే యీ దుందుభి నామ సంవత్సర పంచాంగమున చేర్చినట్లు కనుపించుచున్నవి.

ఈ దుందుభి సంవత్సరమున కొందరు పంచాంగకర్తలు అధిక క్షయ మాసములు పేర్కొనగా మరి కొందరు పేర్కొన

కుండుట ఆస్తికులను తికమకపెట్టుచున్నది. ఆస్తికులకిట్టి కష్టము ముందు ముందు కలుగకుండ సరియగు మార్గమును పంచాంగ కర్తలు చూపుదురుగాక.

వీరు "కార్తికాదిషు మాసేషు
యదిస్యాత్తాంమలిమ్లుచే
సర్వకర్మ హరః ప్రోక్తః
పూర్వస్తత మలిమ్లుచః"

అనగా "క్షయ మాసమునకు పూర్వమందగు అధిక మాసమునందు తన్మాసప్రయుక్త (అశ్వయుజ) వ్రతాదులను చేయరాదదు అని భావము" అని వ్రాసిరి. కార్తికాది మాసములలో అశ్వయుజమును చేర్చుట సరి కాదు. కార్తికాది మాసములకు వారు చెప్పినది సామాన్య విధి.

శబ్దకల్ప ద్రుమమున "ఆశ్విన వైశాఖయో స్తల్లక్షణ యోగేన పరవేవమలమాసః" అని విశేష విధి పేర్కొనబడినది. అనగా ఆయా లక్షణముల వలన అశ్వయుజ మాసమునందును వైశాఖ మాసమునందును రెండవ (అశ్వయుజ వైశాఖములే) మాసములే మల మాసములని చెప్పబడును. అందుచేత మొదటి యాశ్వయుజమునే శుద్ధ మాసముగా భావించి దేవీనవరాత్రములను విజయదశమియు మొదటి యాశ్వయుజముననే చేసిన యెడల యాస్తికులకును దేశమునకును మేలయ్యేడిది. మొదటి యాశ్వయుజముననేవిధి విధానముగా కొందరు దేవీనవరాత్రములు విజయ దశమి పర్వము జరుపుకొని ధన్యులైనారు. ఈ పంచాంగ కర్తలకు శ్రీ ముఖమును ప్రసాదించిన శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు కూడ మొదటి యాశ్వయుజముననే దేవీనవరాత్రములు జరుగవలెనని పత్రికా ముఖమున ఆస్తికుల ననుగ్రహించుట యెల్లరు గమనింప దగిన విషయము.

దీపావళి విషయమున వీరి నిర్ణయము సరిగనే యున్నది. దీపావళి విషయమున ఈ వ్యాసములో "సంవత్సరము శుద్ధ మాసముగా నంగీకరించిన యెడల దీపావళి వెడలిన పిమ్మట వృశ్చిక సంక్రాంతితో గూడిన కార్తికమునకు నొక నెలయంతరము ఉండును. దీపావళి నాటి సాయం సంధ్యయందు దివిటీలు పట్టుట పితృదేవతలకు మార్గమును చూపుటకే. ఆ మరునాటి దినము అనగా వృశ్చిక సంక్రాంతితో గూడిన కార్తిక శుద్ధ పాడ్యమినాడే పితృదేవతలు తమతమ లోకముల కేగుదురు" అని వీరు వ్రాసిరి.

ఈ వ్యాసములోనే "భవిష్యత్పురాణ వచనము నుదాహరించి వృశ్చిక సంక్రమణముతో గూడిన శుద్ధ పాడ్యమినాడే పితృదేవతలు స్వస్వలోకములకు తరలుటకు దారి చూపించవలయును" అని వ్రాసిరి. ఈ పండితులు సహ రచయితలుగా నుండగా వీరి తండ్రిగారైన శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు రచించిన శోభకృతున్నామ సంవత్సర పంచాంగమున (1963) అక్టోబరు 17వ తేదీని దీపావళి కాగా నవంబరు 16వ తేదీని వృశ్చిక సంక్రమణమైనట్లు వ్రాయబడినది. దీపావళికిని వృశ్చిక సంక్రమణమునకును (1963 లో) నెలరోజులు వ్యవధి యుండుట యా పిడపర్తి సోదరులెట్లు సమర్థింతురో చూడవలసి యున్నది.

"గతాను గతికో లోకః" అను న్యాయము ననుసరించి మల (అధిక) మాసము వచ్చినప్పుడు రెండవ మాసమును "నిజ మాసము"గా పంచాంగ కర్తలు పేర్కొనుచున్నారు. "నిజ మాస" మను పదము జ్యోతిషశాస్త్రరీత్యా, ధర్మశాస్త్రరీత్యా, వ్యాకరణశాస్త్ర రీత్యా సాధువగునా ? నా యీ సందేహమును తొలగింప వలసినదిగా విజ్ఞులకు విజ్ఞప్తి.

రాంపల్లి శ్రీరామచంద్రమూర్తి
రిటైర్డు గ్రేడ్ I తెలుగు పండితుడు, పోడూరు - 534 327.

తెలివి లేని వాడు దేవు డెట్లాయెరా ?

వేమనను కవిగా యోగిగా లోకం గుర్తించింది. అయితే వేమనమీద విశేషమైన పరిశోధన జరగడం ఇటీవలే ప్రారంభమైంది. ఇది ముదావహం. కాని ఇదే సమయంలో వేమనను మన యుగం ఊహించుకున్న మూసలో ఇమడ్చడానికి ప్రయత్నం కూడా జరుగుతోంది. వేమన పద్యాలన్నీ ముక్తకాలనీ, ఆయా సందర్భాలలో చాటువుగ చెప్పినవని మరచిపోయి అన్నిటినీ ఒక క్రమ బద్ధమైన ఆలోచనా ఫణితికి దర్పణాయమానమైన రచనలుగ పరిగణించడం జరుగుతోంది. నిజానికి విప్లవాత్మకంగా కనిపించే అతని భావాలలో కొన్నైనా అనాటి వాతావరణంలో సర్వసామాన్యమైనవని కన్నడకవి సర్వజ్ఞుడు మొదలగు వారితో పోల్చినపుడు స్పష్టమౌతుంది. కొన్ని భావాలు సంస్కృత కవులు తమ ధోరణిలో వెలిబుచ్చినవే కూడా.

ఉదాహరణకు :

కనక మృగము భువిని కలదు లేదనకయె
తరుణి విడిచిపోయె దాశరథియు
తెలివిలేనివాడు దేవు డెట్లాయెరా

అన్న పద్యాన్ని తీసుకుందాం. దీన్ని సర్వ సాధారణంగా అందరూ ఉట్టంకిస్తూ ఉంటారు. సెప్టెంబర్ నెల 'భారతి'లో సి. ఆర్. రెడ్డి

గారి రేడియో ప్రసంగాన్ని సమీక్షిస్తూ సమీక్షకులు కూడా దీన్ని ఉట్టంకించి, ఇందులో శబ్దౌచిత్యంకన్న, వేమన చేసిన దైవతిరస్కారం గమనార్హమన్నారు. దీనితో భావ సామ్యంగల సంస్కృత శ్లోకాన్ని ఈ క్రింద ఉదాహరిస్తున్నాను. ఇది నారాయణ పండితుని 'హితోపదేశం', లోనిది.

అసంభవం హేమ మృగస్య జన్మ
తథాపి రామో లులుభే మృగాయ
ప్రాయః సమాపన్న విపత్తి కాలే
ధియోఽపి పుంసాం మలినా భవంతి

[కనక మృగం ప్రభవించడం సృష్టిలో అసంభవం. అయినా రాముడు కనక మృగానికై ఆశపడ్డాడు. సర్వసాధారణంగా విపత్తులు ముంచుకొచ్చినపుడు మనుష్యుల బుద్ధులు కూడా నైర్మల్యాన్ని కోల్పోతాయి.]

ఈ కవి రాముని తెలివి లేమిని స్మరిస్తూ, అది ఆ సందర్భంలో మానవసహజమని సమర్థిస్తున్నాడు. వేమన రాముని దైవత్వాన్ని శంకిస్తే, 'హితోపదేశ' కారుడు రాముని మానవత్వాన్ని గుర్తు చేస్తున్నాడు. పద్ధతులు వేరైనా, చెప్పిందొక్కటే అయింది. అయితే దృష్టిభేదం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. హితోపదేశ కారుడు రాముణ్ని మానవమాత్రునిగా గుర్తించాడు. వేమన రాముడు దేవుడుకాదని చెప్పదల్చుకున్నాడు. తెలివిలేనివాడు దేవుడు కాలేడని ధ్వనిస్తున్నాడు. ఇది హేతువాద విమర్శలా కనిపిస్తుంది.

ఇలాంటి విమర్శమనకు అనూచానంగా వస్తున్నదే. పోతన గారు గజేంద్ర మోక్షణ సందర్భంలో రాసిన 'సిరికింజెప్పడు' అన్న పద్యంపై శ్రీనాథుడు చేసినట్లుగ ప్రచారంలో ఉన్న విమర్శ, అందుకు ప్రతిగ పోతన యుక్తియుక్తంగా ప్రత్యక్షానుభవం ద్వారా నిరూపించినట్లు చెప్పబడుతున్న కథ ఈ కోవకు చెందినదే, సగుణోపాసనపై ఆధారపడ్డ కథలను పురాణాలను పరోదృష్టితో చూస్తే వచ్చే వైపరీత్యాలివి. ఇలా దృష్టి మార్చి చూస్తే, కవి చమత్కారం సాధించగలడు. కాని తత్త్వతః దృష్టిభేదం ఉండక పోవచ్చు. వేమన విషయంలో ఇదే జరిగిందని నా అభిప్రాయం. ఇంతకూ కవిత్వాన్ని హేతువాద దృష్టితో అధ్యయనం చేయడం ఎంతవరకు సమంజసం? అవిశ్వాసాన్ని దూరంగా ఉంచినప్పుడే, కావ్యాస్వాదనకు సాధ్యమన్న కోల్‌రిజ్ సహృదయుని అభిప్రాయం ఇక్కడ స్మరణీయం. వేమన హేతువాద దృష్టితో రామాయణాన్ని అధిక్షేపిస్తున్నాడనడంకన్న, కావ్య సామాన్యమైన చమత్కార వైభవంతో సరసమైన సాంఘిక విమర్శ చేస్తున్నాడనడం సమంజసం. హేతువాదమే ప్రధానమనుకొంటే, ఈ పద్యం గతి ఏమౌతుంది? తెలివిలేనివాడు దేవుడుకాడు. సరే అయితే తెలివి గలవాడు దేవుడౌతాడా? అని విపరీతంగా ప్రశ్నిస్తే సరైన తర్కం అవుతుందా? వేమన భారతీయుడు. అతడు ఏ సంప్రదాయానికి చెందినవాడైనా భారతీయ ఆలోచనా ఫణితి, జీవితశైలి బాగా తెలిసినవాడు. జ్ఞాని. అందుచేత అతడి విమర్శ కావ్యదృష్టితో చేసినదేకాని, తత్త్వదృష్టితో చేసినదికాదని నా అభిప్రాయం. ఏ సందర్భంలోనో, ఏ వితండవాది నోరు మూయించడానికో చమత్కారంగా చెప్పిన చాటువిది. అతడు చేసిన దైవ తిరస్కృతికింతకన్న ప్రాధాన్యంలేదని భావిస్తున్నా.

డా॥ గంటి శ్రీరామమూర్తి
అనకాపల్లి

గ్రంథ విమర్శలు

శ్రీ రామలింగేశ్వర ఆవిర్భావము (అను) ఉభయ రామేశ్వర క్షేత్ర చరిత్ర

[రచయిత - వేమూరు బైరాగిశాస్త్రి. మూల్యం 0-50 ప్రతులకు - వేమూరు బైరాగి శాస్త్రి, చిలుమూరు పోస్ట్ (వయా) అనంతవరము, తెనాలి తాలూకా.]

ఆంధ్రప్రదేశ్‌లో పుణ్యక్షేత్రాలు చాలా వున్నాయి. సాధారణంగా ఆయా క్షేత్రాలు నది ఒడ్డుననే వున్నాయి. అలావుండడానికి చారిత్రిక కారణాలో, పౌరాణిక కారణాలో వుంటాయి. వాటిని గురించి సమగ్ర పరిశోధన లింతవరకూ జరుగలేదు. అయినా యీ రచయిత వంటి వారు వ్యయ ప్రయాసలకోర్చి పండిత పామరులకు అర్థమయ్యే శైలిలో క్షేత్రమహాత్మ్యాలను వ్రాయడం ముదావహం. కలియుగంలో మనశ్శాంతికి భక్తి కంటే సులభమార్గం లేదు. రావణుని సంహరించి రాముడు సీతాసమేతముగా వానరులతో పుష్పక విమానంపై అయోధ్యకు పోవుచుండగా తెనాలి తాలూకా చిలుమూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వరాలయమున్న ప్రదేశమును సమీపించగానే విమానం క్రిందికి దిగినదట. శ్రీ రామచంద్రుడు విమానం దిగి, శంకరుని ప్రబోధం ప్రకారం అక్కడ శివ ప్రతిష్ఠ చేయదలచెను. నాలుగు గడియలలో శివలింగ ప్రతిష్ఠకు ముహూర్తము నిర్ణయమయ్యెను. శివలింగమును కొని తెచ్చుటకు హనుమంతుడు బయలుదేరెను. శివలింగముతో హనుమంతుడు తిరిగి రావడం కొంచెం ఆలస్యం కాగా మునుల ఆదేశం ప్రకారం, సీతాదేవి వినోదంగా ప్రోగుచేసిన ఇసుక శివలింగాకృతి దాల్చగా, శ్రీరామచంద్రుడా లింగమును అచట ప్రతిష్ఠించెను. అంతలో హనుమంతుడు శివలింగముతో తిరిగి వచ్చెను. అప్పటికే శ్రీరామలింగేశ్వర లింగ ప్రతిష్ఠ జరిగినందుకు వాయునందనుడు ఖిన్నుడయ్యెను......... ఈ విధంగా యీ పౌరాణిక కథను సరళంగా రచయిత యీ ఎనిమిది పుటలలో వివరించారు. ఆధ్యాత్మిక దృష్టితో కాకపోయినా చారిత్రిక దృష్టితోనయినా తెలుగువారందరూ చదివి జిజ్ఞాస చేయవలసిన అంశాలు ఈ చిన్ని పొత్తములో నున్నవి. ఈ క్షేత్రానికి ఉభయ రామేశ్వరమను పేరు కూడా వున్నది. కృష్ణానదికి రెండు వైపులా శివలింగాలున్నాయి. శ్రీ రామలింగేశ్వర స్వామి ప్రత్యక్ష దైవమని ప్రతీతి. కైలాసం నుంచి హనుమంతుడు తెచ్చిన లింగమును ప్రతిష్ఠించిన ప్రదేశం "అయిలూరు"గా ఇపుడు ప్రసిద్ధి చెందినది.

భాగవత సప్తాహ మహాత్మ్యము

[రచయిత - వేమూరు బైరాగి శాస్త్రి. వెల-రు. 1. ప్రతులకు - వేమూరు బైరాగి శాస్త్రి, చిలుమూరు పోస్ట్ (వయా) అనంతవరము, తెనాలి తాలూకా]

12 పుటలున్న యీచిన్న పుస్తకాన్ని కీర్తిశేషులు బ్రహ్మశ్రీ పిసుపాటి చిదంబరశాస్త్రిగారి పద్మ పురాణం ఆధారంగా వ్రాసినట్టిది. భాగవత పఠనంవల్ల కలిగే ప్రయోజనాలను గురించి తెలుగువారికి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. పురాణాలలో రామాయణం తర్వాత అధిక ప్రచారం పొందిన పురాణం భాగవతం. ఈ పురాణాన్ని రోజూ పఠిస్తే ఐహిక ప్రయోజనాల సంగతి ఎలావున్నా మానసిక శాంతి మాత్రం తప్పక లభిస్తుంది. ఆధునికుల దృష్టిని పురాణాలపై పునకు మరలించడానికి వాటిని పఠిస్తే యీ మేలు జరుగుతుంది. ఆ మేలు జరుగుతుందని చెబుతూండడం కద్దు. భాగవత పారాయణం విషయం అటువంటిది కాదు. మనస్సును కేంద్రీకరించి చదివినవారి అనుభవంతో తెలిసివచ్చే అంశాన్ని యిలా రచయిత

కం॥ శుకశాస్త్రము కంటెను వే
　　రొక మార్గములేదు భవ పయోధి నిమగ్నుల్
　　సుకరముగ పారమొందగ
　　ప్రకటింపగ నేటికింక బహు భాషణముల్॥

అని చాటించుకున్నారు. 12 పుటల పుస్తకమే అయినా భక్తులకు చాలా ప్రయోజనకరమయినది.

ప్రదోషకాల మహిమ

[సంకలనకర్త - వేమూరు బైరాగిశాస్త్రి. వెల రు. 1-00 ప్రతులకు - వేమూరు బైరాగిశాస్త్రి, చిలుమూరుపోస్టు (వయా) అనంతవరము, తెనాలితాలూకా]

ప్రదోషకాలం అనగా సూర్యాస్తమయం నుంచి సుమారు మూడు గంటల కాలం వరకు. ఆ సమయంలో శివుని ప్రార్థించి ఈతి బాధలను తొలగించుకొనవచ్చునని ఆస్తికుల భావన. పదార్థ

వాదం ప్రాతిపదికన మదింపు చేసినా పదార్థం నాశనంకాదు. జీవం కూడా పదార్థమేనని అంగీకరించితే, పోనీ "ప్రాణం" పదార్థం స్వభావాలలో ఒకటని అంగీకరిస్తే జీవికి కొన్ని జన్మలు తప్పవని విజ్ఞులు గ్రహిస్తారు. ఇటువంటి జీవి ఈతి బాధల నుంచి తొలగ గలగడానికి భక్తి ఒక మార్గము, సులభమార్గం. ఈ దృష్టితో శ్రీ వేమూరు బైరాగిశాస్త్రి 16 పుటలలో శ్రీ రామలింగేశ్వర స్వామిని శ్లోకాల రూపాన ప్రార్థించారు. మానవుడి దైనందిన జీవితాన్ని సుగమం చేయడానికి వినియోగపడే మరొక మార్గం దొరికే వరకూ భక్తిమార్గాన్ని అనుసరించడం తప్పుకాదు. ఈ పుస్తకంలోని శర ణాగతి, అపరాధక్షమార్పణ, ప్రదోషకాలమహిమ అనే ఉపశీర్షికల కింది పద్యాలలోని అంశాలు అందరూ చదివి ఆలోచించదగినవి.

శ్రీ వి. ఎస్. అవధాని

రాసపంచాధ్యాయి

[రాసలీలలపై వ్యాఖ్యానము. వ్యాఖ్యాత : ఉపన్యాస సార్వభౌమ, బ్రహ్మశ్రీ శ్రీ పురాణపండ రామమూర్తి క్రౌనుసైజు 129 పుటలు. వెల 5రూ. ప్రకాశకులు- శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి, జయశ్రీ టాకీస్ రోడ్, రాజమండ్రి - 4.]

భాగవతం భక్తి ప్రతిపాదకమైన గ్రంథమూ, భగవ దవతారకథా ప్రతిపాదకము మాత్రమే కాదు. ఆధ్యాత్మిక తత్త్వాన్ని వివరించే విశిష్ట గ్రంథం. ఇందలి నిగూఢార్థా లను, శ్రీకృష్ణతత్త్వాన్ని వివరిస్తూ ఇప్పుడు చాలా గ్రంథాలు వస్తున్నవి. అట్టివాటిలో ఇదొకటి. భాగవతం లోని రాస లీలను వివరించే అయిదధ్యాయాల అంత రార్థాన్ని వివరించే గ్రంథం యీ "రాసపంచాధ్యాయి".

శ్రీకృష్ణుడు గోపికలతో సలిపిన రాసక్రీడ శృంగార భూయిష్ఠమయినదని, శరత్కాలంలోని వినోదాన్ని వివ రించేదనీ సామాన్య పాఠకులకూ, శ్రోతలకూ గోచ రిస్తుంది. అలా అనుకోకూడదని, అందులో అంతరార్థం ఇమిడి ఉన్నదనీ బాగుగా అవలోడన చేసిన విద్వాంసులు చెప్తారు. అట్టి విద్వాంసులలో పురాణపండ రామమూర్తి గారు ముఖ్యులు. ఆయన మూలాన్ని బాగుగా గ్రహించి రాసలీలపై వ్యాఖ్యరూపంగా దీన్ని వ్రాసారు. వ్యాఖ్యాన మంటే మూలశ్లోకాలను తీసుకొని వాటికి టీకాతాత్పర్యాలు చెప్పే వ్యాఖ్యకాదు. మూలాభిప్రాయ వివరణ అని తెలుసు కోవాలి. "రాసము పంచాధ్యాయ యుతము. ప్రథమా ధ్యాయములో ఆత్మద్వారా (భగవంతుడు) లీల నెరపెను. ద్వితీయాధ్యాయములో మనస్సుద్వారాను, తృతీయా ధ్యాయములో వాక్ప్రాణముల ద్వారాను, చతుర్థాధ్యా యములో ఇంద్రియముల ద్వారాను, పంచమాధ్యాయ ములో శరీరము ద్వారాను లీల నెరపెను. ఇంద్రియాధి పతి, ఆత్మరూపుడైన శ్రీకృష్ణుని గోపికలు స్వామినీ భావముతో ధ్యానించిరి." అని రచయిత తొలుతనే సంగ్ర హంగా చెప్పి పిదప వివరించారు. ఆధ్యాత్మిక తత్త్వ జిజ్ఞాసువు లీ గ్రంథాన్ని చదివితే రాసలీలలోని అంతరార్థం అవగతం కాగలదు.

శ్రీ గోదా గ్రంథమాల రజతోత్సవ సంచిక

[డెమ్మీ సైజు 130 పుటలు. వెల : 12 రూ. ప్రకాశకులు : శ్రీ గోదా గ్రంథమాల, ముసునూరు - 521 207, కృష్ణా జిల్లా.]

అనేక రంగాల్లో ఆంధ్ర సాహితీసేవ చేస్తున్న శ్రీ గోదా గ్రంథమాల పాతికేళ్ళునిండి,రజతోత్సవం జరుపుకుంటున్న సందర్భంలో ఈ సంచికను ప్రకటించింది. ఇది ప్రథమంలో విశిష్టాద్వైత మతగ్రంథ ప్రకటనకే ఉద్దేశించినా ప్రజా నీకం అవసరాన్ని గ్రహించి మతగ్రంథాలతోపాటు యువ కులకూ, బాలురకూ కూడా ఉపయోగించే గ్రంథాలను ప్రచురిస్తూ మంచిపేరు గడించుకొన్నది. దీని సంపాద కులు శ్రీమాన్ కె. టి. యల్. నరసింహాచార్యులుగారు తమ జీవితాన్ని గ్రంథమాలకోసమే ధారపోస్తూ, ఒంటి చేతి మీదనే అన్నికార్యాలూ నిర్వహిస్తున్నట్లు ఈ సంచిక వల్ల తెలుస్తున్నది. గ్రంథమాలలో ప్రకటింపబడిన చాలా గ్రంథాలు ఆయన రచించినవే! సంస్కృతాంధ్ర ద్రావిడ భాషల్లో విద్వాంసులై ఉన్నందున ఆయనకు విశి

ష్టాద్వైత మత గ్రంథవ్యాఖ్యా రచన చాలా సులభమయింది. 'శ్రీచరణ రేణు' వనే ఆయన సంకేతనామం, ఆయన వినయానికి తార్కాణం.

ఈ సంచికలో మూడు భాగాలున్నవి. మొదటిది అభినందనాలకు సంబంధించినది. ఇందులో శ్రీ గోదా గ్రంథమాల, తత్సంపాదకులు నరసింహాచార్యులుగారు చేసిన సేవలు ప్రశంసించబడినవి. ప్రశంసించినవారిలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాచ్య గ్రంథాలయం డైరెక్టర్ వాసిలి లక్ష్మీనరసింహారావుగారు, వావిలాల గోపాలకృష్ణయ్యగారు, డాక్టర్ దాశరథిగారు, కొత్త వేంకటేశ్వరరావు గారు, కనుపర్తి వరలక్ష్మమ్మ గారు, నిడదవోలు వేంకటరావుగారు మున్నగు వారున్నారు. ఆచార్యులుగారి శిష్యుల ప్రశంసలు కూడా ఇందు చేర్చబడినవి.

రెండవ భాగంలో గ్రంథమాల ప్రకటించిన గ్రంథాలపై రేడియోలలోను, భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, విశాలాంధ్ర. కృష్ణాపత్రిక మున్నగు పత్రికలలోను పడిన సమీక్షలు కొన్ని ఇయ్యబడినవి. ఇవి ఆయా గ్రంథాల ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తున్నవి.

మూడవ భాగంలో సంచికకోసం ప్రత్యేకంగా ప్రముఖులు వ్రాసిన వ్యాసాలున్నవి. వాటిలో అద్వైత రహస్యం, వాల్మీకి - శఠకోపమునులు, ఆచార్యమైత్రి, శ్రీ గోదాగ్రంథమాల పరిశీలన, సాటిలేని సాహితీకృషి, కొన్ని వ్యాఖ్యాన గ్రంథాలు, దివ్యప్రబంధాలు మున్నగు వ్యాసాలున్నవి. వ్యాసకర్తలలో శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారు, శ్రీ విరించి, అష్టాదశ భాషావిశారద, ప్రొఫెసర్, కోట సుందరరామశర్మగారు, శ్రీ ఎన్. వి. ఆచార్య మున్నగువారు ఉన్నారు. సంచికలో, గ్రంథమాలకు ఆర్థికంగా తోడ్పడుతున్నవారి ఛాయాచిత్రాలు, గ్రంథమాల వ్యవస్థాపకుల చిత్రాలు చేర్చబడినవి. ముద్రణ చక్కగా ఉన్నది. విషయ విభాగ పూర్వకంగా తయారయిన యీ సంచిక అందరినీ ఆకర్షించగలదు. ఇది సంచికయే అయినా విలువైన విషయాలున్నందున ఒక విశిష్టగ్రంథంగా ఆదరింపబడగలదని భావిస్తున్నాను.

జీవన్ముక్తి సూత్రమాల

[గ్రంథకర్త : అవుల పురుషోత్తమ కవి, ఎం. ఏ., క్రౌన్ సైజు 32 పుటలు. అమూల్యం. ప్రాప్తిస్థానం: శ్రీ అవుల పురుషోత్తమకవి, నెం. 10-4-50, మామిళ్లగూడెం వీధి, ఖమ్మం.]

వేదాంతసారభూతమైనజీవన్ముక్తిసూత్రాలనురచయిత సంగ్రహంగా, సులభంగా అందరూ ముక్తి మార్గాన్ని తెలుసుకునేరీతిలో ఇందు నూరు సూత్రాలను పొందుపరుస్తున్నారు "ఎందరో మహానుభావుల పవిత్ర సూక్తులను, దివ్యానుభూతులను పరిశీలించి, పరిశోధించి, ఏరి, కూర్చి పుస్తకము చేసితిని. దీనిని సావకాశముగ, సావధాన చిత్తముతో చదివి, అర్థముచేసుకొని, ఆచరణలో పెట్టి, తాము తరించి, నన్ను తరింపజేయగలరని సవినయముగ భక్తితో ప్రార్థించుచున్నాను" అని ఆయన ప్రార్థిస్తున్నారు. ఈ సూత్రాలలో రెండు పంక్తులవి మొదలు ఇరవైమూడు పంక్తుల వరకూ కూడా ఉన్నవి. చివరకు ఒక్క మాటలో 'జాగ్రత్వేవ సుషుప్తివచ్చరతియః' అని సారాంశం తేల్చారు. జాగ్రదవస్థలోనే ఉండి సుషుప్తిలో ఉన్నట్లున్నవాడే ముక్తుడని దీని అర్థం. ఆయన చెప్పినట్లు ఈ సూత్రాలన్నీ చదివి అర్థంచేసుకుంటే జీవన్ముక్తి మార్గాన్ని తెలుసుకోవచ్చు.

తన జీవితవిశేషాలను గురించి చెప్తూ రచయిత తాను 1911 సం॥లో విరోధికృన్నామ సంవత్సర శ్రావణబహుళ అష్టమినాడు - శ్రీకృష్ణ జన్మాష్టమినాడు సీతమ్మ, నరసింహంల గర్భశుక్తి ముక్తాఫలంగా భగవదంశచే జన్మించినట్లూ, తాము మానవసేవా ధురంధరులైనట్లు చెప్పుకుంటున్నారు. ఇది ఆత్మస్తుతి కాదని ఆయన అభిప్రాయమేమో! నీచమైన ప్రభుత్వ దాస్యము చేయరాదను దీక్ష, పట్టుదలలతో ఉద్యోగం చెయ్యక, గ్రామాల్లో ఉపాధ్యాయుడుగా ప్రజాసేవ చేశారట! తర్వాత అభిప్రాయం

మార్చుకున్నారో యేమో 1941లో ప్రభుత్వోద్యోగంలో ఉపాధ్యాయుడుగా ప్రవేశించి స్వయంకృషివల్ల ఉస్మానియావిశ్వవిద్యాలయంలో తెలుగు ఎం. ఏ. పట్టంపొంది కాలేజీలో లెక్చెరరుగా పనిచేసి రిటైరయినారట! 15-16 ఆధ్యాత్మిక గ్రంథాలు, సంగ్రహ విజ్ఞానకోశంలో కొన్ని వ్యాసాలూ రచించారట!

ప్రజోపయోగార్థం రచించిన ఈ పుస్తకాన్ని అయన తత్త్వజ్ఞాన తపన ఉన్నవారికీ, తపస్సాధన చేసేవారికీ ఉచితంగా ఇవ్వడానికి సంకల్పించడం ప్రశంసించదగినది.

"ఆంగీరస"

రుక్మిణీ కళ్యాణం

[ముప్పిడి సత్యనారాయణమూర్తి. వెల: అమూల్యం. ప్రతులకు: ముప్పిడి సత్యనారాయణమూర్తి, గొల్లవీధి, విజయనగరం-1]

పోతన భాగవతాంతర్గతమగు రుక్మిణీకళ్యాణ గాథను సత్యనారాయణమూర్తిగారు రచిస్నకావ్యంగా రూపొందించారు. కృష్ణుని కళ్యాణగాథ శుభప్రదమైనదిగా భావించి ఈ కావ్యాన్నిరాయటం జరిగిందని మూర్తిగారు మనవి మాటల్లో చెప్పుకొన్నారు. ఈ కావ్యానికి అభిప్రాయాలు, అభినందనలూ, ఆశీస్సులు అందించినవారు చాలమందిఉన్నారు. దృతకోకిల, సుగంధి, ఉత్సాహ, మాలినీ వృత్తాలు కవిగారి రచనా పాటవానికి నిదర్శనాలని క్రొవ్విడి రామంగారు చెప్పారు. "ఈనాటి సాహిత్యం పురోగమిస్తోందో, తిరోగమిస్తోందో చెప్పలేని సంకట స్థితిలోనున్నాము. నియమాలకు లోబడి వ్రాయటం హేయమంటున్నారు. పద్యానికి సమాధి కట్టాలంటున్నారు మరికొందరు. ఏమైనప్పటికీ విశృంఖల విహారం సులభసాధ్యమని ఆ వైపే రచయితలు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు" అని వసంతరావు వేంకటరావుగారి అభిప్రాయం. నియమమా? నియమరాహిత్యమా? అనేది కవిత్వానికి అసలు ప్రశ్నే కాదు. రాసిందాట్లో కవిత్వం ఉన్నదా? లేదా? అన్నది ప్రశ్న.

"అంతరంగము నందు కోరిన
యాతడే యిటు దక్కెగా
వంత మానుము కోర్కెదీరెను
పంతమున్ నెరవేరెనో
యింతి సంతసమందగా దగు
నెంతయో యిప్పుడొప్పు
కాంతు తోడను ద్వారకాపురి
గాంచరమ్మిక ప్రీతితో"

ఈ పద్యం మూర్తిగారి కవిత్వ శక్తికి ఉదాహరణ.

ఆర్తి గీతాలు

[చల్లా రాధాకృష్ణశర్మ. వెల: రు. 3-00 లు. ప్రతులకు: లక్ష్మీనారాయణ గ్రంథమాల, 9, నాగార్జుననగర్, మద్రాస్]

చల్లా రాధాకృష్ణశర్మగారు సాహిత్యంలో సుప్రసిద్ధులు. కవి, పరిశీలకుడు. ఈ ఆర్తి గీతాలు అయనలోని జీవుని వేదనకు ప్రతిరూపాలు. ఎవరి మార్గంలో వారు, ఎవరి ఇచ్ఛవచ్చిన రీతిలో వారు కవిత్వం రాసుకుంటారు. కవిత్వం బ్రతికేది, చచ్చేది దాని అక్షర బలం, బలహీనతలమీద ఆధారపడి ఉంటుంది. ఈ కావ్యానికి 'అథ కావ్యజిజ్ఞాసా' అని బొమ్మకంటి శ్రీనివాసాచార్యులుగారు పీఠిక రాసి కవిత్వతత్వాన్ని గురించి విపులంగా చర్చించారు. "శబ్దశిల్పం వల్లా, గతి చమత్కారంవల్లకాక కేవలం అనుభూతి నిజాయితీతో రచనని కవిత్వం చెయ్యాలని యత్నించిన గీతాలివి" అని అచార్యులవారు చెప్పారు.

మానవత ప్రధానంగా భగవత్ ప్రార్థన భూమికగా రాసిన గీతాలివి.

"నానాటికి పెరుగుతున్నది వయస్సు
నానాటికి తరుగుతున్నది అయుస్సు
అయినా ....
ఎందుకో పెరగదు మనస్సు
ఎందుకో తరగదు ఈర్ష్య
ఎందుకో కరగదు స్వార్థం"

అని అనుకున్న క్రాంతదర్శి అయిన కవిగారు వాటికి సామాజిక కారణాల్ని అన్వేషించలేరా?

మానవ సమాజంలోకి వెలుగు వెల్లువలా, ఉప్పెనలా, పెనుమంటలా, పూలతావిలా, వెన్నెలలా, తెమ్మెరలా రావాలని శర్మగారు మనసా, వాచా వాంఛిస్తున్నారు. అట్టి వెలుగును ప్రసాదించమని వేరెవ్వరినో కోరుతున్నారు. తిరుపతి దేవస్థానంవారి సహాయంతో వేసిన పుస్తకం ఇది. ఇరవై ఎనిమిది ఖండికలూ దరిదాపుగా భగవన్నుతికి సంబంధించినవే. ఆయన కవితాపరమైన వేదనకు -

"హృదయ క్షేత్రంలో
ఉదయించిన ప్రేమ బీజం
అర్ద్రభావ జలాల్లో పెరిగి
అంతులేని వృక్షంగా పరిణమించి
అమలినమైన భక్తిగా పరిఢవిల్లనీ
భగవన్
అనుగ్రహించునాకు
ఆ అద్భుత సంపద."
మొదలైన పాదాలు ఉదాహరణలు.

రేపటి మజిలీ

[పరిగి రాధాకృష్ణ. వెల : రు. 5-00 లు. ప్రతులకు : పి. యస్. శర్మ, పరిగి, హిందూపురం తాలూకా, అనంతపురం జిల్లా 515 261]

పరిగి రాధాకృష్ణగారు 1964 నుంచి 72 వరకు భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లో రాసిన కవితలన్నింటినీ 'రేపటి మజిలీ' అనే పేరుతో సంకలించారు. వారికి కవిత్వంపట్లా, సమాజం పట్లా ఒక దృక్పథం ఉందని ఈ సంకలనం ఋజువు చేస్తున్నది. "సాహిత్యం యొక్క పరమావధి .... మనిషి నిజంగా తృప్తిగా హాయిగా ఊపిరిపీల్చగలిగే వ్యవస్థలోకి చేరుకునేలా చేయటమే కదా !" అన్నారు రాధాకృష్ణగారు నా మాటలో. ఏతత్ ప్రయత్న ఫలితమే ఈ సంకలనమని పాఠకులు భావించాలి. "నూతిలో మాటల్లా కాకుండా, వెకిలి చేష్టలు లేకుండా కుంకుబద్దలుకొట్టినట్లు" చెప్పటం ఈయన కవితా లక్షణం. మనిషిలో ఉన్న నిరాశని పటాపంచలుచేసి, చైతన్యస్ఫూర్తిని చెయ్యటం ఈయన కవితాధ్యేయం. జీవితంపై భవిష్యత్తుపై ఆశతో, ఆకాంక్షతో ఎదుగుతున్న కవి ఈయన.

మార్పు అనివార్యమయిన లక్షణమని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. మార్పు క్రమబద్ధమై ఉండాలి. మార్పు పేరుతో వైయక్తిక అరాచకత్వాన్ని ఎవడూ ఆశించడు. సర్వజన సమత్వం కోసం, ఆరోగ్యకరమైన, ఆనంద దాయకమైన మార్పును ఈ కవి ఆశిస్తున్నాడు.

"అసంతృప్తి మార్పుకు మూలం
అన్వేషణ ప్రగతికి పునాది
పరిణామం కాలం మారే పద్ధతి
పరిణతి కాలమిచ్చే బహుమతి
కాలాన్ని గడియారపు ముళ్ళతో కొలిచే వాళ్ళు
పరిణామాన్నెలా గ్రహించ గలరు ?
వికృతనాన్ని కీర్తి ప్రతిష్ఠ లెప్పుడూ వరించవు
పిచ్చి చేష్టలు పరిణామ స్వభావాన్ని గ్రహించవు"

అంటున్నారు. కసాయివాని కత్తికి కూడా కవిత్వం కరుణ రసంపూయ గలగాలనీ, సహజమైన సంగీతానికీ, మూలుగుకీ తేడా తెలుసుకోలేకపోతే ఈనాటి ఈ త్రిశంకు స్వర్గం తప్పదనీ, జీవితం రాగ రంజితం కాదనీ, మనిషి కేంద్ర బిందువుగా సమాజం సత్వరం మార్పు చెందాలనీ ఈ కవి ఆశిస్తున్నారు.

సింహావలోకనం

[మూలం :- యశపాల్. అనువాదం :- ఆలూరి భుజంగ రావు. వెల :- రు. 10-00 లు. ప్రతులకు :- ఆలూరి భుజంగ రావు, హిందీ పండిట్, టౌన్ హైస్కూలు, గుడివాడ, కృష్ణాజిల్లా]

యశపాల్ 'సింహావలోకన్'ను రెండు భాగాలుగా అనువదించారు భుజంగరావుగారు. ఇది మొదటి భాగం. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్ అతివాద, మితవాదుల ఉద్యమ ధోరణిపై విశ్వాసంలేని యువకులు సాయుధ పోరాటం ద్వారానే భారతదేశానికి దాస్యవిముక్తి కలుగుతుందని నమ్మినారు. అటువంటి యువతరంలో భగత్‌సింగ్, యశపాల్, భగవతీచరణ్ లాంటి యోధులు ముఖ్యులు. సాయుధ విప్లవం అనంగానే ఉపన్యాసం కంటె ఆచరణ ముఖ్యమని భావిస్తాం. కాని పోరాట వీరుల్లో కూడా సుఖదేవ్‌లాంటి బలహీన మనస్తత్వం కలిగిన వాళ్ళు ఉంటారు. పట్టుపడ్డ తరువాత గవర్నమెంటు సాక్షులుగా మారే వాళ్ళు ఉంటారు. తాము నమ్మిన విశ్వాసాలకు బలైపోయే వాళ్ళూ ఉంటారు.

ఈ మొదటి భాగంలో 1920 దగ్గర నుంచీ 29 దాకా స్వాతంత్ర్యం కోసం జరిగిన సాయుధ విప్లవపోరాట చరిత్ర ఉంది. ఆనాటికే సాయుధపోరాట వీరులకు వ్యక్తి స్వాతంత్ర్యానికీ, సమాజ స్వాతంత్ర్యానికీ భేదం తెలిసింది. మార్క్సిజమ్ స్వరూప స్వభావాలు వారికి అప్పటికి అర్థం కాకపోయినా 1917లో రష్యాలో జరిగిన విప్లవం దాని ఫలితం వారిని ప్రభావితం చేశాయి. కనుకనే యశపాల్ ఒక చోట ఇలా అంటాడు : "వ్యక్తి స్వాతంత్ర్యం భావ స్వాతంత్ర్యం - అవసరం అనే మాట నిజమే కాని దాంతో పాటుమనం మన భావస్వాతంత్ర్యాన్ని దుర్వినియోగంచేసి ఇతర్లకు బాధ కలిగించడం లేదు కదా ! అన్న ఆలోచన అవసరం. సమాజం లేంది మనం లేము. సమాజహితమే మన హితం. అలాంటప్పుడు సమాజంకోసం అంటే తోటి మానవులకోసం మనం స్వార్థంతో పాటు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కూడా కొంత చంపుకోవల్సి వస్తుంది."

నౌ జవాన్ భారత సభ ఆవిర్భావం నుంచీ హిందూస్తాన్ సామ్యవాద ప్రజాతంత్రసేన ఏర్పడేంతవరకూ గల చరిత్ర, ఢిల్లీ అసెంబ్లీలో బాంబు పేల్చడం, లాహోర్ బాంబు ఫ్యాక్టరీ పోలీసులు వశం చేసుకోవటం, ఈ చరిత్రలో మొదటి భాగం పూర్తి అయింది.

గోపీచంద్ భార్గవ్‌లాంటి అవకాశవాదులూ, ఫణీంద్రనాథ్ ఘోష్, హంసరాజ్ వంటి అప్రూవర్లు, జయచంద్ర విద్యాలం

కార్వంటి సూడో విప్లవ నాయకులు నాడూ ఉన్నారు; నేడూ ఉన్నారు. భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య పోరాటం యొక్క రెండవ వైపును ప్రదర్శించే ఇట్లాంటి పుస్తకాలు ఈతరం చదవటం ఎంతైనా అవసరం.

కళలు - శాస్త్రీయ విజ్ఞానం

[కొడవటిగంటి కుటుంబరావు వెల: రు- 6-00లు ప్రతులకు: 1) పి.యస్.ఆర్. ప్రసాద్, సి-108, శ్రీనివాస నగర్ కాలనీ - గుంటూరు - 522006; 2) సృజన, హనుమకొండ, వరంగల్.]

కుటుంబరావుగారు చనిపోయిన తరువాత ఆయన రాసిన అనేక వ్యాసాలూ, పీఠికలు విప్లవ రచయితల సంఘం. తరపున ప్రచురించిన గ్రంథం ఇది. సాహిత్య, రాజకీయ, సామాజిక, వైజ్ఞానికమైన అనేక అంశాలపై కుటుంబరావుగారు వ్యాసాలు రాశారు. ఈవ్యాస సంకలనానికి విప్లవ రచయితల సంఘవిమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావుగారు పీఠిక రాశారు. కుటుంబరావుగారి వ్యాస రచనోద్దేశాన్ని మధుసూదనరావుగారు ఈవిధంగా చెప్పారు. "ప్రాచీన విషయం మీద సమకాలిక పాఠకులకు ఉన్న తప్పుడు అభిప్రాయాలను సవరించి శాస్త్రీయ మైన అవగాహన కలిగించటమే కుటుంబరావు ప్రాచీన విషయాలమీద రాయటంలో ఉద్దేశం. వేదాలలో సోషలిజం ఉందనీ, ఉపనిషత్తులలో ఉన్నదే మార్క్స్ చెప్పాడనీ ప్రచారం చేస్తూ, గతం మీద ప్రజలకు ఉండే గౌరవ భావాన్ని ఆధారం చేసుకొని గతికే రాజకీయ వంచనా పరుల్ని ఖండించడం కోసమే కుటుంబరావు పాత విషయాన్ని గురించి శాస్త్రీయ దృక్పథంతో రాశాడు."

వర్ణ వ్యవస్థ ఏర్పడిన విధానం, మతాలూ, దేవుళ్ళూ, సమాజం ఒక దశనుంచి మరొక దశకు పరివర్తన చెందుతున్నప్పుడల్లా మానవ స్వభావాల్లో వచ్చే మార్పులు, ప్రజా సాహిత్యం, విప్లవసాహిత్యం మొదలైన అనేక అంశాలపై కుటుంబరావుగారు శాస్త్రీయ చర్చ జరిపారు. మానవ స్వభావానికీ, ఆర్థిక వ్యవస్థకూ అవినాభావ సంబంధముందని ఆర్థిక వ్యవస్థ వ్యక్తి సంస్కారంపై చూపే ప్రభావం అమోఘమైనదని కుటుంబరావుగారు చెబుతారు. మార్క్సిస్టు తత్వశాస్త్రం, సంకర సంస్కృతి, కళలు - సామాజిక చైతన్యం మొదలైన వ్యాసాలు కుటుంబరావుగారి శాస్త్రీయ దృక్పథానికీ, అవగాహనకూ తార్కాణాలు.

కుటుంబరావుగారు మార్క్సిజాన్ని విశ్వసించి దానికి బద్ధుడైన రచయిత. వామ పక్ష రచయితల్లో ఏర్పడిన చీలికల ఫలితంగా ఆయన వి. ర. సం. తో ఉండిపోయారు. సాహిత్యపరంగా ఆయన చెప్పిన శాస్త్రీయమైన అభిప్రాయం సంస్కరణవాద, విప్లవవాద సాహిత్యాలను గురించి. మానవ సమాజానికి యుగాలుంటాయనీ, ఆ యుగాలు అంతమయే సమయంలో వాటి పునాదులు సడలి శిథిలావస్థను చేరుకుంటాయనీ, అట్టి సమయంలో వాటిని మరమ్మతు చేసే ప్రయత్నంలో సంస్కరణ వాద సాహిత్యం వస్తుందనీ, పునర్నిర్మించే ప్రయత్నంలో విప్లవ సాహిత్యం వస్తుందనీ ఆయన చెప్పారు. గురజాడ కాలం నాటి సమాజానికీ, ఈ నాటి సమాజానికీ గల వ్యత్యాసాన్ని ఈ విశ్లేషణ పద్ధతిలో ఆలోచించవలసి ఉంటుంది. గురజాడ, వీరేశలింగములకంటె వేమన అధికృత కలవాడనే వాదాన్ని ఆయన పరాస్తం చేశారు.

వ్యక్తి జీవితానికీ, సామాజిక జీవితానికీ మధ్య అంతరువులు నిర్మించే సాహిత్యం ప్రజాసాహిత్యం కాజాలదు. రాగా వ్యవస్థలు మారేటప్పుడల్లా అభివ్యక్తీకరణ పద్ధతి, శిల్పనిర్మాణం, భాషా స్వరూపం, ప్రక్రియలో పరిణామం తప్పవు. "ఆనాడుమతపరంగా అభ్యుదయ రచనలుచేసి వాటిని ఉత్తమ సాహిత్యంగా ఆమోదింప చేయటం సాధ్యంకాదు. అందుకు నాకు తోచిన కారణం అది మత యుగం కాకపోవటమే. అదేవిధంగా ఫ్యూడల్ సంస్కృతి తాలూకు శ్లేషరచనలూ, అలంకార ప్రధానరచనలూ, మాటల గారడీలు పెట్టి వసుచరిత్ర, రాఘవ పాండవీయం లాంటి రచనలు అభ్యుదయకరంగా రచించి ఉత్తమ సాహిత్యం అనిపించటం ఈనాడు సాధ్యంకాదు" అని సమాజ పరిణామక్రమంలో సాహిత్య తత్వాన్ని విశ్లేషించారు. జరిగిన స్థితికీ, జరుగుతున్న స్థితికీ కార్యకారణ సంబంధాన్ని హేతుబద్ధంగా మానవుడు ఆలోచించగలిగితేనే మనిషి శాస్త్రీయ దృక్పథం కలవాడవుతాడు. అట్లు మానవుని ఆలోచనావిధానాన్నీ, ఆచరణాత్మక శీలాన్నీ పెంపొందించే ఇట్లాంటి మేధావుల రచనలు ఈతరం చిత్తశుద్ధితో అధ్యయనం చెయ్యటం అత్యంతావశ్యకం.

రుధిర జ్యోతిర్దర్శనం

(శ్రీరంగం నారాయణబాబు కవితాజీవితం)

[అవంత్స సోమసుందర్, వెల: రు. 10-00 లు. ప్రతులకు : 1)విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520 004; 2) నవోదయ పబ్లిషర్స్, ఏలూరు రోడ్డు, విజయవాడ-520 002, 3) ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ రోడ్డు, హైదరాబాద్ - 500 001 (ఎ. పి.)]

శ్రీరంగం నారాయణబాబు కవితాతత్వాన్ని గూర్చి 1972 నుంచి 80 వరకూ సోమసుందర్‌గారు భిన్నపత్రికల్లో రాసిన వ్యాస సంకలనమే ఈ రుధిర జ్యోతిర్దర్శనం. నారాయణబాబు జీవితాన్ని గురించి ఎక్కువగా తెలిసినవారిలో ఆరుద్ర, చాగంటి సోమయాజులు గారు, రోణంకి అప్పలస్వామిగారు, సోమసుందర్‌గారలు ముఖ్యులు. అంచేత ఆరుద్రగారి 'అంతర్యాలు' అనే పేరుతో విపుల వ్యాస పీఠికతో ఈ గ్రంథం అచ్చుకావటం ఆధునిక కవితాభిమానులందరకూ ఆనందదాయకమైన విషయం.

రాజకీయంలో ఒకే పార్టీకి చెందిన వారిలో ముఠాతగాధాలు మాదిరిగానే సాహిత్యంలో కూడా ఈ ముఠాతగాయిదా లుంటాయి. వాటి స్థాయిని పట్టి కవులను అంచనా కట్టడం తెలుగు సాహిత్య విమర్శకు పట్టిన దుస్థితి. ఈ స్థితి నుంచి బయట పడటానికి కొంత ప్రయత్నించినా ఆ ప్రభావాన్నుంచి అటు ఆరుద్రగాని, ఇటు సోమసుందర్‌గాని పూర్తిగా తప్పుకోలేకపోయారు.

దిగంబర కవుల ఆవిర్భావం తరువాత, శ్రీశ్రీ షష్టిపూర్తి మహోత్సవానంతరం, అభ్యుదయ రచయితల్లో వచ్చిన చీలికల ఉత్తరభాగాన వి. ర. సం. ఏర్పడటంతో అభిప్రాయ భేదాలు, పరస్పర విద్వేషాగ్నులు తీవ్రస్థాయికి చేరుకున్న విషయం ఆధునిక కవిత్వాభిమానులకు తెలియని విషయంకాదు. ఆ తదుపరి మాత్రమే 'చరిత్ర పుటల్లోకయొస్తున్న' నారాయణబాబుని లేపటం జరిగింది. రుధిరజ్యోతి ముద్రణ విషయంలో ఆరుద్ర, రుధిర జ్యోతి కవిత్వ తత్వంపై సోమసుందర్ 1970 తరువాత చేసిన పని అతః పూర్వమే చేసి ఉంటే - తెలుగు పాఠకులు అటు ఆరుద్ర, ఇటు సోమసుందర్‌గార్ల చిత్తశుద్ధిని, నిజాయితీని శంకించవలసిన సందర్భం ఏర్పడేది కాదు. ఆ పని చేసిన వారు ఆచార్య రోణంకి అప్పల స్వామిగారు. వారి ఘనత వారికి ఉండనే ఉంది. సాహిత్యంలోనూ, జీవితంలోనూ ఔన్నత్యం ఒకడు దానం చేస్తే వచ్చేది కాదు. అది రక్తగతలక్షణం.

ఆరుద్రగారి వ్యాస పీఠికలో అది ఆధునిక కవుల అంతర్యమే అయినా నారాయణ బాబుని గురించి పాజిటివ్‌గా చెప్పిందాని కంటె శ్రీశ్రీని గురించి నెగిటివ్‌గా చెప్పటం ఎక్కువగా జరిగింది. శ్రీశ్రీ బలహీనతలను, శ్రీశ్రీలో ఉన్న అరాచక మనస్తత్వాన్ని, గ్రంథ తస్కరణ లక్షణాన్ని, కీర్తికాంక్షని ఇంకా శతానేక లక్షణాల్ని 'శ్రీశ్రీ యుగం' అనే కవితా సంకలనానికి దీర్ఘ పీఠిక రాసిన ఆరుద్రగారే ఇతఃపూర్వమే చెప్పి ఉంటే ఆయన వ్యక్తిత్వం అంతకంటె పెరిగి ఉండేది. తామంతా కలసి ఇది 'శ్రీశ్రీ యుగం' అని ఈ యుగాన్ని శ్రీశ్రీకి కట్టపెట్టి అభిప్రాయ భేదాల అనంతరం ఏ తన్మహా యుగాన్ని చనిపోయిన నారాయణ బాబుకి అంటగట్టే ప్రయత్నం ప్రచ్ఛన్నంగా చెయ్యటం హాస్యాస్పదమైన విషయం. శ్రీశ్రీని గురించి ఆరుద్ర చెప్పిన విషయాల వాస్తవిక, అవాస్తవికాలను నేను చర్చించటం లేదు. ఇదే విషయాలు 1965కు పూర్వమే చెప్పి ఉంటే బాగుండేది. రుధిరజ్యోతి కూడా అప్పటికే అచ్చువేయించి ఉంటే ఇంకా బాగుండేది. ఆరుద్ర గారి ప్రవచనాలు కొన్ని ఇక్కడ ఉదహరిస్తాను.

1) మన సంస్కృత సాహిత్యంలో పంచరాత్రం అనే రూపకం ఉంది. నా జీవితంలో బీభత్సరస ప్రధానమైన పంచ రాత్రం శ్రీశ్రీ ఉన్మాదం పే. 19

2) వాస్తవానికి మల్లారెడ్డి వల్లగానీ మరెవరివల్లగానీ శ్రీశ్రీ పూర్వస్థితికి చలనం ఉండదు. ఉంటే నారాయణబాబు వల్లనే ఉంటుంది. పే. 19

(దువ్వూరి రామిరెడ్డిగారు చెప్పిన ఒక మాటను ఆరుద్ర గారు ఇప్పుడు ఉపయోగించు కుంటున్నారు.)

"శ్రీశ్రీ గారి కవిత్వంలో ప్రతి వాక్యమూ విమర్శకు పాత్రము గునంతటి బలహీనతగ నాకు గోచరించినది." పే. 23

3) ఆచార్య పీఠంనుంచే కాదు ఆకాశ పీఠం మీద నుంచి పడిపోకుండా అసంఖ్యాకులైన శ్రీశ్రీ అభిమానులు అతణ్ణి నిల బెడుతూ వచ్చారు. పే. 28

ఇవి ఆరుద్రగారి అభిప్రాయాలు. ఉచితానుచితాలు పాఠకులే నిర్ణయిస్తారు.

సోమసుందర్‌గారు నారాయణబాబు కవితామూర్తిమత్వాన్ని వారి విమర్శలో చక్కగా రూపు కట్టించారు. కపాలమోక్షం, గడ్డిపరక, ఊరవతల, విశాఖపట్నం మొదలైన కావ్య ఖండికల్లోని రస రమణీయతను అంతర సాధ్యంగా విశ్లేషించారు. అక్కడక్కడా కొంత ఆవేశం దొర్లినా సంయమనం తోనే వారి పరిశీలన సాగింది.

ఎలిగరీలో నారాయణబాబు ప్రతిభ గొప్పదైనా శ్రీశ్రీ ప్రతిభ బహుముఖ్యమైనది. శ్రీశ్రీ నారాయణబాబుపై అతి హేయంగా విరుచుకు పడటం ప్రతి పాఠకుడూ తప్పని సరిగా గర్హిస్తాడు. అంతమాత్రంచేత నారాయణబాబు శ్రీశ్రీ కంటె గొప్ప కవి కాలేడు. కవి వైయక్తిక బలహీనత కవిత్వ బలహీనత కాదు గదా! నారాయణబాబు కవిత్వంపై ఒక సమగ్రమైన పరిశీలనా గ్రంథం సోమసుందర్‌గారు వెలయించటం ముదావహమైన విషయం. ఈ గ్రంథం ఆదునిక కవిత్వ చరిత్రను అధ్యయనం చేసే వారికి విషయ సేకరణ గ్రంథంగా, అంతకు మించి నారాయణబాబు జీవితాన్ని, కవిత్వాన్ని విశదం చేసేదిగా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

గ్రంథస్వీకారాలు

★ **వచన కవితా దిక్సూచి** (వర్తమాన కవితా వేదిక). ప్రతులకు : 'దిక్సూచి', ఇంటినెం. 1-2-63, సిరిసిల్ల - 505 301కు వ్రాయవచ్చు. సాలు చందా. 6 రూపాయిలు.

★ **చైతన్య దీప్తి** (అధునిక కవితావేదిక). సాలుచందా రు. 5/-. ప్రచురణ : సాహితీమిత్రులు, బాపట్ల. ప్రతులకు : అద్దేపల్లి భరత్‌కుమార్, 1-9-1(1), మెయిన్‌రోడ్, రైలుపేట, బాపట్ల - 522 101.

★ **సాహితీ మిత్ర** (సారస్వత మాసపత్రిక). వెల : ఒక రూపాయి. ప్రతులు కావలసినవారు ఎడిటర్, సాహితీమిత్ర, సారస్వత మాసపత్రిక, ఫెర్టిలైజర్ బజార్. మిర్యాలగూడ-508 207 అను చిరునామాకు వ్రాయవచ్చును.


★ **సాహిత్య దుందుభి** (మాసపత్రిక). వెల : ఒక రూపాయి. ప్రతులకు : ఎడిటర్, 'సాహిత్య వేదిక', వనపర్తి - 509 103

★ **మంటలు** (పక్ష పత్రిక). వెల : రెండు రూపాయిలు. ప్రతులకు : వి. నర్సింగం, విద్యానగర్, జగిత్యాల.


★ **జీవబంధు** (మాసపత్రిక). జీవబంధు తెలుగు మరియు హిందీ భాషల పత్రిక. సంవత్సర చందా : రు. 15 లు. ప్రతులకు : సంపాదకుడు, ఆంధ్రప్రదేశ్ జీవరక్షా సంఘం, గుంటూరు - 522 003.

★ **వీరనారీమణి ఝాన్సీ లక్ష్మీబాయి** (బుఱ్ఱకథ) వెల : రు. 2-50 లు ప్రతులు కావలసినవారు పి. దుర్గారావు, యం. ఓ యల్., చెలుకపల్లి (పోస్టు), (వయా) నక్రేకల్, నల్లగొండ జిల్లాకు వ్రాసి తెప్పించుకోవచ్చును.

★ **ప్రసారిత** (అధునిక సాహిత్యవేదిక) సాలుచందా రు. 10/- లు. ప్రతులకు : యన్. బాలకిషన్‌రావు, ఇం. నెం. 6-7-42/ఎ రాగన్నదర్వాజ, హన్మకొండ-506 011కు వ్రాయవచ్చును.



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada Phones: 75667 & 61247.




AMRUTANJAN
Pain Balm
Amrutanjan Ltd.
PAIN BALM